

'పేదలందరూ పక్కా ఇళ్లలో ఉండాలన్నదే నా అభిమతం'

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 18 వెల: ₹ 5.50
సంపుటి: 18
సంచిక: 61
శుక్రవారం 23-5-2025



లక్నో ఘన విజయం
ఐపీఎల్‌లో 33 పరుగుల తేడాతో ఓడిన గుజరాత్ టైటాన్స్ -15లో



ప్రతికూలతలు పడేశాయ్
అరశాతానికిపైగా పతనమైన దేశీయ స్టాక్ సూచీలు -15లో

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



ఛత్తీస్‌గఢ్‌లో మళ్లీ ఎన్‌కౌంటర్
ఛత్తీస్‌గఢ్‌లో చోటుచేసుకున్న వేర్వేరు ఘటనల్లో ముగ్గురు జవాన్లు నేలకొరిగారు. ఒక మావోయిస్టు చనిపోయాడు.
- వివరాలు 5లో ▶



మతాలన్నింటి సారం ఒక్కటే
సేవా కార్యక్రమాల విషయంలో మతాలన్నింటి సారం ఒక్కటేనని, వాటి మధ్య భేదం లేదని సీజేఐ జస్టిస్ గవాయ్ అన్నారు.
- వివరాలు 6లో ▶



ఇజ్రాయెల్ దౌత్య సిబ్బందిపై కాల్పులు
అమెరికాలోని యూదుల మ్యూజియం వద్ద జరిగిన కాల్పుల్లో ఇజ్రాయెల్ రాయబార సిబ్బంది ఇద్దరు హత్యకు గురయ్యారు.
- వివరాలు 6లో ▶



విరమణలో ఏ దేశం పాత్రా లేదు
భారత్–పాక్ మధ్య కాల్పుల విరమణలో మరే ఇతర దేశం పాత్ర లేదని భారత విదేశాంగ మంత్రి జైశంకర్ నొక్కి చెప్పారు.
- వివరాలు 6లో ▶

హద్దులన్నీ దాటుతోంది



ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తీరును తూర్పారబట్టిన సర్వోన్నత న్యాయస్థానం

- సమాఖ్య పాలన భావనను ఈడీ కాలరాస్తోంది
- ఒక ప్రభుత్వ కార్పొరేషన్ నేరం ఎలా చేయగలదు?
- టాస్మాక్‌పై ఈడీ దర్యాప్తు చట్టవిరుద్ధంగా సాగుతోంది
- అన్ని ఉల్లంఘనలకు పాల్పడుతోంది
- తమిళనాడు రాష్ట్ర లిక్కర్ రిటైలర్ సంస్థపై ఈడీ మనీలాండరింగ్ దర్యాప్తుపై స్టే విధించిన సుప్రీంకోర్టు
- స్వాగతించిన తమిళనాడు ప్రభుత్వం
- ఈడీ దుర్వినియోగాన్ని బీజేపీ మానుకోవాలని డీఎంకే హితవు
- ఈడీ రాష్ట్రాల హక్కుల్ని అన్యాయంగా బలవంతంగా లాక్కుంటోందన్న తమిళనాడు సర్కార్
- సోదాలు, జప్తులకు చట్టబద్ధత ఉందా? అని నిలదీత

న్యూఢిల్లీ/చెన్నై: దేశంలో సమాఖ్య పాలన భావనను తీవ్రంగా ఉల్లంఘిస్తూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) బరితెగించి ఇష్టారీతిగా ప్రవర్తిస్తోందని దేశ సర్వోన్నత న్యాయస్థానం తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. తనకు ఇష్టమొచ్చినట్లు దర్యాప్తు చేయడం కోసం హద్దులను మీరి మరీ విపరీత పోకడలతో కేసు దర్యాప్తును ముందుకు తీసుకెళ్తోందని సుప్రీంకోర్టు ధర్మాసనం వ్యాఖ్యానించింది. తమిళనాడు రాష్ట్ర మద్యం రిటైలర్ సంస్థ అయిన ''తమిళనాడు స్టేట్ మార్కెటింగ్ కార్పొరేషన్(టాస్మాక్)''పై నిబంధనలకు విరుద్ధంగా మనీలాండరింగ్ కేసు దర్యాప్తు జరుపుతోందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మాసిహ్‌ల ధర్మాసనం గురువారం ఈడీపై ఆగ్రహ అక్షింతలు చల్లింది. తమిళనాడులో రాష్ట్ర ప్రభుత్వ అనుమతి తీసుకోకుండానే టాస్మాక్ కార్యాలయాల్లో ఈడీ సోదాలు చేస్తోందని, ఉన్నతాధికారులను ముఖ్యంగా మహిళలను గంటల తరబడి వేధించి, భయపెడుతోందని తమిళనాడు ప్రభుత్వం, టాస్మాక్ వేసిన పిటిషన్‌ను గురువారం సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం విచారించింది. ఈడీ దర్యాప్తు తీరును తీవ్రంగా ఆక్షేపించింది. వెంటనే తమిళనాడు రాష్ట్ర లిక్కర్ రిటైలర్ సంస్థపై ఈడీ మనీలాండరింగ్ దర్యాప్తుపై స్టే విధిస్తూ సుప్రీంకోర్టు ఉత్తర్వులు జారీచేసింది.

తిట్లతో తలంటు

డీఎంకే సర్కార్, టాస్మాక్ తరఫున సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబల్, అమిత్ ఆనంద్ తివారీలు వాదించారు. ఈడీ తరఫున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజుకు సుప్రీంకోర్టు తిట్లతో తలంటు పోసింది. ''ఒక ప్రభుత్వ కార్పొరేషన్ అనేది నేరం ఎలా చేయగలదు?. ఈడీ అన్ని చట్టబద్ధ హద్దులను దాటేసి ఇష్టారీతిగా వ్యవహరిస్తోంది. ప్రభుత్వ సమాఖ్య విధానానికి ఏమాత్రం విలువ ఇవ్వకుండా అన్ని రకాల ఉల్లంఘనలకు పాల్పడుతోంది''అని సీజేఐ జస్టిస్ గవాయ్ అసహనం వ్యక్తంచేశారు. ఈడీ దర్యాప్తు చట్టవిరుద్ధంగా సాగుతోందని, అందుకే వెంటనే దర్యాప్తుపై స్టే విధిస్తున్నట్లు ధర్మాసనం తెలిపింది. వెంటనే అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు కల్పించుకుని ''దర్యాప్తును ఆపకండి. దాదాపు రూ.1,000 కోట్ల అక్రమాలు జరిగాయి. కనీసం ఈ ఒక్క కేసులోనైనా ఈడీ హద్దులు దాటలేదని భావించండి''అని వేడుకున్నారు. రాజు వాదనలను కపిల్ సిబల్ తప్పుబట్టారు. ''మద్యం దుకాణాల లైసెన్సుల జారీ అంతా సక్రమంగా ఉన్నాసరే అక్రమాలు

మిగతా 3వ పేజీలో ▶

• పథకాల అమలులో ఫెయిల్.. పాలనలో వైఫల్యం

మద్యం ముడుపుల డాన్ చంద్రబాబే..

దాన్ని కప్పిపుచ్చుకునేందుకే లిక్కర్ స్కామ్ అంటూ బాబు కుతంత్రం

వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆగ్రహం



- కేబినెట్ కళ్లుగప్పి మద్యంపై ప్రివిలేజ్ ఫీజును రద్దు చేస్తూ మూడు చోట్ల ఫైల్‌పై చంద్రబాబు సంతకాలు
- దీనివల్ల ఏటా ఖజానాకు రూ.5 వేల కోట్లకుపైగా నష్టం..
- ప్రైవేట్ మద్యం దుకాణాలు, బెల్టు షాపులతో విచ్చలవిడిగా లూటీ
- ప్రభుత్వానికి ఆదాయం తగ్గింది.. అలా తగ్గిన ఆదాయం చంద్రబాబు గజదొంగల ముఠా జేబులోకి చేరింది
- 2019-24 మధ్య మద్యం స్కామ్ జరగకపోయినా.. జరిగినట్లుగా భేతాళ కుట్రలు చేస్తున్నారు

12లో

మందుగుండైన సిందూరం

ఆపరేషన్ సిందూర్‌తో పాకిస్తాన్‌ను మోకాళ్లపై నిల్చోబెట్టాం: మోదీ



- పహల్గాం ఉగ్రదాడికి 22 నిమిషాల్లో బదులిచ్చాం
- నా సిరల్లో రక్తం బదులు వేడివేడి సింధూరం ప్రవహిస్తోందని వ్యాఖ్య

6లో

న్యూస్‌రీల్

రెండ్రోజులు తేలికపాటి వానలు



అరేబియా సముద్రంలోని దక్షిణ కొంకణ్–గోవా తీరంలో అల్పపీడనం ఏర్పడింది. దీని ప్రభావంతో రానున్న రెండు రోజులు రాష్ట్రంలోని పలుప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది.
- వివరాలు 2లో ▶

యాదగిరిగుట్టకు ఎంఎంటీఎస్



యాదగిరిగుట్టకు ఎంఎంటీఎస్ మంజూరైందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. రూ.400 కోట్లతో పనులు ప్రారంభిస్తామని చెప్పారు. ఏకకాలంలో 1,300 రైల్వేస్టేషన్లు అభివృద్ధి చేయడం గర్వకారణమన్నారు.
- వివరాలు 2లో ▶

రుణలక్ష్యం రూ.7.65 లక్షల కోట్లు



గ్రామీణ ఆర్థికశక్తి వృద్ధికి పెద్దపీట వేస్తూ బ్యాంకులు లక్ష్యాలను నిర్దేశించుకున్నాయి. 2025–26 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్రంలో రూ.7,65,000 కోట్ల రుణాలు ఇవ్వాలని నిర్ణయించాయి.
- వివరాలు 2లో ▶

జూన్ 20లోపు కోర్టులో హాజరుకండి!



ఫోన్‌ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న ఎస్‌ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు చుట్టూ ఉచ్చు బిగుస్తోంది. ఆయన్ను అమెరికా నుంచి రప్పించే యత్నంలో.. ఆయన ఇంటికి పోలీసులు నోటీసులు అతికించారు.
- వివరాలు 12లో ▶



గ్రూప్-2 తుది జాబితా విడుదల


783 ఉద్యోగాలకు 777 మంది ఎంపిక

- టీజీపీఎస్సీ వెబ్‌సైట్‌లో అభ్యర్థుల జాబితా
- జూన్ 10 వరకు ధ్రువపత్రాల పరిశీలన
- గైర్హాజరైతే తదుపరి చాన్స్ లేనట్లే: టీజీపీఎస్సీ

సాక్షి, హైదరాబాద్: గ్రూప్–2 ఉద్యోగాలకు అర్హత సాధించిన అభ్యర్థుల తుది జాబితాను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గురువారం విడుదల చేసింది. మొత్తం 783 ఉద్యోగాలకు గాను 777 మంది మాత్రమే ఎంపికయ్యారు. ఇందులో ఇద్దరు స్పోర్ట్స్ కోటా అభ్యర్థులున్నారు. అభ్యర్థుల జాబితాను కమిషన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. తుది మిగతా 5వ పేజీలో ▶

రక్షణ ఆవిష్కరణల కేంద్రం ఐఐటీహెచ్

- సైనిక అవసరాల కోసం పరిశోధనలు, ఆవిష్కరణలపై దృష్టి... సీఓఈల ఏర్పాటుకు ఆర్మీ, నౌకా విభాగాల ఆసక్తి
- లద్దాఖ్‌లో 3డీ ముద్రిత బంకర్ల నిర్మాణం



లేహ్‌లో నిర్మించిన 3డీ ముద్రిత బంకర్

సాక్షి, హైదరాబాద్: 'ఆపరేషన్ సిందూర్'నేపథ్యంలో దేశ సైనిక, రక్షణ రంగం ప్రదర్శించిన సాంకేతిక పాటవంపై చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఐఐటీ హైదరాబాద్ (ఐఐటీహెచ్) కేంద్రంగా జరుగుతున్న రక్షణ రంగ పరిశోధనలు ఆసక్తికరంగా మారాయి. దేశంలో ప్రతిష్టాత్మక విద్యాసంస్థల్లో ఒకటైన ఐఐటీహెచ్‌లో ఇప్పటికే రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఓ) 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'ను ఏర్పాటు చేసింది. ఐఐటీహెచ్‌లో జరుగుతున్న మిగతా 12వ పేజీలో ▶



బీఆర్‌ఎస్‌లో 'కవిత లేఖ' కలకలం

- ఎల్కతుర్తి సభపై ఫీడ్‌బ్యాక్ పేరిట పలు అంశాల ప్రస్తావన... సభ నిర్వహణ, కేసీఆర్ ప్రసంగాన్ని విశ్లేషిస్తూ సాగిన లేఖ
- లేఖ కాదు.. సూచన అంటున్న సన్నిహితులు

సాక్షి, హైదరాబాద్: ఎల్కతుర్తిలో గత నెల 27న జరిగిన బీఆర్ఎస్ రజతోత్సవ సభకు వచ్చిన స్పందన, తన తండ్రి కేసీఆర్ ప్రసంగం తీరుతెన్నులను విశ్లేషిస్తూ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత రాసినట్లుగా చెప్తున్న లేఖ పార్టీలో కలకలం రేపుతోంది. అమెరికాలో తన కుమారుడు ఆదిత్య గ్రాడ్యుయేషన్ వేడుకకు హాజరయ్యేందుకు వెళ్లిన కవిత శుక్రవారం హైదరాబాద్‌కు మిగతా 3వ పేజీలో ▶

మావోయిస్టుల కొత్త చీఫ్ ఎవరు?

- పార్టీ సుప్రీం కమాండర్ మృతితో చర్చ
- కేశవరావు తర్వాత పార్టీని నడిపించేది ఎవరన్న దానిపై ఇంటెలిజెన్స్ నజర్
- తెరపైకి తిరుపతి, వేణుగోపాల్, సుజాత పేర్లు



మల్లోజుల వేణుగోపాల్



తిప్పిరి తిరుపతి

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: మావోయిస్టు పార్టీ సుప్రీం కమాండర్, కేంద్ర ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు ఎన్‌కౌంటర్‌లో చనిపోవడంతో, ఆ బాధ్యతలు ఎవరికి దక్కుతాయనే అంశంపై ఆ పార్టీ వర్గాలు, సానుభూతిపరుల్లో చర్చ మొదలైంది. మరోవైపు పార్టీకి కమాండర్ ఇన్ చీఫ్ హోదాలో ఎవరు రావచ్చనే దానిపై ఇంటెలిజెన్స్ వర్గాలు కూడా ఆరా తీస్తూ అంచనాలు వేస్తున్నట్టు మిగతా 5వ పేజీలో ▶




కొలువుల కుదింపు... వేతనాల్లోనూ కోత!

అసంఘటిత రంగ కార్మికుల కనీస వేతన సవరణలో కోతల పర్వం

- గతంలో ఇచ్చిన తుది ఉత్తర్వుల కంటే తక్కువగా వేతన ప్రతిపాదనలు
- గతంలో ఏడు ఉద్యోగ కేటగిరీలుంటే.. ఇప్పుడు నాలుగు కేటగిరీలకే పరిమితం
- పలు ఎంప్లాయిమెంటుల్లో భారీగా ఉద్యోగాలకు కోత పెడుతూ బోర్డు సిఫారసులు
- కార్మికుల సర్వీసు నిబంధనలకు సంబంధించిన పుట్‌నోట్‌లూ తగ్గింపు
- త్వరలో రాష్ట్ర ప్రభుత్వానికి కనీస వేతన సలహా మండలి ప్రతిపాదనలు
- భగ్గుమంటున్న కార్మిక సంఘాలు

సాక్షి, హైదరాబాద్: అసంఘటిత రంగ కార్మికుల కనీస వేతన సవరణ ప్రక్రియలో ప్రతిచోటా కోతల పర్వం కొనసాగుతోంది. గతంలో ప్రభుత్వం ఇచ్చిన వేతన సవరణ తుది ఉత్తర్వుల్లో ఖరారు చేసిన ఉద్యోగాలు, వేతనాలకు సంబంధించి కత్తెర పడుతోంది. సర్వీసు నిబంధనల్లో భారీగా మార్పులు చోటు చేసుకుంటున్నాయి. కార్మికుల కనీస వేతన సవరణ చివరిసారిగా 2006లో జరిగింది. అప్పుడు చేసిన సవరణకు సంబంధించిన ఉత్తర్వులు వెలువడేందుకు దాదాపు ఆరేళ్లు పట్టింది. ఆ తర్వాత ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైనా వేతన సవరణ ఊసే లేదు. దీనిపై కార్మిక సంఘాలు తీవ్రస్థాయిలో ఆందోళన చేపట్టాయి. ఈ నేపథ్యంలో ప్రత్యేక రాష్ట్రంలో ఏర్పాటైన మొదటి, రెండో కనీస వేతన సలహా బోర్డులు లోతుగా కసరత్తు చేసి గత ప్రభుత్వానికి వివిధ ఎంప్లాయిమెంట్లకు సంబంధించి ప్రతిపాదనలు సమర్పించాయి. వీటిపై గత ప్రభుత్వం కసరత్తు చేపట్టి ఐదు ఎంప్లాయిమెంట్లకు తుది ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ గెజిట్లు విడుదల కాకపోవడంతో అమలుకు నోచుకోలేదు. మరో 12 ఎంప్లాయిమెంట్లకు సంబంధించి ప్రతిపాదనలు ప్రభుత్వం ఆమోదించినా ఉత్తర్వులు

మిగతా 2వ పేజీలో ▶



భారీగా ఉద్యోగాల కోతలు

గతంలో హైలీస్కిల్డ్–1, 2, 3, 4, స్కిల్డ్, సెమీ స్కిల్డ్, అన్‌స్కిల్డ్ కేటగిరీలుండగా... ఇప్పుడు వాటిని హైలీస్కిల్డ్, స్కిల్డ్, సెమీ స్కిల్డ్, అన్‌స్కిల్డ్ కేటగిరీలకే పరిమితం చేశారు. 3 ఉద్యోగ కేటగిరీలు తొలగించడంతో ఉపాధి సంస్థల్లో భారీగా ఉద్యోగులు తగ్గినట్లేనని కార్మిక సంఘాలు అంటున్నాయి. సెక్యూరిటీ సర్వీసెస్ ఎంప్లాయిమెంట్‌లో 26 జూన్ 2021లో జారీ చేసిన జీఓఎంఎస్ 21 ప్రకారం 66 ఉద్యోగాలున్నాయి. గతేడాది విడుదలైన ప్రాథమిక నోటిఫికేషన్‌లో వీటి సంఖ్య 11కు తగ్గించారు. వీటిని బోర్డు ఆమోదిస్తూ నిర్ణయం తీసుకోవడంతో ఇక్కడే 55 ఉద్యోగాలకు కోత పడింది. అలాగే కన్‌స్ట్రక్షన్ ఆఫ్ రోడ్స్ అండ్ బిల్డింగ్స్ ఎంప్లాయిమెంట్‌లో 611 ఉద్యోగాలను 58కి కుదించడంతో 533 ఉద్యోగాలకు కోతపడింది. స్టోన్ బ్రేకింగ్ అండ్ స్టోన్ క్రషింగ్ ఎంప్లాయిమెంట్‌లో 196 ఉద్యోగాలను 69కి కుదించారు. ఇలా ప్రతి ఎంప్లాయిమెంట్‌లో ఉద్యోగాల సంఖ్య తగ్గిస్తూ కనీస వేతన సలహా బోర్డు ప్రతిపాదనలు తుదిరూపుకు తెచ్చినట్లు సమాచారం. ఉద్యోగుల సంఖ్య కుదించడంతో ఉన్న కార్మికులపై పనిఒత్తిడి పడనుంది.

కేటగిరీల వారీ వేతనాలు, గతంతో పోలిస్తే వ్యత్యాసం (రూ.లలో)

కేటగిరీ	2021 ఉత్తర్వులు	తాజా ప్రతిపాదనలు	కోత
హైలీ స్కిల్డ్	35,664	28,430	7,234
స్కిల్డ్	31,564	26,324	5,240
సెమీ స్కిల్డ్	27,934	23,296	4,638
అన్ స్కిల్డ్	23,275	20,253	3,022

నేషనల్ హెరాల్డ్ కేసులో సీఎం రేవంత్‌రెడ్డి

- విరాళాలిస్తే పదవులు కట్టబెడతామని ప్రలోభ పెట్టారు
- చార్జిషీట్‌లో ప్రస్తావించిన ఈడీ
- ఆరోపణలపై స్పందించని ముఖ్యమంత్రి



న్యూఢిల్లీ: నేషనల్ హెరాల్డ్ కేసులో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు పవన్ బన్సల్‌తోపాటు దివంగత నేత అహ్మద్ పటేల్ పేర్లు తెరపైకి వచ్చాయి. గత నెలలో కోర్టుకు సమర్పించిన చార్జిషీట్‌లో వీరి పేర్లను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ప్రస్తావించింది. కానీ, వీరిని నిందితులుగా చేర్చలేదు. కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీతోపాటు మరో ఐదుగురిని నిందితులుగా చేర్చిన సంగతి తెలిసిందే. అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ (ఏజేఎల్)కు చెందిన రూ.2,000 కోట్ల విలువైన ఆస్తులను అక్రమంగా కొట్టేయడానికి కుట్ర జరిగినట్లు ఈడీ ఆరోపిస్తోంది. ఆస్తులను కాజేయాలన్న ఉద్దేశంతోనే యంగ్ ఇండియా సంస్థను స్థాపించినట్లు చెబుతోంది. ఈ సంస్థ ఏర్పాటుకు పలువురు కాంగ్రెస్ నాయకులతోపాటు ఇతరులు 2019–22 మధ్య విరాళాల రూపంలో డబ్బులు సమకూర్చారు. అందుకు ప్రతిఫలంగా పదవులు, ప్రయోజనాలు కట్టబెడతామని ప్రస్తుత తెలంగాణ సీఎం (అప్పటి తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు) రేవంత్‌రెడ్డి, పవన్ బన్సల్, అహ్మద్ పటేల్ ప్రలోభ పెట్టారని ఈడీ చార్జిషీట్‌లో పేర్కొంది. సాక్షులను విచారించిన తర్వాతే ఈ విషయం నిర్ధారించుకున్నట్లు స్పష్టంచేసింది. ఈడీ ఆరోపణలపై రేవంత్‌రెడ్డి, పవన్ బన్సల్ ఇంకా స్పందించలేదు. ఇదిలా ఉండగా,

మిగతా 2వ పేజీలో ▶

డిగ్రీ.. పదో తరగతి

దరఖాస్తుదారుల్లో వీళ్లే ఎక్కువ

పీఎం ఇంటర్న్‌షిప్ రెండో రౌండ్‌లో పరిస్థితి

4 రాష్ట్రాల నుంచే 42 శాతం దరఖాస్తులు	మొత్తం 1.19 లక్షల అవకాశాలు	ఆఫర్ చేస్తున్న 327 కంపెనీలు

పీఎం ఇంటర్న్‌షిప్.. దేశంలోని టాప్ - 500 కంపెనీల్లో యువత శిక్షణ పొంది, ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్యాలు సాధించేందుకు అద్భుతమైన వేదిక. మొదటి రౌండ్ మొత్తం పూర్తయిపోయి, రెండో రౌండ్ కూడా నగం పూర్తయింది. ఈ దశలో టాప్ - 4 రాష్ట్రాలలోనే సుమారు 50 వేల అవకాశాలు ఉన్నాయి. మొత్తం అవకాశాల్లో ఇవి దాదాపు 42 శాతం. అంటే.. పారిశ్రామికంగా అభివృద్ధి చెందినవీ, పట్టణ ప్రాంతాలు ఎక్కువగా ఉన్న రాష్ట్రాలు ఎక్కువ అవకాశాలు అందిస్తున్నాయి. మరో ఆసక్తికర అంశం ఏంటంటే.. తమిళనాడు, కర్ణాటక, గుజరాత్, మహారాష్ట్ర, తెలంగాణల్లో గ్రాడ్యుయేషన్ అభ్యర్థుల తరవాత అత్యధిక ఇంటర్న్‌షిప్‌లకు దరఖాస్తు చేసింది పది పాసైనవారు. ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం గ్రాడ్యుయేషన్ తరవాత.. ఐటీఐ వాళ్లు ఎక్కువగా ఉన్నారు.

దేశంలోని 21-24 ఏళ్ల మధ్య ఉండే యువత ఉద్యోగ సాధనకు అవసరమయ్యే పూర్తిస్థాయి నైపుణ్యాలను.. అత్యుత్తమ కంపెనీల ద్వారా యువతకు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం 2024లో ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ పథకం (పీఎంఐఎస్) తీసుకొచ్చింది. పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ వంటి చదువులు పూర్తిచేసిన విద్యార్థులకు శిక్షణతోపాటు, నెలకు రూ.5,000 చొప్పున స్టైపెండ్ కూడా ఈ పథకం ద్వారా అందిస్తారు. దీంతోపాటు కంపెనీలో చేరేముందు వన్‌టైమ్ గ్రాంట్ కింద రూ.6,000 కూడా చెల్లిస్తారు. ఏడాదిలో 6 నెలలు క్లాస్ రూమ్‌లో, 6 నెలలు క్షేత్రస్థాయిలో శిక్షణ ఉంటుంది. ఏడాదికి రూ.8 లక్షల వార్షికాదాయం కలిగిన కుటుంబాలకు చెందినవారు దీనికి అర్హులు.

సాక్షి, స్పెషల్ డెస్క్



మొదటి రౌండ్‌లో..


ఈ ఏడాది మార్చిలో రాజ్యసభలో కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల శాఖ చెప్పిన సమాధానం ప్రకారం.. 2024 అక్టోబర్‌లో ప్రారంభమైన పీఎంఐఎస్ పైలట్ ప్రాజెక్ట్ మొదటి రౌండ్‌లో... చివరికి 28,141 మంది ఆఫర్లు తీసుకుని ఆయా సంస్థల్లో శిక్షణకు హాజరయ్యారు. ఇందులో ఏపీ నుంచి 1,970, తెలంగాణ నుంచి 1,380 మంది ఉన్నారు. యూపీ నుంచి అత్యధికంగా 4,656 మంది, బిహార్ నుంచి 2,418 మంది స్వీకరించారు. మొదటి రౌండ్‌లో మొత్తం 1.27 లక్షల ఆఫర్లు రాగా.. వాటికోసం 6.21 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. కంపెనీలు 82,077 మందిని ఎంపిక చేసుకుని ఇంటర్న్‌షిప్ ఆఫర్ చేశాయి.

రెండో రౌండ్‌లో..

రెండో రౌండ్‌లో కంపెనీల సంఖ్య పెరిగింది. మొదటి దశలో 280 వస్తే ఇప్పుడు 327 కంపెనీలు ముందుకొచ్చాయి. ఇవి సుమారు 1.19 లక్షల ఇంటర్న్‌షిప్ అవకాశాలు అందిస్తున్నాయి. దేశంలోని 36 రాష్ట్రాల్లోని 735 జిల్లాల్లో యువతకు.. 25 రంగాల్లో నైపుణ్యం పొందే అవకాశం లభించింది. ఈసారి ఈ అవకాశాన్ని అందిపుచ్చుకునేందుకు దేశంలోని ప్రధాన రాష్ట్రాల్లోని యువత పోటీపడ్డారు. మహారాష్ట్ర, తమిళనాడు, గుజరాత్, కర్ణాటక.. ఈ నాలుగు రాష్ట్రాల నుంచే దాదాపు 50 వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈసారి అత్యధిక ఇంటర్న్‌షిప్‌లు ఆఫర్ చేస్తున్న ప్రధాన రంగాలు.. చమురు, సహజవాయువు, ఇంధనం; పర్యాటకం, ఆతిథ్యం; బ్యాంకింగ్, ఆర్థిక సేవలు.. అత్యధిక ఇంటర్న్‌షిప్‌లు అందిస్తున్న టాప్ -3 రంగాలు.

గ్రాడ్యుయేషన్... ఐటీఐ

ఈసారి ఇంటర్న్‌షిప్‌లకు వచ్చిన దరఖాస్తుల్లో ప్రధాన రాష్ట్రాల్లో గ్రాడ్యుయేషన్ అభ్యర్థులు ఎక్కువగా ఉన్నారు. ఆ తరవాత పదో తరగతి అభ్యర్థులు ముందంజలో ఉండటం విశేషం. తమిళనాడు, మహారాష్ట్ర, కర్ణాటక, యూపీలలో ఇదే పరిస్థితి ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం గ్రాడ్యుయేషన్ తరవాత ఐటీఐ వాళ్లు అధిక సంఖ్యలో ఉన్నారు. మే 20 నాటికి 4,710 దరఖాస్తులు వస్తే.. అందులో గ్రాడ్యుయేషన్ చేసినవాళ్లు 1,717 మంది కాగా, ఐటీఐ అభ్యర్థులు 1,040 మంది. అలాగే తెలంగాణలో 5,252 రాగా.. గ్రాడ్యుయేషన్ అభ్యర్థులు దాదాపు నగం అంటే.. 2,611 మంది ఉండటం విశేషం.



అత్యధిక ఇంటర్న్‌షిప్ అవకాశాలు ఉన్న రంగాలు

రంగం	అవకాశాలు	శాతం
చమురు, సహజవాయువు, ఇంధనం	28,047	23.56%
పర్యాటకం, ఆతిథ్యం	15,022	12.62%
బ్యాంకింగ్, ఆర్థిక సేవలు	18,467	15.51%
ఆటోమోటివ్	11,730	9.8%
లోహాలు, మైనింగ్	8,368	7.03%

2025-26 రుణ లక్ష్యం రూ.7.65 లక్షల కోట్లు

గతేడాది కంటే 17% అధికం... ఎస్‌ఎల్‌బీసీ నివేదికలో వెల్లడి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో వ్యవసాయం, వ్యాపార రంగాల్లో పెట్టుబడి పెంపు, గ్రామీణ ఆర్థికశక్తి వృద్ధికి పెద్దపీట వేస్తూ బ్యాంకులు లక్ష్యాలను నిర్దేశించుకున్నాయి. 2025-26 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్రంలో రూ.7,65,000 కోట్ల రుణాలు ఇవ్వాలని నిర్ణయించాయి. గత ఏడాది (2024-25)లో రూ.6.51 లక్షల కోట్ల లక్ష్యానికి గాను అదనంగా మరో లక్ష కోట్లు ఎక్కువగా రూ.7.52 లక్షల కోట్ల రుణాలు టార్గెట్‌గా పెట్టుకున్నారు. గురువారం జరిగిన స్టేట్ లెవల్ బ్యాంకర్స్ కమిటీ (ఎస్‌ఎల్‌బీసీ) వార్షిక నివేదికలో ఈ మేరకు గత ఏడాది లక్ష్యాలను చేరుకున్న తీరు, వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఏఏ రంగాలకు ఎన్ని వేల కోట్ల రుణాలు మంజూరు చేయాలనే లక్ష్యాలను ఎస్‌ఎల్‌బీసీ చైర్మన్ రాజేశ్‌కుమార్ వెల్లడించారు.

వ్యవసాయ రంగం

2024-25లో వ్యవసాయ రంగానికి రూ.1.52 లక్షల కోట్లకు గాను రూ.1.37 లక్షల కోట్లు మంజూరు చేశారు. పంట రుణాల్లో 80.5% మేర పురోగతి సాధించగా, వ్యవసాయ ఆధారిత ఇతర రంగాల్లో 104.8% సాధించారు. 27.53 లక్షల రైతులకు రూ.33,245 కోట్ల విలువైన కేసీసీ (కిసాన్ క్రెడిట్ కార్డు) రుణాలు ఇచ్చారు.

ఎంఎస్‌ఎంఈ రంగం

ఎంఎస్‌ఎంఈలకు ఇచ్చే రుణ లక్ష్యం రూ.1.29 లక్షల కోట్లు కాగా, రూ.1.21 లక్షల కోట్ల రుణాలను ఆయా బ్యాంకులు ఇచ్చాయి. అంటే 93.6% లక్ష్యాన్ని సాధించాయి. మైక్రో, స్మాల్, మీడియం పరిశ్రమల విభాగాల్లో రుణాల ప్రవాహం పెరుగుతోందని ఎస్‌ఎల్‌బీసీ తెలిపింది.

ఇతర రంగాల్లో బలహీన పురోగతి

విద్యారుణాల్లో కేవలం 21.43 శాతం మాత్రమే లక్ష్యాలను చేరుకున్నాయి. 2024-25లో విద్యారుణాలను రూ.2707 కోట్లు మేర ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకోగా, రూ.580 కోట్లు మాత్రమే అందజేశారు.

గృహ రుణాల్లో 31.87 శాతం మాత్రమే లక్ష్యాలను చేరుకున్నట్టు ఎస్‌ఎల్‌బీసీ నివేదిక తెలిపింది. రూ.10,769 కోట్ల గృహ రుణాలు లక్ష్యం కాగా, కేవలం రూ.3432 కోట్లు మాత్రమే ఇచ్చారు.

2025-26 లక్ష్యాలు ఇవీ...

తాజా ప్రణాళిక ప్రకారం 2025-26లో రూ.7.65 లక్షల కోట్లు రుణాల లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో వ్యవసాయ రంగానికి రూ.1.65 లక్షల కోట్లు, ఎంఎస్‌ఎంఈలకు రూ.1.45 లక్షల కోట్లు ఇవ్వాలని నిర్ణయించారు. విద్యా రుణాలకు రూ.3200 కోట్లు, గృహరుణాలకు రూ.11,500 కోట్లు కేటాయించారు. విద్యా, గృహరుణాల్లో తక్కువ లక్ష్య సాధన కనబడగా, ఎంఎస్‌ఎంఇలు, వ్యవసాయరంగాల్లో బ్యాంకులు రుణాలకు ప్రాధాన్యం ఇస్తున్నట్టు తేలింది. కాగా బ్యాంకు రుణాలకు సంబంధించిన సిఫార్సులల్లో గ్రామీణ ప్రాంతాల్లో నిర్బంధ బ్యాంకు కరెస్పాండెంట్లను (బీసీలు) అమలు చేయాల్సి ఉంది. అన్ని కేసీసీ ఖాతాలకు ఆధార్ లింక్ చేయడంతో పాటు ఎస్‌హెచ్‌జీ సభ్యులకు బీమా పథకాలను విస్తరించాలని నివేదిక స్పష్టం చేసింది.

రంగం	2024-25 లక్ష్యం	2024-25 సాధన	సాధన శాతం	2025-26 లక్ష్యం
వ్యవసాయం	రూ.1.52 లక్షల కోట్లు	రూ.1.37 లక్షల కోట్లు	90.33%	రూ.1.65 లక్షల కోట్లు
ఎంఎస్‌ఎంఈలు	రూ.1.29 లక్షల కోట్లు	రూ.1.21 లక్షల కోట్లు	93.6%	రూ.1.45 లక్షల కోట్లు
ఇతర రంగాలు	రూ.16,777 కోట్లు	రూ.8,762 కోట్లు	52.23%	రూ.18,400 కోట్లు
విద్యా రుణాలు	రూ.2,707 కోట్లు	రూ.580 కోట్లు	21.4%	రూ.3,200 కోట్లు
గృహ రుణాలు	రూ.10,769 కోట్లు	రూ.3,432 కోట్లు	31.8%	రూ.11,500 కోట్లు

సామాజిక బాధ్యతను నెరవేర్చడంలో బ్యాంకర్లు ముందుండాలి

రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమితి సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి

సాక్షి, హైదరాబాద్: దేశంలోనే అతివేగంగా అభివృద్ధి చెందుతున్న తెలంగాణలో ప్రజలు ఆర్థికాభివృద్ధిలో ముందంజలో ఉండేలా బ్యాంకర్లు సహకరించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. విద్య, ఉపాధి, వ్యవసాయం, నైపుణ్య అభివృద్ధి తదితర రంగాల్లో బ్యాంకులు తగిన సహకారాన్ని అందించాల్సిన అవసరముందని చెప్పారు. గురువారం హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమితి (ఎస్‌ఎల్‌బీసీ) సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. రాష్ట్ర అభివృద్ధిలో బ్యాంకర్లు భాగస్వాములై 2025-26 వార్షిక రుణ ప్రణాళిక లక్ష్యాలను చేరుకోవాలని ఆకాంక్షించారు.

రాజీవ్ యువ వికాసానికి సహకరించాలి

రాజీవ్ యువ వికాస పథకం కింద ప్రభుత్వం జూన్ 2న రుణాల మంజూరు లెటర్లు జారీ చేస్తుందని, ప్రభుత్వం నిర్దేశించుకున్న లక్ష్యాన్ని చేరుకోవడానికి బ్యాంకర్లు సహకరించాలని భట్టి కోరారు. ఈ పథకానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.6,250 కోట్లు సబ్సిడీ రూపేణా ఇస్తున్నదని తెలిపారు. గతంలో యువతకు స్వయం ఉపాధి కింద రుణాలు ఇచ్చే సమయంలో 70 శాతం రుణం, 30 శాతం సబ్సిడీ ఉండేదని, ఇప్పుడది రివర్స్‌గా ఉందన్న విషయాన్ని బ్యాంకర్లు గ్రహించాలన్నారు. జూన్ 2న ఐదు లక్షల మంది యువతకు యువ వికాసం మంజూరు లేఖలు పంపిణీ చేయాలన్న లక్ష్యాన్ని చేరుకోవడానికి ప్రత్యేక నోడల్ అధికారిని నియమించాలని ఎస్‌ఎల్‌బీసీ కన్వీనర్‌ను కోరారు.



రుణ ప్రణాళిక బ్రోచర్ ఆవిష్కరిస్తున్న భట్టి, ఉన్నతాధికారులు

మానవ వనరుల అభివృద్ధి, వ్యవసాయంపై ప్రత్యేక దృష్టి

మానవ వనరుల అభివృద్ధికి స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేయడంతోపాటు ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నామని భట్టి చెప్పారు. ప్రభుత్వం వ్యవసాయానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నదని, ఇందులోనూ ఉద్యాన వన పంటలకు ప్రాధాన్యం ఇస్తుందన్నారు. రాష్ట్రానికి డ్రీమ్ ప్రాజెక్ట్ అయిన ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహిస్తున్నామని చెప్పారు.ఈ పంటకు రుణాలు ఇచ్చే విషయంలో బ్యాంకులో ఉదారంగా వ్యవహరించాలని కోరారు. ఈ సమావేశంలో ఉన్నతాధికారులు సందీప్‌కుమార్ సుల్తానియా, ఎస్ శ్రీధర్, శరత్, శ్రీధర్, చిన్మోయ్ కుమార్, ఉదయ్‌భాస్కర్, రాజేశ్‌కుమార్, ప్రకాశ్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.

యాదగిరిగుట్టకు ఎంఎంటీఎస్

రూ.400 కోట్లతో త్వరలో పనులు ప్రారంభం

- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వెల్లడి
- పునర్నిర్మించిన బేగంపేట రైల్వేస్టేషన్‌ను వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని మోదీ

సనత్‌నగర్ (హైదరాబాద్): యాదగిరిగుట్టకు ఎంఎంటీఎస్ మంజూరైందని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలి పారు. రూ.400 కోట్లతో త్వరలో పనులు ప్రారంభించనున్నామని చెప్పారు. ప్రపంచంలో ఏ దేశంలో లేని విధంగా భారత్‌లో ఏకకాలంలో 1,300 రైల్వేస్టేషన్లు అభివృద్ధి చేస్తున్నామన్నారు. అమృత్ భారత్ పథకం కింద పునర్నిర్మించిన బేగంపేట రైల్వేస్టేషన్‌లో అంతా మహిళా ఉద్యోగులే సేవలందించనుండడం గర్వకారణమని పేర్కొన్నారు. రూ.26 కోట్లతో పునర్ అభివృద్ధి చేసిన బేగంపేట రైల్వేస్టేషన్‌ను గురువారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా స్టేషన్ ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో కిషన్‌రెడ్డి మాట్లాడారు.

రాష్ట్రంలో 40 రైల్వేస్టేషన్ల అభివృద్ధి

రాజమాత అహల్యా బాయి 300వ జయంతి రోజున మహిళా ఉద్యోగులకు అంకితం చేస్తున్న బేగంపేట రైల్వేస్టేషన్‌ను ప్రారంభించడం గర్వకారణమని కేంద్రమంత్రి పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశవ్యాప్తంగా రైల్వే వ్యవస్థ వేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. తెలంగాణలో ఒకే సమయంలో 40 రైల్వేస్టేషన్ల అభివృద్ధి జరుగుతోందని చెప్పారు. 2026 నాటికి ఈ స్టేషన్లను స్థానిక సంస్కృతి, వారసత్వాన్ని ప్రతిబింబించేలా తీర్చిదిద్ది ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌ను రూ.720 కోట్లతో, నాంపల్లి (హైదరాబాద్) రైల్వేస్టేషన్‌ను రూ.350 కోట్లతో అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు.

దసరా నాటికి కొమురవెల్లి స్టేషన్ రెడీ

సిద్దిపేట జిల్లా కొమురవెల్లి వెళ్లే భక్తులకు రైలు సౌకర్యం కల్పించాలని ప్రధానిని కోరానని, ఆయన వెంటనే రైల్వేస్టేషన్‌ను మంజూరు చేశారని కిషన్‌రెడ్డి తెలిపారు. ఈ ఏడాది దసరా నాటికి పనులు పూర్తి చేసుకుని కొమురవెల్లి మల్లన్న భక్తులకు ఈ స్టేషన్‌ను అంకితం చేస్తామని చెప్పారు.


బేగంపేట రైల్వేస్టేషన్ ప్రారంభోత్సవంలో కిషన్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, అనిల్‌కుమార్

మాజీ మంత్రి నిజాలు గ్రహించాలి..

కేంద్రం అభివృద్ధి పనులను తక్కువ చేస్తూ ట్విట్టర్‌లో విమర్శలు చేసే మాజీ మంత్రి నిజాలను గ్రహించాలని కేటీఆర్‌ను ఉద్దేశించి కిషన్‌రెడ్డి పరోక్షంగా వ్యాఖ్యలు చేశారు. కాజీపేటలో రూ.580 కోట్లతో రైల్వే మాన్యుఫాక్చరింగ్ యూనిట్ నిర్మాణానికి మోదీ భూమి పూజ చేశారని గుర్తు చేశారు. అవసరమైతే జరిగిన అభివృద్ధిపై సదరు మాజీ మంత్రికి లేఖ పంపుతానని అన్నారు.

యాదగిరిగుట్ట ప్రాజెక్టు వెంటనే చేపట్టాలి: మంత్రి కోమటిరెడ్డి

యాదగిరిగుట్ట ఎంఎంటీఎస్ ప్రాజెక్టు వెంటనే చేపట్టాలని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కోరారు. ఘట్‌కేసర్ నుంచి యాదగిరిగుట్టకు రోజుకు 50 వేల నుంచి లక్ష మంది వరకు వెళ్తుంటారని, వారి ప్రయాణ సౌలభ్యం కోసం ఎంఎంటీఎస్‌ను అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు. రైల్వే ప్రాజెక్టులకు అవసరమైన స్థల సేకరణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా సహకరిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య తదితరులు పాల్గొన్నారు.

రెండ్రోజులు తేలికపాటి వానలు

కొన్ని ప్రాంతాల్లో మోస్తరు వర్షాలు

సాక్షి, హైదరాబాద్: అరేబియా సముద్రంలోని దక్షిణ కొంకణ్-గోవా తీర ప్రాంతంలో గురువారం తెల్లవారుజామున అల్పపీడనం ఏర్పడింది. ఇది ఉత్తర దిశగా కదులుతూ మరింత బలపడి శుక్రవారం సాయంత్రానికి వాయుగుండంగా మారే అవకాశమున్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. ఆ తర్వాత వాయుగుండం మరింత బలపడే అవకాశం ఉన్నట్లు అంచనా వేస్తోంది. దీంతో రానున్న రెండు రోజులు రాష్ట్రంలోని పలుప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఉమ్మడి మెదక్ జిల్లాలోని కొన్నిప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు నమోదు కావొచ్చని, అదేవిధంగా జగిత్యాల, కామారెడ్డి, మహబూబాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, రంగారెడ్డి, వరంగల్ జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షా లు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. మిగిలిన ప్రాంతా ల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. మరోవైపు, రానున్న రెండు, మూడు రోజుల్లో నైరుతి రుతుపవనాలు కేరళలో ప్రవేశించేందుకు అనుకూలమైన పరిస్థితులు ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది.

తగ్గిన ఉష్ణోగ్రతలు

గురువారం రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లో నమోదైన ఉష్ణోగ్రతలు పరిశీలిస్తే... గరిష్ట ఉష్ణోగ్రత నల్లగొండలో అత్యధికంగా 35.5 డిగ్రీల సెల్సియస్, కనిష్ట ఉష్ణోగ్రత మెదక్‌లో అత్యధికంగా 20.3 డిగ్రీల సెల్సియస్ నమోదైంది. చాలా ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 6-10 డిగ్రీల సెల్సియస్ తక్కువగా నమోదయ్యాయి. రానున్న రెండు రోజులు కూడా రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 5 డిగ్రీల సెల్సియస్ తక్కువగా నమోదు కావొచ్చని వాతావరణ శాఖ వివరించింది.

మీ సొంత విచక్షణ అనవసరం

- చట్టప్రకారం చర్యలు తీసుకోండి
- వైవీ స్వర్ణలత పిటిషన్‌లో పోలీసులకు హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: శేరిలింగంపల్లి మండలం కొండాపూర్‌లోని భూ వివాదంలో చట్టాన్ని పాటించాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. కాంపిటెంట్ కోర్టు ఇచ్చిన ఇంజంక్షన్ ఉత్తర్వులను పాటించనప్పుడు తగిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. ఉత్తర్వులను ఉల్లంఘించినట్లు స్పష్టంగా తెలుస్తున్నప్పుడు పోలీసులు సొంత విచక్షణతో వ్యవహరించలేరని తేల్చిచెప్పింది. పిటిషనర్ ఫిర్యాదును పరిశీలించి, చట్టప్రకారం వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. కొండాపూర్‌లోని సర్వే నంబర్ 87/2లోని 6.23 ఎకరాల చుట్టూ ఉన్న రెండెకరాల వివాదంలో ప్రైవేట్ వ్యక్తులకు అనుకూలంగా పోలీసులు వ్యవహరిస్తున్నారని వైఎస్సార్‌సీపీ నేత వైవీ సుబ్బారెడ్డి సతీమణి స్వర్ణలతారెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది వినోద్‌కుమార్ దేశ్‌పాండే, రోహిత్ పోగుల వాదనలు వినిపించారు. ప్రభావవంతమైన వ్యక్తులతో సంబంధాలున్న ప్రైవేట్ వ్యక్తులకు పోలీసులు వత్తాసు పలుకుతున్నారన్నారు. పలుమార్లు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోకపోగా, భూమిని స్వాధీనం చేసుకోవడానికి మద్దతు ఇస్తున్నారని వివరించారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. పిటిషనర్ ఫిర్యాదును పరిశీలించి రెండు వారాల్లోగా చట్టప్రకారం చర్య లు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు. కౌంటర్ దాఖలు చేయాలని ప్రైవేట్ పార్టీని ఆదేశిస్తూ, విచారణను జూన్ 23కు వాయిదా వేశారు.

మాజీ ఐఏఎస్ అధికారిపై చీటింగ్ కేసు

పెట్టుబడుల పేరుతో ప్రవాస భారతీయుడి నుంచి రూ.23 కోట్లు స్వాహా

సాక్షి, హైదరాబాద్: ఓ మాజీ ఐఏఎస్ అధికారిపై హైదరాబాద్ సెంట్రల్ క్రైమ్‌స్టేషన్ (సీసీఎస్)లో చీటింగ్ కేసు నమోదైంది. ఓ ప్రవాస భారతీయుడికి ఎర వేసి, రూ.23 కోట్లు స్వాహా చేశారనేది ప్రధాన ఆరోపణ. ఏపీ కేడర్‌కు చెందిన ఐఏఎస్ అధికారి పొన్నెకంటి దయాచారి 2008లో ఉద్యోగ విరమణ పొందారు. స్నేహితుల ద్వారా న్యూజెర్సీలో ఐటీ ప్రొఫెషనల్‌గా పనిచేస్తున్న కె.కల్యాణ్‌తో పరిచయం ఏర్పడింది. 2015లో అమెరికా వెళ్లిన దయాచారి అక్కడ కల్యాణ్‌ను కలిశారు. తాను ఐఏఎస్‌గా పలు కీలక హోదాల్లో పనిచేశానని, అనేక ప్రాజెక్టులు, వెంచర్లు తన చేతిలో ఉన్నాయని, వాటిలో పెట్టుబడులు పెడితే భారీ లాభాలు వచ్చేలా చేస్తానని కల్యాణ్‌తో అన్నారు. దీంతో తన అమెరికన్ బ్యాంకు ఖాతా నుంచి ఐదు లక్షల డాలర్లు బదిలీ చేశారు. ప్రాజెక్టుల పేర ఏళ్లకేళ్లుగా సాగదీసి, చివరగా ఈ ఏడాది మార్చి 17న రాసిచ్చిన ఎంఓయూలో ప్రాజెక్టులు ప్రారంభించి లాభాలు పంచుతానని, అలా కాకుంటే నగదు మొత్తం తిరిగి ఇచ్చేస్తానంటూ రాసి సంతకం చేశారు. ఇది కూడా కార్యరూపంలోకి రాకపోవడంతో కల్యాణ్ నగరానికి వచ్చి సీసీఎస్‌లో ఫిర్యాదు చేశారు.కేసు దర్యాప్తు దశలో ఉందని, వివిధ కోణాల్లో ముందుకు వెళుతున్నామని అధికారులు తెలిపారు.

నేషనల్ హెరాల్డ్ కేసులో సీఎం రేవంత్‌రెడ్డి

▶ మొదటి పేజీ తరువాయి

యంగ్ ఇండియా సంస్థ ఏర్పాటు కోసం రూ.30 లక్షలు విరాళంగా ఇచ్చానని కాంగ్రెస్ నేత అరవింద్ విశ్వనాథ్ సింగ్ చౌహాన్ ఈడీ విచారణలో అంగీకరించారు. అహ్మద్ పటేల్ సూచన మేరకే ఈ డబ్బులు ఇచ్చినట్లు తెలిపారు. కాగా, ఈడీ గతంలో మాజీ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్, మాజీ మంత్రి గీతారెడ్డి, గాలి అనిల్‌కుమార్‌కు కూడా నోటీసులిచ్చి విచారించిన విషయం తెలిసిందే.

నాంపల్లి కోర్టుకు సీఎం రేవంత్‌రెడ్డి

ఎన్నికల కోడ్ ఉల్లంఘన కేసులో హాజరైన సీఎం

తుది తీర్పు జూన్ 12కి వాయిదా



సిటీ కోర్టులు: గత ఎన్నికల సమయంలో ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించారని పోలీసులు నమోదు చేసిన కేసులో సీఎం రేవంత్‌రెడ్డి గురువారం వ్యక్తిగతంగా ఆయన తరపు న్యాయవాది విశ్వేశ్వర్‌రావు ఆధ్వర్యంలో నాంపల్లి కోర్టుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా కోర్టు ఆయన వాంగ్మూలం నమోదు చేసుకుంది. తుదితీర్పు ఇచ్చేందుకు కేసు విచారణను జూన్ 12కు వాయిదా వేస్తున్నట్లు నాంపల్లి లోని ప్రజాప్రతినిధుల కోర్టు తెలిపింది. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో పీసీసీ చీఫ్‌గా ఉన్న రేవంత్‌రెడ్డి, ఎన్నికలకోడ్ ఉన్నా పట్టించుకోకుండా రిజర్వేషన్లపై వ్యాఖ్యలు చేశారని బేగంబజార్ పోలీసులు కేసు నమోదు చేశారు. దీంతో నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టులో కేసు విచారణ కొనసాగుతోంది. గురువారం జరిగిన విచారణకు ఈ కేసులో నిందితుడిగా ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి కోర్టుకు హాజరై తన స్టేట్మెంట్ ఇవ్వాలని గత విచారణ సందర్భంగా జడ్జి శ్రీదేవి.. రేవంత్‌రెడ్డి తరపు న్యాయవాదికి సూచించారు. దీంతో రేవంత్‌రెడ్డి వ్యక్తిగతంగా కోర్టుకు హాజరై సీఆర్‌పీసీ సెక్షన్ 313 ప్రకారం తన స్టేట్మెంట్‌ను ఇవ్వగా కోర్టు రికార్డ్ చేసుకుంది. సీఎం రేవంత్‌రెడ్డి తన స్టేట్మెంట్ ఇస్తూ.. ఈ కేసుకు తనకు ఎలాంటి సంబంధంలేదని తెలిపారు. తాను రిజర్వేషన్లపై ఎలాంటి తప్పుడు వ్యాఖ్యలు చేయలేదని, పోలీసులు చెప్పేవి అవాస్తవాలని తెలిపారు. తాను ఎక్కడ, ఎలాంటి తప్పు చేయలేదని పేర్కొన్నారు. స్టేట్మెంట్ రికార్డు చేసుకున్న కోర్టు, తుది తీర్పు వచ్చే విచారణలో ఉంటుందని సూచిస్తూ, జూన్ 12కి వాయిదా వేసింది.

హైదరాబాద్‌కు 2వేల ఎలక్ట్రిక్ బస్సులు

పీఎం ఈ-డ్రైవ్‌లో భాగంగా ఢిల్లీ, బెంగళూరు, అహ్మదాబాద్‌లకు కేటాయింపు

వచ్చే ఏడాది మార్చి నాటికి రోడ్లపైకి 14,028 ఎలక్ట్రిక్ బస్సులు: కేంద్ర మంత్రి కుమారస్వామి



సాక్షి, న్యూఢిల్లీ: పర్యావరణాన్ని పరిరక్షించేందుకు కేంద్రం ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెడుతున్నట్లు కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామి తెలిపారు. ఎలక్ట్రిక్ బస్సుల వాడకం వలన కాలుష్యం బాధ నుంచి ప్రధాన నగరాలకు ఉపశమనం కలిగే అవకాశం ఉంటుందన్నారు. ప్రధాన మంత్రి ఈ-డ్రైవ్ పథకంలో భాగంగా ప్రధాన నగరాలకు ఈ బస్సులను అందచేస్తున్నట్లు చెప్పారు. హైదరాబాద్, ఢిల్లీ, బెంగళూరు, అహ్మదాబాద్, సూరత్ తదితర సిటీలు ఈ పథకంలో బస్సుల కోసం నమోదు చేసుకున్నట్లు తెలిపారు. గురువారం హెచ్‌డీ కుమారస్వామి అధ్యక్షతన ఢిల్లీలోని ఆయన కార్యాలయంలో ఎలక్ట్రిక్ బస్సులపై సమీక్ష నిర్వహించారు. పీఎం ఈ-డ్రైవ్ పథకంలో భాగంగా హైదరాబాద్‌కు 2వేలు, బెంగళూరుకు4,500, ఢిల్లీకి 2,800, అహ్మదాబాద్‌కు 1,000, సూరత్‌కు 600 చొప్పున బస్సులను అందిస్తామని చెప్పారు. రూ.10,900 కోట్లతో 14,028 ఎలక్ట్రిక్ బస్సులను వచ్చే ఏడాది మార్చి నాటికి అందించేలా సిద్ధమవుతున్నట్లు కేంద్ర మంత్రి వెల్లడించారు.

కొలువుల కుదింపు.. వేతనాల్లోనూ కోత!

▶ మొదటి పేజీ తరువాయి

వెలువడలేదు. మిగిలిన ఎంప్లాయిమెంట్లు ప్రతిపాదన దశలోనే ఉండిపోయాయి. కాగా కాంగ్రెస్ ప్రభుత్వం 73రకాల ఎంప్లాయిమెంట్లకు సంబంధించిన ప్రాథమిక నోటిఫికేషన్లను గతేడాది జనవరి 29న జారీ చేయగా.. ఇప్పుడున్న కనీస వేతన సలహా బోర్డు తుది ప్రతిపాదనలు రూపొందిస్తోంది.

నాలుగు అంశాలు కొలిక్కి...: ఈ బోర్డు గతేడాది డిసెంబర్‌లో ఏర్పాటు కాగా.. అప్పట్నుంచి ఏడుసార్లు సమావేశమైంది. ప్రభుత్వం జారీ చేసిన ప్రాథమిక నోటిఫికేషన్లపై సుదీర్ఘంగా చర్చించి ఐదు ఎంప్లాయిమెంట్లకు సంబంధించి ప్రతిపాదనలను దాదాపు సిద్ధం చేసింది. ఇందులో నాలుగు రకాల అంశాలపై కీలకంగా నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. కార్మికుల వేతనాలకు సంబంధించి బేసిక్ వేజ్, వీడీఏ ఖరారుతో పాటు, ఉద్యోగ హోదా (డిజిగ్నేషన్), సర్వీసు నిబంధనలకు సంబంధించిన ఫుట్ నోట్లను కూడా సిద్ధం చేసినట్లు తెలిసింది.

కట్.. కట్... కట్...: కనీస వేతన సలహా మండలి సమావేశాల్లో చర్చించి నిర్ణయం తీసుకున్న అంశాలపై కార్మిక సంఘాలు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. కార్మిక సంఘాల ద్వారా తెలిసిన సమాచారం ప్రకారం .. కనీస వేతన సలహా బోర్డు సెక్యూరిటీ సర్వీసెస్, కన్‌స్ట్రక్షన్ ఆఫ్ రోడ్స్ అండ్ బిల్డింగ్స్, స్టోన్ బ్రేకింగ్ అండ్ స్టోన్ క్రషింగ్, కన్‌స్ట్రక్షన్ ఆఫ్ ప్రాజెక్ట్స్, ప్రైవేట్ మోటార్ ట్రాన్స్‌పోర్ట్ ఎంప్లాయిమెంట్స్‌కు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం అయ్యాయి.

ఫుట్ నోట్స్ కీలకం...: కార్మికుల సర్వీసు నిబంధనల్లో ఫుట్ నోట్స్ కీలకం . ఈ ఫుట్‌నోట్స్ ఆధారంగా కార్మికుడి గ్రేడ్ పెంచుతూ వేతనాలను సవరిస్తారు. ఉదాహరణకు ఒక కేటగిరీలో కార్మికుడు ఐదేళ్లపాటు పనిచేస్తే ఆరో సంవత్సరం కార్మికుడి గ్రేడ్ పెంచుతూ అధిక వేతనం ఇవ్వాలి. నైట్ షిఫ్ట్ అలవెన్సు 25 శాతం, రిస్క్ అలవెన్స్ 20 శాతం, అధిక ఎత్తులు, భూమి లోపల పనిచేసే వారికి అదనపు వేతనం జారీ తదితర నిబంధనలున్న ఫుట్ నోట్లను తగ్గించినట్లు సమాచారం. కన్‌స్ట్రక్షన్ ఆఫ్ రోడ్స్ అండ్ బిల్డింగ్స్ ఎంప్లాయిమెంట్ 21 ఫుట్‌నోట్‌లను 5కు పరిమితం చేశారు. ఏకంగా 16 ఫుట్‌నోట్‌లు రద్దు చేశారు. ఇలా అన్ని సెక్టార్లలోనూ ఫుట్‌నోట్లకు కోత పడింది.

హైలీ స్కిల్డ్ వేతనంలో రూ.7,234 కోత: 2021 జూన్‌లో ప్రభుత్వం ఐదు కేటగిరీలకు కనీస వేతనాలకు ఖరారు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. తాజాగా బోర్డు ప్రతిపాదించిన వేతనాలను పరిశీలిస్తే గతంలో కంటే భారీగా కోత పెట్టినట్లు తెలుస్తోంది. హైలీ స్కిల్డ్ కేటగిరీలో రూ.7,234 కోత పడగా.. అన్‌స్కిల్డ్‌లో రూ.3,018 కోత పడింది. ఐదేళ్ల క్రితం నిర్దేశించిన వేతనాలకంటే 10 శాతం నుంచి 20 శాతం మేర కోత పెడుతూ బోర్డు ప్రతిపాదనలు తయారు చేయడంపై కార్మిక సంఘాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

క్లుప్తంగా...

కోల్‌కతాకు జస్టిస్ పినాకి చంద్రఘోష్

జూన్ 3న తిరిగి రాక.. 5న కేసీఆర్ విచారణ



సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం బ్యారేజీలపై విచారణ జరుపుతున్న జస్టిస్ పినాకి చంద్రఘోష్ గురువారం కోల్‌కతాకు తిరిగి వెళ్లిపోయారు. మళ్లీ జూన్ 3న ఆయన హైదరాబాద్‌కు వచ్చే అవకాశం ఉంది. జూన్ 5న మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, 6న మాజీ మంత్రి ఈటల రాజేందర్, 9న మాజీ మంత్రి హరీశ్‌రావు విచారణకు హాజరుకావాలని కమిషన్ ఇదివరకే నోటీసులు పంపిన విషయం విదితమే. ముగ్గురినీ క్రాస్ ఎగ్జామినేషన్ చేసిన అనంతరం కమిషన్ ప్రభుత్వానికి నివేదిక సమర్పించే అవకాశముంది. గతేడాది మార్చిలో కాళేశ్వరం బ్యారేజీలపై విచారణలో భాగంగా ప్రభుత్వం కమిషన్‌ను ఏర్పాటు చేసింది. తాజాగా కమిషన్ విధించిన గడువు జూలై 31తో ముగియనుంది. ఈ దఫా విచారణ అత్యంత కీలకంగా మారింది. మాజీ సీఎం, ఇద్దరు మాజీ మంత్రులను విచారణకు పిలవడంతో క్రాస్ ఎగ్జామినేషన్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది. అయితే కేసీఆర్ విచారణకు హాజరవుతారా? లేక కోర్టులో సవాలు చేస్తారా? లేఖ రాసి దూరంగా ఉంటారా? అనే దానిపై ఉత్కంఠ నెలకొంది. ఈటల, హరీశ్‌రావులు విచారణకు హాజరవుతామని ఇప్పటికే ప్రకటించారు.

కేటీఆర్‌ను చూసి నవ్వుకుంటున్నారు

టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్



సాక్షి, హైదరాబాద్: పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంపై న్యాయస్థానం తీర్పు తమకు అనుకూలంగా ఇచ్చినట్లు, నీతిమంతులమని చెప్పేందుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేస్తున్న ప్రయత్నాలను చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ఎద్దేవా చేశారు. నాడు కాంగ్రెస్ పార్టీలో ఉన్న నాగం జనార్దన్ రెడ్డి ఈ పథకంపై కోర్టులో కేసు వేశారని తెలిపారు. ఆయన పూర్తి ఆధారాలతో కేసు వేస్తే బీఆర్ఎస్ పార్టీలో చేర్చుకుని.. ఆ కేసు నీరుగారేలా, వీగిపోయేలా వ్యవహరించారని ధ్వజమెత్తారు. ఈ మేరకు ఆయన ఒక వీడియో విడుదల చేశారు. బీఆర్ఎస్ పార్టీలోని నాయకుడు.. అధినేత కేసీఆర్‌పై ఎలా కొట్లాడతారని ప్రశ్నించారు. జరిగింది అదైతే.. తామంతా నీతిమంతులమని, చేసిన అవినీతి మాయమైనట్లు కేటీఆర్ మాట్లాడుతుండటం శోచనీయమన్నారు. దీనిపై ధైర్యం ఉంటే.. సీబీఐ, జ్యుడీషియల్ విచారణల్లో.. ఏది కావాలో కోరుతూ ప్రభుత్వానికి లేఖ రాయాలని కేటీఆర్‌కు సూచించారు.

రాజకీయ కక్షసాధింపు..

కేసీఆర్‌కు నోటీసులపై సబిత



సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టును న్యాయస్థానాలు సైతం ప్రశంసిస్తుంటే, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కేసీఆర్‌కు నోటీసులు ఇవ్వడం ఎంతవరకు న్యాయమని బీఆర్ఎస్ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ప్రశ్నించారు. ఇది కేవలం రాజకీయ కక్షసాధింపు చర్య తప్ప మరొకటి కాదని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీక అని, కేసీఆర్ దూరదృష్టితో నిర్మించిన ఈ ప్రాజెక్టు తెలంగాణలో వ్యవసాయ రంగానికి జీవనాడి అని కొనియాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి ప్రాజెక్టులపై రాద్ధాంతం చేస్తోందని ఆరోపించారు.

నిలోఫర్‌లో ప్రైవేట్ మందుల దుకాణం కూల్చివేత

ప్రభుత్వ స్థలంలో నిర్మించడంపై సర్కార్ ఆగ్రహం

సూపరింటెండెంట్ సీఎంవో, మంత్రి పేర్లు ఉపయోగించడంపై సీరియస్.. తానెలాంటి అనుమతి ఇవ్వలేదని స్పష్టం చేసిన కలెక్టర్

ఎవరి ప్రయోజనాల కోసం దుకాణం అనే అనుమానాలు



నిలోఫర్‌లో నిర్మించిన కాంక్రీట్ నిర్మాణాన్ని కూల్చేస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్

సాక్షి, హైదరాబాద్: నిలోఫర్ ఆస్పత్రిలో రాత్రికి రాత్రే నిర్మించిన మందుల దుకాణాన్ని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశాల మేరకు అధికారులు తొలగించారు. గురువారం నాంపల్లి తహసీల్దార్, ఇతర సిబ్బంది ఆస్పత్రి భవనం ఎదురుగా నిర్మించిన దుకాణాన్ని కూల్చివేయించారు. 'రాత్రికి రాత్రే కట్టేశారు'శీర్షికన నిలోఫర్ ఆస్పత్రి ఆవరణలో ప్రైవేట్ మందుల దుకాణ నిర్మాణంపై 'సాక్షి'లో ప్రచురితమైన కథనం ఆరోగ్యశాఖలో చర్చనీయాంశమైంది. దీనిపై సీఎం కార్యాలయంతోపాటు మంత్రి దామోదర రాజనర్సింహ ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. ఆరోగ్యశాఖ కార్యదర్శి క్రిస్టినా చోంగ్తూను వివరణ కోరినట్టు సమాచారం. నిలోఫర్ ఆస్పత్రిలో ప్రైవేటు మందుల దుకాణం ఏర్పాటుకు సంబంధించిన అంశంపై విచారణ జరిపి వివరణ ఇవ్వాలని వైద్యవిద్య సంచాలకులు డాక్టర్ నరేంద్రకుమార్‌కు ఆదేశించారు. కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి స్పందిస్తూ నిలోఫర్ ఆస్పత్రి క్యాంపస్‌లో నిర్మాణాలకు ఎవరికి అనుమతి ఇవ్వలేదని ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. మెడికల్ షాపు కోసం డీఎంఈ, కలెక్టర్ నుంచి అనుమతులు తీసుకున్నామని ఆస్పత్రి సూపరింటెండెంట్ చెప్పడం అవాస్తవమని కలెక్టర్ తెలిపారు.

ఎవరి కోసం?: నిలోఫర్ ఆస్పత్రిలో ప్రైవేట్ మందుల దుకాణం కోసం ఏకంగా పార్కు స్థలంలోనే కాంక్రీట్ కట్టడం నిర్మించిన తీరు అనేక అనుమానాలకు తావిస్తోంది. సీఎం కార్యాలయ ఆదేశాలతో మంత్రి దామోదర, కలెక్టర్లతో చర్చించి మందుల దుకాణం ఏర్పాటుకు అనుమతి ఇచ్చినట్టు నిలోఫర్ సూపరింటెండెంట్ డాక్టర్ రవికుమార్ 'సాక్షి'కి ఫోన్‌లో తెలియజేశారు. ఎమర్జెన్సీలో అవసరమైన మందుల కోసం వైద్యులు ఎదురుచూసే పరిస్థితి లేకుండా ఆస్పత్రి ఆవరణలోనే మందుల దుకాణం పెట్టాలని అందరితో చర్చించి నిర్ణయం తీసుకున్నట్టు ఆయన చెప్పారు. అయితే మంత్రి, కలెక్టర్, డీఎంఈలు సూపరింటెండెంట్ ప్రకటనను తోసిపుచ్చిన నేపథ్యంలో మందుల దుకాణం అంశం మళ్లీ చర్చనీయాంశమైంది. నిజంగానే సీఎంఓ స్థాయిలో సూపరింటెండెంట్‌ను ప్రభావితం చేసేలా ఒత్తిళ్లు వచ్చాయా అని ఆరోగ్యశాఖలో చర్చ నడుస్తోంది. హైదరాబాద్‌లోని ప్రఖ్యాత ఉస్మానియా, గాంధీ ఆస్పత్రులలో నిర్వహిస్తున్న మందుల దుకాణాలపై కూడా మంత్రి దృష్టి పెట్టాల్సిన అవసరముంది. ప్రభుత్వమే రోగులకు ఉచితంగా మందులు అందజేస్తున్నప్పుడు ప్రైవేట్ మందుల దుకాణాలకు అనుమతి ఎందుకు ఇస్తారనే ప్రజల అనుమానాలను నివృత్తి చేయాల్సి ఉంది.

● బీఆర్ఎస్‌లో నాలుగు స్తంభాలాట మొదలవుతుందని తాను ముందే చెప్పానని బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్సీ కవిత బీఆర్ఎస్ అధినేత, తన తండ్రి కేసీఆర్‌కు లేఖ రాసిన విషయంపై మహేశ్వర్‌రెడ్డి గురువారం ఈ మేరకు ఒక వీడియోను విడుదల చేశారు.

వెళదామా.. వద్దా?

కేసీఆర్‌తో హరీశ్‌రావు భేటీ

పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నోటీసులపై చర్చ

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టుపై పీసీ ఘోష్ విచారణ కమిషన్ నోటీసులు ఇచ్చిన నేపథ్యంలో బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌తో మాజీమంత్రి టి.హరీశ్‌రావు భేటీ అయ్యారు. ఎర్రవల్లిలోని కేసీఆర్ వ్యవసాయక్షేత్రంలో గురువారం జరిగిన ఈ భేటీలో విచారణ కమిషన్ ఇచ్చిన నోటీసులపై ఎలా స్పందించాలనే అంశంపై సుదీర్ఘంగా చర్చించినట్టు సమాచారం. బీఆర్ఎస్‌పై బురద చల్లేందుకు ఉద్దేశపూర్వకంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన విచారణ కమిషన్ నోటీసులకు స్పందించాల్సిన అవసరం లేదనే అభిప్రాయాన్ని కేసీఆర్ సూత్రప్రాయంగా వ్యక్తం చేసినట్టు తెలిసింది. విచారణ కమిషన్ కాల పరిమితిని ఏడు పర్యాయాలు పొడిగించడం, విచారణ పూర్తయినట్టు ప్రకటించిన తర్వాత తిరిగి నోటీసులు జారీ చేయడాన్ని కేసీఆర్ ప్రస్తావించినట్టు తెలిసింది. కమిషన్ ఎదుట హాజరైతే ఎదురయ్యే అనుకూల, ప్రతికూలతలపై చర్చ జరిగినట్టు సమాచారం. కేవలం మేడిగడ్డ బరాజ్‌ను మాత్రమే కాళేశ్వరం ప్రాజెక్టుగా చిత్రీకరిస్తూ దుష్ప్రచారం చేసిన తీరును కేసీఆర్ ప్రస్తావించినట్టు తెలిసింది. విచారణ కమిషన్‌ను అడ్డుపెట్టుకొని బీఆర్ఎస్‌ను బదనాం చేసేందుకు జరుగుతున్న ప్రయత్నాలను ప్రజల్లోనే ఎండగట్టడం మంచిదనే అభిప్రాయం ఈ భేటీలో వ్యక్తమైనట్టు తెలిసింది. కాళేశ్వరం విశిష్టతలు, మేడిగడ్డలో బరాజ్ నిర్మాణానికి దారితీసిన సాంకేతిక అంశాలను వివరిస్తూ కమిషన్‌కు లేఖ రాస్తే ఎలా ఉంటుందనే కోణంలోనూ చర్చ జరిగినట్టు తెలిసింది. కమిషన్ ఎదుట హాజరయ్యే అంశంపై నెలాఖరులోగా కేసీఆర్ తన వైఖరి చెప్పే అవకాశముందని బీఆర్ఎస్ వర్గాలు వెల్లడించాయి.

5వేల లైసెన్స్‌డ్ సర్వేయర్లు

తొలివిడతలో నియమిస్తామని వెల్లడించిన మంత్రి పొంగులేటి

ప్రతీ మండలానికి 6 నుంచి 8 మంది..

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో భూసమస్యలకు శాశ్వత పరిష్కారం లక్ష్యంగా లైసెన్స్‌డ్ సర్వేయర్ల నియామకాలను చేపడుతున్నామని రెవెన్యూ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. తొలివిడతలో ఐదువేల మంది లైసెన్స్‌డ్ సర్వేయర్‌లను నియమిస్తామని తెలిపారు. నక్షా లేని గ్రామాలు, లైసెన్స్‌డ్ సర్వేయర్ల శిక్షణపై గురువారం పొంగులేటి అధికారులతో సమీక్షించారు. వీరికి ఈనెల 26 నుంచి ఆయా జిల్లా కేంద్రాల్లో శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తామని, ఇది రెండు నెలలపాటు కొనసాగుతుందని చెప్పారు. దరఖాస్తుదారులు సోమవారం ఆయా జిల్లా సర్వే అధికారులను సంప్రదించాలని సూచించారు. శిక్షణ పూర్తయిన వెంటనే ఆయా మండలాల్లో భూవిస్తీర్ణం, భూ లావాదేవీల ఆధారంగా 6 నుంచి 8 మంది సర్వేయర్లను నియమిస్తామని పొంగులేటి తెలిపారు. రాబోయే రోజుల్లో ప్రతీ గ్రామంలో, మండలంలో, రెవెన్యూ డివిజన్‌లో, పట్టణ ప్రాంతాల్లో భూములకు సంబంధించిన అనేక సమస్యలకు ఈ సర్వేయర్ల ద్వారా శాశ్వత పరిష్కారం చూపుతామని చెప్పారు.

రిజిస్ట్రేషన్ సమయంలో సర్వే పత్రం తప్పనిసరి

రిజిస్ట్రేషన్ సమయంలో ఎమ్మార్వో, సబ్ రిజిస్ట్రార్ దగ్గర భూములకు సంబంధించిన డాక్యుమెంట్లతోపాటు సర్వే పత్రాన్ని కూడా జత పరచాలని భూభారతి చట్టంలో ఉందని, ఇందుకు అనుగుణంగానే సర్వే విభాగాన్ని బలోపేతం చేస్తున్నామని మంత్రి పొంగులేటి తెలిపారు. ఇప్పటివరకు సర్వే రికార్డులు లేని 413 నక్షా గ్రామాలలో రీసర్వే చేపడుతున్నామన్నారు. ఇందులోభాగంగా ప్రయోగాత్మకంగా మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండలం సలార్ నగర్, జగిత్యాల్ జిల్లా బీర్పూర్ మండలం కొమ్మనాపల్లి (కొత్తది) గ్రామం, ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం ములుగుమడ, ములుగు జిల్లా వెంకటాపురం మండలం నూగురు, సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి మండలం షాహిద్ నగర్ గ్రామాలను ఎంపిక చేసినట్లు తెలిపారు.

సీఎం రేవంత్‌లో అపరిచితుడు

ఒకే అంశంపై రోజుకో రీతిలో మాట్లాడుతున్నాడు: కేటీఆర్

పర్సంటేజీల నుంచి దృష్టి మళ్లించేందుకే కేసీఆర్‌కు నోటీసులు

కాళేశ్వరాన్ని కూల్చి మళ్లీ నిర్మించి కమీషన్లు తీసుకోవాలనే కుట్ర

పీసీ ఘోష్ కమిషన్ విచారణ పూర్తయినా పొడిగింపు ఎందుకు?

మిస్ వరల్డ్ పోటీలకు మంత్రులు టూర్ గైడ్లుగా పనిచేస్తున్నారు



సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిలో ఒక అపరిచితుడు ఉన్నాడని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎద్దేవా చేశారు. ఆయనకు 'మల్టీపుల్ పర్సనాలిటీ డిజార్డర్' అనే భయంకరమైన మానసిక రుగ్మత ఉండటంతో ఒకే అంశంపై రోజుకో రీతిలో మాట్లాడుతున్నారని అన్నారు. తెలంగాణ భవన్‌లో గురువారం కేటీఆర్ మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టి నిర్వహించారు. 'పర్సంటేజీల పాలన నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు నోటీసులు అంటూ కాంగ్రెస్ నీచ రాజకీయాలు చేస్తోంది. పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టుపై కాంగ్రెస్ చేసిన దుష్ప్రచారం సుప్రీం కోర్టు సాక్షిగా తేలి పోయి నిజాలు బయటకు వచ్చాయి. కాళేశ్వరంపై కాంగ్రెస్, బీజేపీ కలసికట్టుగా చేస్తున్న దుష్ప్రచారం కూడా త్వరలో తేలిపోతుంది. కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రభుత్వం నియమించిన పీసీ ఘోష్ తన విచారణ పూర్తయిందని, నివేదిక సిద్ధంగా ఉందని చెప్పారు. కానీ తిరిగి కమిషన్ గడువును ఎందుకు పొడిగించారో చెప్పాలి'అని డిమాండ్ చేశారు. కాళేశ్వరం అంశానికి సంబంధించి కేసీఆర్, హరీశ్‌రావుకు నేరుగా నోటీసులు అందినట్లు సమాచారం లేదని కేటీఆర్ తెలిపారు. నోటీసులు అందిన తర్వాత విచారణకు హాజరు కావడంపై నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని అన్ని బరాజ్‌లను కూలగొట్టి మళ్లీ టెండర్లు పిలవడం ద్వారా 20 నుంచి 30 శాతం కమీషన్లు తీసుకోవాలన్నదే ఈ నోటీసుల వెనుక ఉన్న అసలు ఎజెండా అని ఆరోపించారు.

రైతులు ఆత్మహత్యలు చేసుకుంటుంటే..

రాష్ట్రంలో 500 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటే సీఎం అందాల పోటీల్లో తలమునకలై ఉన్నారని కేటీఆర్ విమర్శించారు. అన్నదాతల ధాన్యం వర్షంలో కొట్టుకుపోతుంటే.. రేవంత్ అందాల పోటీలకు ప్రాధాన్యత ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. గుల్జార్ హౌస్‌లో అతి పెద్ద అగ్ని ప్రమాదం జరిగితే కనీసం చూడటానికి కూడా వెళ్లని సీఎం.. అందాల పోటీలకు మాత్రం నాలుగు సార్లు హాజరయ్యారని ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రభుత్వం వద్ద ఒక్క రూపాయి కూడా లేదంటూనే అందాల పోటీలకు రూ.200 కోట్లు ఖర్చు పెడుతున్నారని ఆరోపించారు. మంత్రులంతా మిస్‌వరల్డ్ పోటీదారులకు టూర్ గైడ్లుగా మారిపోయారని ఎద్దేవా చేశారు. మిస్ వరల్డ్ పోటీదారులకు బీఆర్ఎస్ ప్రభుత్వం కట్టిన ప్రాజెక్టులను చూపిస్తున్నారని, నిజాంలు, కేసీఆర్ కట్టిన ప్రాజెక్టులు మినహా చూపించేందుకు కాంగ్రెస్ కట్టిన ఒక్క ప్రాజెక్టు కూడా లేకుండా పోయిందని కేటీఆర్ ఎద్దేవా చేశారు.

అభిప్రాయభేదాలు సహజం

రాజకీయ పార్టీల్లో అభిప్రాయ భేదాలు సహజమని కేటీఆర్ అన్నారు. 'నలుగురు కుటుంబ సభ్యులు ఉన్న ఇంట్లోనే కొన్ని విషయాల్లో అభిప్రాయ భేదాలు వస్తాయి. అలాంటిది లక్షల మంది కార్యకర్తలు ఉన్న పార్టీలో అభిప్రాయ భేదాలు ఉండడం సహజమే. వాటిని పక్కనపెట్టి అధిష్టానం ఎవరికి టికెట్ ఇస్తే వారి గెలుపు కోసం ప్రతి ఒక్క కార్యకర్త కష్టపడి పని చేయాలి'అని సూచించారు. గురువారం హైదరాబాద్‌లో తనను కలిసిన నిర్మల్ జిల్లా బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ ఈ వ్యాఖ్యలు చేశారు.

బీఆర్ఎస్‌లో 'కవిత లేఖ' కలకలం

▶ మొదటి పేజీ తరువాయి

చేరుకోనున్నారు. కవిత హైదరాబాద్‌కు చేరుకున్న తర్వాతే లేఖ అంశంపై స్పందించే అవకాశముంది. అయితే కవిత రాసింది లేఖ కాదని, తన అభిప్రాయాలతో రాసిన నోట్ మాత్రమేనని ఆమె సన్నిహిత వర్గాలు చెప్తున్నాయి. రజతోత్సవ సభపై కేసీఆర్‌కు ఫీడ్‌బ్యాక్ ఇచ్చేందుకు తయారుచేసుకున్న నోట్స్ బయటకు ఎలా లీక్ అయిందనే కోణంలోనూ చర్చ జరుగుతోంది.

లేఖలో పేర్కొన్న అంశాలు

→ ఎల్కతుర్తి సభ పార్టీ కేడర్‌లో కొత్త ఉత్సాహాన్ని ఇచ్చింది. అందరూ మీ (కేసీఆర్) ప్రసంగం చివరి వరకు ఆసక్తిగా విన్నారు. ఆపరేషన్ కగార్, రేవంత్ ప్రభుత్వ వైఫల్యాలు, పహల్గాం అమరులకు నివాళి, ప్రసంగంలో రేవంత్ పేరును ప్రస్తావించకపోవడం అందరికీ నచ్చాయి.

→ తెలంగాణ అంటే బీఆర్ఎస్ అనే విషయాన్ని బలంగా చెప్తారని ఆశించారు. ప్రసంగంలో మరింత పంచ్ ఉండాలని నాయకులు, కార్యకర్తలు కోరుకున్నారు. పోలీసులను హెచ్చరించడంపై మంచి స్పందన వచ్చింది. తెలంగాణ తల్లి విగ్రహం, తెలంగాణ గీతం మార్చడంపై మీరు స్పందిస్తారని అనుకున్నారు.

→ వక్ఫ్ బిల్లు, బీసీలకు 42శాతం రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణ మీద మాట్లాడితే బాగుండేది.

→ బీజేపీపై మీరు రెండు నిమిషాలు మాత్రమే మాట్లాడటంతో భవిష్యత్తులో బీజేపీతో పొత్తు పెట్టుకుంటారనే ఊహాగానాలకు తావు ఇచ్చినట్లు అయింది. బీజేపీతో ఇబ్బంది పడిన తాను కూడా ఇదే అంశాన్ని కోరుకున్నా. క్షేత్రస్థాయిలో కాంగ్రెస్‌పై నమ్మకం కోల్పోయిన వారు బీజేపీ మనకు ప్రత్యామ్నాయమవుతుందని అనుకుంటున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పోటీ చేయకపోవడంతో బీజేపీకి మనం సాయం చేశామనే కోణాన్ని కాంగ్రెస్ ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లింది.

→ జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్యే స్థాయి వ్యక్తులు కూడా మిమ్మల్ని కలవడం సాధ్యం కావడం లేదనే అభిప్రాయంతో ఉన్నారు. దయచేసి అందరికీ చేరువకండి.

హద్దులన్నీ దాటుతోంది

▶ మొదటి పేజీ తరువాయి

జరిగాయని అనవసరంగా నేర విచారణను ఈడీ మొదలెట్టింది. 2014 ఏడాది నుంచి ఇప్పటిదాకా అక్రమంగా డైరెక్టరేట్ ఆఫ్ విజిలెన్స్, అవినీతి నిరోధక విభాగాలతో తప్పుడు ఫిర్యాదులు ఇప్పించి 41 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయించారు. ఇప్పుడు కొత్తగా ఈడీ రంగంలోకి దిగి అన్యాయంగా టాస్మాక్ కార్యాలయాలపై చట్టవ్యతిరేకంగా దాడులు చేస్తోంది. మహిళా అధికారులను గంటల తరబడి టాస్మాక్ ఆఫీసుల్లోనే నిర్బంధించి ఈడీ అధికారులు వేధించారు. వ్యక్తిగత వస్తువులను లాక్కుని గోప్యతకు, ప్రాథమిక హక్కులకు భంగం కల్గించారు''అని సిబల్ వాదించారు. ఈడీ దర్యాప్తును సమర్థిస్తూ ఏప్రిల్ 23వ తేదీన మద్రాస్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వం, టాస్మాక్ తాజాగా సుప్రీంకోర్టును ఆశ్రయించిన విషయం తెల్సిందే.

రాష్ట్రాల హక్కులను కూలదోస్తోంది..

→ సుప్రీంకోర్టులో తమిళనాడు సర్కార్ సైతం తన వాదనలను బలంగా వినిపించింది. ''ఈడీ ప్రవర్తన సమాఖ్య విధానాన్ని కూలదోసేలా ఉంది. రాష్ట్రాల హక్కులను ఈడీ కాలరాస్తోంది. తమ పరిధిలోని నేరాల విచారణ రాష్ట్రాలకు సంబంధించిన విషయంకాగా ఈడీ రాష్ట్రాల హక్కులను అన్యాయంగా, బలవంతంగా లాక్కుంటోంది''అని తమిళనాడు ప్రభుత్వం వాదించింది. ఈఏడాది మార్చి ఆరో తేదీ నుంచి మార్చి 8వ తేదీ దాకా ఏకధాటిగా 60 గంటలపాటు రాష్ట్రంలో ఈడీ చేసిన సోదాలు, తనిఖీలు, దాడులు, జప్తుల పర్వానికి చట్టబద్ధత ఉందా? అని తమిళనాడు సర్కార్ ఈడీని సుప్రీంకోర్టులో నిలదీసింది. ''మార్చి ఆరో తేదీన టాస్మాక్ ప్రధాన కార్యాలయంలో మనీలాండరింగ్ నిరోధక చట్టంలోని సెక్షన్ 17 ప్రకారం సోదాలు, జప్తులు చేశామని ఈడీ చెబుతోంది. కానీ టాస్మాక్ అనేది పూర్తిగా రాష్ట్ర పరిధిలోని సంస్థ. ఇప్పటిదాకా అక్రమంగా నమోదైన ఎఫ్ఐఆర్‌లలో ఏ ఒక్క దాంట్లోనూ టాస్మాక్ పేరును 'నిందితుల జాబితా'లో పేర్కొనలేదు. ఎలాంటి ఆరోపణలు లేని, నిందితుల జాబితాలో లేని సంస్థ పరిధిలో, ప్రాంగణాల్లో ఈడీకి విచారణ, దర్యాప్తు చేసే హక్కు లేదు. పీఎంఎల్ఏ చట్టం సైతం ఇదే విషయాన్ని స్పష్టంచేస్తోంది''అని తమిళనాడు సర్కార్ కోర్టులో వాదించింది. ''2021లో చివరిసారిగా ఎఫ్ఐఆర్ నమోదైతే ఇంత ఆలస్యంగా సోదాలు చేయడమేంటి?. పీఎంఎల్ఏ చట్టంలోని సెక్షన్ 17 ప్రకారం నమ్మశక్యమైన కారణాలు ఉంటేనే దర్యాప్తు/సోదాలు జరపాలి. కానీ ఈడీ ఈ నిబంధనను గాలికొదిలేసింది. సరైన లక్ష్యం లేకుండా రంగంలోకి దూకి అడ్డదిడ్డంగా దర్యాప్తు చేస్తోంది'' అని రాష్ట్ర ప్రభుత్వం వాదించింది. ఈడీని సుప్రీంకోర్టు ఇదే తొలిసారి కాదు. గతంలోనూ చాలా కేసుల్లో పలు సుప్రీంకోర్టు ధర్మాసనాలు ఈడీ వైఖరిని తప్పుబట్టాయి. మనీ లాండరింగ్ చట్ట నిబంధనలను దుర్వినియోగం చేస్తున్నారని సర్వోన్నత న్యాయస్థానం ఆక్షేపించింది.

బీజేపీకి చెంపదెబ్బ: సుప్రీంకోర్టు నిర్ణయంపై డీఎంకే వ్యాఖ్య

→ టాస్మాక్ కేసులో సుప్రీంకోర్టు స్టే నిర్ణయం కేంద్రంలోని బీజేపీకి చెంపదెబ్బలా తగిలిందని తమిళనాడులోని పాలక డీఎంకే పార్టీ వ్యాఖ్యానించింది. ఈ మేరకు డీఎంకే సీనియర్ నాయకుడు, పార్టీ కార్యదర్శి(వ్యవస్థాగతం) ఆర్ఎస్ భారతి గురువారం చెన్నైలో మీడియాతో మాట్లాడారు. ''టాస్మాక్ కేసులో సుప్రీంకోర్టు ఉత్తర్వులను మేం స్వాగతిస్తున్నాం. 2014లో మోదీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి బీజేపీ అధికారంలోని లేని రాష్ట్రాలపై ఈడీని ఉసిగొల్పుతున్నారు. 2021లో తమిళనాడులో ఎంకే స్టాలిన్ సారథ్యంలో డీఎంకే సర్కార్ కొలువుతీరాక ఈ ప్రభుత్వాన్ని కూలదోసేందుకు ఈడీని రంగంలోకి దింపారు. తాజాగా కోర్టు ఉత్తర్వులు చూశాకైనా బీజేపీ ఈడీని దుర్వినియోగం చేయడం మానుకుంటే మంచిది. తమిళనాడులో మరో 7–8 నెలల్లో శాసనసభ ఎన్నికలున్నాయి. వీటిని దృష్టిలో పెట్టుకునే ఈడీ సోదాలు చేసింది''అని ఆర్ఎస్ భారతి అన్నారు. కోర్టు నిర్ణయాన్ని విపక్ష పార్టీలు సైతం స్వాగతించాయి.

ఆయనే ఆకాశాలను మరియు భూమిని మరియు వాటి మధ్య ఉన్న సమస్తాన్ని ఆరు దినములలో (అయ్యాములలో) సృష్టించి తరువాత తన సింహాసనాన్ని (అర్ష్‌ను) అధిష్ఠించాడు.

– ఇస్లాం ధర్మం

సాక్షి

శుక్రవారం, 23 మే 2025

మావోలకు పెద్ద దెబ్బ

విస్తీర్ణంలో చాలా దేశాలతో పోలిస్తే ఎంతో పెద్దదైన మధ్య భారతంలో కొన్ని దశాబ్దాలుగా సాగుతున్న వామపక్ష తీవ్రవాదం క్షీణిస్తున్న జాడలు గత కొన్నేళ్లుగా కనబడుతుండగా... మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు బుధవారం తెల్లవారుజామున జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరణించారు. అబూజ్‌మడ్ అడవుల్లో జరిగిన ఆ ఎన్‌కౌంటర్‌లో ఆయనతోపాటు మరో 26 మంది నక్సలైట్లు చనిపోయారని, వారిలో పలువురు కీలక నేతలు ఉండొచ్చని అధికారిక ప్రకటన చెబుతోంది. ఇరుపక్షాల మధ్యా జరిగిన కాల్పుల్లో భద్రతా బలగాల్లోని ఒక జిల్లా రిజర్వ్ గార్డ్ (డీఆర్‌జీ) కానిస్టేబుల్ ప్రాణాలు కోల్పోగా, మరికొంతమంది గాయపడ్డారని అధికారిక కథనం. ప్రధాన కార్యదర్శి స్థాయి నేత మరణించటం మావోయిస్టు పార్టీకి నిస్సందేహంగా కోలుకోలేని దెబ్బ. అందుకే కావొచ్చు... ఈ ఎన్‌కౌంటర్ గర్వించదగ్గ విజయమని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు.

ఆదివాసీల హక్కుల కోసం, దోపిడీ నిరోధానికీ ఆయుధం పట్టామని చెబుతున్న మావోయిస్టులు ఇన్ని దశాబ్దాల పోరాటంలో తమ చర్యల పర్యవసానాలనూ, వాటి నిరర్థకతనూ గమనించి సరిచేసుకోలేకపోయారని అర్థమవుతుంది. నక్సలైట్ ఉద్యమం పూర్వాపరాలు గమనిస్తే అదెప్పుడూ పడుతూ లేస్తూనే సాగింది. కానీ తమ పోరాటాలపై రాజ్యం ప్రతిసారీ ఎందుకు పైచేయి సాధించ గలుగుతున్నదన్న అంశంపై వారు దృష్టి పెట్టినట్టు లేదు. అంతకుముందు దేశంలో చెదురుమదురుగా జరిగిన సాయుధ పోరాటాలు అంతరించాయనుకుంటున్న తరుణంలో 1967లో పశ్చిమ బెంగాల్‌లోని డార్జిలింగ్ జిల్లా సిలిగుడి డివిజన్‌లో మారుమూల గ్రామమైన నక్సల్బరీలో రాజుకున్న ఉద్యమం వేగంగా విస్తరించి సీపీఐ(ఎంఎల్) ఆవిర్భావానికి దారితీసింది. మూడేళ్ల లోపునే పోలీసులు ఆ ఉద్యమాన్ని అణిచేయగలిగారు. దానివెంబడే అప్పటి ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో వెల్లువెత్తిన ఉద్యమం సైతం ఎన్‌కౌంటర్ల పరంపర తర్వాత మూడేళ్లకే సద్దుమణిగింది. తిరిగి మరో ఆరేళ్లకు ఉత్తర తెలంగాణలో తలెత్తి విస్తరించిన ఉద్యమం ఒక్కటే దీర్ఘకాలం సాగిందనుకోవాలి. ఈ మూడు చోట్లా ఒకేవిధంగా మొదట్లో మధ్యతరగతి, మేధావి, విద్యార్థి వర్గాలను ఆకర్షించిన ఉద్యమాలు అనంతర కాలాల్లో ఆ వర్గాలకు ఎందుకు దూరమయ్యాయన్న విశ్లేషణను మావోయిస్టులు చేసుకోలేదని వారి ఆచరణ తీరు గమనిస్తే అర్థమవుతుంది. మరోపక్క నక్సల్ ఉద్యమం చీలికలూ, పేలికలూ అయింది. సీపీఐ (ఎంఎల్) భిన్నవర్గాలుగా విడిపోయింది. లిబరేషన్ వంటి పార్టీలు పార్లమెంటరీ పంథాకు మళ్లి చెప్పుకోదగ్గ విజయాలు సాధిస్తున్నాయి.

పాలకులెవరైనా ప్రజాస్వామ్యంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేయటానికీ, ప్రభుత్వ విధానాలు సక్రమంగా లేవనుకుంటే ప్రజల్ని కూడగట్టి ఉద్యమించటానికీ ఎప్పుడూ అవకాశాలుంటాయి. 2014లో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడ్డాక భూసేకరణ చట్టం సవరించినప్పుడూ, అనంతర కాలంలో సాగు చట్టాలు తీసుకొచ్చినప్పుడూ రైతాంగం నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. చివరకు కేంద్రం ఆ చర్యల్ని వెనక్కి తీసుకోక తప్పలేదు. మావోయిస్టు పార్టీ వీటిని గమనంలోకి తీసుకుందా? అంతక్రితం 1977 తర్వాత ఉద్యమాల్లోకి ప్రజల్ని కూడగట్టడంలో విజయం సాధించినా అటుపై ఆ ఉద్యమాలకు తోడు సాయుధ చర్యలు కూడా మొదలయ్యాయి. పర్యవసానాలు తెలియని యువతను మొదట్లో ఇవి ఆకర్షించివుండొచ్చు. కానీ ప్రభుత్వ బలగాలు పకడ్బందీ వ్యూహాలు అమలు చేయటం ప్రారంభించాక ఆ సాయుధ చర్యలు వ్యతిరేక ఫలితాలిస్తాయి.

సమస్యలెన్నివున్నా ప్రజలు మౌలికంగా శాంతియుత జీవనాన్ని కోరుకుంటారు. నిత్యం ఉద్రిక్తతల నడుమ అనిశ్చితిలో బతికే స్థితి ఉన్నప్పుడు దాన్నుంచి సాధ్యమైనంత త్వరగా బయటపడటానికి ప్రయత్నిస్తారు. ప్రభుత్వాలు అణచివేత చర్యలతోపాటు వారి ప్రశాంతతకు హామీ ఇచ్చినప్పుడు సహజంగానే ఉద్యమాల వైపు మొగ్గు తగ్గుతుంది. మొదట్లో ఉన్నత చదువులు చదివినవారు భద్రమైన జీవితాన్నీ, బంగారు భవిష్యత్తునూ వదులుకుని ఆ ఉద్యమాల వైపు వెళ్లిన మాట వాస్తవం. అందుకు నిరుద్యోగం, ప్రభుత్వ వ్యవస్థల్లో పెరిగిన అవినీతి వంటివి కారణం అయ్యాయి. కానీ 1990వ దశకం చివరిలో ప్రపంచీకరణ తర్వాత మన దేశంలో పెట్టుబడులు వెల్లువలా రావటం, యువతకు మెరుగైన అవకాశాలు ఏర్పడటం మొదలయ్యాక ఉద్యమాల పట్ల విముఖత ఏర్పడింది. ఈ తరం విద్యార్థులు అటువైపు వెళ్లటం మాట అటుంచి, వారిలో అత్యధికులకు ఆ ఉద్యమాలపై కనీస అవగాహన కూడా లేదు. మావోయిస్టు ఉద్యమంలో కొత్త రిక్రూట్‌మెంట్ గణనీయంగా తగ్గి పోయిందని గణాంకాలు చెబుతున్నాయి.

ఉద్యమంలో మధ్యతరగతి వర్గానికి బదులు ప్రస్తుతం ఆదివాసీల ప్రాబల్యం గతంతో పోలిస్తే పెరిగింది. కానీ దానికి సమాంతరంగా ఆదివాసీలను తమవైపు తిప్పుకోవటంలో భద్రతా బలగాలు సైతం విజయం సాధించగలిగాయి. నంబాల కేశవరావు తదితర ఉద్యమ నేతలు ఎన్‌కౌంటర్లలో మరణించటం ఆ పర్యవసానమే! వర్తమానంలో విస్తృతంగా అభివృద్ధి చెందిన సాంకేతికత సైతం బలగాలకు అందివచ్చింది. నక్సలిజాన్ని వచ్చే ఏడాది మార్చి ఆఖరుకల్లా అంతం చేస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా తరచూ చెబుతున్నారు. జరుగుతున్న పరిణామాలు గమనిస్తే అది సాధ్యమేనన్న అభిప్రాయం కలుగుతుంది. ఏదేమైనా ఈ సమస్య హింసకు తావులేకుండా శాంతియుతంగా పరిష్కారమైతే సమాజం సంతోషిస్తుంది. అందుకు మావోయిస్టులు తమ పంథా మార్చుకుని సహకరించాలి. వారు పునరాలోచించుకునేందుకు కేంద్రం కూడా వ్యవధినివ్వాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు వైశాఖ మాసం, **తిథి:** బ.ఏకాదశి రా.6.41 వరకు, తదుపరి ద్వాదశి, **నక్షత్రం:** ఉత్తరాభాద్ర ప.12.30 వరకు, తదుపరి రేవతి, **వర్జ్యం:** రా.11.44 నుండి 1.14 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.05 నుండి 8.56 వరకు, తదుపరి ప.12.21 నుండి 1.12 వరకు, **అమృత ఘడియలు:** ఉ.7.55 నుండి 9.26 వరకు.

సూర్యోదయం : 5.30
సూర్యాస్తమయం: 6.22
రాహుకాలం : ఉ.10.30 నుండి 12.00 వరకు
యమగండం : ప.3.00 నుండి 4.30 వరకు

పెరిగేది... దిగుబడా? సమస్యలా?

విశ్లేషణ



దొంతి నరసింహారెడ్డి

మొన్న మే 4న కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ దేశంలో మొదటి సారిగా జీనోమ్ ఎడిట్ చేసిన రెండు కొత్త వరి రకాలను విడుదల చేశారు: డీఆర్‌ఆర్ రైస్ 100 (కమల), పూసా డీఎస్‌టీ రైస్ 1. కమల రకాన్ని సాంబా మహసూరి (బీపీటీ 5204) ఆధారంగా ఐసీఏఆర్-ఐఐఆర్‌ఆర్ హైదరాబాద్ అభివృద్ధి చేసింది. రెండవ రకం-పూసాను ఎంటీయూ 1010 ఆధారంగా ఐసీఏఆర్-ఐఏఆర్‌ఐ న్యూఢిల్లీ అభివృద్ధి చేసింది. ప్రభుత్వం విడుదల చేసిన ప్రకటనలో వీటి వల్ల ఈ ప్రయోజనాలు ఉన్నాయి: దిగుబడిలో 19 శాతం పెరుగుదల. గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలలో 20 శాతం తగ్గింపు. 7,500 మిలియన్ క్యూబిక్ మీటర్ల సాగునీరు ఆదా. కరువు, లవణీయత, వాతావరణ ఒత్తిళ్లను మెరుగ్గా తట్టుకోగలగడం.

ఈ ప్రకటన ప్రకారం, ఈ రకాలు పంట కాలాన్ని 20 రోజులు తగ్గిస్తాయి. తద్వారా కర్బన ఉద్గారాలను, నీటి వినియోగాన్ని తగ్గిస్తాయి. అయితే, మొత్తం సమాచారం బయటపెట్టలేదు. వీటి విడుదల ఆహారానికి, ఆహార భద్రతకు, పర్యావరణ పరిరక్షణకు సంబంధించినది కాబట్టి తెలుసుకోవడం, ప్రతిస్పందించడం ప్రజల హక్కు.

ఇతర దిగుబడి సమస్యలో?

దాదాపు 50 ఏండ్ల క్రితం అధిక దిగుబడి వంగడాల పేరిట హైబ్రిడ్ రకాలను విడుదల చేయడం వల్ల కొనసాగుతున్న అనర్థాలు అనేకం. ఈ రెండు వరి రకాలు వాతావరణ మార్పులను తట్టుకునేవి అనుకుందాం (ఇది ఒక సందేహాస్పద వాదనగానే కనిపిస్తుంది). మరి దిగుబడి ఎట్లా పెరుగుతుంది? వరి దిగుబడిపై ప్రభావం చూపే కారణాలలో విత్తనాలతో సహా అనేకం ఉన్నాయి- సారవంతమైన నేల, సరైన పోషకాలు, నీరు, పొలంలో ఇతర జీవాల పాత్ర, వగైరా. తీవ్ర వాతావరణ మార్పుల వల్ల పంటలకు ఉపయోగపడే ఇతర రకాల జీవులు కూడా ఒత్తిడికి గురవుతున్నాయి. వాటిలో మట్టిలో ఉండే సూక్ష్మజీవులు కూడా ఉన్నాయి. తెగుళ్లు కూడా ఉన్నాయి. కేవలం వరి ధాన్యానికి వాతావరణ మార్పు ఒత్తిడిని తట్టుకునే శక్తిని అభివృద్ధి చేసుకుంటే సరిపోతుందా? దిగుబడిని ప్రభావితం చేసే ఇతర అంశాలు కూడా ఆ విధమైన శక్తిని సంపాదించకుంటే, వరి దిగుబడి స్థిరంగా ఉంటుందా? వరి జన్యువులో ఒకటి మార్చినంత మాత్రాన దిగుబడి పెరగదు.

ప్రధానంగా, భారతదేశంలో వరి దిగుబడి సమస్య చాలా కాలంగా అనేక రూపాలలో కనిపిస్తున్నది. నిరంతరం ఒకే పంట వేయడం వల్ల, అధిక నీరు ఇవ్వడం నేల సారం పూర్తిగా పడిపోయింది. కృత్రిమ, రసాయన ఎరువులు వేయనిదే పంట రావడం లేదు. ఈ రకమైన దిగుబడి సమస్య మీద పరిశోధన చేయకుండా ఇంకేదో చేయడం సరి కాదు. వాస్తవానికి, ప్రభుత్వ సమాచారం ప్రకారమే 2025 ఏప్రిల్ 1 నాటికి వరి నిల్వలు రికార్డు స్థాయిలో 63.09 మిలియన్ టన్నులు ఉన్నాయి. ప్రభుత్వ లక్ష్యం కంటే 13.6 మిలియన్ టన్నులు అధికం. మరింత దిగుబడి పెరిగితే రైతుకు గిట్టుబాటు కాదు. ప్రభుత్వం కొనదు! మరి ఈ రెండు కొత్త వరి విత్తన రకాల ద్వారా శాస్త్రవేత్తలు ఏ సమస్యను పరిష్కరించడానికి ప్రయత్నించారు? సరళంగా చెప్పాలంటే, శాస్త్రవేత్తల అవగాహన రైతుల సమస్యలకు భిన్నంగా ఉంటున్నది. రైతులు తక్కువ దిగుబడి గురించి ఫిర్యాదు చేయడం లేదు. అధిక సాగు ఖర్చులు, గిట్టుబాటు లేని ధరల గురించి ఫిర్యాదు చేస్తున్నారు. ఈ తాజా వరి రకాల విడుదలలో భారతీయ రైతులకు ఏమి అవసరమో అది కాకుండా, కంపెనీలకు ఉపయోగపడే శాస్త్రీయ పరిశోధన పేరుతో కొత్త రకాలను నెత్తిన రుద్దుతున్న వైనం కనబడుతోంది.



◆ కేంద్ర ప్రభుత్వం కమల, పూసా పేర్లతో జీనోమ్ ఎడిట్ చేసిన రెండు కొత్త వరి రకాలను విడుదల చేసింది. ఇవి దిగుబడి పెంచుతాయనీ, వాతావరణ మార్పులను తట్టుకుంటాయనీ చెబుతున్నారు. నేల సారం, పోషకాలు, నీరు, సూక్ష్మజీవుల లాంటి వాటిని పట్టించుకోకుండా కేవలం ఒక మార్పుతో దిగుబడి సాధ్యమా? నిజానికి రైతులు తక్కువ దిగుబడి గురించి ఫిర్యాదు చేయడం లేదు. అధికమైన సాగు ఖర్చులు, గిట్టుబాటు లేని ధరలు అసలు సమస్య!

'శుద్ధి' చేయడం సాధ్యమా?


ఈ వరి రకాలు ఒక కొత్త సాంకేతిక విప్లవం అని ఢంకా బజాయిస్తున్నారు. గింజలను అధికంగా ఉత్పత్తి చేసే జన్యువు పని సానుకూలం చేశాము అంటున్నారు. పోషకాలు లేదా ఇతర 'సహాయం' లేకుండా ఒక జన్యువు అధికంగా గింజలను సాధించగలదా? గాలిలో నుంచి సాధువు భస్మం పుట్టించినట్టు వరి గింజలోని ఒక జన్యువు అధిక దిగుబడి ఇస్తుంది అంటున్నారు. పర్యవసానాలు, దీర్ఘకాలిక పరిణామాల గురించి చెప్పడం లేదు. ఈ ఆహారం తినే మనుష్యుల మీద, జంతువుల మీద ఎలాంటి ప్రభావాలు ఉంటాయో తెలియదు. విత్తనాల జన్యుక్రమం, సహజ సంపదకు కలిగే దీర్ఘకాలిక పరిణామాల గురించి అసలే తెలియదు. ఈ రకమైన విత్తనాల వల్ల సహజ, మంచి రకం విత్తనాలు కలుషితం అయితే తిరిగి వాటిని 'శుద్ధి' చేయడం అసాధ్యం. పరిశోధనలు, పరిశీలనలు, పరీక్షలను కొన్ని ఏళ్ల పాటు ప్రయోగశాలలో జరపాల్సి ఉండగా, కేంద్రం తొందర పడి ఈ రెండు రకాలను విడుదల చేయడంలో సార్వజనీన సంక్షేమ లక్ష్యం కనపడటం లేదు. విదేశీ ప్రైవేట్ కంపెనీల గుప్పిట్లో ఉన్న ఈ టెక్నాలజీకి ప్రభుత్వమే ముందుండి ప్రోత్సాహం ఇవ్వడం ఆశ్చర్యం కలిగిస్తున్నది. పేరుకే కేంద్ర ప్రభుత్వ సంస్థల పేర్లు ముందట పెడుతున్నా దీని వెనుక విదేశీ, లాభాపేక్ష శక్తులు ఉన్నట్లు అనుమానం కలుగుతోంది.

విత్తనాలు, జన్యు సంపదతో ఆడుకోవడానికి శాస్త్రవేత్తలకు క్రిస్పర్ (సీఆర్ఐఎస్‌పీఆర్) ఒక సాధనంగా మారింది. ఈ టెక్నాలజీ ఉపయోగించి ఇంకా 40 పంటల మీద పరిశోధనలు జరుగుతున్నాయని కేంద్రం ప్రకటించింది. వరి జన్యుక్రమంలో జన్యువులను తమ ఇష్టానుసారంగా తొలగించి, శాస్త్రవేత్తలు కోరుకున్న విధంగా 'స్పందిస్తుందని' మనకు విశ్వాసం కల్పించే ప్రయత్నం చేస్తున్నారు. అధిక దిగుబడి, వాతావరణ ఒత్తిళ్లకు తట్టుకునే శక్తి సామాజిక-ఆర్థిక లక్ష్యాలు. ఇవి ఇప్పుడు ప్రకృతిలో చొప్పించబడ్డాయి. ప్రకృతిపై ఇటువంటి పరిశోధన నిరపాయ కరమైనది కాదు. ఈ పరిశోధన వెనుక ఉన్నతమైన ఆదర్శాలు లేవు. స్వతంత్ర పర్యవేక్షణ లేకుండా ఒక కొత్త ఉత్పత్తిని మార్కెట్లో ప్రవేశపెట్టి వ్యాపారం పెంచుకోవడానికి ప్రభుత్వం మద్దతు ఇవ్వడం ఆక్షేపించదగినది. భారత ప్రభుత్వం ఈ రకం పరిశోధనలను నియంత్రించాలి, నిషేధించాలి. అంతగా అవసరం అనుకుంటే ప్రయోగ శాలలకే పరిమితం చేయాలి. క్రిస్పర్ ఆధారిత జన్యుమార్పిడి పంటల మీద భారత సమాజంలో విస్తృత, బహిరంగ చర్చ జరగాల్సిన అవసరం ఉంది.

వ్యాసకర్త వ్యవసాయ రంగ నిపుణులు

పాకిస్తాన్ ఎందుకు భ్రష్టు పట్టింది?

అభిప్రాయం



ఎయిర్ వైస్ మార్షల్ (రిటైర్డ్) అర్జున్ సుబ్రమణియం

పాకిస్తాన్ వ్యవస్థాపకుడు, ఆ దేశ ప్రథమ గవర్నర్ జనరల్ మహమ్మద్ అలీ జిన్నా బతికున్నంత కాలం పాకిస్తాన్ ఒక ఇస్లామిక్ ప్రజాస్వామ్యం అయినా ఇతర మతాలు, సంస్కృతులు అక్కడ సహజీవనం చేసేందుకు అవకాశం ఉండేది. జిన్నా మృతి అనంతరం ఈ భావన అంతరించిపోయింది. దేశంలో రాజకీయ-సైనిక సంబంధాలు విచ్ఛిన్నమయ్యాయి. అస్థిరత్వం వేరూనింది. పాకిస్తాన్ బ్రిటిష్ కాలనీ నుంచి ఒక ఆధునిక దేశంగా రూపొందే పరిణామ క్రమాన్ని ఈ పరిస్థితులు దెబ్బతీశాయి.

పాక్ రాజకీయ-సైనిక సంబంధాలను మూడు ప్రధాన ఇతివృత్తాలతో వివరించవచ్చు. వీటిలో మొదటిది: అక్కడి రాజకీయ నాయకత్వానికి ఏనాడూ సరైన విజ్ఞత లేదు. రాజకీయ పార్టీలు ఆది నుంచీ అవినీతికి మారుపేర్లుగా ఉన్నాయి. ఈ పరిస్థితి సైనిక జోక్యానికి తావిచ్చింది. ఆ దేశంలో రాజకీయ అస్థిరత ఏ స్థాయిలో ఉందో చెప్పడానికి ఒక ఉదాహరణ ఏమిటంటే, ఇప్పటి వరకు ఇండియాలో 14 మంది ప్రధాని పదవి అలంకరించగా, పాకిస్తాన్ ప్రజలు ఇదే కాలంలో 24 మంది ప్రధానులను చూశారు.

రెండోది: పాకిస్తాన్ సైన్యం రాజకీయ స్థాయికి ఎదిగి హింసాయుత రాజకీయాలపై క్రమంగా పట్టు సాధించడం. 1951లో అప్పటి ప్రధాన మంత్రి లియాఖత్ అలీ ఖాన్ హత్య నుంచి 2022 నవంబర్‌లో ఇమ్రాన్ ఖాన్‌పై హత్యాయత్నం వరకు... ఈ ఘటనలు అన్నీ ఏదో రూపంలో పాక్ సైన్యంతో ముడిపడి ఉన్నాయి.

రాజకీయ వేదిక మీద ప్రాబల్యం సంపాదించే ప్రక్రియలో పాక్ సైన్యం రెండు పద్ధతులు అనుసరించింది. వీటిలో మొదటిది- సైనిక నియంతృత్వం. ఈ పద్ధతిలో పాక్ సైనిక అధిపతులు నిస్సిగ్గుగా రాజకీయ అధికారం హస్తగతం చేసుకుని తమను తాము దేశాధ్యక్షులుగా ప్రకటించుకున్నారు. రాజకీయ సంక్షోభాలను సృష్టించి, వాటిని సాకుగా చూపిస్తూ తాము దేశానికి రాజకీయ సుస్థిరత అందిస్తామంటూ వారీ దుశ్చర్యకు పాల్పడ్డారు. మిలిటరీ జనరల్లు అయూబ్ ఖాన్, యాహ్యా ఖాన్, జియా-ఉల్-హక్, పర్వేజ్ ముషారఫ్ ఈ పద్ధతిలో రాజకీయ అధికారం చేపట్టారు. వీరి హయాంలో ప్రధానులు డమ్మీలుగా ఉండేవారు. ఇక్కడో ఆసక్తికరమైన అంశం ఉంది. పాకిస్తాన్ ఏర్పాటు నుంచీ ఆ దేశ సైన్యానికి కేవలం 15 మంది ఆధిపత్యం వహించారు. వీరి పదవీ కాలం 2 నుంచి 12 ఏళ్లు. ఇదే సమయంలో ఇండియాకు 31 మంది సైనికాధిపతులుగా వ్యవహరించారు. ఆర్మీ చీఫ్‌గా వీరి పదవీకాలం రెండేళ్లు/ 62 ఏళ్లకు రిటైర్మెంటు నిబంధనకు లోబడి ఉంటుంది.

◆ పాక్ రాజకీయ నాయకత్వానికి ఏనాడూ సరైన విజ్ఞత లేదు. రాజకీయ పార్టీలు ఆది నుంచీ అవినీతికి మారుపేర్లుగా ఉన్నాయి. ఈ పరిస్థితి సైనిక జోక్యానికి తావిచ్చింది.

పాక్ సైన్యం ప్రాబల్యాన్ని జుల్ఫికర్ అలీ భుట్టో, నవాజ్ షరీఫ్, బేనజీర్ భుట్టో, ఇమ్రాన్ ఖాన్ వంటి శక్తిమంతులైన రాజకీయ నాయకులు సవాలు చేశారు. వీరు భారత వ్యతిరేకతనూ, కశ్మీర్ అంశాన్నీ రెచ్చగొట్టడం ద్వారా అధికారంలోకి వచ్చారు. పాకిస్తాన్‌కు ఆర్థిక సాయం కొనసాగించాలంటే ప్రజాస్వామ్య ప్రక్రియలను తిరిగి అమలులోకి తేవాలని అంతర్జాతీయంగా ఒత్తిడి వచ్చినప్పుడు ఆర్మీలోని కొన్ని ఫ్యాక్షన్లు వీరికి మద్దతు ఇచ్చాయి. అయితే, ఈ రాజకీయ నాయకులు తమ రాజకీయ బలం చూసుకుని సైన్యాన్ని ఖాతరు చేయలేదు. అటువంటి సమయంలో, సైనికాధిపతులు వారిని అధికారం నుంచి తప్పించారు. జుల్ఫికర్ అలీ భుట్టోను ఉరి తీశారు. బేనజీర్ భుట్టోను హత్య చేశారు. నవాజ్ షరీఫ్‌ను దేశం నుంచి తరిమేశారు. ఇమ్రాన్ ఖాన్ జైలు పాలయ్యారు. వీరందరి దుర్గతికీ సైనికాధిపతులే కారకులు.

మూడో చివరి ఇతివృత్తం గురించి ఇండియలో అంతగా చెప్పుకోం. పాకిస్తాన్ రాజ్యాంగం నిరంతరం సవరణలకు గురయ్యింది. తద్వారా అక్కడి రాజకీయ-సైనిక సంబంధాలను అవి ప్రభావితం చేశాయి. పాకిస్తాన్ సైన్యం రబ్బర్ స్టాంపు అధ్యక్షుల ద్వారా నేషనల్ అసెంబ్లీని రద్దు చేయించి తాజా ఎన్నికలు జరిపించేది. సర్వసాధారణంగా ఇలాంటి సందర్భాల్లో సైన్యానికి అనుకూల ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చేవి. 1987లో అప్పటి అధ్యక్షుడు జియా-ఉల్-హక్ దేశాధ్యక్షుడికి (అంటే తనకు) నేషనల్ అసెంబ్లీని రద్దు చేసే విశేష అధికారాన్ని కట్టబెడుతూ రాజ్యాంగానికి 8వ సవరణ చేశారు. బేనజీర్ భుట్టో, నవాజ్ షరీఫ్‌లు ప్రధానులుగా పదేళ్ల సుదీర్ఘ పౌరపాలన అందించిన కాలంలో రాజ్యాంగానికి 13వ సవరణ తీసుకువచ్చారు. 1997 నాటి ఈ సవరణతో 1987 నాటి 8వ సవరణ రద్దు అయ్యింది. ఇలా అధ్యక్షుడి తోక కత్తిరించారు. తరువాతి దశాబ్దంలో ఆర్మీ తిరిగి అధికారం చేజిక్కించుకుంది. 2001లో, మూడేళ్ల సైనికాధిపతిగా పనిచేసిన అనంతరం, ముషారఫ్ తనను తానే అధ్యక్షుడిగా ప్రకటించుకున్నారు. అధికారంలో కొనసాగేందుకు అతడు రాజ్యాంగాన్ని తుంగలో తొక్కారు. చిట్టచివరకు 2008లో అభిశంసన నుంచి తప్పించుకోవడానికి పదవికి రాజీనామా చేశారు.

ముషారఫ్ అనంతరం, 2010లో 18వ రాజ్యాంగ సవరణ వచ్చింది. దేశంలో సమాఖ్య విధానాన్ని బలోపేతం చేయడం దీని లక్ష్యం. ఈ సవరణ సైతం సైన్యం అధికారాలను బలహీనం చేయలేకపోయింది. ఇటీవలి సంవత్సరాల్లో జనరల్ కమర్ బాజ్వా వంటి సైనికాధిపతులు పౌర అధికారానికి లోబడి ఉన్నట్లు నటిస్తూ, తెలివిగా అధికారం చలాయించాలని ప్రయత్నించారు. బాజ్వా తర్వాతి వాడు జనరల్ అసీమ్ మునీర్. జనరల్ జియా మూసలో ర్యాడికలైజ్ అయిన మునీర్ పాక్ రాజకీయ-సైనిక సంబంధాలను సరికొత్త స్థాయికి దిగజార్చారు.

వ్యాసకర్త మిలిటరీ హిస్టారియన్, రిటైర్డ్ ఫైటర్ పైలట్
('ది హిందుస్థాన్ టైమ్స్' సౌజన్యంతో)

ఇన్ బాక్స్

విద్యార్థుల కలలపై తూటా!

తెలంగాణ రాష్ట్రంలో ఇంజినీరింగ్ విద్యకు సంబంధించి ఫీజు పెంపు అంశం మరోసారి చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం (జేఎన్‌టీయూ)కి అనుబంధంగా ఉన్న అనేక ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలు ట్యూషన్ ఫీజు పెంపు ప్రతిపాదనలు దాఖలు చేసిన నేపథ్యంలో, ప్రస్తుతం ఈ వ్యవహారం విద్యార్థులు, వారి తల్లితండ్రుల ఆందోళనకు కారణమవుతోంది. టెక్నికల్ ఎడ్యుకేషన్ రెగ్యులేటరీ బాడీ అయిన 'తెలంగాణ అడ్మిషన్స్ అండ్ ఫీ రెగ్యులేటరీ కమిటీ' (టీఏఎఫ్‌ఆర్‌సీ)కి కొన్ని కళాశాలలు సమర్పించిన ప్రతిపాదనల ప్రకారం చూస్తే... ఫీజులు రూ. 1.10 లక్షల నుండి రూ. 2.45 లక్షల వరకూ పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి. నిజంగా ఈ మేర ఫీజులు పెరిగితే మధ్యతరగతి, పేద కుటుంబాల విద్యార్థులకు ఇది తీవ్రమైన ఆర్థిక భారం అవుతుంది. ఇందువల్ల వారు అప్పుల పాలు అవ్వడమో, లేక చదువు మానడమో జరుగుతుంది.

కొన్ని కళాశాలలు ట్యూషన్ ఫీజులను పెంచేందుకు టీఏఎఫ్‌ఆర్‌సీకి తప్పుడు ఆడిట్ రిపోర్టులు సమర్పిస్తున్నాయని వచ్చిన ఆరోపణలు ఆందోళన కలిగిస్తున్నాయి. నిజమైన ఖర్చులను కప్పిపుచ్చేందుకు, ఫీజులను పెంచవలసిన అవసరాన్ని నొక్కి చెప్పేందుకు కొన్ని కళాశాలలు ఈ తప్పుడు దోవ తొక్కుతున్నట్లు తల్లితండ్రులు అంటున్నారు. ఇది విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడటమే కాదు. నైతికతకు విరుద్ధం కూడా!

ఈ ఫీజుల పెంపు వ్యవహారం కేవలం విద్యార్థుల వ్యక్తిగత సమస్య మాత్రమే కాదు. మొత్తం సమాజం ప్రభావితమయ్యే సమస్య. రాజ్యాంగం ప్రకారం సంపన్నులతో పాటూ, పేదలూ, మధ్యతరగతివారూ ఉన్నత విద్యను అభ్యసించే హక్కును ఇది మృగ్యం చేస్తుంది. అంటే సమాన విద్యావకాశం దూరమవుతుందన్నమాట. నిజంగా ఈ ఫీజులు పెరిగితే అసలే ఆర్థిక కష్టాల్లో ఉన్న ప్రభుత్వానికి మరింత ఆర్థిక భారం పెరుగుతుంది. ఫీ రీయింబర్స్‌మెంట్ కింద ప్రస్తుతం ఆర్థికంగా వెనుకబడినవారికి రూ. 35,000 ఇస్తున్నారు. ఫీజులను పెంచిన మేర ఈ ఫీ రీయింబర్స్‌మెంట్ పరిమాణాన్ని పెంచవలసి ఉంటుంది. అందుకే ఫీజుల పెంపకం నిర్ణయాన్ని పునఃసమీక్షించాలి. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించి, అన్ని వర్గాల అభిప్రాయాలనూ పరిగణనలోకి తీసుకొని నిర్ణయం తీసుకోవాలి. విద్యను లాభదృష్టితో వ్యాపారం చేయకూడదు. విద్యార్థులే దేశానికి సంపద. అలాంటి విద్యార్థుల జీవితాలను ఒక్క నిర్ణయంతో నాశనం చేయడాన్ని అరికట్టాల్సింది ప్రభుత్వమే!

– రిషి మలిశెట్టి, జేఎన్టీయూ విద్యార్థి

కవిత్వమూ, ఆలోచనా రాజద్రోహాలేనా?

అభిప్రాయం



ఎన్. వేణుగోపాల్

నాగపూర్ పోలీసులు ఒక ఆశ్చర్యకరమైన పని చేశారు. ఒక సభలో పాడిన పాట ఆధారంగా సభా నిర్వాహకుల మీద 'రాజద్రోహ నేరం' కేసు పెట్టారు. సుప్రీంకోర్టు మూడు సంవత్సరాల కింద 2022 మే 11న అప్పటికి ఉండిన భారత శిక్షా స్మృతి (ఇండియన్ పీనల్ కోడ్)లో సెక్షన్ 124-ఎ 'రాజద్రోహ నేరం' ఔచిత్యాన్ని విచారిస్తూ, దాన్ని పునస్సమీక్షించే వరకూ, ఆ ఆరోపణ మీద విచారణలు ఆపేయాలని, కొత్త కేసులు నమోదు చేయగూడదని మధ్యంతర ఆదేశం ఇచ్చింది. తర్వాత ప్రభుత్వం ఐపీసీని రద్దు చేస్తూ తీసుకు వచ్చిన భారత న్యాయ సంహిత (బీఎన్ఎస్)లో 'రాజద్రోహం' అనే మాట వాడలేదు గాని, మిగిలినదంతా సెక్షన్ 152లో యథాతథంగా ఉంచారు. ఇప్పుడు నాగపూర్ పోలీసులు ఆ బీఎన్ఎస్ సెక్షన్ 152తో పాటు, సెక్షన్ 196 (సమూహాల మధ్య శత్రుత్వం పెంచడం), సెక్షన్ 353 (ప్రజల మనోభావాలను గాయపరిచే ప్రకటనలు చేయడం) అనే నేరారోపణలతో కేసు పెట్టారు.

ఇంతకీ ఆ సభ 'వీరా సాథీదార్ స్మృతి సమన్వయ్ సమితి' అనే బృందం మే 13న నాగపూర్‌లోని 'విదర్భ సాహిత్య సంఘ్' హాలులో ఏర్పాటు చేసిన సంస్మరణ సభ. వీరా సాథీదార్ (1958-2021) సుప్రసిద్ధ మరాఠీ కవి, నటుడు, రచయిత, పత్రికా సంపాదకుడు, దళిత హక్కుల కార్యకర్త. అంబేడ్కర్, మార్క్స్‌ల భావాలతో ప్రభావితుడైన వీరా కులవివక్షకూ, సామాజిక అన్యాయాలకూ వ్యతిరేకంగా అపారమైన కృషి చేశారు. 'ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్' కన్వీనర్‌గా ఉన్నారు. మరాఠీ మాసపత్రిక 'విద్రోహి' సంపాదకులుగా ఉన్నారు. 'కోర్ట్' అనే 2014 నాటి మరాఠీ సినిమాలో ప్రధాన పాత్రలో నటించారు. అది ఉత్తమ సిని మాగా జాతీయ అవార్డు అందుకుంది. కోవిడ్ రెండో దశలో 2021 ఏప్రిల్ 13న మరణించారు. నాలుగేళ్లుగా ఆయన సహచరి పుష్పా సాథీదార్, ఇతర మిత్రులు సంస్మరణ సభలు నిర్వహిస్తున్నారు. ఈ సంవత్సరం సంస్మరణ సభలో సామాజిక కార్యకర్త ఉత్తమ్ జాగీర్దార్ ప్రస్తుతం మహారాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న 'ప్రజా భద్రతా బిల్లు' గురించి ప్రధాన ఉపన్యాసం చేశారు. ముంబయికి చెందిన సమతా కళా మంచ్ గాయకులు పాటలు పాడారు. ఆ పాటల్లో ఒకటి ఫైజ్ అహ్మద్ ఫైజ్ రాసిన 'హమ్ దేఖేంగే' అనే సుప్రసిద్ధ గీతం.



వీరా సాథీదార్



ఫైజ్ అహ్మద్ ఫైజ్

'మన సైనికులు పాక్‌తో వీరోచితంగా పోరాడి ఓడిస్తూ ఉన్నప్పుడు, ఇక్కడ ఒక వామపక్ష కళా బృందం పాక్ కవి పాటలు పాడుతున్నది. ఆ పాటలో సింహాసనాలను వణికించాలి అని ఉంది. వాళ్లు ఇది ఫాసిస్టు ప్రభుత్వం అంటున్నారు. ఈ సభ, ఉపన్యాసం, పాట దేశ సమగ్రతకు, భద్రతకు, సార్వభౌమత్వానికి వ్యతిరేకం. కనుక నిర్వాహకులు పుష్పా సాథీదార్ మీద కేసు పెట్టి విచారించండి' అని నాగపూర్ 'జనసంఘర్ష సమితి' అధ్యక్షుడు దత్తాత్రేయ షిర్కే చేసిన ఫిర్యాదు మీద పోలీసులు వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

ఇందులో రెండు విచిత్రమైన విషయాలున్నాయి. ఒకటి – ఫైజ్ అహ్మద్ ఫైజ్‌ను, ఆ మాటకొస్తే ఏ కవినైనా ఒక దేశానికి పరిమితం చేయడానికి వీలు లేదు. ఫైజ్ 1911లో అవిభక్త భారత్‌లో పంజాబ్‌లో పుట్టిన కవి. 1947 దేశ విభజన తర్వాత ఇంగ్లిష్ దినపత్రిక 'పాకిస్తాన్ టైమ్స్'కూ, ఉర్దూ దినపత్రిక 'ఇమ్రోజ్'కూ ప్రధాన సంపాదకుడిగా పాకిస్తాన్‌కు వెళ్లారు. పాకిస్తాన్ కమ్యూనిస్ట్ పార్టీ స్థాపకుల్లో ఒకరయ్యారు. లియాఖత్ అలీఖాన్ ప్రభుత్వం 1951లోనే ఆయనను రావల్పిండి కుట్ర కేసు నిందితుడిగా అరెస్టు చేసి నాలుగేళ్లు జైల్లో పెట్టింది. తర్వాత ఆయన మధ్య పాకిస్తాన్ వస్తూపోతూ ఉన్నప్పటికీ జీవితంలో ఎక్కువ భాగం మాస్కోలో, లండన్‌లో, బీరుట్‌లో గడిచింది. 1984లో మరణించే లోపు, మొత్తం 73 ఏళ్ల జీవితంలో ఆయన పాకిస్తాన్‌లో గడిపినది పదిహేనేళ్ల లోపే. ఆయనను పాకిస్తాన్ కవి అనడం హాస్యాస్పదం.

రెండు – హమ్ దేఖేంగే కవితను ఫైజ్ పాకిస్తాన్‌లో సైనిక నియంత జియా ఉల్ హక్‌కు వ్యతిరేకంగా 1979లో రాశారు. ఫైజ్ చనిపోయాక కూడా పాకిస్తాన్‌లో ఆయన పేరు ఎత్తడానికి వీలు లేదని జియా ఉల్ హక్ ఆదేశించగా, 1986లో లాహోర్‌లో ఒక బహిరంగ వేదిక మీద ఈ పాట పాడి పాకిస్తానీ గాయని ఇక్బాల్ బానో సంచలనం సృష్టించారు. మరొక పాకిస్తాన్ సైనిక నియంత పర్వేజ్ ముషర్రఫ్ వ్యతిరేక నిరసన ప్రదర్శనల్లో కూడా ఇది మార్మోగింది. అలా మౌలికంగా పాకిస్తాన్ నియంతలకు వ్యతిరేక ప్రతీక అయిన పాటను చూసి భారత పాలకులు ఉలిక్కిపడడం ఆశ్చర్యకరం.

అయితే ఈ ఉలికిపాటు, అసహనం, అభూత కల్పనల నేరారోపణలు, సుప్రీంకోర్టు కొట్టివేసిన నేరారోపణలు ఒకచోట ఆగిపోవడం లేదు, విస్తరిస్తున్నాయి. అశోకా యూనివర్సిటీ రాజనీతి శాస్త్ర విభాగ అధిపతి, ప్రపంచ ప్రఖ్యాత కవి, చరిత్రకారుడు అలీఖాన్ మహమూదాబాద్‌ను మే 18న రాజద్రోహ నేరారోపణలతో అరెస్టు చేశారు. ఆ అరెస్టుకు కారణం ఆయన ఫేస్‌బుక్ మీద రాసిన ఒక పోస్టు. అలాగే లండన్‌లోని వెస్ట్ మినిస్టర్ యూనివర్సిటీ అధ్యాపకురాలు, సుప్రసిద్ధ సామాజిక శాస్త్రవేత్త, స్వయంగా కశ్మీరీ పండిట్ నిటాషా కౌల్‌కు 'భారత వ్యతిరేక రచనలు చేస్తున్నందుకు' అనే ఆరోపణతో ఓవర్సీస్ సిటిజెన్ ఆఫ్ ఇండియా (ఓసీఐ) కార్డు రద్దుచేస్తూ నోటీసు పంపారు. భారత ప్రభుత్వ విధానాల మీద విమర్శనాత్మక రచనలు చేసినందుకే ఈ చర్య. ప్రజాస్వామ్యానికి కన్నతల్లి అంటే అర్థం... భావ ప్రకటనా స్వేచ్ఛను అడ్డుకోవడమేనా?


వ్యాసకర్త 'వీక్షణం' ఎడిటర్

నంబాల అంత సులువుగా ఎలా?

పౌరహక్కులు, ప్రజా సంఘాలు, రాజకీయ నేతల్లో సందేహాలు

- అనారోగ్యంతో చికిత్స పొందుతున్న వ్యక్తిని పట్టుకుని కాల్చారా?
- అనుక్షణం అప్రమత్తత, మూడంచెల భద్రత ఏమైంది?
- ఫొటోలు లేవు.. ఫోన్లు, కెమెరాలకు అనుమతే లేదు
- 45 ఏళ్ల క్రితం అజ్ఞాతంలోకి వెళ్లిన వ్యక్తిని ఎలా గుర్తుపట్టారనే ప్రశ్నలు
- బూటకపు ఎన్‌కౌంటర్ కాదంటున్న పోలీసు వర్గాలు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: సాయుధ పోరాటం ద్వారా విప్లవం సాధించాలని ప్రయత్నిస్తున్న అతి పెద్ద పార్టీగా దేశంలో గుర్తింపు ఉన్న భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు ఎన్‌కౌంటర్‌లో చనిపోయినట్టు ప్రభుత్వం ప్రకటించింది. అయితే ఈ ఎన్‌కౌంటర్‌పై పలువురు సామాజిక కార్యకర్తలు, పౌరహక్కులు, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీల నేతల్లో ప్రత్యక్షంగా, సామాజిక మాధ్యమాల్లో సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. అనారోగ్య కారణాలతో ఒడిశాలో రహస్యంగా చికిత్స పొందుతున్న నంబాలను పట్టుకుని ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్ చేశారనే ఆరోపణలు విన్పిస్తున్నాయి.


నంబాల కేశవరావు (ఫైల్)

అప్పట్నుంచీ ఒక్క ఫొటో కూడా లేదు

సాయుధ పోరాట మార్గం ఎంచుకున్నప్పటి నుంచి నంబాల కేశవరావు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించేవాడని ఆ పార్టీకి చెందిన సానుభూతిపరులు, మాజీ మావోయిస్టులు చెబుతున్నారు. తినడం, పడుకోవడం ఇలా ప్రతి అంశంలో జాగ్రత్తలు తీసుకునేవాడని తెలుస్తోంది. అజ్ఞాత జీవితం గడిపే వ్యక్తులు ఎట్టి పరిస్థితుల్లోనూ తమ ఫొటోలు, ఛాయా చిత్రాలు, ఇతర ఆనవాళ్లు బయట పడకుండా జాగ్రత్త పడాలని తోటి కామ్రేడ్లకు చెప్పేవాడని అంటున్నారు. తాను స్వయంగా ఫోన్లకు దూరంగా ఉండటమే కాకుండా.. తాను ఉన్న ప్రదేశంలోనూ ఫోన్లు, కెమెరాలకు అనుమతి ఇచ్చేవాడు కాదని తెలుస్తోంది. ఈ కారణంగానే 45 ఏళ్ల అజ్ఞాత జీవితంలో ఆయనకు సంబంధించిన ఒక్క ఫొటో కూడా బయటకు రాలేదు. ఎంతో జాగ్రత్తగా ఉండే వ్యక్తి ఎన్‌కౌంటర్‌కు గురి కావడం, 45 ఏళ్ల క్రితం అజ్ఞాతంలోకి వెళ్లడమే కాకుండా కనీసం ఫొటోలు కూడా చూసిన దాఖలాలు లేని నేపథ్యంలో..వెనువెంటనే అతన్ని భద్రతా దళాలు గుర్తించడం సందేహాస్పదమన్న వాదనలు వినిపిస్తున్నాయి.

మూడే ఏకే 47లు ఎలా?

మావోయిస్టు పార్టీ చీఫ్‌గా ఉన్న నంబాల కేశవరావుకు మూడంచెల భద్రత సర్వసాధారణంగా ఉంటుంది. సాధారణ పరిస్థితుల్లో వందకు పైగా, క్లిష్టమైన పరిస్థితులు ఉంటే కనీసం 70కి తక్కువ కాకుండా రక్షణ దళం ఉంటుందని, వీరిలో కనీసం 40 మంది ఏకే 47 వంటి తుపాకులు వినియోగిస్తారని ఆయనతో కలిసి పనిచేసిన మాజీ మావోలు చెబుతున్నారు. కానీ నారాయణపూర్ ఎన్‌కౌంటర్ ఘటనలో 27 మంది మావోయిస్టులు చనిపోగా 28 ఆయుధాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇందులో ఏకే 47 తుపాకులు కేవలం మూడే ఉన్నాయి. ఎస్‌ఎల్‌ఆర్‌లు 4, 303 రైఫిళ్లు 6, 12 ఇంచ్ బోర్ తుపాకులు 5, ఇన్సాస్‌లు 6, బ్యారెల్ గ్రెనేడ్ లాంచర్లు 3, కార్బన్ తుపాకీ 1 ఉన్నాయి. చనిపోయిన వారిలో నంబాల, నవీన్, టిప్పులు డివిజన్ ఆ పైస్థాయి నేతలుగా ఉన్నారు. దీంతో మూడు ఏకే 47లు దొరికాయనుకున్నా, మాజీలు చెబుతున్నట్టు ప్రధాన కార్యదర్శికి రక్షణ కల్పించే దళానికి ఉండాల్సిన సంఖ్యలో అక్కడ ఏకే 47లు లభ్యం కాకపోవడాన్ని కొందరు ప్రస్తావిస్తుండటం గమనార్హం.

జనంలోకి రాబట్టే జుట్టుకు రంగు?

సాధారణంగా అజ్ఞాత జీవితం గడిపే మావోయిస్టులు పొదుపుగా వనరులు ఉపయోగిస్తుంటారు. పాలు, చక్కెర, టీపొడి వంటి నిత్యావసరాలకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారు. కానీ నంబాల కేశవరావు హెయిర్ డై వాడినట్టుగా ఫొటోల్లో కనిపించడం అసాధారణంగా ఉందనే వాదనలు వినిపిస్తున్నాయి. అనారోగ్య సమస్యల కారణంగా అజ్ఞాతం వీడి జనబాహుళ్యంలోకి నంబాల వచ్చారని, అందువల్లే బయట పరిస్థితులకు తగ్గట్టుగా హెయిర్ డై వాడటం, క్లీన్ షేవ్ చేసుకోవడం వంటివి జరిగి ఉండవచ్చని అంటున్నారు. అయితే రహస్యంగా చికిత్స పొందుతున్న అంశంపై పక్కా సమాచారం అందడంతో పోలీసులు చాకచక్యంగా దాడి చేసి పట్టుకున్నారనే గుసగుసలు వినిపిస్తున్నాయి.

డీఆర్‌జీ బలగాల పనేనా?

నారాయణపూర్ ఆపరేషన్‌లో డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్స్ (డీఆర్‌జీ) బలగాలు పాల్గొన్నట్లు పోలీసులు ప్రకటించారు. అయితే.. జంగిల్ వార్‌ఫేర్‌లో శిక్షణ పొందిన కోబ్రా బలగాలు, యుద్ధతంత్రాల్లో ఆరితేరిన బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్, ఇండో టిబెటన్ పోలీస్ ఫోర్స్, ఆధునిక ఆయుధాలు ఉపయోగించే సీఆర్‌పీఎఫ్ జవాన్లతో సాధ్యం కానిది కేవలం నాలుగు జిల్లాలకు చెందిన మాజీ మావోలతో కూడిన డీఆర్‌జీ బలగాలు మావోయిస్టు చీఫ్‌ను ఎన్‌కౌంటర్ చేయడం ఎలా సాధ్యమైందనే వాదన విన్పిస్తోంది. అయితే మావోయిస్టు పార్టీ చీఫ్‌ను పట్టుకునేందుకు దశాబ్దాల తరబడి శ్రమిస్తున్నామని, వందలాది మంది పోలీసులు నిరంతరం ఇదే పనిలో ఉన్నారని, చివరకు తమ కష్టం ఫలించి నంబాల ఆచూకీ తెలుసుకున్నామని, లొంగిపోమ్మని చెబితే వినకుండా కాల్పులు జరపడం వల్లే ఎన్‌కౌంటర్‌లో ఆయన ప్రాణాలు కోల్పోయారని, చాలామంది మావోయిస్టులు ఘటనా స్థలి నుంచి తప్పించుకున్నారని పోలీసు వర్గాలు అంటున్నాయి.

గోప్యత ఎందుకు: విరసం

నంబాల కేశవరావు మరణం, పోస్టుమార్టం, భౌతికకాయాన్ని బంధువులకు అప్పగించే విషయం.. ప్రతిచోటా పోలీసులు గోప్యతను ఎందుకు పాటిస్తున్నారో అర్థం కావటం లేదని విప్లవ రచయితల సంఘం (విరసం) పేర్కొంది. భౌతికకాయం కోసం గురువారం జగదల్‌పూర్‌కు వెళ్లిన కేశవరావు సోదరులను దూరం నుంచే పోలీసులు వెనక్కు పంపించారని తెలిసింది. దీనివెనుక ఉద్దేశం ఏంటో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేసింది.

గ్రూప్–2 తుది జాబితా విడుదల

▶ మొదటి పేజీ తరువాయి

జాబితాలో అర్హత సాధించిన అభ్యర్థులకు ఈనెల 29 నుంచి జూన్ 10వ తేదీ వరకు ధ్రువపత్రాల పరిశీలన చేపట్టనున్నట్లు టీజీపీఎస్సీ కార్యదర్శి నవీన్ నికొలస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు, ఆ తర్వాత మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ఈ పరిశీలన కొనసాగుతుంది. పెండింగ్ ధ్రువపత్రాల సమర్పణకు జూన్ 11వ తేదీని కమిషన్ రిజర్వ్ చేసింది.

సురవరం వర్సిటీలో ధ్రువపత్రాల పరిశీలన

నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్ సమీపంలో ఉన్న సురవరం ప్రతాపరెడ్డి యూనివర్సిటీ (పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ)లో ధ్రువపత్రాల పరిశీలన జరుగుతుందని టీజీపీఎస్సీ వెల్లడించింది. అభ్యర్థుల హాల్‌టిక్కెట్ నంబర్ల వారీగా పరిశీలన షెడ్యూల్‌ను ఈనెల 26న వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతామని తెలిపింది. అభ్యర్థులు పూర్తిస్థాయి సర్టిఫికెట్లతో హాజరు కావాలని, ఏవైనా కారణాలతో పరిశీలనకు గైర్హాజరైతే తదుపరి అవకాశం ఉండదని స్పష్టం చేసింది. ఉద్యోగాలకు అభ్యర్థులు తగ్గితే (షార్ట్‌ఫాల్) తదుపరి మెరిట్ నుంచి ఎంపిక చేసి పరిశీలన ప్రక్రియ పూర్తి చేస్తామని వివరించింది. ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియకు సమాంతరంగా వెబ్ ఆప్షన్ల ప్రక్రియ జరుగుతుంది.

2022లో నోటిఫికేషన్: గ్రూప్–2 సర్వీసులకు సంబంధించి 18 కేటగిరీల్లో 783 ఉద్యోగాల భర్తీకి టీజీపీఎస్సీ 2022 డిసెంబర్ 29న నోటిఫికేషన్ జారీ చేసింది. 2023 జనవరి 18నుంచి ఫిబ్రవరి 16 వరకు... ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించింది. 5,51, 855 మంది దరఖాస్తు చేసుకోగా పరీక్షలు దాదాపు 3 సార్లు వాయిదా పడ్డాయి. చివరకు గతేడాది డిసెంబర్ 15, 16 తేదీల్లో.. రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన 1,368 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించింది. అయి తే 2,49,964 మంది అభ్యర్థులు మాత్రమే నాలుగు పేపర్లు రాశారు. అయితే 777 మంది మాత్రమే ఉద్యోగాలకు ఎంపికయ్యారు.

సాయుధ దళాల సిబ్బందికి ఎల్‌పీయూ ఉపకార వేతనం

జలంధర్: లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ చాన్స్‌లర్, ఎంపీ డాక్టర్ అశోక్ కుమార్ మిట్టల్ 'జై జవాన్ స్కాలర్‌షిప్'ను ప్రకటించారు. 22 లక్షలకు పైగా డిఫెన్స్, పారామిలటరీ సిబ్బందికి సంబంధించి దీనిని ప్రపంచంలోనే అతిపెద్ద ప్రైవేట్ స్కాలర్‌షిప్ పథకంగా ఆయన అభివర్ణించారు. ఆపరేషన్ సిందూర్ విజయాన్ని పురస్కరించుకుని తమ వర్సిటీ ఈ సదుపాయాన్ని అందజేస్తోందని ఆయన తెలిపారు. ఈ పథకం ద్వారా యూనివర్సిటీ అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్‌లలో ఆన్‌లైన్ మోడ్‌లో నమోదు చేసుకునే డిఫెన్స్, పారామిలిటరీ సిబ్బందికి 100 శాతం ట్యూషన్ ఫీజు మినహాయింపు లభిస్తుంది. 2025–2026, 2026– 2027 విద్యా సెషన్‌లలో ప్రవేశం పొందే ఆర్మీ సిబ్బంది ఈ స్కాలర్‌షిప్‌కు అర్హులని డాక్టర్ మిట్టల్ ప్రకటించారు.

జోస్‌అలుక్కాస్ శుభమాంగల్యం వివాహ ఆభరణాల ఉత్సవం

సాక్షి, హైదరాబాద్: సుప్రసిద్ధ ఆభరణాల సంస్థ జోస్ అలుక్కాస్.. వివాహ వేడుకల కోసం చేసే కొనుగోళ్లపై ప్రత్యేక రాయితీలతో 'శుభమాంగల్యం వివాహ ఆభరణాల ఉత్సవం'ప్రారంభిస్తున్నట్లు ప్రకటించింది. ఈ సీజన్లో ఒక ప్రత్యేక ఆఫర్‌గా.. బంగారం కొనుగోళ్లపై అంతే బరువున్న వెండిని ఉచితంగా జోస్ అలుక్కాస్ అందిస్తోంది. పాత బంగారం ఎక్స్ఛేంజ్‌పై.. మునుపెన్నడూ లేని లాభాలను కూడా కల్పిస్తోంది. తరుగు మీద బంగారు ఆభరణాలకు 30 శాతం తగ్గింపును, వజ్రాలకు 25 శాతం తగ్గింపును కూడా అందజేస్తోంది. అదనంగా, ఈ ఆఫర్‌లో ప్లాటినమ్ ఆభరణాల తరుగు మీద 15 శాతం తగ్గింపు ఉంటుంది. వెండి ఆభరణాలు ఎలాంటి తరుగు లేకుండా లభిస్తాయని గ్రూప్ చైర్మన్ జోస్ అలుక్కాస్ తెలిపారు.

మార్చికి ముందే మావోయిస్టుల అంతం

- అబూజ్‌మఢ్ ఎన్‌కౌంటర్ మృతుల్లో 14 మంది మహిళలు, 13 మంది పురుషులు
- వీరిలో తెలుగు రాష్ట్రాలకు చెందిన ఐదుగురి మృతి
- ఛత్తీస్‌గఢ్ డీజీపీ అరుణ్ దేవ్ గౌతమ్ వెల్లడి

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: దేశాన్ని 2026 మార్చి 31 నాటికి మావోయిస్టు విముక్తి ప్రాంతంగా మారుస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా చెప్పారని, కానీ ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే అంతకుముందే మావోయిస్టుల నిర్మూలన జరిగే అవకాశం ఉందని ఛత్తీస్‌గఢ్ డీజీపీ అరుణ్‌దేవ్ గౌతమ్ అన్నారు. అబూజ్‌మఢ్ అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు మరణించడంతో దేశానికి మంచిరోజులు వచ్చాయని వ్యాఖ్యానించారు. మావోయిస్టుల కారణంగా ఎంతోమంది అమాయక ప్రజలు మృత్యువాత పడ్డారని అన్నారు. నంబాల మృతదేహంతో పాటు ఎన్‌కౌంటర్‌లో మరణించిన మొత్తం 27 మంది మృతదేహాలను గురువారం నారాయణపూర్ జిల్లా కేంద్రానికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన డీజీపీ ఎన్‌కౌంటర్ జరిగిన తీరుతెన్నుల గురించి స్థానిక పోలీసులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు.

మావోయిస్టులకు భారీ నష్టం

కేంద్ర కమిటీకి చెందిన అగ్రనాయకులు ఉన్నారనే పక్కా సమాచారంతో మే 19 నుంచి ఆపరేషన్ చేపట్టామని డీజీపీ చెప్పారు. నంబాల వంటి అగ్రనేత మృతి మావోయిస్టు పార్టీకి తీరని నష్టం చేకూరుస్తుందని అన్నారు. ఛత్తీస్‌గఢ్ పోలీసులకు ఇదో గొప్పరోజని వ్యాఖ్యానించారు. ఎదురుకాల్పుల్లో ఒక జవాన్ మరణించాడని, మరి కొందరు గాయపడినా ప్రాణాపాయం లేదని తెలిపారు. మరికొందరు మావోయిస్టులు కూడా తీవ్రంగా గాయపడి తప్పించుకున్నారని, వారిని పట్టుకునేందుకు సెర్చ్ ఆపరేషన్ కొనసాగిస్తున్నామని చెప్పారు.


ఎన్‌కౌంటర్‌లో పోలీసులు స్వాధీనం చేసుకున్న మావోయిస్టుల ఆయుధాలు

మృతుల్లో కాయ్ –7కి చెందినవారే ఎక్కువ

ఎన్‌కౌంటర్‌లో మొత్తం 27 మంది చనిపోగా అందులో 13 మంది పురుషులు 14 మంది మహిళలు ఉన్నారు. మృతుల్లో నంబాల కేశవరావుతో పాటు స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు, జంగ్ పత్రిక నిర్వాహకుడు, సెంట్రల్ కమిటీ, సెంట్రల్ రీజనల్ బ్యూరో స్టాఫ్‌గా ఉన్న నవీన్ అలియాస్ మధు అలియాస్ పజ్జ వెంకట నాగేశ్వరరావు, సీవైపీసీ కమాండర్ రోషన్ అలియాస్ టిప్పు ఉన్నారు. కేశవరావు, మధు, టిప్పును మినహాయిస్తే మిగిలిన వారంతా సుప్రీం కమాండర్‌కు రక్షణ కల్పించే దళమైన కాయ్ –7కి చెందినవారు. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. మృతుల్లో నంబాల కేశవరావు, జంగు నవీన్ అలియాస్ మధు, రోషన్ అలియాస్ టిప్పు (సీవైపీసీ ఇన్‌చార్జ్/కమాండర్) కీలక నేతలుగా ఉన్నారు. వీరితో పాటు నంబాలకు రక్షణ కల్పించే కాయ్–7 కంపెనీకి చెందిన సునీల్, కుర్సం విజా, రవి, సూర్య అలియాస్ సంతు, తెల్లం రాజేశ్, గుడ్డు అలియాస్ ఉంగా, ఓయం రాజు, కోసా హోడి, వివేక్ అలియాస్ ఉగేంద్ర, ఓది భద్రు, బుచ్చి అలియాస్ రామే, భీమే అలియాస్ మడావి, భూమిక, లక్ష్మీ అలియాస్ కష్షు, పొడియం జమున, గీతా, సోమ్లీ అలియాస్ సజ్జంతి, రేష్మా పొడియం, రాగో, సంగీత, సరిత అలియాస్ మాంకో, హిడిమే, అవలం కల్పన, మడావి క్రాంతి మరణించినట్లు పోలీసులు ప్రకటించారు. నంబాలతో పాటు నవీన్ ఏపీకి చెందిన వారు కాగా వివేక్ (30)తో పాటు భూమిక, సంగీత తెలంగాణ ప్రాంతానికి చెందిన వారని తెలిపారు.

కేశవరావు మృతదేహం హెలికాప్టర్ ద్వారా..

కేశవరావు మృతదేహాన్ని గురువారం ఉదయం హెలికాప్టర్ ద్వారా నారాయణపూర్ జిల్లా కేంద్రానికి తరలించారు. అక్కడ పోలీస్ లైన్స్‌లో మిగతా అందరి మృతదేహాలతో పాటు ఎన్‌కౌంటర్‌లో స్వాధీనం చేసుకున్న ఆయుధాలను ప్రదర్శించారు. ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన ఇతర మావోల మృతదేహాలకు తెల్లని కవర్లు చుట్టగా కేశవరావుకు మాత్రం నల్లని కవర్ చుట్టారు. గురువారం సాయంత్రం పోస్టుమార్టం నిర్వహించారు.

ఎట్టకేలకు హితేశ్ రిమాండ్

- అడుగడుగునా గుజరాత్ అధికారుల అడ్డుపుల్ల


నిందితుడు హితేశ్ అరెస్టు చూపిస్తున్న ఏఎస్పీ శుభం, సీఐ సంజీవ్

సాక్షిప్రతినిధి,కరీంనగర్: భారతీయ యువతకు కొలువుల ఎరవేసి విదేశాలకు విక్రయించాడన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న గుజరాత్‌కు చెందిన ప్రధాన నిందితుడు హితేశ్ అర్జున్‌ను పోలీసులు గురువారం రాత్రి రిమాండ్‌కు తరలించారు. బుధవారం తెల్లవారుజామున 2.30 ప్రాంతంలో ఢిల్లీ విమానాశ్రయంలో దిగిన హితేశ్‌ను ఇమిగ్రేషన్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. నిబంధనల ప్రకారం.. ఎవరైనా విదేశాల నుంచి వచ్చిన భారతీయులను ఎలాంటి కేసులు లేకపోతే వారి సొంత రాష్ట్రానికి అప్పగిస్తారు. ఒకవేళ కేసులుంటే.. కేసులు నమోదైన రాష్ట్రానికి అప్పగిస్తారు. ఈ క్రమంలోనే గుజరాత్ అధికారులు హితేశ్‌ను ముందుగా అదుపులోకి తీసుకున్నారు. తమకు అప్పగించాలని అడిగిన మానకొండూరు నుంచి వెళ్లిన సీఐ సంజీవ్, అతని సిబ్బందిని ముప్పతిప్పలు పెట్టారు. చివరకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ జోక్యంతో హితేశ్‌ను తెలంగాణ పోలీసులకు అప్పగించారు. హితేశ్‌ను గురువారం తెల్లవారుజామున తీసుకొచ్చిన పోలీసులు తొలుత రహస్య ప్రాంతంలో విచారించి, అనంతరం మానకొండూరు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అక్కడ హితేశ్ ద్వారా బ్యాంకాక్ వెళ్లిన బాధితుల స్టేట్‌మెంట్ తీసుకున్నారు. హితేశ్ తమ కుమారుడు మధుకర్‌రెడ్డిని ఉద్యోగం పేరుతో థాయ్‌లాండ్‌కు తీసుకెళ్లి అక్కడ సైబర్ నేరాలు చేయాలని హింసిస్తున్నాడని అతని తండ్రి లక్ష్మారెడ్డి ఫిర్యాదు మేరకు మానకొండూరు పీఎస్‌లో కేసు నమోదైన విషయం తెలిసిందే. మధ్యాహ్నం ఏఎస్పీ శుభం నిందితుడు హితేశ్‌ను విచారించారు. రాత్రి మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా నిందితుడికి 14 రోజుల రిమాండ్ విధించారు.

ఎన్‌కౌంటర్‌లన్నీ ప్రభుత్వ హత్యలే

పౌరహక్కుల సంఘం నేతలు

కూడిగూడ(హైదరాబాద్): ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్రం చేస్తున్న ఎన్‌కౌంటర్‌లన్నీ ప్రభుత్వ హత్యలేనని..ఆదివాసీల హక్కులను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాలను మార్చుకోవాలని, ఇప్పటివరకు జరిగిన బూటకపు ఎన్‌కౌంటర్లపై న్యాయవిచారణ జరిపించాలని తెలంగాణ పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ డిమాండ్ చేశారు. రెండేళ్లుగా ఆపరేషన్ కగార్ పేరుతో కాల్పులు జరుపుతూ ఇటు మావోయిస్టులను బూటకపు ఎన్‌కౌంటర్లు చేస్తూ, అటు అమాయక ఆదివాసీల ప్రాణాలను తీస్తుందన్నారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని అబూజ్‌మఢ్ అడవుల్లో మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు సహా 27 మంది మావోయిస్టులను ఎన్‌కౌంటర్ చేయడాన్ని నిరసిస్తూ గురువారం లోయర్ ట్యాంక్ బండ్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద పౌర హక్కుల సంఘం, ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ మాట్లాడుతూ అబూజ్‌మఢ్ అడవుల్లో జరిగింది బూటకపు ఎన్‌కౌంటర్ అని ఆరోపించారు. మావోయిస్టులు శాంతియుతంగా చర్చలు జరుపుదామని పలుమార్లు కేంద్ర ప్రభుత్వానికి లేఖలు రాసినా, వాటిని పట్టించుకోకుండా కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, సహాయ మంత్రి బండి సంజయ్‌లు నిర్లక్ష్యం చేసి ఆయుధాలు ధరించిన వ్యక్తులకు ఆయుధాలతోనే సమాధానం చెబుతామని హింసకు పాల్పడుతున్నారని చెప్పారు. ఇప్పటికైనా కేంద్రం స్పందించి మావోయిస్టులతో చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో కోఆర్డినేషన్ కమిటీ ఫర్ దపీస్ కన్వీనర్ రవి, పౌరహక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారాయణరావు, వీక్షణం ఎడిటర్ వేణుగోపాల్, రీసెర్చ్ స్కాలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అజాద్, ప్రజాతంత్ర దేశభక్తి నాయకులు చంద్రమౌళి, మహిళా సంఘం నాయకురాలు శ్రీదేవి, తెలంగాణ ప్రజాఫ్రంట్ నాయకులు రాంబాబు, ఆదివాసీ హక్కుల సంఘం నేత ముత్తయ్య విరసం నేత రాము తదితరులు పాల్గొన్నారు.


కేశవరావు ఎన్‌కౌంటర్‌కు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేస్తున్న పౌరహక్కుల నేతలు

ఛత్తీస్‌గఢ్‌లో మళ్లీ ఎన్‌కౌంటర్

నేలకొరిగిన ముగ్గురు జవాన్లు, మావోయిస్ట్ మృతి

రాయ్‌పూర్/నారాయణ్‌పూర్: ఛత్తీస్‌గఢ్‌లో చోటుచేసుకున్న వేర్వేరు ఘటనల్లో ముగ్గురు జవాన్లు నేలకొరిగారు. ఒక మావోయిస్టు చనిపోయాడు. బీజాపూర్ జిల్లా ఉసూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని తుమ్రెల్ ప్రాంతంలో మావోయిస్టుల కదలికల సమాచారం అందుకున్న బలగాలు బుధవారం నుంచి కూంబింగ్ సాగిస్తున్నాయి. ఈ సందర్భంగా గురువారం ఉదయం జరిగిన ఎదురుకాల్పుల్లో కమాండో కానిస్టేబుల్ మెహుల్ సోలంకి బుల్లెట్ గాయాలతో చనిపోయారు. ఈయన స్వరాష్ట్రం గుజరాత్. గాయపడిన ముగ్గురు జవాన్లను హెలికాప్టర్‌లో రాయ్‌పూర్‌లోని ఆస్పత్రికి తరలించారు. వారికెటువంటి ప్రమాదంలేదని అధికారులు తెలిపారు. ఘటనలో ఒక మావోయిస్ట్ కూడా చనిపోయాడని, తుపాకీని స్వాధీనం చేసుకున్నామని వివరించారు. దట్టమైన అడవిలోకి పారిపోయిన మావోయిస్టుల కోసం గాలింపు ముమ్మరం చేశామన్నారు. నారాయణపూర్– బీజాపూర్ సరిహద్దుల్లో బుధవారం జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో అగ్ర నేత నంబాల కేశవరావు సహా 27 మంది మావోయిస్టులు చనిపోవడం తెల్సిందే. కాగా, ఈ ఎన్‌కౌంటర్ అనంతరం తిరిగి వస్తున్న జవాన్లే లక్ష్యంగా మావోయిస్టులు అమర్చిన మందుపాతర పేలి జిల్లా రిజర్వు గార్డ్(డీఆర్‌జీ) ప్రాణాలు కోల్పోయారు. ఈయన బీజాపూర్‌కు చెందిన రమేశ్ హెమ్లా అని చెప్పారు. అంతకుముందు, బుధవారం ఇదే జిల్లాలోని ఓర్చా పోలీస్‌స్టేషన్ పరిధిలో ఖాట్‌బేడ గ్రామం వద్ద జరిగిన ఎదురుకాల్పుల్లో ఖొట్లూరాం కొర్రం అనే డీఆర్‌జీ జవాను నేలకొరిగారని అధికారులు వివరించారు.

మావోయిస్టుల కొత్త చీఫ్ ఎవరు?

▶ మొదటి పేజీ తరువాయి

సమాచారం.

కేంద్ర కమిటీయే కీలకం..

భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) 2004లో ఏర్పాటైనప్పుడు కేంద్ర కమిటీలో 32 మంది సభ్యులు ఉండేవారు. అయితే వరుస ఎన్‌కౌంటర్లు, సహజ మరణాల నేపథ్యంలో ఈ సంఖ్య తగ్గుతూ వస్తోంది. ఈ ఏడాది జరిగిన ఎన్‌కౌంటర్లలోనే నంబాల కేశవరావు, ప్రయాగ్ మాంఝీ, చలపతి వంటి కేంద్ర కమిటీ సభ్యులు మృతి చెందారు. ప్రస్తుతం కేంద్ర కమిటీలో 17 మంది సభ్యులే ఉన్నట్టు సమాచారం. 2004 నుంచి గణపతి అలియాస్ ముప్పాళ్ల లక్ష్మణరావు పార్టీ ప్రధాన కార్యదర్శిగా వ్యవహరించారు. అనారోగ్య కారణాలతో ఆయన ఆ బాధ్యతల నుంచి తప్పుకోగానే సెంట్రల్ మిలిటరీ కమిషన్ (సీఎంసీ) బాధ్యతలు చూస్తున్న నంబాల కేశవరావు పార్టీ చీఫ్‌గా 2018 నవంబర్‌లో బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం ఆయన ఎన్‌కౌంటర్‌లో చనిపోవడంతో గత సంప్రదాయాన్ని అనుసరిస్తూ ప్రస్తుతం సీఎంసీ కమాండర్‌గా ఉన్న తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీకి ఈ బాధ్యతలు అప్పగిస్తారనే ప్రచారం జరుగుతోంది. పదేళ్ల కిందట కూడా ఒకసారి పార్టీ చీఫ్ పదవికి తిరుపతి పేరు తెరపైకి వచ్చింది. అయితే కార్యరూపం దాల్చలేదు.

ఈసారి తెలుగేతర వ్యక్తి?

మరోవైపు కేంద్ర కమిటీ, పొలిట్‌బ్యూరో సభ్యుడిగా, అధికార ప్రతినిధిగా పలు బాధ్యతలు నిర్వహిస్తున్న మల్లోజుల వేణుగోపాల్ (మల్లోజుల కోటేశ్వరరావు సోదరుడు) పేరు కూడా విన్పిస్తోంది. పార్టీ ప్రస్తుతం గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటున్నందున మిలిటరీ విభాగం కంటే పొలిట్‌బ్యూరో సభ్యులకే అవకాశం ఇచ్చేందుకు ఆస్కారం ఉందనే వాదనలు వినిపిస్తున్నాయి. అయితే వరుసగా రెండుసార్లు తెలుగు రాష్ట్రాలకు చెందిన నేతలకే అవకాశం దక్కినందున ఈసారి తెలుగేతర నేతలకు అవకాశం ఇవ్వవచ్చని, పశ్చిమ బెంగాల్‌కు చెందిన రాజా పేరును పరిశీలనలోకి తీసుకోవచ్చనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

హిడ్మాకు సీఎంసీ బాధ్యతలు!

గడిచిన దశాబ్ద కాలంగా మావోయిస్టు పార్టీకి ఆదివాసీలు.. అందునా మహిళలే దన్నుగా నిలుస్తూ వస్తున్నారు. ఆపరేషన్ కగార్ మొదలైన తర్వాత జరుగుతున్న భారీ ఎన్‌కౌంటర్లు అన్నింట్లోనూ మహిళా మావోయిస్టులే ఎక్కువగా చనిపోతున్నారు. మావోయిస్టు ఉద్యమంలో మహిళలు పోషిస్తున్న భూమికను దృష్టిలో ఉంచుకుని సెంట్రల్ రీజినల్ బ్యూరోలో ఉన్న మాధవి అలియాస్ సుజాతకు ప్రధాన కార్యదర్శి పదవి అప్పగించవచ్చని, అదే సమయంలో పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ కంపెనీ వన్ కమాండర్‌గా ఉన్న మడావి హిడ్మాకు సీఎంసీ బాధ్యతలు అప్పగించే అవకాశం ఉందని తెలుస్తోంది.

సమష్టి నాయకత్వం!

పీపుల్స్ వార్ పార్టీలో కొండపల్లి సీతారామయ్య తిరుగులేని విధంగా ఏకఛత్రాధిపత్యం చూపారు. దీన్ని ఇతర పార్టీ నేతలు నిరసించారు. కొండపల్లి తర్వాత పార్టీ పగ్గాలు చేపట్టిన ముప్పాళ్ల లక్ష్మణరావు అలియాస్ గణపతి గతానికి భిన్నంగా ఉమ్మడి నాయకత్వం వైపు మొగ్గు చూపారు. అందువల్లే సెంట్రల్ కమిటీ, సెంట్రల్ రీజినల్ బ్యూరో, పొలిటికల్ బ్యూరో, సెంట్రల్ మిలిటరీ కమిషన్ వంటివి ఏర్పడ్డాయి. ప్రస్తుతం నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో సమష్టి నాయకత్వం వైపు మొగ్గు చూపవచ్చనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. దీని ప్రకారం ప్రతి కమిటీకి ఒకరికి మించి నాయకులు ఉండే విధానం అవలంబించవచ్చని అంటున్నారు.

మందుగుండైన సిందూరం



ఆపరేషన్ సిందూర్‌తో పాకిస్తాన్‌ను మోకాళ్లపై నిల్చోబెట్టాం

- పహల్గాం ఉగ్రదాడికి 22 నిమిషాల్లో బదులిచ్చాం
- 9 అతిపెద్ద ఉగ్రవాద స్థావరాలను నేటమట్టం చేశాం
- నా సిరల్లో రక్తం బదులు వేడివేడి సిందూరం ప్రవహిస్తోంది
- ఆయుధాలు చూసుకొని విర్రవీగినవారు మట్టిలో కలిసిపోయారు
- భారతీయుల రక్తం పారించాలని చూస్తే భారీ మూల్యం చెల్లించాలి
- పాకిస్తాన్‌కు ప్రధాని నరేంద్ర మోదీ హెచ్చరిక

బికనెర్/జైపూర్: పహల్గాం ఉగ్రవాద దాడికి కేవలం 22 నిమిషాల్లో సరైన జవాబు ఇచ్చామని, ఉగ్రవాదుల శిబిరాలను నేలమట్టం చేశామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తేల్చిచెప్పారు. పవిత్ర సిందూరం మందుగుండుగా(గన్‌పౌడర్) మారితే ఏం జరుగుతుందో మన శత్రువులతోపాటు ప్రపంచం మొత్తం చూసిందని అన్నారు. భారత్‌కు వ్యతిరేకంగా ఉగ్రవాదులను ఎగదోస్తున్న పాకిస్తాన్‌ను మోకాళ్లపై కూర్చోబెట్టామని, మన సైనిక దళాలు అపూర్వ ధైర్య సాహసాలు ప్రదర్శించాయని, ఆపరేషన్ సిందూర్‌ను విజయవంతం చేశాయని ప్రశంసించారు. ప్రధాని మోదీ గురువారం రాజస్తాన్‌లో పర్యటించారు. పాకిస్తాన్ సరిహద్దులోని బికనెర్ జిల్లాలో పలు అభివృద్ధి ప్రాజెక్టులు ప్రారంభించారు. ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ఆపరేషన్ సిందూర్ అనంతరం ఆయన బహిరంగ సభలో ప్రసంగించడం ఇదే మొదటిసారి. ఏప్రిల్ 22న జరిగిన పహల్గాం ఉగ్రదాడికి ప్రతిస్పందనగా 22 నిమిషాల్లోనే 9 అతిపెద్ద ఉగ్రవాద స్థావరాలను నాశనం చేశామని వెల్లడించారు. తన సిరల్లో రక్తం బదులు వేడివేడి సిందూరం ప్రవహిస్తోందని వ్యాఖ్యానించారు. భారత్‌లో జరిగే ప్రతి ఉగ్రదాడికి పాకిస్తాన్ భారీ మూల్యం చెల్లించాల్సి ఉంటుందని తీవ్రంగా హెచ్చరించారు. ప్రధానమంత్రి మోదీ ఇంకా ఏం మాట్లాడారంటే...

అణ్వాయుధాలకు భారత్ భయపడదు

''ఉగ్రవాద దాడికి భారత్ ప్రతిస్పందనను ప్రతీకార చర్యగా చూడొద్దు. ఇదొక కొత్త రకమైన న్యాయం. ఇది ఆపరేషన్ సిందూర్. ఇది ఆగ్రహం కాదు.. దేశ శక్తి సామర్థ్యాలకు ప్రతీక. ఇది నూతన భారతదేశం. పాకిస్తాన్‌తో వ్యాపారం, వాణిజ్యం జరిపే ప్రసక్తే లేదు. పొరుగు దేశంతో ఇకపై చర్చలంటూ జరిగితే కేవలం ఉగ్రవాదులు, పాక్ ఆక్రమిత కశ్మీర్(పీఓకే)పైనే జరుగుతాయి. అణ్వాయుధాలు చూపించి బెదిరిస్తామంటే ఇక్కడ బెదిరిపోయే వాళ్లు ఎవరూ లేరు. అణ్వస్త్రాల ముప్పు చూసి భారత్ భయపడదు. దేశంలో ఇకపై ఉగ్రదాడులు జరిగితే ఎలా బదులివ్వాలో మాకు బాగా తెలుసు. ముష్కర మూకలకు అర్థమయ్యే రీతిలోనే బుద్ధి చెప్తాం. ఉగ్రవాదులపై ఎప్పుడు, ఎక్కడ, ఎలా దాడులు చేయాలో మన సైనిక దళాలే నిర్ణయిస్తాయి. మన జవాన్లకు ఆ స్వేచ్ఛ ఉంది. ఉగ్రవాద దాడుల కుట్రదారులను, పాక్ ప్రభుత్వ అండతో చెలరేగిపోతున్న ఉగ్రవాదులను వేర్వేరుగా చూడం. వారందరినీ ఒక్కటిగానే పరిగణిస్తాం. ఆపరేషన్ సిందూర్ నుంచి ఈ మూడు సూత్రాలు తీసుకున్నాం. పాకిస్తాన్ ప్రాయోజిత ఉగ్రవాదుల ఆటలు ఇకపై సాగవు.

ఐసీయూలోకి చేరిన పాక్ ఎయిర్‌బేస్

బికనెర్ జిల్లాలోని నాల్ ఎయిర్‌బేస్‌పై దాడి చేయడానికి పాకిస్తాన్ సైన్యం ప్రయత్నించింది. కానీ, మన ఎయిర్‌బేస్‌కు ఎలాంటి నష్టం జరగలేదు. పాక్ చర్యకు బదులుగా మన సైన్యం పాకిస్తాన్‌లోని రహిమ్యార్ ఖాన్ ఎయిర్‌బేస్‌పై దాడికి దిగింది. దాంతో అది చాలావరకు ధ్వంసమైంది. ప్రస్తుతం ఐసీయూలో ఉంది. ఎప్పుడు బయటకు వస్తుందో ఎవరికీ తెలియదు. భారత్‌పై ప్రత్యక్ష యుద్ధంలో పాకిస్తాన్ ఎప్పటికీ నెగ్గలేదు. భారత్‌తో తలపడినప్పుడల్లా పరాజయమే చవిచూసింది. అందుకే ప్రత్యక్షంగా ఎదుర్కొనే సత్తా లేక ఉగ్రవాదాన్ని ఆయుధంగా వాడుకుంటోంది. దొంగదెబ్బ తీయాలని చూస్తోంది. 2019లో బాగల్‌కోట్ వైమానిక దాడుల తర్వాత రాజస్తాన్‌లో మాట్లాడుతూ మన దేశాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ తలవంచనివ్వబోనని ప్రతిజ్ఞ చేశా. అదే రాజస్తాన్ గడ్డపై దేశ ప్రజలకు మరో మాట చెబుతున్నా. మన ఆడబిడ్డల సిందూరం తుడిచేయాలని చూసే ఉగ్రవాదులను ఏరిపారేస్తాం. మన రక్తం పారించాలని కుట్రలు చేస్తే ప్రతి రక్తం బొట్టుకు ముష్కరులు మూల్యం చెల్లించక తప్పదు'' అని మోదీ స్పష్టం చేశారు.

ఉగ్రవాదులను ఎగుమతి చేసినంత కాలం భిక్షం ఎత్తుకోవాల్సిందే!

''ఉగ్రవాదులను ప్రోత్సహిస్తూ అమాయకులను హత్య చేస్తూ మన దేశంలో భయానక వాతావరణాన్ని సృష్టించాలన్నదే పాక్ ఎత్తుగడ. కానీ, ఇక్కడ భరతమాత సేవకుడు మోదీ ఉన్నాడు. తలెత్తుకొని నిల్చున్నాడు. మోదీ మనసు ప్రశాంతంగానే ఉండొచ్చు.. అతడి రక్తం మాత్రం సెగలు కక్కుతోంది. ఉగ్రవాదులను ఎగుమతి చేసినంత కాలం పాకిస్తాన్‌కు పూట గడవదు. భిక్షం ఎత్తుకోవాల్సిందే. ఇండియా నుంచి ప్రవహించే నదుల్లో వాటా కూడా దక్కదు. భారతీయుల రక్తంతో ఆటలాడితే అందుకు చెల్లించే మూల్యం ఊహించనంతగా ఉంటుందని పాకిస్తాన్ గుర్తుంచుకోవాలి. ఉగ్రవాద భూతాన్ని కూకటివేళ్లతో సహా పెకిలించి వేయడమే మన సంకల్పం. దీన్నుంచి మనల్ని ప్రపంచంలోని ఏ శక్తి కూడా వేరుచేయలేదు. పాకిస్తాన్ ప్రాయోజిత ఉగ్రవాదాన్ని అంతం చేసే విషయంలో మన సంకల్పాన్ని ఇతర దేశాలకు తెలియజేయడానికే అఖిలపక్ష బృందాలను పంపించాం. పాకిస్తాన్ అసలు రూపాన్ని మొత్తం ప్రపంచానికి చూపిస్తాం'' అని ప్రధాని మోదీ వివరించారు.

103 అమృత్ భారత్ స్టేషన్లు ప్రారంభం

ప్రధానమంత్రి మోదీ దేశవ్యాప్తంగా 103 అమృత్ భారత్ రైల్వే స్టేషన్లను గురువారం వర్చువల్‌గా ప్రారంభించారు. 18 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 86 జిల్లాల్లో రూ.1,100 కోట్లతో రైల్వే స్టేషన్లను అమృత్ భారత్ స్టేషన్లుగా అభివృద్ధి చేశారు. అభివృద్ధి చెందిన భారత్ కోసం ఆధునిక మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన చెప్పారు. దేశంలో రైల్వే స్టేషన్లు, ఎయిర్‌పోర్టుల ఆధునీకరణ కోసం గత 11 ఏళ్లుగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. దేష్నోక్ స్టేషన్‌లో బికనెర్–ముంబై ఎక్స్‌ప్రెస్ రైలును పచ్చజెండా ఊపి ప్రారంభించారు. అలాగే రైల్వేలు, రహదారులు, విద్యుత్, నీటి సరఫరా, పునరుత్పాదక ఇంధనం వంటి రంగాలకు సంబంధించిన రూ.26,000 కోట్ల విలువైన పలు ప్రాజెక్టులను ప్రారంభించి, జాతికి అంకితం ఇచ్చారు. మరికొన్ని ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. అంతకు ముందు బికనెర్ జిల్లాలోని ప్రఖ్యాత కర్ణి మాత ఆలయాన్ని ప్రధాని మోదీ దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఆలయం ఎలుకలకు ప్రసిద్ధి చెందింది. ఇక్కడ ఎటు చూసినా ఎలుకలే కనిపిస్తుంటాయి. భక్తులు వాటిని పవిత్రంగా భావిస్తారు.

‘విరమణ’లో ఏ దేశం పాత్రా లేదు

స్పష్టం చేసిన విదేశాంగ మంత్రి జైశంకర్



న్యూఢిల్లీ: భారత్–పాకిస్తాన్ కాల్పుల విరమణకు అమెరికా మధ్యవర్తిత్వం వహించిందని, అణు యుద్ధ ప్రమాదాన్ని అమెరికాయే నివారించిందని.. ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పదేపదే చేస్తున్న వ్యాఖ్యలను భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ ఖండించారు. ఇస్లామాబాద్, న్యూఢిల్లీ మధ్య నేరుగా కాల్పుల విరమణ చర్చలు జరిగాయని, మరే ఇతర దేశం పాత్ర లేదని జైశంకర్ నొక్కి చెప్పారు. ఉద్రిక్తతలను తగ్గించాలంటూ పాక్ చేసిన ప్రతిపాదనకు భారత్ స్పందించిందని, కాల్పుల విరమణకు అంగీకరించిందని స్పష్టం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నెదర్లాండ్స్‌ను సందర్శించాల్సి ఉండగా, పాకిస్తాన్‌తో ఉద్రిక్తతల నేపథ్యంలో జైశంకర్ ఆయన స్థానంలో వెళ్లారు. గురువారం డచ్ దినపత్రిక డి వోక్స్‌క్రాంట్‌కు ఇచ్చిన విస్తృత ఇంటర్వ్యూలో జైశంకర్ ఈ వ్యాఖ్యలు చేశారు.

అన్ని దేశాల్లాగే అమెరికా మాట్లాడింది

భారత్–పాక్ మధ్య తీవ్రమైన ఉద్రిక్తతలు నెలకొన్న సమయంలో.. అనేక దేశాలు భారత్‌ను సంప్రదించాయని, పాకిస్తాన్‌తో కూడా మాట్లాడాయని, అమెరికా సైతం అలాగే మాట్లాడిందని తెలిపారు. అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో, ఉపాధ్యక్షుడు సహా అగ్రశ్రేణి అధికారులు తమను సంప్రదించారని, కానీ వారు తమ ఆందోళనలను మాత్రమే తెలియజేశారని స్పష్టం చేశారు. అయితే పాకిస్తాన్ కాల్పుల విరమణ కోరుకుంటే నేరుగా భారత్‌ని సంప్రదించాల్సి ఉంటుందని తమ ప్రభుత్వం అమెరికాతో సహా అన్ని దేశాలకు తెలియజేసిందని ఆయన గుర్తు చేశారు. ఆ తరువాత కాల్పులు ఆపడానికి సిద్ధంగా ఉన్నామని పాకిస్తాన్ సైన్యం సందేశం పంపిందని, దానికి అనుగుణంగా భారత సైన్యం స్పందించిందని స్పష్టం చేశారు. ఇందులో అమెరికా ఎక్కడుందని వ్యాఖ్యాత ప్రశ్నించగా..''పాక్, భారత్ మధ్యలోకి అమెరికా రాలేదు. అమెరికా తన పరిధిలోనే ఉండిపోయింది. సుదూరంగా అమెరికా గడ్డమీదనే ఆగిపోయింది'' అని జైశంకర్ చమత్కరించారు. పహల్గాం ఉగ్రవాద దాడుల అంశంపై జైశంకర్ మాట్లాడారు. భారతీయుల మధ్య మత సామరస్యాన్ని చెడగొట్టడం, కశ్మీర్‌లో అభివృద్ధి చెందుతున్న పర్యాటక పరిశ్రమను దెబ్బతీయడం వారి లక్ష్యమన్నారు. వారు ఉద్దేశపూర్వకంగా దాడికి మతపరమైన రంగును పులిమారని జైశంకర్ అన్నారు.

పాక్ నటించడం మానెయ్యాలి

ఉగ్రవాదులకు మద్దతు ఇవ్వడంలో తమ ప్రమేయం లేదని ప్రపంచం ముందు పాక్ నటించడం మానెయ్యాలన్నారు. ఉగ్రవాదుల కార్యకలాపాల్లో ప్రభుత్వం మాత్రమే కాదు.. సైన్యం కూడా భాగస్వామి అని నొక్కి చెప్పారు. ''ఐక్యరాజ్య సమితి నిషేధ జాబితాలోని మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాదులందరూ పాకిస్తాన్‌లో ఉన్నారు. వారు పెద్ద నగరాల్లో, పట్టపగలు పనిచేస్తారు. వారి చిరునామాలు తెలుసు. వారి కార్యకలాపాలు తెలుసు. కాబట్టి ప్రమేయం లేదని పాకిస్తాన్ నటించకూడదు'' అని జైశంకర్ హితవు పలికారు.

మతాలన్నింటి సారం ఒక్కటే

- అన్ని మతాలూ సేవా భావాన్ని బోధిస్తున్నాయి
- హిందువుల్లో మోక్షం అనే భావన ఉంది
- సుప్రీంకోర్టు సీజేఐ జస్టిస్ బి.ఆర్.గవాయ్ వెల్లడి
- వక్ఫ్(సవరణ) చట్టంపై ముగిసిన వాదనలు
- మధ్యంతర ఉత్తర్వును రిజర్వ్ చేసిన ధర్మాసనం



న్యూఢిల్లీ: వక్ఫ్(సవరణ) చట్టం–2025 రాజ్యాంగబద్ధతను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టులో మూడు రోజులపాటు జరిగిన వాదనలు గురువారం ముగిశాయి. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్, న్యాయమూర్తి జస్టిస్ అగస్టీన్ జార్జి మాసిహ్‌తో కూడిన ధర్మాసనం మధ్యంతర ఉత్తర్వును రిజర్వ్ చేస్తున్నట్లు ప్రకటించింది. అంతకుముందు కేంద్ర ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, పిటిషనర్ల తరఫున కపిల్ సిబల్, రాజీవ్ ధావన్, అభిషేక్ సింఘ్వీ సుప్రీంకోర్టు ధర్మాసనం ఎదుట వాదనలు వినిపించారు. వక్ఫ్ అనేది కేవలం ఒక సేవా కార్యక్రమం అని, అది ఇస్లాంలో తప్పనిసరి భాగం కాదని తుషార్ మెహతా పేర్కొనగా, కపిల్ సిబల్ స్పందిస్తూ... మరణానంతర జీవితం కోసం దేవుడికి, సమాజానికి సేవ చేయడమే వక్ఫ్ అని తేల్చిచెప్పారు. ఆధ్యాత్మిక ప్రయోజనం కోసం భగవంతుడికి అంకితంకావడం వక్ఫ్ అని వివరించారు. సీజేఐ జస్టిస్ గవాయ్ మాట్లాడుతూ.. హిందూ మతస్తుల్లో మోక్షం అనే భావన ఉందని గుర్తుచేశారు. జస్టిస్ అగస్టీన్ జార్జి స్పందిస్తూ.. క్రైస్తవ మతంలోనూ అలాంటి భావనే ఉందన్నారు. స్వర్గానికి చేరుకోవడానికి క్రైస్తవులు ఆరాటపడుతుంటారని తెలిపారు. అనంతరం రాజీవ్ ధావన్ మాట్లాడుతూ కేంద్రం వాదనను తిప్పికొట్టే ప్రయత్నం చేశారు. వేదాల ప్రకారం చూస్తే హిందూ మతంలో దేవాలయాలు తప్పనిసరి భాగం కాదని చెప్పారు. ప్రకృతిని ఆరాధించే ఆచారం హిందూ మతంలో ఉందన్నారు. అగ్ని, నీరు, వర్షం, పర్వతాలు, సముద్రాలను దేవుళ్లుగా పూజిస్తుంటారని గుర్తుచేశారు. దాదాపు అన్ని మతాల్లో సేవా భావన ఉందని జస్టిస్ గవాయ్ పేర్కొన్నారు. మతాల్లో అదొక ప్రాథమిక సూత్రమని వెల్లడించారు. సేవా కార్యక్రమాల విషయంలో మతాలన్నింటి సారం ఒక్కటేనని, వాటి మధ్య భేదం లేదని పరోక్షంగా తెలియజేశారు. మరోవైపు వక్ఫ్(సవరణ) చట్టాన్ని చట్టబద్ధంగానే తీసుకొచ్చారని, ఇది చట్టవిరుద్ధమని సాక్ష్యాధారాలతో సహా నిరూపించాల్సిన బాధ్యత పిటిషనర్లదేనని సీజేఐ సూచించారు. పార్లమెంట్ ఆమోదంతో తీసుకొచ్చిన చట్టంపై స్టే ఇవ్వొద్దని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సుప్రీంకోర్టును కోరారు.

వక్ఫ్ బోర్డుల్లో ముస్లిమేతరులు ఎందుకు?

సెంట్రల్ వక్ఫ్ కౌన్సిల్, స్టేట్ వక్ఫ్ బోర్డుల్లో ముస్లిమేతరులను కూడా సభ్యులుగా నియమించాలన్న నిబంధనను చట్టంలో చేర్చడాన్ని కపిల్ సిబల్ తప్పుపట్టారు. హిందూ ధార్మిక సంస్థల్లో హిందూయేతరులకు ప్రవేశం ఉండదని తెలిపారు. అలాంటప్పుడు వక్ఫ్ బోర్డుల్లో ముస్లిమేతరులను నియమించడంలో ఔచిత్యం ఏమిటని ప్రశ్నించారు. వక్ఫ్(సవరణ) చట్టంపై సుప్రీంకోర్టు ఉత్తర్వు శుక్రవారం వెలువడే అవకాశం ఉంది.

ట్రంప్.. మళ్లీ అదే తీరు!

- దక్షిణాఫ్రికా అధ్యక్షుడితో వాగ్వాదం
- మీ దేశంలో శ్వేతజాతి రైతులను ఊచకోత కోశారని ఆరోపణలు
- అసలు బాధితులు నల్లజాతీయులేనని దీటుగా బదులిచ్చిన రమఫోసా
- మరోసారి రచ్చబండగా మారిన వైట్‌హౌస్ ఓవల్ ఆఫీస్



వైట్‌హౌస్‌లో రమఫోసాతో వెటకారంగా మాట్లాడుతున్న ట్రంప్

వాషింగ్టన్: కొన్ని వారాల క్రితం శ్వేతసౌధంలో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో మీడియా సాక్షిగా తీవ్రస్థాయిలో వాగ్వాదానికి దిగిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన వైఖరిని ఏమాత్రం మార్చుకోలేదు. సాదరంగా ఆహ్వానించి నిందారోపణల బురద కుమ్మరించడం అగ్రరాజ్యానికి ఏమాత్రం తగదని ఆనాడే ప్రపంచ మీడియా తీవ్రంగా మందలించినా ట్రంప్ తన తెంపరితనాన్ని ఏమాత్రం తగ్గించుకోలేదని బుధవారం మరోసారి రుజువైంది. వాణిజ్య ఒప్పందం కుదుర్చుకుంటారనే ఆశతో వైట్‌హౌస్‌కు విచ్చేసిన దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రమఫోసాకు ట్రంప్ ఆరోపణలతో స్వాగతం పలికారు. దక్షిణాఫ్రికాలో వేలాది మంది శ్వేతజాతి రైతులను వధించారని ట్రంప్ తీవ్ర ఆరోపణలు చేశారు. దీంతో హతాశుడైన రమఫోసా వెంటనే తేరుకుని ట్రంప్‌కు దీటుగా బదులిచ్చారు.

అసలేం జరిగిందంటే?

శ్వేతసౌధంలో మీడియా సమక్షంలో సంయుక్తంగా మాట్లాడేందుకు రమఫోసా సిద్ధంకాగా ట్రంప్ మీడియాతో మాట్లాడటం వదిలేసి అక్కడే ఉన్న పెద్ద టెలివిజన్‌లో ఒక వీడియో చూపిస్తాం చూడండని అక్కడి వారందరినీ ఆదేశించారు. ''శ్వేతజాతీయులను చంపేయండి. శ్వేతజాతి రైతులను కాల్చిచంపండి'' అంటూ దక్షిణాఫ్రికాలో చిన్నపాటి కమ్యూనిస్ట్‌పార్టీ అయిన ఎకనమిక్ ఫ్రీడమ్ ఫైటర్స్ నేత జూలియస్ మలేమా పాడుతున్నట్లు ఆ వీడియోలో ఉంది. వీడియో ప్లే అవడం పూర్తయ్యాక ట్రంప్ రమఫోసాను ఉద్దేశించి ఇష్టమొచ్చినట్లు మాట్లాడారు. '' దక్షిణాఫ్రికాలో నల్లజాతీయులు జాత్యహంకారానికి గురయ్యారనేది ఒట్టిమాట. వాస్తవానికి వేలాది మంది శ్వేతజాతి రైతులను ఊచకోత కోశారు. ఆ దేశంలో ఎన్నో ప్రాంతాలు శ్వేతజాతీయుల సమాధి దిబ్బలుగా మారాయి. శ్వేతజాతీయులు పీడనకు, వేదనకు గురయ్యారు. మీ ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో చాలా మంది శ్వేతజాతీయులు బతుకుజీవుడా అంటూ అమెరికాకు శరణార్థులుగా వలసవచ్చారు. వాళ్లకు మేం ఆశ్రయం కల్పించాం'' అంటూ ట్రంప్ చెప్పుకుంటూ పోయారు. శ్వేతజాతీయుల అవస్థలు ఇవి అంటూ విదేశీ వార్తాసంస్థల్లో ప్రచురితమైన కథనాల జిరాక్స్ కాపీలను మీడియా ప్రతినిధులకు చూపించి రమఫోసాకు అందజేశారు. వీటికి సంజాయిషీ చెప్పాలని డిమాండ్‌చేశారు. '' అన్ని హత్యలే. దక్షిణాఫ్రికాలో ఎక్కడ చూసినా మరణాలే'' అని ట్రంప్ వ్యాఖ్యానించారు. ట్రంప్ వైఖరితో ఒక్కసారిగా విసిగిపోయిన రమఫోసా పట్టరాని ఆగ్రహంతో ఉన్నాసరే సంయమనం పాటించారు. హుందాగా వ్యవహరిస్తూ సూటిగా మాట్లాడారు. '' అసలేంటీ వీడియో?. నేనెప్పుడూ ఈ వీడియో చూడలేదు. ఎక్కడిదీ వీడియో?. ఈ వీడియో ఎంత వరకు వాస్తవం?'' అంటూ ట్రంప్‌పై ప్రశ్నల వర్షం కురిపించారు. '' దశాబ్దాలుగా జాత్యహంకారానికి, పీడనకు కోట్లాదిమంది నల్లజాతీయులు బాధితులయ్యారు. లెక్కలేనంత మంది బలయ్యారు. మా దేశంలో శ్వేతజాతీయుల ఊచకోత అనేది పూర్తిగా అబద్ధం. నిజానికి ఆఫ్రికనర్స్‌గా పిలిచే మైనారిటీ శ్వేతజాతీయులే దాన్నాళ్లు మా దేశాన్ని చెండుకు తిన్నారు. ఆఫ్రికన్ల దీనగాథను వినే ఓపిక మీకు ఉంటే మా బాధ సరిగ్గా అర్థమవుతుంది.'' అని రమఫోస సూటిగా సమాధానం ఇచ్చారు. ట్రంప్ చూపిన వీడియోలో ఒక రోడ్డు పక్కన చోట పెద్ద సంఖ్యలో సమాధులు ఉన్నాయి. అయితే ఇవి నిజమైన సమాధులు కావని, 2020లో ఖ్వజూలు–నటాల్ ప్రావిన్సులో ఒక రైతు జంట పొలంలో హత్యకు నిరసనగా ఏర్పాటుచేసిన నకిలీ సమాధులు అని కొందరు వాదించారు.

ఉంటే ఇచ్చేవాడినే

శ్వేతజాతి, నల్లజాతీయుల్లో ఎవరు పీడనకు గురయ్యారని ఓవైపు ట్రంప్, రమఫోసా వాదించుకుంటుంటే ఒక విలేకరి మధ్యలో కల్పజేసుకుని వందల కోట్ల రూపాయల విలువైన విమానాన్ని బహుమతిగా స్వీకరించడం ఎంత వరకు నైతికతగా అనిపించుకుంటుంది? అని ట్రంప్‌ను సూటి ప్రశ్న వేశారు. దీంతో చిర్రెత్తికొచ్చిన ట్రంప్.. '' నువ్వో చెత్త రిపోర్టర్‌వు. ఇంత కీలకమైన విషయంపై చర్చిస్తుంటే మధ్యలో నీ విమానం గోల ఏంటి?. నువ్వు అసలు ప్రశ్నలు అడగొద్దు'' అని అతనిపై ట్రంప్ అరిచాడు. ఆగ్రహంతో ఊగిపోతున్న ట్రంప్‌ను కూల్ చేసేందుకు రమఫోసా మధ్యలో కలుగజేసుకున్నారు. '' ఖతార్ మాత్రమే కాదు. కావాలంటే మేం కూడా మీకు విమానాన్ని బహుమానంగా ఇస్తాం'' అని అన్నారు. దీనికి ట్రంప్ వెటకారంగా బదులిచ్చారు. '' అగ్రరాజ్యమైన అమెరికాకే ఎయిర్‌ఫోర్స్‌వన్‌గా కొత్త విమానాన్ని ఇచ్చే దమ్ముంటే మీరూ ఇవ్వొచ్చు. నేను తీసుకునేందుకు రెడీ'' అని అన్నారు. వెంటనే రమఫోసా '' అగ్రరాజ్యంగా ఉండి కూడా మీరు ఇంకొకరి నుంచి తీసుకునే స్థితిలో ఉన్నా.. ఇచ్చే స్థితిలో మేం లేము. మా వద్ద అసలు విమానమే లేదు'' అని అనేసరికి అక్కడ ఉన్న వాళ్లంతా ఘొల్లున నవ్వేశారు.

అమెరికాలో ఇజ్రాయెల్ రాయబార సిబ్బందిపై
కాల్పులు, ఇద్దరు మృతి

నీచమైన ఉగ్రవాద చర్యగా అభివర్ణించిన ఇజ్రాయెల్ • ఖండించిన అమెరికా

వాషింగ్టన్: అమెరికాలో ఇజ్రాయెల్ రాయబార సిబ్బంది ఇద్దరు హత్యకు గురయ్యారు. నార్త్ వెస్ట్ డీసీలోని యూదుల మ్యూజియానికి సమీపంలో జరిగిన కాల్పుల్లో రాయబార సిబ్బంది అయిన సారా లిన్ మిల్‌గ్రిమ్, యారోన్ లిచిన్‌స్కీ అక్కడికక్కడే మృతి చెందారు. అమెరికన్ యూదు అసోసియేషన్ ఇచ్చిన విందు నుంచి తిరిగి వెళ్తుండగా కాల్పుల ఘటన జరిగింది. కాల్పుల అనంతరం నిందితుడు మ్యూజియంలోకి వెళ్లేందుకు ప్రయత్నించాడు. ఈవెంట్ సెక్యూరిటీ అతడిని వెంటనే అదుపులోకి తీసుకుంది. ఈ సమయంలో ‘ఫ్రీ పాలస్తీనా’ అని నినాదాలు చేశాడు. నిందితుడిని చికాగోకు చెందిన 30 ఏళ్ల ఎలియాస్ రోడ్రిగ్జ్‌గా గుర్తించారు. అతనికి గతంలో ఎలాంటి నేర చరిత్ర లేదు. కాల్పుల్లో మరణించిన లిచిన్‌స్కీ రాయబార కార్యాలయంలో రీసెర్చ్ అసిస్టెంట్ కాగా, మిల్‌గ్రిమ్.. ఇజ్రాయెల్ ఎంబసీలో పనిచేస్తున్న అమెరికా పౌరురాలు. వారిద్దరూ త్వరలో నిశ్చితార్థం చేసుకోవాలనుకున్నారని అమెరికాలో ఇజ్రాయెల్ రాయబారి యెచియల్ లెయిటర్ తెలిపారు. వచ్చేవారం జెరూసలేంలో సారాకి ప్రపోజ్ చేయాలని యారోన్ ప్లాన్ చేసుకున్నారని, ఈలోపే ఈ దుర్ఘటన జరిగిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

నీచమైన ఉగ్రవాద చర్య: నెతన్యాహు

ఈ దాడిని అమెరికా, ఇజ్రాయెల్ నేతలు, అధికారులు ఖండించారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఇజ్రాయెల్ దౌత్య కార్యాలయాల వద్ద భద్రతను పెంచాలని ఆ దేశ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఆదేశించారు. ఈ దాడిని యూదు వ్యతిరేక, నీచమైన ఉగ్రవాద చర్యగా అభివర్ణించారు. యువ జంటను కోల్పోవడం పట్ల విచారం వ్యక్తం చేశారు. ఇజ్రాయెల్ రాయబార సిబ్బందిపై కాల్పులను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఖండించారు. ‘యూదు వ్యతిరేకతతో చేసిన హత్యలని స్పష్టమవుతోంది. ఇలాంటి హత్యలు ఇప్పుడే అంతం కావాలి. ద్వేషం, రాడికలిజానికి అమెరికాలో స్థానం లేదు. బాధితుల కుటుంబాలకు నా సంతాపం. ఇలాంటివి జరగడం చాలా విచారకరం’ అని ట్రంప్ ట్రూత్ సోషల్‌లో పేర్కొన్నారు. ‘ఇజ్రాయెల్ రాయబార కార్యాలయం సిబ్బంది హత్యను మేమూ తీవ్రంగా ఖండిస్తున్నాం. ఇది పిరికితనం. యూదు వ్యతిరేక హింస. బాధ్యులను గుర్తించి న్యాయం ముందు నెలబడతాం’ అని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో అన్నారు. ఇటీవలి కాలంలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఇజ్రాయెల్ ప్రతినిధులు నిరంతరం ప్రమాదాలను ఎదుర్కొంటున్నారని, అయినా ఇజ్రాయెల్ ఉగ్రవాదానికి లొంగిపోదని ఆ దేశ విదేశాంగ మంత్రి గిడియన్ సార్ అన్నారు.

నీట్–పీజీ సీట్లు బ్లాక్ చేయకుండా
కఠినచర్యలు తీసుకోవాలి

కౌన్సెలింగ్‌కు ముందే ఫీజుల వివరాలు వెల్లడించాలి • సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ: పోస్ట్‌గ్రాడ్యుయేట్ మెడికల్ అడ్మిషన్ల విషయంలో కొన్ని కాలేజీలు ముందుగానే సీట్లు బ్లాక్ చేస్తుండడం పట్ల సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. నీట్–పీజీకి సంబంధించి కౌన్సెలింగ్‌కు ముందే ఫీజుల వివరాలు బహిర్గతం చేయాలని అన్ని ప్రైవేట్ కాలేజీలు, డీమ్డ్ యూనివర్సిటీలను ఆదేశించింది. సీట్ల బ్లాకింగ్ వల్ల అవకాశం కోల్పోయిన ఇద్దరు అభ్యర్థులకు నష్టపరిహారం చెల్లించాలని అలహాబాద్ హైకోర్టు గతంలో ఉత్తరప్రదేశ్ ప్రభుత్వాన్ని, లక్నోలోని మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ డైరెక్టర్ జనరల్‌కు ఆదేశాలు జారీ చేస్తూ తీర్పు వెలువరించింది. ఈ తీర్పును సవాలు చేస్తూ ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం, డైరెక్టర్ జనరల్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జె.బి.పార్దివాలా, జస్టిస్ ఆర్.మహాదేవన్‌తో కూడిన ధర్మాసనం తాజాగా విచారణ చేపట్టింది. మెడికల్ పీజీ సీట్లను ముందుగానే బ్లాక్ చేసి, ఇష్టానుసారంగా విక్రయించుకోవడం అనేది తప్పుడు చర్య మాత్రమే కాకుండా, వ్యవస్థలో లోపాలకు ఉదాహరణ అని వెల్లడించింది. పారదర్శకత లేకపోవడానికి, ప్రభుత్వ విధానాలు బలహీనంగా ఉండడానికి నిదర్శనమని తెలియజేసింది. సీట్ల కేటాయింపులో ఎలాంటి అవకతవకలు జరగకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. కౌన్సెలింగ్‌కు ముందే ఫీజులను వెల్లడించడం తప్పనిసరి అని స్పష్టంచేసింది. ట్యూషన్, హాస్టల్ ఫీజులు, కాషన్ డిపాజిట్‌తోపాటు ఇతర ఫీజులను విద్యార్థులకు తెలియజేయాలని ధర్మాసనం పేర్కొంది. నేషనల్ మెడికల్ కమిషన్ ఆధ్వర్యంలో కేంద్రీకృత ఫీజుల నియంత్రణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి సూచించింది. సీట్లు బ్లాక్ చేసే కాలేజీలకు జరిమానాలు విధించాలని స్పష్టం చేసింది. ఆయా కాలేజీలపై అనర్హత వేటు వేయాలని పేర్కొంది.

కశ్మీర్ మాజీ గవర్నర్ మాలిక్‌పై
సీబీఐ చార్జిషీట్

న్యూఢిల్లీ: కిరు జలవిద్యుత్ ప్రాజెక్టు కాంట్రాక్టుల విషయంలో అవినీతికి పాల్పడ్డారంటూ జమ్మూకశ్మీర్ మాజీ గవర్నర్ సత్యపాల్ మాలిక్, మరో ఏడుగురిపై కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) గురువారం చార్జిషీట్ దాఖలు చేసింది. మాలిక్‌తోపాటు అతని అనుచరులు వీరేందర్ రానా, కన్వర్‌సింగ్ రానాలపై మూడేళ్ల విచారణ అనంతరం చార్జిషీట్‌ను స్పెషల్‌కోర్టుకు సమర్పించింది. చీనాబ్‌వాలీ పవర్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎం.ఎస్.బాబు, డైరెక్టర్లు అరుణ్‌కుమార్ మిశ్రా, ఎం.కె.మిట్టల్, పటేల్ ఇంజనీరింగ్ సంస్థ మేనేజిగ్ డైరెక్టర్ రుపేన్ పటేల్, మరోవ్యక్తి కన్వల్‌జీత్ సింగ్‌దుగ్గల్ పేర్లను కూడా చేర్చింది. ''నేను గత మూడు నుండి నాలుగు రోజులుగా అనారోగ్యంతో ఉన్నాను. ఆసుపత్రిలో చేరాను. అయినప్పటికీ, ప్రభుత్వ సంస్థల ద్వారా నియంత నా ఇంటిపై దాడి చేస్తున్నాడు. నా డ్రైవర్, నా సహాయకుడిని కూడా అనవసరంగా వేధిస్తున్నారు. నేను రైతు కొడుకుని, ఈ దాడులకు నేను భయపడను. నేను రైతులతో ఉన్నాను'' అని ఎక్స్ వేదికగా మాలిక్ గురువారం పోస్ట్ చేశారు.

భారత్‌కు అండగా ఉంటాం


ఉగ్రవాదంపై పోరాటంలో పూర్తిగా సహకరిస్తాం

అఖిలపక్ష బృందాలకు హామీ ఇచ్చిన యూఏఈ, జపాన్

అబుదాబీ/టోక్యో: ఉగ్రవాదంపై పోరాటంలో భారత్‌కు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(యూఏఈ), జపాన్ ప్రకటించాయి. భారత్‌కు అన్నివిధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చాయి. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో పాకిస్తాన్ అరాచకాలను, ఉగ్రవాదంపై భారత్ సాగిస్తున్న పోరాటాన్ని ప్రపంచ దేశాల నేతలకు తెలియజేయడానికి ఏర్పాటైన అఖిలపక్ష బృందాలు తమ కార్యాచరణ ప్రారంభించాయి. శివసేన ఎంపీ శ్రీకాంత్ షిండే నేతృత్వంలోని బృందం గురువారం యూఏఈ మంత్రి షేక్ నహ్యాన్ బిన్ ముబారక్ అల్ నహ్యాన్, డిఫెన్స్ కమిటీ చైర్మన్ అలీ అల్ నుయామీతోపాటు ఇతర నేతలతో అబుదాబీలో సమావేశమైంది. జేడీ(యూ) ఎంపీ సంజయ్ ఝా నేతృత్వంలో మరో బృందం జపాన్ రాజధాని టోక్యోలో జపాన్ విదేశాంగ మంత్రి తకాషీ ఇవాయాతోపాటు మరికొందరు నేతలతో భేటీ అయ్యింది. ఉగ్రవాదం అనేది కేవలం ఏదో ఒక దేశానికి పరిమితమైన సమస్య కాదని, మొత్తం ప్రపంచానికి ముప్పుగా మారిందని అలీ అల్ నుయామీ ఆందోళన వ్యక్తంచేశారు. ఉగ్రవాదాన్ని అంతం చేయడానికి ప్రపంచ దేశాలన్నీ కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. మొత్తం మానవాళికి ఉజ్వలమైన భవిష్యత్తును అందించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. జపాన్ మంత్రి ఇవాయా మాట్లాడుతూ... ఉగ్రవాదం ఎక్కడ, ఏ రూపంలో ఉన్నాసరే అంతం చేయాల్సిందేనని పేర్కొన్నారు. పహల్గాం ఉగ్రదాడిని ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ దాడిలో ప్రాణాలు కోల్పోయిన 26 మందికి సంతాపం ప్రకటించారు. ఉగ్రవాదంపై పోరాటంలో భారత్‌కు తమ మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని ఉద్ఘాటించారు. మరోవైపు డీఎంకే ఎంపీ కె.కనిమొళి నేతృత్వంలోని మరో అఖిలపక్ష బృందం రష్యాకు బయలుదేరింది. మొత్తం 33 దేశాలకు అఖిలపక్ష బృందాలను పంపించాలని భారత ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే.

అత్యంత శక్తివంతమైన క్షిపణిని ప్రయోగించిన అమెరికా

వాషింగ్టన్: అమెరికా వైమానిక దళం అత్యంత శక్తివంతమైన అణ్వస్త్ర సామర్థ్యమున్న ఖండాంతర బాలిస్టిక్ క్షిపణి(ఐసీబీఎం) మినట్‌మ్యాన్–3ని బుధవారం ప్రయోగించింది. దేశానికి క్షిపణి రక్షణ వ్యవస్థ గోల్డెన్ డోమ్‌ను ఏర్పాటు చేయనున్నట్లు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన మరునాడే ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం. కాలిఫోర్నియాలోని వాండెన్‌బర్గ్ స్పేస్ ఫోర్స్ బేస్ నుంచి ప్రయోగించిన సమయంలో రీ–ఎంట్రీ వెహికల్ మాత్రమే అమర్చిన ఈ క్షిపణిలో ఎటువంటి ఆయుధాలు లేవని ఎయిర్‌ఫోర్స్ తెలిపింది. రీ–ఎంట్రీ వెహికల్‌లో సాధారణంగా అణు వార్‌హెడ్‌ను ఉంచుతారు. గంటకు 15 వేల మైళ్లకంటే ఎక్కువ వేగంతో 4,200 మైళ్లు ప్రయాణించిన ఈ క్షిపణి మార్షల్ ఐల్యాండ్స్‌లోని యూఎస్ ఆర్మీ స్పేస్ అండ్ మిస్సైల్ డిఫెన్స్ కమాండ్‌లోని రొనాల్డ్ రీగన్ బాలిస్టిక్ డిఫెన్స్ టెస్ట్ ప్రాంతానికి చేరుకుంది. దేశ అణ్వాయుధ సామర్థ్యాన్ని, సర్వసన్నద్ధతను చాటేందుకే ఈ పరీక్ష చేపట్టామని యూఎస్ గ్లోబల్ స్ట్రైక్ కమాండ్ కమాండర్ జనరల్ థామస్ బుస్సెయిర్ చెప్పారు. ఇది రొటీన్‌గా చేపట్టే పరీక్ష మాత్రమే తప్ప, ప్రస్తుత ప్రపంచ పరిణామాల నేపథ్యంలో చేపట్టిన చర్య కాదని యూఎస్ మిలటరీ స్పష్టం చేసింది.



సాక్షి హైదరాబాద్



ప్రపంచ స్థాయి నగరంగా హైదరాబాద్

హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దేందుకు ఎన్ని నిధులైనా వెచ్చిస్తామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. -8లో



లైట్ తీస్కో భయ్యా

ఒకప్పుడు టర్కీ వంటకాలంటే లొట్టలేసుకుని తినే సిటీ ఫుడ్ లవర్స్ ఇప్పుడు టర్కీ ఫుడ్ అంటే పీచే ముడ్ అంటున్నారు.

- సిటీప్లస్‌లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.0/24.0

నగరంలో శుక్రవారం ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గరిష్టంగా 32, కనిష్టంగా 24 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముంది.

‘గ్రేటర్’లో అదనపు డీసీపీల బదిలీ

కొత్తగా 12 మంది అధికారులకు పోస్టింగులు

సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్రంలో 30 మంది అదనపు ఎస్పీలను బదిలీ చేస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. వీటిలో 12 స్థానాలు హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండలకు సంబంధించిన అదనపు డీసీపీలవి ఉన్నాయి. హోదా అదనపు, నాన్–క్యాడర్ ఎస్పీలు అయినప్పటికీ కమిషనరేట్లలో అదనపు డీసీపీలుగా పని చేస్తుంటారు. రాజధానిలో పోస్టింగ్ వచ్చిన అదనపు డీసీపీలు వీరే..

పేరు	పోస్టింగ్
ఎస్.ఉదయ్‌రెడ్డి	మాదాపూర్
ఎ.విశ్వప్రసాద్	మేడ్చల్ ఎస్ఓటీ
ఎ.లక్ష్మి	ఎల్బీనగర్ ట్రాఫిక్
మహ్మద్ అష్ఫాఖ్	హైదరాబాద్ సీటీసీ
బి.ఆనంద్	సెంట్రల్ జోన్
ఎ.రాములు	సిటీ ట్రాఫిక్–2
టి.గోవర్ధన్	వెస్ట్ జోన్
కె.శ్రీకాంత్	సౌత్ ఈస్ట్ జోన్
కె.పూర్ణచందర్	శంషాబాద్
జి.హనుమంతరావు	సైబరాబాద్ ట్రాఫిక్
కె.శ్రీనివాసరావు	రాజేంద్రనగర్
ఎం.సుదర్శన్	సిటీ సీసీఎస్

మూడు కార్పొరేషన్లకే మొగ్గు?

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్‌ఎంసీని రెండు లేదా అంతకంటే ఎక్కువ కార్పొరేషన్లుగా విభజించాలని భావిస్తున్న ప్రభుత్వం.. మూడు కార్పొరేషన్లుగా ఏర్పాటు చేసేందుకే మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది.ఇందుకు సంబంధించి తగిన అధ్యయనంతో నివేదిక సమర్పించాల్సిందిగా జీహెచ్‌ఎంసీలో జోనల్ కమిషనర్‌గా ఉన్న ఒక ఐఏఎస్, మరో ఐపీఎస్ అధికారికి బాధ్యతల ప్పగించింది. ఇప్పటికే వారు ఓ దఫా సమావేశమై ఓఆర్ఆర్ వరకున్న పురపాలికలను జీహెచ్‌ఎంసీలో విలీనం చేసే అంశాలు, చట్టపరంగా ఎదురయ్యే సవాళ్ల తదితర అంశాలను బేరీజు వేసినట్లు తెలుస్తోంది. ఇతర విభాగాల అధికారులతోనూ సమావేశాలు నిర్వహించాక మూడు కార్పొరేషన్లపై ఒక నిర్ణయానికి వచ్చే అవకాశముంది. దాదాపు మూడు పోలీస్ కమిషనరేట్ల తరహాలోనే మూడు కార్పొరేషన్లు ఏర్పాటయ్యే అవకాశాలున్నట్లు జీహెచ్‌ఎంసీ వర్గాల ద్వారా తెలుస్తోంది. జీహెచ్‌ఎంసీ పాలకమండలి గడువు వచ్చే ఫిబ్రవరి 10వ తేదీ వరకు ఉంది. ఆ తర్వాత జరగబోయే ఎన్నికలు జీహెచ్‌ఎంసీకి కాకుండా కొత్తగా ఏర్పాటయ్యే కార్పొరేషన్లకే జరగనున్నాయి. ఈ పాలకమండలి గడువు ముగిసేలోగా కొత్త కార్పొరేషన్లకు ఒక రూపు తీసుకువచ్చే యోచనలో ప్రభుత్వం ఉంది.

17 అంశాలకు స్టాండింగ్ కమిటీ ఆమోదం

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశం అజెండాలోని 14 అంశాలతో పాటు మూడు టేబుల్ అజెండా అంశాలు సహా మొత్తం 17 అంశాలకు ఆమోదం తెలిపింది. వీటిలో హైసిటీ ప్రాజెక్టు పనులకు సంబంధించిన భూసేకరణలు, ఆయా ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధికి సంబంధించిన భూసేకరణలు, పార్కుల అభివృద్ధి పనుల్ని సీఎస్సార్ కింద ప్రైవేట్ సంస్థలకు అప్పగింత. వీఎస్టీ వద్ద రెండో దశలో చేపట్టాలనుకున్న సెకండ్ లెవల్ ఫ్లై ఓవర్ ప్రస్తుతానికి ఉపసంహరణ. బాక్స్ డ్రెయిన్ల నిర్మాణం.చిన్న చర్లపల్లిలో రూ.5.50 కోట్లతో హిందూ, ముస్లిం, క్రిస్టియన్ ఆధునిక శ్మశాన వాటిక తదితరాలు ఉన్నాయి. గురువారం మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన సమావేశంలో కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ తదితరులు పాల్గొన్నారు.



అందం.. సంప్రదాయ గంధం

విదేశీ ముద్దుగుమ్మలు ముచ్చటగా బతుకమ్మ ఆడారు. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు వన్నెలద్దారు. గురువారం నగరంలోని శిల్పారామంలో ఇందిరా మహిళా శక్తి బజారును ప్రపంచ సుందరి పోటీదారులు మంత్రి సీతక్కతో కలిసి సందర్శించారు. ఆటాపాటలతో సందడి చేశారు.

మెట్రో డీపీఆర్‌లకు పచ్చజెండా!

మేడ్చల్ కారిడార్‌లో 18, శామీర్‌పేట్‌లో 14 స్టేషన్లు

- నార్త్, ఫ్యూచర్ సిటీ మార్గంలో రోజుకు 3 లక్షల మంది ప్రయాణించేలా..
- రూ.19,579 కోట్లతో హెచ్‌ఏఎంఆర్‌ఎల్ ప్రణాళికలు
- త్వరలో కేంద్రానికి నివేదన: మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి



సాక్షి, సిటీబ్యూరో:

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న మెట్రో రెండో దశలో భాగంగా ‘బి’ విభాగం కింద ప్రతిపాదించిన మూడు కారిడార్‌లకు సమగ్ర ప్రాజెక్ట్ నివేదికలు (డీపీఆర్‌లు) సిద్ధమయ్యాయి. నార్త్‌సిటీలో ప్యారడైజ్ మెట్రో స్టేషన్ నుంచి మేడ్చల్, శామీర్‌పేట్ రూట్‌లలో, శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఫ్యూచర్ సిటీలోని స్కిల్ యూనివర్సిటీ వరకు మూడు కారిడార్‌లలో మెట్రో నిర్మాణానికి రెండో దశలోనే ప్రతిపాదించిన సంగతి తెలిసిందే. మొదటి ఐదు కారిడార్‌లతో పాటు ఈ మూడు కారిడార్‌లను సైతం రెండో దశలో భాగంగా చేపట్టనున్నారు. మొదటి ఐదు కారిడార్‌ల డీపీఆర్‌లు రాష్ట్ర ప్రభుత్వ ఆమోదంతో నాలుగు నెలల క్రితమే కేంద్రానికి అందజేశారు. ‘బి’ విభాగం కింద ప్రతిపాదించిన ఈ మూడు కారిడార్‌ల డీపీఆర్‌లను సైతం రాష్ట్ర ప్రభుత్వ ఆమోదంతో త్వరలో కేంద్రానికి పంపించనున్నట్లు హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రోరైల్ (హెచ్‌ఏఎంఆర్‌ఎల్) ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన డీపీఆర్‌ల వివరాలను వెల్లడించారు. కేంద్రం నుంచి అనుమతి లభించిన వెంటనే పనులు ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. డీపీఆర్‌లను హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్‌మెట్రో రైల్ బోర్డు ఈ నెల 8న ఆమోదించినట్లు ఆయన గుర్తు చేశారు. ఈ మూడు కారిడార్‌ల నిర్మాణం పూర్తయ్యే నాటికి ప్రతిరోజూ సుమారు 3 లక్షల మందికి పైగా రాకపోకలు సాగించే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. 2028 నాటికి రెండో దశలోని అన్ని రూట్లలో 10 లక్షల మందికి పైగా ప్రయాణించే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు.

జేబీఎస్.. మెట్రో హబ్..

జేబీఎస్ ప్యారడైజ్ స్టేషన్ వద్ద అంతర్జాతీయ ప్రమాణాలతో అతిపెద్ద మెట్రో హబ్‌ను నిర్మించనున్నారు. ఇక్కడి నుంచి శామీర్‌పేట్, మేడ్చల్ మార్గాల్లో మెట్రో విస్తరణ చేపట్టనున్నారు. ప్రయాణికులు ఒక కారిడార్ నుంచి మరో కారిడార్‌కు మారేందుకు స్కైవాక్ ఏర్పాటు చేస్తారు. జేబీఎస్ నుంచి మేడ్చల్ వరకు మొత్తం 24.5 కిలోమీటర్ల మార్గంలో 18 స్టేషన్లు అందుబాటులోకి రానున్నాయి. అలాగే జేబీఎస్ నుంచి శామీర్‌పేట్ వరకు 22 కి.మీల కారిడార్‌లో 14 మెట్రో స్టేషన్లను ఏర్పాటు చేస్తారు. మెట్రో రెండో దశలో ‘బి’ విభాగం కింద రు.19,579 కోట్ల అంచనా వ్యయంతో 86.1 కి.మీ పొడవు గల జేబీఎస్– మేడ్చల్, జేబీఎస్– శామీర్‌పేట్, ఎయిర్‌పోర్ట్– ఫ్యూచర్ సిటీ మెట్రో రెండో దశ (బి) కారిడార్లకు డీపీఆర్‌లను రూపొందించినట్లు ఎన్వీఎస్ రెడ్డి వెల్లడించారు.

రూ.43,579 కోట్ల వ్యయంతో 8 కారిడార్‌లు

మెట్రో రెండో దశలో ప్రభుత్వం మొదట 76.4 కిలోమీటర్లతో 5 కారిడార్‌ల నిర్మాణానికి సమగ్రమైన ప్రాజెక్టు నివేదికను తయారు చేసి రాష్ట్ర ప్రభుత్వ ఆమోదంతో కేంద్రానికి అందజేశారు. కేంద్రం నుంచి ఆమోదం లభిస్తే ఈ ప్రాజెక్టు పట్టాలెక్కనుంది. సుమారు రూ.24 వేల కోట్ల అంచనాలతో రెండో దశలో మొదటి 5 కారిడార్‌లను ప్రతిపాదించారు. ప్రస్తుతం మరో 3 కారిడార్‌లకు డీపీఆర్‌లు పూర్తయ్యాయి. రెండోదశ కింద ప్రతిపాదించిన మొత్తం 8 కారిడార్‌లలో సుమారు 162 కి.మీల నిర్మాణానికి రూ.43,579 కోట్ల వ్యయం కానుంది. ఇది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ప్రాజెక్టు. కానీ.. కేంద్ర కేబినెట్ దీనిపై దృష్టి సారించినప్పుడే కీలకమైన ముందడుగు పడ్డట్లుగా భావించాలి.

‘కబ్జా’స్థాన్!

- స్థానికుల ఫిర్యాదుతో రంగంలోకి హైడ్రా
- పునాదులతో పాటు ప్రహరీ కూల్చివేత
- పీర్జాదిగూడ కంచ పర్వతాపూర్‌లో ఘటన

శ్మశానాన్ని ఆక్రమించి మరీ అక్రమ లేఔట్



సాక్షి, సిటీబ్యూరో: ప్రభుత్వ స్థలాలు, ప్రజావసరాలకు ఉద్దేశించిన భూములు, పార్కులు, రహదారుల్నే కాదు చివరకు శ్మశానాలను సైతం కబ్జాదారులు వదలట్లేదు. కరోనా కాలాన్ని తమకు అనువుగా మార్చుకున్న ఓ వ్యక్తి పీర్జాదిగూడ పరిధిలోని కంచ పర్వతాపూర్‌లో ఉన్న శ్మశానాన్ని ఆక్రమించి అక్రమ లేఔట్ వేశాడు. ఈ వ్యవహారంలో పీర్జాదిగూడ మాజీ మేయర్, కో–ఆప్షన్ సభ్యులకు పాత్ర ఉందని స్థానికులు ఫిర్యాదు చేయడంతో రంగంలోకి దిగిన హైడ్రా అధికారులు రికార్డులు పరిశీలించారు. బుధవారం కమిషనర్ ఏవీ రంగనాథ్ స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటించి విషయం నిర్ధారించారు. ఆయన ఆదేశాల మేరకు ప్రత్యేక బృందాలు గురువారం అక్రమ లేఔట్‌లోని పునాదులు, ప్రహరీని కూల్చేశారు. హైడ్రా అధికారుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.

ఇదీ కబ్జా కమామీషు..

కంచ పర్వతాపూర్‌లో మైనారిటీలకు సంబంధించి రెండు శ్మశాన వాటికలు ఉన్నాయి. వీటిని కబ్జా చేసి కొందరు ప్లాట్లుగా విక్రయించారని శ్మశాన పరిరక్షక ప్రతినిధులు ప్రజావాణి ద్వారా హైడ్రాకు ఫిర్యాదు చేశారు. స్థానికుడైన సుఖేందర్ రెడ్డికి సర్వే నం.12లో సొంత భూమి, పక్కనే సర్వే నెం.1లో ప్రభుత్వ భూమి ఉన్నాయి. ప్రభుత్వ భూమిలో ఉన్న శ్మశాన వాటికల స్థలాన్ని కూడా కబ్జా చేసిన సుఖేందర్‌రెడ్డి లేఔట్ వేశారు. సమాధులపై మట్టి పోసి వాటిని కనిపించకుండా చేశారు. పీర్జాదిగూడ మాజీ మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి, కో–ఆప్షన్ మాజీ సభ్యుడు జగదీశ్వర్ రెడ్డితో కుమ్మక్కైన సుఖేందర్‌రెడ్డి కబ్జాలకు పాల్పడ్డారు. కరోనా సమయంలో ఈ తతంగం మొత్తం నడిచింది. ఈ లేఔట్ వివాదం తెలిసినప్పటికీ రజనీకాంత్ రెడ్డి అనే వ్యక్తి 200 గజాల ప్లాట్ కొన్నారు. అక్కడ మూడు షాపులు నిర్మించి అద్దెకు ఇచ్చారు.

లేని కేసులు ఉన్నాయని చెబుతూ...

శ్మశాన స్థలాన్ని కబ్జా చేసి.. లేఔట్ వేసిన సుఖేందర్‌రెడ్డి ఎవరూ అందులోకి వెళ్లకుండా కోర్టు కేసులు ఉన్నాయని నమ్మించారు. అక్కడి 15 ప్లాట్ల ప్రహరీల మీద తప్పుడు రిట్ పిటిషన్ నంబర్లను రాయించారు. అటువైపు తాము వెళ్లకుండా అడ్డుకోవడానికే ఇలా చేశారని స్థానికులు ప్రజావాణిలో పేర్కొన్నారు. సుఖేందర్ తన సొంత భూమికి సంబంధించిన సర్వే నంబరు శ్మశానానికి సంబంధించిందని అంటూ చూపించి అనుమతులు తీసుకోవడంతో పాటు అక్రమ కట్టడాలు కట్టారు. ఈ అనుమతులు రావడంలో అప్పటి మేయర్, కో–ఆప్షన్ మెంబర్ సహకరించారని ఫిర్యాదుదారులు ఆరోపిస్తున్నారు. ఇలా వచ్చిన ఫిర్యాదులను హైడ్రా కమిషనర్ రంగనాథ్ గూగుల్ మ్యాప్స్, ఎన్నారెస్సీ ఇమేజ్‌లు, రెవెన్యూ రికార్డుల ఆధారంగా పరిశీలించారు. క్షేత్రస్థాయికి వెళ్లిన అధికారులు అక్కడ సమాధులు కనిపించకకుండా మట్టితో కప్పినట్లు గుర్తించారు.

సామాన్ల తరలింపునకు సమయం ఇచ్చి..

శ్మశాన వాటికలో ఉన్న ఆక్రమణల తొలగింపునకు గురువారం ఆదేశాలు జారీ అయ్యాయి. దీంతో అధికారులు, సిబ్బంది ఉదయం అక్కడికి చేరుకున్నారు. మూడు షాపుల యజమానులు తమ సామాన్లను తరలించడానికి సమయం కావాలని కోరగా... అంగీకరించిన హైడ్రా సిబ్బంది సహాయం చేశారు. మొత్తం సామాన్లు వాహనాలోకి ఎక్కించిన తర్వాత ఆ షాపులను కూడా హైడ్రా తొలగించింది. 200 గజాల్లో ఉన్న మూడు దుకాణాలతో పాటు, పునాదులు వేసి రెండు మీటర్ల ఎత్తులో నిర్మించిన 15 ప్లాట్ల ప్రహరీలను హైడ్రా తొలగించింది. ఈ కూల్చివేతలపై సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న దుష్ప్రచారాన్ని హైడ్రా ఖండించింది. అక్కడి షాపులు అద్దెకు తీసుకున్న వారికి ఈ వివాదాలేవీ తెలియవని స్పష్టం చేసింది.

తొలిరోజే.. విద్యార్థికి అందేలా..

- నేటి నుంచి ప్రభుత్వ బడులకు పాఠ్య పుస్తకాల సరఫరా

సాక్షి, సిటీబ్యూరో: నూతన విద్యా సంవత్సరం తొలి రోజే విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను అందజేసేలా చర్యలు ముమ్మరం చేశారు. శుక్రవారం నుంచి పాఠశాలలకు పుస్తకాల సరఫరా ప్రక్రియ చేపట్టేందుకు విద్యాశాఖ యంత్రాంగం సిద్ధమైంది. ఇప్పటికే పుస్తక ముద్రణాలయం నుంచి ప్రధాన గోదాములకు పాఠ్యపుస్తకాలు స్టాక్ చేరడంతో ఎమ్మార్సీ పాయింట్లకు చేరవేస్తోంది. అక్కడి నుంచి జూన్ 12 నాటికి పాఠశాలలకు పూర్తిస్థాయి ఇండెంట్ సరఫరా జరిగే విధంగా చర్యలకు ఉపక్రమించింది.

27.5 లక్షల పాఠ్య పుస్తకాలు

- గ్రేటర్‌లోని హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల పరిధిలో మొత్తం 2,515 సర్కారు బడులు ఉండగా.. వీటిలో సుమారు 3.41 లక్షల మంది విద్యార్థులున్నారు. 2025–26 విద్యా సంవత్సరానికి సుమారు 27.5 లక్షల పాఠ్యపుస్తకాలు అవసరం. ఇండెంట్ ప్రకారం ఇప్పటివరకు ప్రధాన గోదాముకు 80 శాతం వరకు పాఠ్యపుస్తకాలు చేరుకున్నట్లు సమాచారం.



- హైదరాబాద్ జిల్లాలోని సర్కారు స్కూళ్లలో ప్రస్తుతం 2 నుంచి 10వ తరగతి వరకు 1,07,947 మంది విద్యార్థులున్నారు. ఈసారి కొత్తగా ఒకటో తరగతిలో 2 నుంచి 3 వేల మంది చేరే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీంతో ఈసారి 12.50 లక్షల పుస్తకాల ఇండెంట్ పెట్టారు. అందులో ఇప్పటివరకు 8.40 లక్షలు ఎమ్మార్సీలకు చేరాయి.

పుస్తకాల మోత తగ్గించేందుకు..

విద్యార్థులకు మోత భారం తగ్గించేందుకు తక్కువ బరువు కలిగిన కాగితంతో పాఠ్యపుస్తకాలు ముద్రించారు. మరోవైపు ప్రభుత్వ బడులకు సరఫరా చేసే పుస్తకాలు పక్కదారి పట్టకుండా ప్రతి దానిఈ వరుస సంఖ్య 'క్యూ ఆర్ కోడ్' ఏర్పాటు చేశారు.

డిజిటల్ అరెస్టు పేరుతో బెదిరించి రూ.2.18 కోట్లు స్వాహా

నగర వృద్ధురాలిని టార్గెట్ చేసిన సైబర్ నేరగాళ్లు



సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని కల్యాణ్‌నగర్‌లో నివసించే వృద్ధురాలిని (86) టార్గెట్ చేసిన సైబర్ నేరగాళ్లు ‘డిజిటల్ అరెస్టు’ చేశారు. మనీలాండరింగ్ కేసు పేరు చెప్పి, మూడు వారాల పాటు బెదిరిస్తూ రూ.2.18 కోట్లు స్వాహా చేశారు. మోసపోయానని గుర్తించిన బాధితురాలు సిటీ సైబర్ క్రైమ్ ఠాణాను ఆశ్రయించడంతో గురువారం కేసు నమోదైంది. వివరాలు ఇలా ఉన్నాయి. గత నెల 17న సదరు వృద్ధురాలికి వాట్సాప్ కాల్ వచ్చింది. అవతలి వ్యక్తి తాను ఎంహెచ్‌ఏ ఉద్యోగి అంటూ పరిచయం చేసుకున్నాడు. మనీలాండరింగ్ ఆరోపణల నేపథ్యంలో డిజిటల్ అరెస్టు చేశానంటూ చెప్పిన అతగాడు ఆ కాల్‌ను మరో కేటుగాడికి బదిలీ చేశాడు. ఆ వ్యక్తి తాను మహారాష్ట్రలోని నాసిక్ డీఐజీ బిస్వాస్ పాటిల్‌గా పరిచయం చేసుకున్నాడు. ఆపై కథ వీడియో కాల్‌లోకి మారింది. నాసిక్‌లోని కెనరా బ్యాంక్‌లో ఉన్న ఓ ఖాతాలోకి మనీ లాండరింగ్‌కు సంబంధించి రూ.2.5 కోట్లు డిపాజిట్ అయ్యాయని, ఈ ఉదంతంతో మొత్తం 249 మందిని అనుమానితులుగా పరిగణించి దర్యాప్తు చేశామని చెప్పాడు. ఈ నేపథ్యంలోనే మీరే ప్రధాన నిందితురాలిగా తేలినట్లు భయపెట్టి ఆమెను డిజిటల్ అరెస్టు చేస్తున్నామంటూ నమ్మించాడు. ఈ కేసు నుంచి బయటపడాలంటూ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) అధికారులు చెప్పినట్లు నడుచుకోవాలని వృద్ధురాలితో చెప్పాడు. ఇది జరిగిన తర్వాత ఆర్బీఐ అధికారినంటూ మరో వ్యక్తి ఆమెకు కాల్ చేశాడు. మీ నిర్దోషత్వం నిరూపితం కావాలంటూ తాము చెప్పిన మొత్తం ఆర్బీఐకి చెందిన ఖాతాల్లోకి బదిలీ చేయాలని, ఆ మొత్తం వివరాలు ఆరా తీసిన తర్వాత నిర్దోషిగా తేలుస్తూ రిఫండ్ కూడా చేస్తామని నమ్మించాడు. వీరి మాటలు నమ్మిన వృద్ధురాలు తన వద్ద ఉన్న మొత్తంతో పాటు ఫిక్స్‌డ్ డిపాజిట్లు సైతం విత్‌డ్రా చేసి రూ.2.18 కోట్లు ఆర్టీజీఎస్ ద్వారా సైబర్ నేరగాళ్లు చెప్పిన ఖాతాలకు బదిలీ చేశారు. ఏప్రిల్ 17 నుంచి మే 7 వరకు నగదు బదిలీ జరిగింది. ఆపై నేరగాళ్ల నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో తాను మోసపోయినట్లు గుర్తించిన బాధితురాలు సిటీ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు కొనసాగుతోంది.

వెలుగులీనేందుకు..

వీధి దీపాల నిర్వహణ కోసం ఈఓఐని ఆహ్వానించిన జీహెచ్‌ఎంసీ

- స్టాండింగ్ కమిటీలో పెండింగ్

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్‌లో ఈఈఎస్‌ఎల్ (ఎనర్జీ ఎఫీషియెన్సీ సర్వీసెస్)కు వీధిదీపాల నిర్వహణ గడువు ముగిసిపోవడంతో కొత్త ఏజెన్సీ నియామకానికి జీహెచ్‌ఎంసీ సిద్ధమైంది. గత ఏప్రిల్ నెలాఖరుతో ఈఈఎస్‌ఎల్ గడువు ముగిసిపోవడంతో అప్పటి నుంచి జీహెచ్‌ఎంసీయే నిర్వహిస్తోంది. కొత్త ఏజెన్సీ నియామకం వరకు మాత్రమే నిర్వహించేందుకు సిద్ధమైన జీహెచ్‌ఎంసీ మరో ఏడేళ్ల కాలపరిమితితో వీధిదీపాల నిర్వహణకు ఆసక్తి వ్యక్తీకరణ(ఈఓఐ) కోరుతూ నోటిఫికేషన్ వెలువరించింది. నిర్వహణలో భాగంగా ప్రస్తుతం ఉన్నట్లు చెబుతోన్న 5.5 లక్షల వీధిదీపాలను దశల వారీగా మార్చడంతో పాటు అవసరమైన ప్రాంతాల్లో కొత్తవి ఏర్పాటు చేసేందుకు, ఆపరేషన్ అండ్ మెయింటనెన్స్ సహా సీసీఎంఎస్ బాక్సులు, మీటర్ నుంచి లైట్స్ వరకు ఫిటింగ్స్,పోల్ బాక్సులు, వాటికి సంబంధించిన ఉపకరణాలు, ఎర్తింగ్ తదితర పనులతో డ్యాష్‌బోర్డు నిర్వహణ పనుల కోసం ఆసక్తి వ్యక్తీకరణలను ఆహ్వానించింది. పరస్పర అవగాహనతో మరో రెండేళ్ల వరకు పొడిగింపు సదుపాయం కూడా ఉంటుందని పేర్కొంది.



గతంలో ఈఈఎస్‌ఎల్‌తో ఒప్పందం

జీహెచ్‌ఎంసీలో వీధిదీపాల నిర్వహణకు ఎల్‌ఈడీ వీధిదీపాల ఏర్పాటు, నిర్వహణ పనులకు 2017 మే 29న జీహెచ్‌ఎంసీ ఈఈఎస్‌ఎల్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. అందుకనుగుణంగా సాధారణ వీధిదీపాల స్థానంలో ఎల్‌ఈడీ దీపాలు ఏర్పాటు చేశారు. వాటితో విద్యుత్ ఖర్చు తగ్గుతుందని పేర్కొన్నారు. మొత్తం 5.5 లక్షల వీధిదీపాలున్నట్లు పేర్కొన్నప్పటికీ క్షేత్రస్థాయిలో ఎన్ని ఉన్నాయో సరైన వివరాలు లేకపోవడంతో ప్రస్తుతం సర్వే నిర్వహిస్తున్నారు. గతంలో కేబుల్స్ జీహెచ్‌ఎంసీ సమకూర్చేది. పోల్స్ ఏర్పాటు పనులు చేసేది. ప్రస్తుతం వాటిని కూడా కలిపి ఆసక్తి వ్యక్తీకరణ నోటిఫికేషన్ వెలువరించింది.

చర్చించిన తర్వాత నిర్ణయం

ఓవైపు ఏజెన్సీల నుంచి ఆసక్తి వ్యక్తీకరణలు ఆహ్వానించినప్పటికీ, మరోవైపు గురువారం జన స్టాండింగ్ కమిటీ అజెండాలో ఈ అంశం ఉంది. ఈఈఎస్‌ఎల్ గడువు ముగిసిపోయినందున కొత్త నిబంధనలతో తిరిగి ఈఈఎస్‌ఎల్‌కే అప్పగించాలా.. లేక కొత్త ఏజెన్సీల కోసం టెండర్లు పిలవాలా? అనే అంశంపై నిర్ణయం కోసం అజెండాలో ఉంచినప్పటికీ, స్టాండింగ్ కమిటీ సభ్యుల అవగాహన కోసం సోమవారం మరోసారి స్టాండింగ్ కమిటీ సభ్యులతో కమిషనర్, సంబంధిత విభాగం అడిషనల్ కమిషనర్ సమావేశమవుతారు. ఈ అంశంపై చర్చించి తగిన నిర్ణయం తీసుకోవాలని భావించి, స్టాండింగ్ కమిటీలో ఈ అంశాన్ని పెండింగ్‌లో ఉంచారు.

30న ఓయూ పీహెచ్‌డీ ఎంట్రన్స్ టెస్ట్ ఫలితాలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పీహెచ్‌డీ కేటగిరీ-2 ఎంట్రన్స్ టెస్ట్-2025 ఈ నెల 30న విడుదల కానున్నాయి. గత నెల 25, 26, 27 తేదీల్లో ప్రవేశ పరీక్షలు జరిగిన విషయం విధితమే. ఈ నెల 2న మొదటి కీ విడుదల అనంతరం జవాబు పత్రాల మూల్యాంకనం ప్రారంభించారు. వచ్చే వారం విడుదల చేయనున్న చివరి విడత కీ పరిశీలించిన అనంతరం ఫలితాలను ప్రకటించనున్నారు.

ఆ సూడో... మాజీ రంజీ ప్లేయర్!

- సీఎం కార్యదర్శి అవతారం ఎత్తింది నాగరాజు
- ప్రముఖులు, అధికారుల పేర్లు చెప్పి మోసాలు
- ఇప్పటి వరకు అతడిపై 29 కేసులు నమోదు
- నిందితుడిని అరెస్టు చేసిన సైబర్ క్రైమ్ పోలీసులు



సాక్షి, సిటీబ్యూరో: 2021లో అప్పటి మంత్రి కేటీఆర్ పీఏగా, 2023లో నాటి ఆంధ్రప్రదేశ్ సీఎం వ్యక్తిగత సహాయకుడిగా అవతారం ఎత్తి పలువురిని మోసం చేసిన మాజీ రంజీ ప్లేయర్ బుడుమూ రు నాగరాజు మళ్లీ అరెస్టయ్యాడు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పీఎస్, ఓఎస్డీగా చెప్పుకుంటూ పలువురు బడా బాబులకు సందేశాలు పంపిన ఆరోపణలపై హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు కటకటాల్లోకి పంపారు. ఇతడిపై ఇప్పటి వరకు 29 కేసులు ఉన్నట్లు డీసీపీ దార కవిత తెలిపారు.

ఉమ్మడి ఆంధ్రా రంజీ జట్టుకు ఎంపికై...

శ్రీకాకుళం జిల్లా, నరసన్నపేటకు చెందిన నాగరాజుకు క్రికెట్‌పై ఆసక్తి ఉండేది. విశాఖపట్నం శివారులోని కూర్మన్నపాలెంలో స్థిరపడిన అతను క్రికెట్‌తో రాణించేందుకు అనేక ప్రయత్నాలు చేశాడు. 2006లో విశాఖ స్టీల్ ప్లాంట్ జోన్ జట్టుకు, ఆపై ఐదు జిల్లాలతో కూడిన నార్త్ జోన్ జట్టుకు ఎంపికయ్యాడు. 2009లో రాష్ట్ర (ఉమ్మడి) స్థాయిలో అండర్-19 కేటగిరీలో ఆడాడు. ఆ తర్వాతి ఏడాది స్టేట్ సౌత్ జోన్‌లో ఎంపికై ఆరు రాష్ట్రాల జట్ల తలపడ్డాడు. ఈ మ్యాచ్‌ల్లో భాగంగా గోవా జట్టుతో ఆడుతున్న సమయంలో నాగరాజు ముక్కుకు తీవ్ర గాయమైంది. దీని ప్రభావంతో అప్పట్లో దాదాపు రెండేళ్ల పాటు క్రికెట్‌కు దూరమైనా ఆ ఆటపై మక్కువ తగ్గలేదు. 'ఇండియన్ ప్రీమియర్ కార్పొరేట్ లీగ్'లో ఎయిర్ ఇండియా టీమ్ తరఫున ఆడాడు. మొత్తం ఎనిమిది మ్యాచ్‌లు ఆడగా... ఓ దాంట్లో 52 బంతుల్లో 106 పరుగులు చేశాడు. దీంతో 2014లో అతడిని సెలెక్టర్లు ఆంధ్రా రంజీ జట్టుకు ఎంపిక చేశారు.

క్రికెట్‌పై మక్కువతో బెట్టింగ్...

నాగరాజు 2016లో ఓ రికార్డు సృష్టించడానికి ప్రయత్నించాడు. 'లాంగెస్ట్ ఇండివిడ్యువల్ నెట్ సీజన్' పేరుతో 82 గంటల పాటు నిర్విరామంగా బ్యాటింగ్ చేయజూశాడు. కేవలం ద్రవ పదార్థాలే తీసుకుంటూ, ప్రతి ఐదు గంటలకు 10 నిమిషాల చొప్పున గ్యాప్ ఇస్తూ దీనిని పూర్తి చేయాలని భావించినా సాధ్యం కాలేదు ఇదిలా ఉండగా... క్రికెట్‌పై ఉన్న మక్కువ కొన్నాళ్లకు బెట్టింగ్స్ వైపు నడిపించింది. తొలినాళ్లల్లో బుకీల వద్దకు వెళ్లి లేదా వారిని సంప్రదించి నేరుగా పందాలు కాసేవాడు. ఆ తర్వాతి కాలంలో ఆన్‌లైన్ బెట్టింగ్ వైపు మొగ్గాడు. తన ఫోన్‌లోనే అనేక బెట్టింగ్ యాప్స్ డౌన్‌లోడ్ చేసుకున్నాడు. ప్రపంచ వ్యాప్తంగా ఎక్కడ, ఎలాంటి మ్యాచ్ జరిగినా ఆన్‌లైన్‌లో బెట్టింగ్ కాస్తున్న నాగరాజు నష్టపోయాడు. ఈ పందాలు కాయడానికి అవసరమైన డబ్బు కోసం మోసాలు మొదలెట్టాడు.

ఇప్పటికే అనేక మందికి టోకరా...

ప్రముఖులు, వారి వ్యక్తిగత సహాయకులు, ఓఎస్డీల అవతారం ఎత్తే ఇతను ఆ పేర్లు చెప్తూ ఇప్పటి వరకు అనేక మందిని మోసం చేశాడు. ట్రూ కాలర్ యాప్‌ను తనకు అనుకూలంగా మార్చుకునే ఇతగాడు అందులో తాను వినియోగిస్తున్న నెంబర్‌ను ఆయా ప్రముఖుల పీఏల పేరుతో ఎంటర్ చేస్తాడు. తమ సంస్థ బ్యాంకు ఖాతా అంటూ సొంతది ఇచ్చి డబ్బు డిపాజిట్ చేయించుకుంటాడు. తాజాగా ప్రముఖుల ఫొటోలను వాట్సాప్ డీపీలుగా పెట్టి, అధికారికం అన్నట్లు ఈ-మెయిల్స్ సృష్టించి మోసాలు చేస్తున్నాడు. తాజాగా ముఖ్యమంత్రి కార్యాలయంలో సీఎం స్పెషల్ సెక్రటరీ, ఓఎస్డీగా ర్యాపిడీ ఎండీ అరవింద్ సంక, గుప్తా రియాల్టీ చైర్మన్ శ్రీనివాస్ గుప్తా, బేకెమ్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ ఎండీ బొలినేటి కృష్ణమోహన్, కంట్రీ డిలైట్ నిర్వాహకులు చక్రధర్, నితిన్ తదితరులకు సందేశాలు పంపాడు. ముఖ్యమంత్రి కార్యాలయంలో సీఎం స్పెషల్ సెక్రటరీగా పని చేస్తున్న బి.అజిత్‌రెడ్డి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు అతడిని అరెస్టు చేశారు.

ప్రపంచ స్థాయి నగరంగా హైదరాబాద్

ఓల్డ్ సిటీపై సమీక్షలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ మహానగరాన్ని ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దేందుకు ఎన్ని నిధులైనా వెచ్చించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిద్ధంగా ఉన్నారని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. గురువారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాష్ట్ర సచివాలయంలో ఓల్డ్‌సిటీ అభివృద్ధి, పురోగతి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, హైదరాబాద్ పార్లమెంట్ పరిధిలోని శాసనసభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్ పార్లమెంటు పరిధిలోని చార్మినార్, మలక్ పేట్, కార్వాన్, యాకుత్ పురా, చాంద్రాయణగుట్ట, బహదూర్‌పురా, నాంపల్లి అసెంబ్లీ నియోజకవర్గాల్లో కొనసాగుతున్న పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ పాత నగరంలో ఉన్న వారసత్వ నిర్మాణాలను కాపాడుకుంటూ అభివృద్ధి చేసుకుందామన్నారు. హైదరాబాద్ నగర అభివృద్ధికి గత బడ్జెట్‌లో రూ. 10వేల కోట్లు కేటాయించామని, ఇంత పెద్ద ఎత్తున నిధులు కేటాయించిన చరిత్ర ముందెన్నడూ లేదన్నారు. హైదరాబాద్ మహానగర అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక‌ను రూపొందించిందని, అందులో భాగంగానే మూసీ పునరుజ్జీవం, మెట్రో రైల్ విస్తరణ, పర్యాటక ప్రాంతాల అభివృద్ధి, తదితర కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ఈ సంవత్సరం కూడా భారీగా నిధులు వెచ్చించి నగరాభివృద్ధిని పరుగులు తీయిస్తామన్నారు. నగర ప్రజల తాగునీటి కోసం రూ. 7400 కోట్లతో గోదావరి నది జలాల తరలింపు పనులు చేపట్టామన్నారు. మెట్రో రైల్ ఏర్పాటు కోసం రోడ్డు విస్తరణ పనులు పాత నగరంలో శరవేగంగా జరుగుతున్నాయన్నారు. రూ. 19,579 కోట్లతో జేబీఎస్ నుంచి మేడ్చల్, జేబీఎస్ నుంచి శామీర్‌పేట, శంషాబాద్ ఎయిర్ పోర్ట్ నుంచి ఫ్యూచర్ సిటీ వరకు మెట్రో రైల్ విస్తరణకు సంబంధించిన ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వానికి పంపించామన్నారు.

పాత నగరంలో ఇప్పటి వరకు 42 విద్యుత్ సబ్ స్టేషన్లు ఉండగా, ఈ ఏడాది అదనంగా 18 సబ్ స్టేషన్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నగరంలో ఇళ్లపై ప్రమాదకరంగా వేలాడుతున్న విద్యుత్ తీగలను సరి చేయాలని ఆదేశించారు. యాకుత్‌పురాలో 50 పడకల ఆసుపత్రి భవన నిర్మాణానికి అవసరమైన స్థలానికి తక్షణమే ఎన్‌ఓసీ ఇవ్వాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్‌ను ఆదేశించారు. అంబేడ్కర్ నాలెడ్జ్ సెంటర్ ఏర్పాటుకు అనువైన ప్రాంతాలను గుర్తించాలని హైదరాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఎమ్మెల్యేలకు సూచించారు. పాతనగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులు నిర్దేశించిన గడువులోగా పూర్తిచేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అగ్నిప్రమాదాల నివారణకు ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కమిటీ వేశారని, ఆ నివేదిక వచ్చిన తర్వాత ప్రభుత్వ నిర్ణయం తీసుకొని చేపట్టే సంస్కరణలకు ప్రజా ప్రతినిధులు, ప్రజలు సహకరించాలన్నారు. పకడ్బందీగా రూపొందించుకున్న ప్రణాళికలతో వేల కోట్లతో ఓల్డ్ సిటీని అభివృద్ధి చేస్తున్నందున ప్రజా ప్రభుత్వానికి హైదరాబాద్ పార్లమెంటు పరిధిలోని ఎంఐఎం ఎమ్మెల్యేలు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో వివిధ విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

రెండేళ్లకు చిక్కాడు..

లైంగిక దాడి కేసులో నిందితుడి రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ సురేష్ కుమార్

జీడిమెట్ల: ప్రేమ పేరుతో ఓ బాలికను నమ్మించి వైజాగ్ తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడిన కేసులో రెండేళ్లుగా తప్పించుకు తిరుగుతున్న నిందితుడిని బాలానగర్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. గురువారం బాలానగర్‌లోని డీసీపీ కార్యాలయంలో డీసీపీ కె.సురేష్‌కుమార్, ఏడీసీపీ సత్యనారాయణ, ఏసీపీ నరేష్‌రెడ్డితో కలిసి వివరాలు వెల్లడించారు. బాలానగర్ ప్రాంతానికి చెందిన బాలిక(13)కు సైనిక్‌పురి యాప్రాల్‌కు చెందిన రాబిన్‌సన్‌తో పరిచయం ఏర్పడింది. సదరు బాలికను ప్రేమిస్తున్నానని నమ్మించిన అతను వైజాగ్ వెళ్లి ఆనందంగా గడుపుదామని అందుకు ఇంట్లో నుంచి డబ్బులు తీసుకురావాలని చెప్పాడు. రాబిన్‌సన్ చెప్పినట్లుగానే సదరు బాలిక రూ. 30 వేలు తీసుకువచ్చింది. దీంతో 2023 మే 22న ఆమెను విశాఖపట్నం తీసుకెళ్లాడు. అక్కడ ఓ గదిలో ఆమెపై రెండుసార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడు. మే 29న ఆమెను సికింద్రాబాద్ తీసుకువచ్చి రైల్వేస్టేషన్‌లో వదిలి అక్కడి నుంచి పరారయ్యాడు. బాధితురాలు తండ్రికి ఫోన్ చేసి చెప్పడంతో అతను కుమార్తెను ఇంటికి తీసుకెళ్లాడు. బాధితురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు రాబిన్‌సన్‌పై కిడ్నాప్, పోక్సో చట్టం కింద కేసులు నమోదు చేశారు. అప్పటి నుంచి అతను పోలీసుల కళ్లుగప్పి తప్పించుకు తిరుగతున్నారు. బుధవారం నిందితుడు రాబిన్‌సన్ సికింద్రాబాద్‌లోని బంధువుల ఇంటి వద్ద ఉన్నట్లు సమాచారం అందడంతో అక్కడికి వెళ్లిన పోలీసులు అతడిని అరెస్టు చేసి గురువారం రిమాండ్‌కు తరలించారు. నిందితుడిని పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఇన్‌స్పెక్టర్ నరసింహరాజు, ఎస్సై వినోద్‌కుమార్, కానిస్టేబుళ్లు ఇష్తేకర్, సి.హెచ్ కృష్ణయ్య, ఎండీ ఖధీర్, బి.శ్రీనివాస్‌లను డీసీపీ అభినందించి రివార్డులు అందజేశారు.

గేదెలను రక్షించేందుకు వెళ్లి..

విద్యుదాఘాతంతో పాడి రైతు దుర్మరణం



శేఖర్ యాదవ్ మృతదేహం

శంషాబాద్ రూరల్: కరెంట్ షాక్ తగిలిన గేదెలను రక్షించేందుకు వెళ్లిన ఓ పాడి రైతు విద్యుదాఘాతంతో మృతి చెందిన సంఘటన శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని తొండుపల్లిలో గురువారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కె.నరేందర్ రెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. తొండుపల్లికి చెందిన పర్లగొల్ల శేఖర్‌యాదవ్ (30) రోజు మాదిరిగానే పశువులను మేపేందుకు గ్రామ శివారులోని పొలం వద్దకు వెళ్లాడు. సమీపంలోని రైతు బక్క రత్నం తన పొలం చుట్టూ ఫెన్సింగ్ అమర్చాడు. పొలంలోని బోరు మోటారుకు కరెంటు కేబుల్‌ను ఫెన్సింగ్ మీద నుంచి ఏర్పాటు చేశారు. కేబుల్ పైభాగం తెలిపోయి ఫెన్సింగ్‌కు విద్యుత్ సరఫరా కావడంతో అటుగా వెళ్లిన గేదెలకు కరెంటు షాక్ తగిలింది. వాటిని కాపాడే ప్రయత్నంలో శేఖర్ విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. అతనితో పాటు రెండు గేదెలు మృత్యువాత పడ్డాయి. అటువైపు వెళ్లిన స్థానికులు దీనిని గుర్తించి అక్కడికి వెళ్లి చూడగా శేఖర్ అప్పటికే మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి విక్రేత అరెస్ట్

ఫిలింనగర్: గంజాయి విక్రయిస్తున్న యువకుడిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళితే..మంగళగిరికి చెందిన రాహుల్ బీటెక్ పూర్తి చేశాడు. ఉద్యోగాన్వేషణలో భాగంగా నగరానికి వచ్చిన అతను కొండాపూర్‌లో ఉంటున్నాడు. ఈజీ మనీ కోసం గంజాయి విక్రయాలకు అలవాటు పడ్డాడు. ఎల్బీనగర్‌కు చెందిన మహేష్ అనే వ్యక్తి నుంచి తరచూ గంజాయి కొనుగోలు చేసి అవసరమైన వారికి విక్రయించేవాడు. బుధవారం రాత్రి అతను ఫిలింనగర్‌లోని కొత్త చెరువు సమీపంలో స్వయంభూ, కుందన్ అనే యువకులకు గంజాయి విక్రయించడగా ఫిలింనగర్ పోలీసులు దాడి చేసి అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి 1.15 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అతను రెండేళ్లుగా మహేష్ నుంచి గంజాయిని కొనుగోలు చేసి కస్టమర్లకు విక్రయిస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. ప్రధాన నిందితుడు రాహుల్‌తో పాటు కొనుగోలుదారులు స్వయంభూ, కుందన్‌లను కూడా అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

లైంగిక దాడి కేసులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అరెస్ట్



నిందితుడు అర్పిత్

ఫిలింనగర్: ప్రేమ, పెళ్లి పేరుతో ఓ యువతిని నమ్మించి ఆమెతో సహజీవనం చేసి మూడుసార్లు అబార్షన్ చేయించి మోసం చేసిన కేసులో నిందితుడైన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌ను ఫిలింనగర్ పోలీసులు గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పసుపులేటి అర్పిత్ అనే వ్యక్తికి రెండేళ్ల క్రితం ఓ యువతితో పరిచయం ఏర్పడింది. ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఆమెతో సహజీవనం చేశాడు. దీంతో ఆమె గర్భం దాల్చగా మూడుసార్లు అబార్షన్ కూడా చేయించాడు. పెళ్లి చేసుకోవాలని నిలదీయగా చిత్రహింసలకు గురి చేశాడు.దీంతో మనస్తాపానికిలోనైన బాధితురాలు గతంలో రెండుసార్లు ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ నేపథ్యంలో ఆమె ఆరోగ్యం పూర్తిగా క్షీణించడంతో నడవలేనిస్థితికి చేరుకుంది. గత కొన్నాళ్లుగా అర్పిత్ మరో యువతితో తిరుగుతున్నట్లు తెలుసుకున్న బాధితురాలు తనకు న్యాయం చేయాలని కోరుతూ అతడి ఇంటికి వెళ్లగా అర్పిత్ కుటుంబ సభ్యులు, బంధువులు ఆమెను తరిమికొట్టారు. ఈ విషయమై బాధితురాలు గతంలో ఫిలింనగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. దీంతో ఆమె ఉన్నతాధికారులను ఆశ్రయించింది. ఉన్నతాధికారుల ఆదేశాలతో స్పందించిన పోలీసులు నిందితుడు అర్పిత్‌ను గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఫిలింనగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గొడవ పడ్డాడనే కోపంతోనే..

- మద్యం మత్తులో గుర్తుతెలియని వ్యక్తి హత్య
- నిందితుడి అరెస్టు

రాంగోపాల్‌పేట్: తనతో గొడవ పడ్డాడనే కోపంతో మద్యం మత్తులో హత్యకు పాల్పడిన వ్యక్తిని గురువారం మహంకాళి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మహంకాళి ఏసీపీ సైదయ్య ఇన్‌స్పెక్టర్ పరశురాం, డీఐ కే ప్రసాద్‌లతో కలిసి వివరాలు వెల్లడించారు. ఈస్ట్‌మారేడుపల్లికి చెందిన శివ అలియాస్ టైల్స్ పనిచేస్తూ జీవనం సాగించేవాడు. మద్యం, గంజాయికి బానిసైన అతను తరచూ కుటుంబ సభ్యులను వేధించేవాడు. ఈ నెల 17న రాత్రి అతను ఎస్డీరోడ్డు మంజు థియేటర్ ప్రాంతంలో సేవించాడు. ఈ సందర్భంగా అక్కడ ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులతో గొడవ పడ్డాడు. వారిలో ఒకరు అక్కడి నుంచి వెళ్లిపోగా మరో వ్యక్తి సమీపంలోని జేకే ఫర్నిచర్ షాప్ ఎదుట నిద్రిస్తున్నాడు. దీనిని గుర్తించిన శివ బండరాయితో అతడి తలపై మోదడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా నిందితుడు శివను గుర్తించి గురువారం అతడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మృతుడు ఎవరనేది తెలియరాలేదని ఏసీపీ తెలిపారు.

హత్య అనంతరం గుడిలో చోరీ

నిందితుడు శివ గుర్తు తెలియని వ్యక్తిని హత్య చేసిన అనంతరం మల్కాజ్‌గిరికి వెళ్లిపోయాడు. అక్కడ ఓ సాయిబాబా దేవాలయంలో విగ్రహాలను చోరీ చేశాడు. అతను గతంలోనూ తుకారంగేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు దేవాలయాల్లోనూ చోరీలకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు.

అద్దానికి తగిలిందని ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి

ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు



రాంబాబుపై ఆటో డ్రైవర్ దాడి చేస్తున్న దృశ్యం

మియాపూర్: మిర్రర్‌కు తగిలిందని ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై ఓ ఆటో డ్రైవర్ దాడికి పాల్పడిన సంఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సదరు ఆటో డ్రైవర్‌పై బాధితుడు గురువారం మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. సీఐ క్రాంతి కుమార్, డ్రైవర్ రాంబాబు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. వనపర్తికి చెందిన రాంబాబు కాచిగూడలో నివాసం ఉంటూ కాచిగూడ ఆర్టీసీ డిపోలో బస్సు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 19న అతను కండక్టర్ రంగ ప్రసాద్‌తో కలిసి సీబీఎస్ నుంచి ఇస్నాపూర్‌కు బస్సు టీఎస్ ప్రయాణికులను తీసుకెళ్తున్నాడు. బొల్లారం క్రాస్ రోడ్డు దాటిన తర్వాత ఓల్డ్ పోలీస్ స్టేషన్ సమీపంలోని బస్టాప్‌లో ప్రయాణికులను దింపేందుకు బస్సు ఆపుతుండగా వెనక నుంచి ఎడమవైపు ట్రాలీ ఆటో దూసుకొచ్చింది. ఆటో డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా బస్సు వెనుకభాగం ఆటో మిర్రర్‌కు తగిలింది. దీంతో సదరు ఆటో డ్రైవర్ బస్సును వెంబడించి మియాపూర్ ఆల్విన్‌క్రాస్ రోడ్డు వద్ద ఆటోను మరో వ్యక్తికి ఇచ్చి రన్నింగ్ బస్సులోకి ఎక్కి డ్రైవర్ రాంబాబు కాలర్ పట్టుకుని దుర్భాషలాడాడు. మైత్రి కమాన్ వద్ద బస్సును పక్కకు ఆపుతుండగా ట్రాలీ ఆటోను బస్సుకు అడ్డుపెట్టిన అతను రాంబాబుపై దాడికి పాల్పడ్డాడు. దీంతో బస్సులోని ప్రయాణికులు జోక్యం చేసుకుని ఆటో డ్రైవర్‌ను మందలించి అక్కడి నుంచి పంపారు. విధి నిర్వహణలో ఉన్న డ్రైవర్‌పై దాడి చేసిన ఆటో డ్రైవర్‌పై గురువారం బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఐటీఐ విద్యార్థి మృతి



అభిషేక్(ఫైల్)

లాలాపేట: రోడ్డు ప్రమాదంలో ఐటీఐ విద్యార్థి మృతి చెందిన సంఘటన ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. ఐడీహెచ్ కాలనీ, న్యూ బోయిగూడకు చెందిన అభిషేక్(19) ఐటీఐ చదువుతున్నాడు. గత నాలుగు రోజుల నుంచి ప్రాక్టికల్స్ కోసం దిల్‌సుఖ్‌నగర్‌కు వెళుతున్నాడు. గురువారం ఉదయం అతను తన స్నేహితుడితో కలిసి బైక్‌పై దిల్‌సుఖ్‌నగర్‌కు వెళ్లి తిరిగి వస్తుండగా మాణికేశ్వర్‌నగర్ కమాన్ వద్ద వెనుక నుంచి వేగంగా వచ్చిన కారు ఢీకొనడంతో వారి బైక్ చెట్టును ఢీ కొంది. ఈ ఘటనలో బైక్ నడుపుతున్న అభిషేక్ తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించిన పోలీసులు మృతుడి తల్లి శిరీష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్ ఉద్యోగిపై దాడి

మాజీ ఉద్యోగితో పాటు మరొకరిపై కేసు నమోదు

బంజారాహిల్స్: ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లో పనిచేసే ఉద్యోగిపై అక్కడి మాజీ ఉద్యోగి తన స్నేహితుడితో కలిసి దాడి చేసిన సంఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే..బంజారాహిల్స్ కేబీఆర్ పార్కు చౌరస్తాలోని టీడీపీ కార్యాలయంలో బొడ్డుపల్లి ప్రశాంత్ వీడియో ఎడిటర్‌గా పనిచేస్తున్నాడు. గతంలో అదే కార్యాలయంలో ప్రవీణ్ అనే వ్యక్తి పనిచేసేవాడు. అతడి ప్రవర్తన సరిగ్గా లేకపోవడంతో విధుల నుంచి తొలగించారు. అక్కడి వెళ్లిపోయిన తర్వాత ప్రవీణ్ తనతో పాటు పనిచేసిన ఓ యువతి ఫోన్ నెంబర్ తన స్నేహితుడు శశికిరణ్‌కు ఇచ్చాడు. గత కొద్ది రోజులుగా శశికిరణ్ సదరు యువతికి మెసేజ్‌లు పెడుతూ వేధిస్తున్నాడు. ఈ విషయం ఆమె ప్రశాంత్ దృష్టికి తీసుకెళ్లడంతో బుధవారం అతను శశికిరణ్‌కు ఫోన్ చేసి అతడిని నిలదీశాడు. ఇకపై ఆమెకు ఫోన్ చేయవద్దని హెచ్చరించాడు. దీంతో కక్ష పెంచుకున్న శశికిరణ్ తన స్నేహితుడు ప్రవీణ్‌తో కలిసి అదే రోజు రాత్రి మాట్లాడదామని ప్రశాంత్‌ను ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్ పక్క గల్లీలోకి పిలిపించాడు. ప్రశాంత్ అక్కడికి రావడంతోనే ఇద్దరి మధ్య మాటామాటా పెరగడంతో శశికిరణ్, ప్రవీణ్ అతడిపై కర్రలు, ఇనుపరాడ్లతో దాడి చేయడమేగాక చంపేస్తామంటూ బెదిరించారు. తీవ్రంగా గాయపడిన అతను చికిత్స నిమిత్తం ఆస్పత్రిలో చేరాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మాజీ ఆర్మీ ఉద్యోగి అరెస్టు

- అధిక వడ్డీ ఆశ చూపించి మోసం
- రూ.4.48 కోట్లు వసూలు చేసి పరారీ
- న్యూఢిల్లీలో అరెస్టు చేసిన సైబరాబాద్ ఈఓడబ్ల్యూ పోలీసులు

సాక్షి, సిటీబ్యూరో: అధిక వడ్డీ ఆశ చూపించి అమాయకుల నుంచి డిపాజిట్లు సేకరించి, మోసం చేసిన మాజీ ఆర్మీ ఉద్యోగిని సైబరాబాద్ ఆర్థిక నేరాల నియంత్రణ విభాగం (ఈఓడబ్ల్యూ) పోలీసులు గురువారం అరెస్టు చేసి, జ్యూడీషియల్ రిమాండ్‌కు తరలించారు. డీసీపీ ప్రసాద్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బీహార్‌కు చెందిన జితేంద్ర కుమార్ చౌబే మాజీ ఆర్మీ ఉద్యోగి. తిరుమలగిరిలోని మిలిటరీ కళాశాలలో ఎలక్ట్రీషన్‌గా పనిచేసి, 2018లో రిటైర్ అయ్యాడు. అనంతరం బొల్లారంలో స్థిరపడ్డాడు. మాజీ ఆర్మీ ఉద్యోగి కావడంతో స్థానికంగా పలువురితో పరిచయాలు ఏర్పడ్డాయి. దీనిని ఆసరాగా చేసుకొని వ్యాపారాన్ని ప్రారంభించాలని నిర్ణయించుకున్న జితేంద్ర అల్వాల్ కేంద్రంగా జేకే ఎంటర్‌ప్రైజెస్, సౌమ్య శ్రీ ఆసుపత్రి, కార్తీక్ లాజిస్టిక్స్ పేర్లతో పలు కంపెనీలను ఏర్పాటు చేశాడు. తన సంస్థలలో పెట్టుబడులు పెడితే అధిక వడ్డీ ఇస్తానని నమ్మించి, అమాయకుల నుంచి పెద్ద మొత్తంలో డిపాజిట్లు సేకరించాడు. నెలకు 5 శాతం వడ్డీ ఆశ చూపించి, రూ.4.48 కోట్లు వసూలు చేశాడు. స్థానికులు, వ్యాపారస్తులతో పాటు మాజీ ఆర్మీ ఉద్యోగులు కూడా అతడి వద్ద పెట్టుబడులు పెట్టారు. వారికి కొన్ని నెలల పాటు వడ్డీ చెల్లించిన జితేంద్ర గత డిసెంబర్‌లో రాత్రికి రాత్రే కంపెనీలను మూసేసి పరారయ్యాడు. దీంతో బొల్లారానికి చెందిన చంద్రావతి అనే బాధితురాలు సైబరాబాద్ ఈఓడబ్ల్యూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సాంకేతిక ఆధారాలతో నిందితుడు న్యూఢిల్లీలో ఉన్నట్లు గుర్తించారు. దీంతో ప్రత్యేక బృందం అక్కడికి వెళ్లి జితేంద్రను అరెస్టు చేసి, ట్రాన్సిట్ వారెంట్‌పై హైదరాబాద్‌కు తీసుకొచ్చారు.

ఆర్టీసీ బస్సు కింద పడి యువకుడి ఆత్మహత్య



సనత్‌నగర్: ఆర్టీసీ బస్సు కింద పడి గుర్తుతెలియని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. రాజేంద్రనగర్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు గురువారం మధ్యాహ్నం సికింద్రాబాద్ వైపు నుంచి పంజగుట్ట వైపు వెళ్తుంది. బస్సు రసూల్‌పురా చౌరస్తాకు చేరుకోగానే గుర్తుతెలియని యువకుడు (25) అకస్మాత్తుగా బస్సు టైర్ల కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో నివ్వెరపోయిన డ్రైవర్, కండక్టర్ కిందకు దిగి అతడిని పరిశీలించగా అప్పటికే మృతి చెందాడు. దీంతో వారు బేగంపేట పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. డ్రైవర్, కండక్టర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పంజగుట్ట ఏసీపీగా మురళీకృష్ణ



పంజగుట్ట: పంజగుట్ట ఏసీపీగా మురళీకృష్ణ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ ఏసీపీగా విధులు నిర్వహించిన మోహన్‌ కుమార్‌ బదిలీపై డీజీపీ కార్యాలయానికి వెళ్లగా, సిరిసిల్ల స్పెషల్‌ బ్రాంచ్‌లో విధులు నిర్వహిస్తున్న మురళీకృష్ణ బదిలీపై పంజగుట్టకు వచ్చారు. 1995 బ్యాచ్‌ ఎస్‌ఐగా విధుల్లో చేరిన ఆయన పలు పోలీస్‌ స్టేషన్‌లల్లో ఎస్‌ఐగా, ఇన్‌స్పెక్టర్‌గా, ఏసీపీగా విధులు నిర్వహించారు. ఎంతో కీలకమైన పంజగుట్ట పోలీస్‌స్టేషన్‌లో నేరాల నియంత్రణకు తనవంతు కృషి చేస్తానని, కిందిస్థాయి సిబ్బంది సహకారంతో విధులు నిర్వహిస్తానని మురళీకృష్ణ తెలిపారు.

మధురానగర్‌ ఎస్‌హెచ్‌వోగా ప్రభాకర్‌



వెంగళరావునగర్‌: మధురానగర్‌ పోలీసు స్టేషన్‌ ఎస్‌హెచ్‌వోగా హెచ్‌.ప్రభాకర్‌ గురువారం బాధ్యతలు స్వీకరించారు. 2009 బ్యాచ్‌కు చెందిన ప్రభాకర్‌ గతంలో చిక్కడపల్లి, సరూర్‌నగర్‌, హయత్‌నగర్‌ ఎస్‌ఐగా, అంబర్‌పేట, ఐటీ సెల్‌ డీఐగా విధులు నిర్వహించారు. అనంతరం సాధారణ బదిలీపై మధురానగర్‌ పీఎస్‌కు ఎస్‌హెచ్‌ఓగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ... శాంతిభద్రతల విషయంలో ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. శాంతిభద్రతలకు ఆటంకం కలిగిస్తే ఎట్టి పరిస్థితుల్లో సహించేది లేదన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి కృషి




జూబ్లీహిల్స్‌ రోడ్డునెంబర్‌-25సీలో పర్యటిస్తున్న కార్పొరేటర్‌ వెల్దండ

ఫిలింనగర్‌: జూబ్లీహిల్స్‌ డివిజన్‌ పరిధిలోని జూబ్లీహిల్స్‌ రోడ్డునెంబర్‌-25సీలో స్థానిక కార్పొరేటర్‌ వెల్దండ వెంకటేష్‌ గురువారం పర్యటించారు. ఇక్కడ రోడ్లు తీవ్రంగా దెబ్బతినడంతో రాకపోకలకు ఇబ్బందికరంగా మారిందని స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. గుంతలమయమైన రహదారులపై నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని వాపోయారు. కార్పొరేటర్‌ స్పందిస్తూ సమస్యను జోనల్‌ కమిషనర్‌కు తెలిపి త్వరలోనే నూతన సీసీ రోడ్ల నిర్మాణం జరిగేలా చూస్తానని తెలిపారు. కార్యక్రమంలో వర్క్‌ ఇన్‌స్పెక్టర్‌ రవి తదితరులు పాల్గొన్నారు.

విద్యా హక్కు చట్టం అమలు చేయాలి

రహమత్‌నగర్‌: ప్రైవేటు పాఠశాలల్లో విద్యా హక్కు చట్టం అమలు కావడం లేదని, ఈ దిశగా ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని జూబ్లీహిల్స్‌ జోన్‌ ఎస్‌ఎఫ్‌ఐ కార్యదర్శి సునిల్‌ డిమాండ్‌ చేశారు. బోరబండలో ఆయన గురువారం మాట్లాడుతూ... ప్రైవేటు పాఠశాలల్లో పేద, మధ్య తరగతి విద్యార్థులకు 25 శాతం ఉచితంగా విద్యా విధానం అమలు చేయాలని డిమాండ్‌ చేశారు. స్కూల్‌ తెరిచేలోపు తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకోకపోతే ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ప్రైవేటు పాఠశాలలు విద్యా హక్కు చట్టం అమలు చేసే వరకు పోరాడతామని సునిల్‌ స్పష్టం చేశారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు



సనత్‌నగర్‌: టమాటా రూ.13, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 18, బెండకాయ 35, పచ్చిమిర్చి 28, బజ్జీమిర్చి 45, క్యాప్సికం 45, పచ్చకాకర 35, పందిరి బీర 35, క్యాబేజీ 13, క్యారెట్‌ 25, దొండ 19, గుండుబీన్స్‌ 95, గింజ చిక్కుడు 65, గోకరకాయ 35, కీర 21, దోసకాయ 18, బీట్‌రూట్‌ 19, ఉల్లిగడ్డ 16, ఆలుగడ్డ 24, చామగడ్డ 33, మొరంగడ్డ 18, కందగడ్డ 60, సొరకాయ 9, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 3-4, ముల్లంగి 5-6. ఈ ధరలు శుక్రవారం ఉదయం 9 గంటల వరకు అమల్లో ఉంటాయి.

రేపు వాహనాల వేలం

అమీర్‌పేట: అమీర్‌పేట ప్రొహిబిషన్‌ ఎక్సైజ్‌ కార్యాలయంలో ఈనెల 24న వాహనాలు వేలం వేయనున్నట్లు ఎక్సైజ్‌ ఇన్‌స్పెక్టర్‌ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పలు కేసుల్లో జప్తు చేసిన వాహనాలు ఉన్నాయని ఉదయం 11 గంటలకు వేలం జరుగుతుందని పాల్గొనేవారు ధరావతు కింద రూ.15 వేలు చెల్లించాలని పేర్కొన్నారు. వేలంలో వాహనాలు దక్కించుకున్న అనంతరం మిగిలిన మొత్తాన్ని 18 శాతం జీఎస్‌టీతో కలిపి చెల్లించి వాహనం తీసుకెళ్లాలని తెలిపారు. వేలంలో పాల్గొని వాహనం దక్కించుకోని వారి డబ్బులు తిరిగి రావాని ఆయన పేర్కొన్నారు.

2380 మంది కొత్త ఓటర్లు

- క్షేత్ర స్థాయిలో పరిశీలన.. జాబితా ప్రక్షాళన
- ఏటా 4 సార్లు ఓటు నమోదుకు అవకాశం



రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తున్న ఖైరతాబాద్‌ నియోజకవర్గ ఆర్‌వో సమ్మయ్య

బంజారాహిల్స్‌: ఓటరు జాబితా ప్రక్షాళనకు ఎన్నికల సంఘం పలు చర్యలు చేపడుతున్నది. తొలుత 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటు నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని రాజకీయ పార్టీల నేతలకు ఎన్నికల సంఘం సూచించింది. ఈ మేరకు నియోజకవర్గాల రిటర్నింగ్‌ అధికారులు వివిధ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహిస్తూ అర్హత ఉన్న ప్రతిఒక్కరినీ ఓటరుగా నమోదు చేయించే బాధ్యతలను తీసుకోవాలని సూచిస్తున్నారు.

- క్షేత్రస్థాయిలో ఓటు నమోదుకు ఎదురవుతున్న ఏవైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకుంటున్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల సలహాలు, సూచనలు కూడా తీసుకుని సంబంధిత బూత్‌ లెవల్‌ ఆఫీసర్లకు ఆ వివరాలను అందజేస్తున్నారు. వాటిని అమలుచేసే బాధ్యతను కూడా సూచిస్తున్నారు.
- ఖైరతాబాద్‌ అసెంబ్లీ నియోజకవర్గం పరిధి కిందికి వచ్చే బంజారాహిల్స్‌, జూబ్లీహిల్స్‌, వెంకటేశ్వరకాలనీ, సోమాజిగూడ, ఖైరతాబాద్‌, హిమాయత్‌నగర్‌ డివిజన్ల పరిధిలో గత జనవరి నుంచి మార్చి వరకు నిర్వహించిన ఓటరు నమోదులో కొత్తగా 2380 మంది ఓటర్లుగా తేల్చారు. ఇందులో పురుషులు 1088, మహిళలు 1290, ఇతరులు ఇద్దరు ఉన్నారు. తాజాగా ఖైరతాబాద్‌ నియోజకవర్గంలో మొత్తం ఓటర్ల సంఖ్య 2,96,965కు చేరింది. ఇందులో సీనియర్‌ సిటిజన్స్‌ 3004, యువ ఓటర్లు 2617, దివ్యాంగులు 1592 మంది ఉన్నారు. ఓటు నమోదుకు ఇంకా అవకాశం కల్పించారు. ఇటీవల ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఖైరతాబాద్‌ అసెంబ్లీ నియోజకవర్గంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో జూబ్లీహిల్స్‌ సర్కిల్‌ డీసీ, ఎన్నికల రిటర్నింగ్‌ అధికారి సమ్మయ్య పలుమార్లు సమావేశాలు నిర్వహించారు.
- గతంలో ఏటా జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండిన వారికి మాత్రమే ఓటు నమోదుకు అవకాశం ఉండేది.
- అయితే ఓటు నమోదును మరింత సులభతరం చేసేందుకు ఏడాదిలో నాలుగుసార్లు అంటే జనవరి, ఏప్రిల్‌, జులై, అక్టోబర్‌ 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండిని ప్రతిఒక్కరూ ఓటు నమోదు చేసుకునేందుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పిస్తున్నది.
- గత నెల ఏప్రిల్‌ 1 నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు నమోదుకు ఫారం-6 ద్వారా సమీపంలోని బీఎల్‌ఓల వద్ద, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటు నమోదు చేసుకునేందుకు ఎన్నికల సంఘం ఏటా నాలుగు సార్లు అవకాశం కల్పిస్తున్నది. ఈ అవకాశాన్ని యువతీయువకులు సద్వినియోగం చేసుకోవాలి. రానున్న జులై 1 నాటికి 18 ఏళ్లు నిండిన వారు సమీపంలోని బీఎల్‌ఓల వద్ద గానీ, ఆన్‌లైన్‌లో గానీ ఫారం-6 ద్వారా ఓటు నమోదుకు దరఖాస్తు చేసుకోవాలి. మరణించిన, వలస వెళ్లిన వారి ఓట్లను తొలగించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం.

– సమ్మయ్య, రిటర్నింగ్‌ అధికారి, ఖైరతాబాద్‌ నియోజకవర్గం

ఎర్రమంజిల్‌ స్కూల్‌ భవనాన్ని సత్వరమే పూర్తిచేయాలి



పాఠశాల భవనాన్ని పరిశీలిస్తున్న విజయారెడ్డి, జాయింట్‌ కలెక్టర్‌, అధికారులు

పంజగుట్ట: జూన్‌లో పాఠశాలలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఎర్రమంజిల్‌ పాఠశాల నూతన భవనాన్ని సత్వరమే పూర్తిచేయాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, ఖైరతాబాద్‌ కార్పొరేటర్‌ విజయారెడ్డి పేర్కొన్నారు. కొత్త పాఠశాల ప్రారంభం కాకముందే పాత పాఠశాల తరగతి గదులు కూలుస్తామంటే ఒప్పుకునేది లేదని ఆమె స్పష్టం చేశారు. సంవత్సరం గడుస్తున్నా ఇంకా పనులు పూర్తి చెయ్యకుండా పాత పాఠశాల కూల్చేస్తే ఇక్కడ చదివే సుమారు 350 మంది విద్యార్థుల పరిస్థితి ఏమిటని విజయారెడ్డి ప్రశ్నించారు. రాత్రిపగలు పనిచేసి పాఠశాల ప్రారంభమయ్యే లోపు పనులు పూర్తి చేయాలని డిమాండ్‌ చేశారు. కొత్త పాఠశాల నిర్మిస్తున్న భవనాన్ని పి.విజయారెడ్డి, జాయింట్‌ కలెక్టర్‌ ముకుంద్‌ రెడ్డి, ఆర్డీవో శ్రీరామ్‌, విద్యాశాఖ అధికారి శామ్యూల్‌, ఎమ్‌ఆర్‌ఓ నయీముద్దీన్‌ గురువారం సందర్శించారు. విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా పనులు పూర్తయ్యే వరకు టెంపర్‌వెరీ షెడ్‌ వేసి పాఠశాల నడిపిద్దామా అనే ప్రతిపాదన తీసుకొచ్చారు. స్కూల్‌ భవనం నిర్మిస్తున్న కాంట్రాక్టర్‌ను పనులు నాణ్యతతో, త్వరగా పూర్తి చేయాలని విజయారెడ్డి ఆదేశించారు.

కేబీఆర్‌ పార్కులో నేలకూలిన చెట్లు

బంజారాహిల్స్‌: బంజారాహిల్స్‌లోని కేబీఆర్‌ పార్కులో బుధవారం రాత్రి కురిసిన వానకు వాక్‌వేలో భారీ చెట్లు నేలకూలాయి. పార్కు లోపల ఉన్న వాక్‌వేలో ఈ భారీ చెట్లు నేలకూలడంతో వాకర్లు ఇబ్బందులు పడ్డారు. వాకర్లు చెట్లు పడిపోయిన విషయాన్ని గుర్తించి అధికారులకు చెప్పడంతో దారికి అడ్డంగా పడిపోయిన చెట్లను పార్కు అధికారులు పక్కకు తప్పించారు.



పార్కులోని వాక్‌వేలో కూలిన చెట్టు

అందాల పోటీలను వ్యతిరేకించాలి

ప్రముఖ కవయిత్రి విమల



సదస్సులో ప్రసంగిస్తున్న ప్రముఖ కవయిత్రి విమల

హిమాయత్‌నగర్‌: అందాల పోటీల్లో స్త్రీలను విలాస వస్తువుగా చూపిస్తున్నారని ప్రముఖ కవయిత్రి విమల ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిని ఎవరూ వ్యతిరేకించకపోవడం బాధాకరమన్నారు. గురువారం రాత్రి బషీర్‌ బాగ్‌ దేశోద్ధారక భవన్‌లో 'అందాల పోటీలు–వ్యాపార సంస్కృతి' అంశంపై మంజీరా రచయితల సంఘం అధ్యక్షుడు కె.రంగాచారి అధ్యక్షతన సామాజిక సదస్సు నిర్వహించారు. ప్రధాన వక్తగా హాజరైన విమల మాట్లాడుతూ... ఒకవైపు రైతులు, విద్యార్థులు, మహిళలు అనేక సమస్యలు ఎదుర్కొంటూటే వాటిని పట్టించుకోకుండా రాష్ట్ర ప్రభుత్వం అందాల పోటీల పేరుతో కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తోందని ఆరోపించారు. కార్పొరేట్‌ శక్తుల వ్యాపారంలో భాగమే ఈ అందాల పోటీలని విమర్శించారు. తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ అధ్యక్షులు నందిని సిధారెడ్డి మాట్లాడుతూ... స్త్రీని అంగడి వస్తువుగా మారుస్తున్న వ్యాపార ప్రపంచంలో ఈ అందాల పోటీలు నిర్వహిస్తున్నారని, దీనికి వ్యతిరేకంగా నిరసన గళం వినిపించాలన్నారు. అందాల పోటీలతో తెలంగాణ ప్రతిష్ఠ పెరగదు, దిగజారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సదస్సులో ప్రముఖ రచయిత దేశపతి శ్రీనివాస్‌, రచయిత్రి ఆర్‌.పద్మజ, అరుణ తదితరులు పాల్గొన్నారు.

సందడిగా తిరంగా ర్యాలీ

ఫిలింనగర్‌: ఆపరేషన్‌ సిందూర్‌ విజయవంతమైన నేపథ్యంలో ఖైరతాబాద్‌ నియోజకవర్గంలోని జూబ్లీహిల్స్‌, సోమాజిగూడ, బంజారాహిల్స్‌ డివిజన్లలో బీజేపీ శ్రేణులు గురువారం తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఫిలింనగర్‌లో తిరంగా ర్యాలీని ఖైరతాబాద్‌ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి యాత్రను ప్రారంభించారు. దీన్‌దయాల్‌నగర్‌ బస్తీ నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ ఫిలింనగర్‌ బస్తీల మీదుగా విగ్రహాల చౌరస్తా వరకు కొనసాగింది. ఈ సందర్భంగా చింతల మాట్లాడుతూ... దేశంలోని ప్రతి పౌరుతూ భారత సైనికులకు మద్దతుగా నిలవాలని ప్రతి ఒక్కరూ జాతీయ స్ఫూర్తిని చాటుకోవాలని కోరారు.



ర్యాలీలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

కేబీఆర్‌ పార్కు చౌరస్తాలో పనిచేయని సిగ్నల్‌



కేబీఆర్‌ పార్కు చౌరస్తాలో పనిచేయని ట్రాఫిక్‌ సిగ్నల్‌

బంజారాహిల్స్‌: బంజారాహిల్స్‌ రోడ్డునెంబర్‌-2లోని కేబీఆర్‌ పార్కు చౌరస్తాలో గురువారం తెల్లవారుజామున 6 గంటల నుంచి ట్రాఫిక్‌ సిగ్నల్స్‌ పనిచేయకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రాత్రి 12 గంటల వరకు కూడా సిగ్నల్‌ చేయలేదు. దీంతో ట్రాఫిక్‌ పోలీసులు తమ చేతులకు పని చెప్పాల్సి వచ్చింది. ఈ చౌరస్తా నుంచి వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. సిగ్నల్స్‌ పనిచేయకపోవడంతో వీటిని నియంత్రించడం ట్రాఫిక్‌ పోలీసులకు నరకప్రాయంగా మారింది. చాలాసార్లు ట్రాఫిక్‌ పోలీసులను కాదని వాహనదారులు అడ్డదిడ్డంగా ముందుకుదూసుకుపోయారు. ట్రాఫిక్‌ను నియంత్రించలేక పోలీసులు పడ్డ బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి సిగ్నల్స్‌కు మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

నేడు జాబ్‌ మేళా

హిమాయత్‌నగర్‌: లక్షియోలా ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో శుక్రవారం నారాయణగూడలోని బాబు జగ్జీవన్‌ రామ్‌ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో జాబ్‌ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ విజయకుమార్‌ తెలిపారు. జెన్‌పాక్ట్‌, అపోలో ఫార్మసీ, సర్‌ టెక్‌ లాంటి పలు 15 కంపెనీల ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూ నిర్వహిస్తారని తెలిపారు. నగరంలోని అన్ని కళాశాలలకు చెందిన డిగ్రీ పూర్తయిన చివరి సంవత్సర విద్యార్థినీ, విద్యార్థులు వారి బయోడేటా, సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు. వివరాలకు ఫోన్‌: 80994 43921లో సంప్రదించాలని కోరారు.

కేఏ పాల్‌ ప్రేయర్‌ను రద్దు చేయాలి

పంజగుట్ట: గ్లోబల్‌ పీస్‌ ప్రెయర్‌ పేరుతో ఈ నెల 24వ తేదీన కె.ఎ.పాల్‌ తలపెట్టిన ప్రేయర్‌ను రద్దు చేసి శాంతిభద్రతలను కాపాడాలని భారత క్రిస్టియన్‌ కౌన్సిల్‌ చైర్మన్‌ బిషప్‌ భాస్కర్‌ ముల్కల తెలిపారు. గురువారం ఖైరతాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ... గ్లోబల్‌ పీస్‌ ప్రేయర్‌ పేరుతో క్రైస్తవులను 24వ తేదీన జింఖానా గ్రౌండ్స్‌కు పిలిపించి ప్రవీణ్‌ పగడాల మృతికి నిరసనగా తెలంగాణ ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టేందుకు క్రిస్టియన్‌లను రెచ్చగొట్టేందుకు చేస్తున్న కుట్రే ఈ ప్రేయర్‌ అని అన్నారు. 197 దేశాల్లో ప్రపంచ శాంతి కోసం ప్రార్థనలు జరుగుతున్నాయి అనడం పూర్తిగా అవాస్తవమన్నారు. కేవలం హైదరాబాద్‌లోని ఇండిపెండెంట్‌ పాస్టర్లకు నగదు పంపిణీ చేసి మీటింగ్‌కు జనాలను తీసుకురావాలని, పాస్టర్ల అందరికీ అమెరికా పాస్‌పోర్టులు, వీసాలు ఇప్పిస్తానని, తనకు రద్దైన ఫారిన్‌ ఫండ్స్‌ను మీ అకౌంట్‌లోకి వేయిస్తానని, అందర్నీ కోటీశ్వరులను చేస్తానని మాయ మాటలు చెపుతూ ప్రజాశాంతి పార్టీలో సభ్యత్వం తీసుకోవాలని ఒత్తిడి చేస్తున్నట్లు ఆరోపించారు. గతంలో కూడా దళిత క్రైస్తవ యువకులకు, విద్యార్థులకు జాబ్‌ వీసాలు ఇప్పిస్తానని జింఖానా గ్రౌండ్స్‌లోనే పీస్‌ ప్రేయర్‌ పేరుతో మీటింగ్‌ ఏర్పాటు చేశారన్నారు. ఆ మీటింగ్‌కు ఎవరూ విదేశీ క్రైస్తవ మిషనరీలు రాలేదని, సభ అనంతరం ఒక్కరికీ వీసాలు ఇవ్వలేదన్నారు. ఈ మీటింగ్‌కు అనుమతి ఇవ్వకూడదని ఇప్పటికే పోలీస్‌ కమిషనర్‌, డీజీపీ, ఉన్నతాధికారులందరికీ వినతిపత్రాలు ఇచ్చామని ఆయన పేర్కొన్నారు.

వివాహితతో అసభ్యకర ప్రవర్తన: యువకుడి అరెస్టు

ఖైరతాబాద్‌: వివాహితతో అసభ్యకరంగా ప్రవర్తించిన ఓ యువకుడిని ఖైరతాబాద్‌ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్‌ఐ నాగరాజు సమాచారం మేరకు... బంజారాహిల్స్‌లో నివాసముండే ఓ వివాహిత(29) మంగళవారం సాయంత్రం మింట్‌ కంపౌండ్‌లోని వీర హనుమాన్‌ దేవాలయానికి వచ్చింది. ఆమె భర్త కోసం పక్కనే ఉన్న లేఖా అపార్ట్‌మెంట్‌ ముందు వేచి చూస్తోంది. అదే సమయంలో ఖైరతాబాద్‌లో నివాసముండే షేక్‌ అబ్దుల్లా(22) ద్విచక్ర వాహనంపై అటుగా వెళ్తూ అక్కడ ఉన్న ఆ మహిళ వద్దకు వచ్చి అసభ్యంగా ప్రవర్తించాడు. అసభ్య పదజాలంతో దూషించాడు. దీంతో ఆ మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు గురువారం ఖైరతాబాద్‌లో నివాసముంటూ సోఫాలను మరమ్మతులు చేసే షేక్‌ అబ్దుల్లాను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ నాగరాజు వివరించారు.

క్రెడిట్ల కుదింపు నిర్ణయంపై ఓయూ ప్రొఫెసర్ల ఆందోళన

ఉస్మానియా యూనివర్సిటీ: డిగ్రీలో ద్వితీయ భాషలుగా కొనసాగుతున్న తెలుగు, హిందీ, సంస్కృతం తదితర సబ్జెక్టుల క్రెడిట్లను 20 నుంచి 12కు కుదింపు నిర్ణయంపై ఓయూ ప్రొఫెసర్లు ఆందోళన వ్యక్తం చేశారు. ఓయూలో డీన్‌ ఫ్యాకల్టీ ఆఫ్‌ ఆర్ట్స్‌, సంస్కృతం విభాగం ఆధ్వర్యంలో గురువారం వేర్వేరుగా జరిగిన అధ్యాపకుల సమావేశంలో రాష్ట్ర ఉన్నత విద్యా మండలి తీసుకున్న క్రెడిట్ల కుదింపు నిర్ణయాన్ని రద్దు చేయాలని కోరారు. క్రెడిట్ల కుదింపును అమలు చేస్తే విద్యార్థులు నష్టపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి క్రెడిట్ల కుదింపు నిర్ణయంపై ప్రకటన చేయాలని కోరారు. ఆర్ట్స్‌ ఫ్యాకల్టీ డీన్‌ ప్రొ. సయ్యద్‌ తలత్‌ సుల్తానా సంస్కృతం విభాగం హెడ్‌ ప్రొ.విద్యానంద్‌ ఆర్యా తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా హనుమాన్‌ జయంతి



నందినగర్‌ ఆంజనేయ స్వామి ఆలయంలో సువర్చలా హనుమాన్‌ కల్యాణోత్సవం



ఫిలింనగర్‌ దైవసన్నిధానంలో తమలపాకులతో అర్చన

బంజారాహిల్స్‌: హనుమాన్‌ జయంతి సందర్భంగా ఆలయాల్లో గురువారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. బంజారాహిల్స్‌ రోడ్‌ నెం. 14లోని నందినగర్‌ శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో సువర్చలా సహిత హనుమత్‌ కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. కల్యాణ దాతలు ఫణిశ్రీ, రత్నాకర్‌ దంపతుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కల్యాణ మహోత్సవాన్ని ఆలయ అర్చకులు మోటుపల్లి శైష శైలాచార్యులు, కిరణ్‌ కుమారాచార్యులు వైభవంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్‌ దశరథ్‌ చౌహాన్‌ స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. స్వామివారి కల్యాణాన్ని వీక్షించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేశారు. ఫిలింనగర్‌ దైవసన్నిదానంలోని శ్రీ దాసాంజనేయ స్వామికి వేకువ జామునే పంచామృతాలతో అభిషేకం, ఆకుపూజలు వైభవంగా నిర్వహించారు.

రహమత్‌నగర్‌, బోరబండ డివిజన్‌లలో...

రహమత్‌నగర్‌: రహమత్‌నగర్‌, బోరబండ డివిజన్‌లలో హనుమాన్‌ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఎస్పీఆర్‌హిల్స్‌ ఇందిరానగర్‌ ఫేజ్‌-2 శివదత్త మారుతి ఆలయంలో పెద్ద ఎత్తున అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. బోరబండ డివిజన్‌లోని సీతారామచంద్ర స్వామి ఆలయాల్లో భక్తులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వెంగళరావునగర్‌లో...

వెంగళరావునగర్‌: హనుమాన్‌ జయంతిని వెంగళరావునగర్‌ డివిజన్‌ జీటీఎస్‌ ఆలయం, సీతారామాంజనేయస్వామి , అభయాంజనేయస్వామి, సాయిబాబా ఆలయాల్లో ఘనంగా నిర్వహించారు. తెలంగాణ పాఠశాల విద్యాశాఖ సమగ్రశిక్ష డైరెక్టర్‌ పి.రాధారెడ్డి దంపతులు, వెంగళరావునగర్‌ కార్పొరేటర్‌ దేదీప్య విజయ్‌ దంపతులు ప్రత్యేక పూజల్లో పాల్గొని స్వామివారికి వడమాల, తమలపాకులు, మిఠాయిలు సమర్పించారు. దేవాదాయ ధర్మాదాయశాఖ ఎగ్జిక్యూటివ్‌ ఆఫీసర్‌ గుమ్మడిదల సుధాకర్‌ ఏర్పాట్లను పర్యవేక్షించారు.



ఎస్పీఆర్‌హిల్స్‌ శివదత్త మారుతి ఆలయంలో...



పూజలు చేస్తున్న కార్పొరేటర్‌ దంపతులు

చెత్తకుప్పలతో నిండిపోతున్న ఫుట్‌పాత్‌లు

ఫిలింనగర్‌: బహిరంగ ప్రదేశాల్లో వేస్తున్న చెత్తను తరలించడంలో జీహెచ్‌ఎంసీ వాహనాలు ఆలస్యంగా వస్తుండటంతో ఒక్కోసారి రెండు రోజుల వరకు కూడా చెత్త కదలడం లేదు. దీంతో ఆయా ప్రాంతల్లో మరింత అపరిశుభ్రంగా కనిపిస్తున్నాయి. జూబ్లీహిల్స్‌ రోడ్‌ నెం. 71లోని భారతీయ విద్యాభవన్‌ స్కూల్‌ రోడ్డులో ఫుట్‌పాత్‌పై వ్యర్థాలు రోజురోజుకు పేరుకుపోతున్నాయి. ఏ రోజుకారోజు వ్యర్థాలు తరలించకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయంటూ స్థానికులు ఫిర్యాదు చేస్తున్నారు. గుర్తు తెలియని వ్యక్తులు రాత్రి వేళల్లో చెత్తను ప్యాకెట్లలో కట్టి విసిరేసి పోతున్నారని వారు వాపోతున్నారు.



భారతీయ విద్యాభవన స్కూల్‌ రోడ్డులో ఫుట్‌పాత్‌పై వ్యర్థాలు

గ్రీన్‌ల్యాండ్స్‌ డివిజన్‌లోని విద్యుత్‌ అధికారుల కొత్త నెంబర్లు

బంజారాహిల్స్‌:

అధికారి హోదా	పేరు	ఫోన్‌ నెంబర్‌
డీఈ (ఆపరేషన్స్‌)	జి.భీమానాయక్‌	87124 69036
ఏడీఈ (ఆపరేషన్స్‌-గ్రీన్‌ల్యాండ్స్‌)	కె.కిషోర్‌కుమార్‌	87124 69038
ఏడీఈ (ఆపరేషన్స్‌-సనత్‌నగర్‌)	పి.వంశీకృష్ణ	87124 69039
ఏడీఈ (సీబీడీ-గ్రీన్‌ల్యాండ్స్‌)	బి.వరణ్‌సింగ్‌	87124 69040
ఏఈ (సీబీడీ-గ్రీన్‌ల్యాండ్స్‌)	ఎం.వేణు	87124 69052
ఏఈ (టెక్నికల్‌-గ్రీన్‌ల్యాండ్స్‌)	యు.కుసుమకుమారి	87124 69037
ఏఈ (ఆపరేషన్స్‌-బేగంపేట)	వి.సాయికుమార్‌	87124 69045
ఏఈ (ఆపరేషన్స్‌-ఎస్సార్‌నగర్‌)	జి.మౌనిక	87124 69043
ఏఈ (ఆపరేషన్స్‌-గ్రీన్‌ల్యాండ్స్‌)	టి.లావణ్య	87124 69047
ఏఈ (ఆపరేషన్స-సనత్‌నగర్‌)	పి.శేఖర్‌	87124 69042
ఏఈ (ఆపరేషన్స్‌-బోరబండ)	ఎన్‌.రంజిత్‌	87124 69051
ఏఈ (ఆపరేషన్స్‌-మోతీనగర్‌)	జీవీఎల్‌ఎస్‌ రాజు	87124 69044
ఏఈ (ఆపరేషన్స్‌-ఎర్రగడ్డ)	యు.తబ్రేజ్‌	87124 69046
ఫ్యూజ్‌ ఆఫ్‌ కాల్స్‌ సెంటర్లు...	బేగంపేట	87124 69097
ఎస్సార్‌నగర్‌		87124 69095
గ్రీన్‌ల్యాండ్స్‌		87124 69093
సనత్‌నగర్‌		87124 69099
బోరబండ		87124 69107
మోతీనగర్‌		87124 69101
ఎర్రగడ్డ		8712 469104
సీఎం క్యాంప్‌ ఆఫీస్‌		87124 69103

నగరంలో నేడు

◆ ఇండో మ్యాచ్ పేరిట బీ2బీ ఇండస్ట్రియల్ మిషనరీ, ఇంజినీరింగ్ ఎక్స్‌పో మాదాపూర్ లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో మధ్యాహ్నం 12.35 గంటల నుంచి అందుబాటులో ఉంటుంది.

◆ మాదాపూర్‌లోని ఇన్నార్బిట్ మాల్‌లో అప్ట్రోనిక్స్ తొలిసారిగా ఆపిల్ ప్రీమియం స్టోర్ మధ్యాహ్నం 12 నుంచి అందుబాటులో ఉంటుంది.

◆ మాదాపూర్‌లోని నోవాటెల్ హోటల్‌లో ఉదయం 11 నుంచి సాయంత్రం 8 గంటలకు హైలైఫ్ ఎగ్జిబిషన్ జరుగుతుంది.

◆ మిస్ వరల్డ్ ప్రారంభ వేడుకల్లో భాగంగా గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జానపద కళాకారుల ప్రదర్శన జరుగుతుంది.

◆ మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళా శక్తి బజార్‌లో చేనేత ఉత్పత్తుల ప్రదర్శన ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది .

◆ మాదాపూర్‌లోని శిల్పారామంలో వేసవి సెలవుల సందర్భంగా ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సమ్మర్ ఆర్ట్ క్యాంప్ జరుగుతుంది.

◆ మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో 7 విజన్స్ పేరిట చిత్ర ప్రదర్శన ఉదయం 10.30 నుంచి రాత్రి 7 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.

◆ శంకరానంద కళాక్షేత్రంలో భరతనాట్యంలో శిక్షణ పొందిన శ్రీనిధి రామస్వామి, శివాని నంబియార్‌లు రవీంద్రభారతిలో సాయంత్రం 6.30 గంటలకు భరతనాట్య అరంగేట్రం చేయనున్నారు.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.comకు మెయిల్ చేయగలరు.

తూకాల్లో మోసాలు.. కానరాని తనిఖీలు

- పాతబస్తీలోని పలు దుకాణాల్లో వ్యాపారుల చేతివాటం
- కొన్ని దుకాణాల వద్ద మాత్రం 'సరైన తూకం'.. బోర్డులు దర్శనం
- పట్టించుకోని తూనికలు, కొలతల శాఖ అధికారులు



ఇసామియా బజార్‌లో మామిడి పండ్ల తోపుడు బండికి కరెక్ట్ వెయిట్ అంటూ బోర్డు

చార్మినార్: పాతబస్తీలోని పలు దుకాణాల్లో తూకాల మోసాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. తనిఖీలు చేయాల్సిన తూనికలు, కొలతల శాఖ అధికారులు మాత్రం మొద్దునిద్ర వీడటంలేదు. ఏడాదికోసారి కూడా పాతబస్తీ వైపు కన్నెత్తి చూడటంలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొన్ని దుకాణాల వద్ద 'కరెక్ట్ వెయిట్'అనే బోర్డులు దర్శనమిస్తున్నాయి. అంటే.. ఇతర దుకాణాల తూకాల్లో మోసాలున్నాయని ఇలాంటి బోర్డులు చెప్పకనే చెబుతున్నాయి కదూ! పాతబస్తీలోని పలు కిరాణా దుకాణాలు, షాపింగ్ మాల్స్‌తోపాటు పండ్ల వ్యాపారులు సైతం తూకంలో మోసాలకు పాల్పడుతున్నారు.

అక్రమ సంపాదనే ధ్యేయంగా...

కొంతమంది నిజాయితీగా వ్యాపారాలను కొనసాగిస్తుండగా... అక్రమ సంపాదనే ధ్యేయంగా మరి కొంత మంది తూకాల్లో మోసాలు చేస్తూ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. అయితే పౌర సరఫరాల శాఖ అధికారులు, తూనికలు, కొలతల శాఖ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించాల్సి ఉండగా, ఆ దిశలో స్పందించడం లేదనే ఫిర్యాదులు ఉన్నాయి. రెండు శాఖల నడుమ సమన్వయలోపం కారణంగా వినియోగదారులు తీవ్రంగా నష్టపోతున్నారు. నిత్యవసర వస్తువులతోపాటు కూరగాయలు, పండ్లు, ఫలాలు, పెట్రోల్ బంకుల్లో సైతం తూకాల్లో వ్యత్యాసం కనబడుతోందని వినియోగదారులు లబోదిబోమంటున్నా పట్టించుకునేవారు కరువయ్యారు.

50–100 గ్రాముల వరకు తరుగు

కిలో బరువుతో ఏదైనా వస్తువు ఖరీదు చేస్తే వినియోగదారుడికి అందులో 50–100 గ్రాముల తరుగు వస్తుంది. ఖరీదు చేసిన వస్తువులను మరోచోట మళ్లీ తూకం వేయించుకునే సౌకర్యాలు అందుబాటులో లేకపోవడంతో వ్యాపారుల మోసాలకు అడ్డూఅదుపూ లేకుండా పోతోంది. అయితే పాతబస్తీలోని చాలామంది వ్యాపారులు ఎలాంటి గుర్తింపు లేని బరువులను మాత్రమే వినియోగిస్తున్నారు. ప్రస్తుతం కొంతమంది వినియోగిస్తున్న బరువుల్లో చాలా వరకు తేడాలు కనిపిస్తున్నాయి. మామిడి పండ్ల సీజన్ కావడంతో పాతబస్తీలోని కొన్ని ప్రాంతాల్లో తక్కువ తూకంతో వ్యాపారాలు కొనసాగుతున్నాయి. రెండు కిలోల మామిడి పండ్లు ఖరీదు చేస్తే, అందులో పావుకిలో తక్కువగా వస్తున్నట్లు వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీరిని కట్టడి చేయాలని కోరుతున్నారు.

తరచూ తనిఖీలు చేయాలి..



వినియోగదారులు తూకాల్లో మోసపోకుండా సంబంధిత తూనికలు, కొలతల శాఖ అధికారులు తరచూ తనిఖీలు చేయాలి. అధికారుల నుంచి గుర్తింపు పొందిన సరైన వేయింగ్‌లను మాత్రమే వినియోగించేటట్లు చూడాలి. అప్పుడే వినియోగదారుడు మోసపోకుండా ఉంటాడు.

– శ్రీకాంత్ గౌడ్, ప్రైవేట్ ఉద్యోగి

ధర తక్కువ చెబుతూ.. తప్పుడు తూకాలు..



మార్కెట్‌లో కొంతమంది తప్పుడు తూకాలనే వినియోగిస్తున్నారు. ఇది జగమెరిగిన సత్యం. తక్కువ ధర చూపెడుతూ తూకాల్లో తరుగు చేస్తుంటారు. తగ్గించి తూకం వేసి అక్రమాలకు పాల్పడుతున్నారు. తనిఖీలు ఉండకపోవడంతో తూకాల్లో మోసాలు జరుగుతున్నాయి.

– అజీజ్, మామిడి పండ్ల వ్యాపారి, ఇసామియా బజార్

మహిళా శ్రామిక శక్తితోనే ప్రగతిశీల దేశం సాధ్యం

ఉపాసన కొణిదెల


ఎఫ్ఎల్ఓ నిర్వహించిన సెషన్‌లో ఉపాసన కొణిదెల

సనత్‌నగర్: బలమైన మహిళా శ్రామికశక్తి ప్రగతిశీల దేశానికి దారితీస్తుందని అపోలో ఫౌండేషన్ వైస్ చైర్‌పర్సన్ ,ప్రముఖ హెల్త్‌కేర్ ఎంటర్‌ప్రెన్యూర్ ఉపాసన కొణిదెల అన్నారు. ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్(ఎఫ్ఎల్ఓ) హైదరాబాద్ చాప్టర్ ఆధ్వర్యంలో 'లెగసీ, లీడర్‌షిప్ అండ్ పర్పస్–ది న్యూ ఏజ్ ఆఫ్ వెల్‌నెస్'అనే అంశంపై గురువారం బేగంపేటలోని ఐటీసీ కాకతీయ హోటల్‌లో ఉపాసనతో ప్రత్యేక ఇంటరాక్టివ్ సెషన్ జరిగింది. ఈ సందర్భంగా ఉపాసన మాట్లాడుతూ తన దృష్టిలో వారసత్వం అంటే ఎక్కువ మంది మహిళలను శ్రామికశక్తి వైపు నడిపించడమేనని అన్నారు. 40 ఏళ్ల క్రితం భారతదేశానికి ఉత్తమ ఆరోగ్య సంరక్షణ సేవలను అందించాలనే సంకల్పంతో హెల్త్‌కేర్ రంగంలోకి అడుగుపెట్టినట్లు చెప్పారు. అయితే ఇకపై ప్రజలను ఆస్పత్రులకు దూరంగా ఉంచడంపై దృష్టి సారించినట్లు తెలిపారు. వ్యాధుల బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకునేలా చేయడమే తమ లక్ష్యమని చెప్పారు. ఆరోగ్య బీమాకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.



మాల్దీవుల అధికారులకు ఎన్ఐఆర్‌డీలో శిక్షణ

ఏజీ వర్సిటీ: రాజేంద్రనగర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీరాజ్(ఎన్ఐఆర్‌డీపీఆర్)లో 30 మంది రిపబ్లిక్ ఆఫ్ మాల్దీవుల అధికారులకు గురువారం శిక్షణ ప్రారంభించారు. ఈ అంతర్జాతీయ శిక్షణా కార్యక్రమాన్ని భారత ప్రభుత్వ విదేశాంగ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఆడిట్ విభాగం గురించి వీరికి అవగాహన కల్పిస్తున్నారు. కంప్ట్రోలర్ జనరల్ ఆఫ్ ఇండియా వారు హైదరాబాద్‌లోని జీహెచ్ఎంసీ ఖైరతాబాద్, శేరిలింగంపల్లి జోన్ కార్యాలయాలకు తీసుకెళ్లి శిక్షణ ఇచ్చారు. వరంగల్, ఇతర పట్టణాలను వారికి చూపించనున్నారు. జిల్లా పరిషత్, మండల పరిషత్, గ్రామ పంచాయతీ స్థాయిలలో జరిగే ఆడిట్‌ల గురించి కూడా వివరిస్తారు. భారతదేశంలోని గ్రామీణ ప్రజల జీవనోపాధి కోసం అమలు చేస్తున్న అన్ని పథకాల డిజిటలైజేషన్ గురించి శిక్షణ ఇవ్వనున్నారు. హైదరాబాద్‌లోని గోల్కొండ, ట్యాంక్‌బండ్, చార్మినార్, రామోజీ ఫిల్మ్ సిటీ లాంటి వివిధ ప్రదేశాలను మాల్దీవుల అధికారులకు చూపించనున్నారు.

తెలంగాణవారికి స్థానికత కల్పించాలి

పంజగుట్ట: తెలంగాణలో సైనిక్ స్కూల్స్ ఏర్పాటు చేసే వరకు ఆంధ్రప్రదేశ్‌లోని సైనిక్ స్కూల్స్‌లో తెలంగాణ వారిని స్థానికులుగా గుర్తించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరారు. స్కూల్స్ అడ్మిషన్స్ కోసం జనవరిలో ఇచ్చిన నోటిఫికేషన్‌లో స్థానికత విషయం పెండింగ్‌లో పెట్టారని, ఏప్రిల్‌లో పరీక్షలు రాసి ఫలితాలు వచ్చే ముందు తెలంగాణ వారిని నాన్ లోకల్‌గా చూస్తామని అక్కడి అధికారులు పేర్కొనడం సరికాదని అన్నారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో క్రాంతి కిన్ ఫౌండేషన్ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో విజయనగరం, చిత్తూరులో మాత్రమే రెండు సైనిక్ స్కూల్స్ ఏర్పాటు చేశారని, తెలంగాణ ఏర్పడి 11 సంవత్సరాలైనా ఒక్క సైనిక్ స్కూల్ కూడా ఇక్కడ ఏర్పాటు కాలేదన్నారు. పరీక్ష కీలో తనకు 300 మార్కులకు 287 మార్కులు వచ్చాయని, ఇప్పుడు ఏపీలో తనను నాన్ లోకల్ అంటే సీటు రాదని అశ్విన్ సాయి అనే విద్యార్థి ఆవేదన వ్యక్తం చేశాడు.

ఏపీ సైనిక్ స్కూల్స్ ప్రవేశాలపై విద్యార్థులు, తల్లిదండ్రుల డిమాండ్


న్యాయం చేయాలంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

నేడు కంటోన్మెంట్ బోర్డు సమావేశం



కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ సమావేశం శుక్రవారం జరగనుంది. బోర్డు అధ్యక్షుడు, బ్రిగేడియర్ ఎస్‌వీ నంజుండేశ్వర ఆధ్వర్యంలో జరిగే బోర్డు సమావేశంలో సీఈఓ మధుకర్ నాయక్, బోర్డు నామినేటెడ్ సభ్యురాలు భానుక నర్మదతో పాటు ప్రత్యేక ఆహ్వానితులుగా ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే శ్రీగణేశ్ పాల్గొననున్నారు. కంటోన్మెంట్ పరిధిలో చేపట్టే అభివృద్ధి పనులు, కీలక టెండర్లు, భవన నిర్మాణ అనుమతులు ఇతరత్రా అంశాలపై సమావేశంలో చర్చించి తీర్మానాలు చేస్తారు. గత నెలలో జరిగిన బోర్డు సమావేశంలో ఆమోదించిన బిల్డింగ్ బైలాస్‌పై ప్రిన్సిపల్ డైరెక్టరేట్ లేవనెత్తిన అభ్యంతరాలపై వివరణాత్మక సమాధానం ఇవ్వడంతో పాటు ఇందుకు సంబంధించిన సవరణలపై బోర్డులో తీర్మానం చేసే అవకాశముంది.

ముగిసిన ఆచార్యుల రాష్ట్రస్థాయి శిక్షణ

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శ్రీ శారదా ధామంలో నిర్వహించిన శిశుమందిర ఆచార్యుల రాష్ట్రస్థాయి శిక్షణ గురువారం ముగిసింది. ముఖ్యఅతిథిగా శ్రీ సరస్వతీ విద్యాపీఠం పాలక మండలి సభ్యులు డాక్టర్ అన్నదానం వెంకట సుబ్రహ్మణ్యం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగంలో ఉన్నత లక్ష్యంతో శ్రీ సరస్వతీ శిశు మందిరాలు ముందుకు సాగుతున్నాయని అన్నారు. దేశానికి, సమాజానికి అవసరమైన, అంకితమైన భావంతో సేవలు, శ్రేష్టమైన పౌరులను శిశుమందిరాలు అందిస్తున్నాయని పేర్కొన్నారు. తరగతి గదులలోనే దేశానికి, సమాజానికి అవసరమైన భవిష్యత్ తరం నిర్మాణం అవుతుందన్నారు. ఆచార్యులు నిరంతర విద్యార్థిగా ఉంటూ వికాసం చెందాలని సూచించారు. కార్యక్రమంలో శ్రీ సరస్వతీ విద్యాపీఠం ప్రాంత అధ్యక్షులు డాక్టర్ తిరుపతిరావు, శ్రీ సరస్వతీ విద్యాపీఠం ప్రాంత సంఘటనా కార్యదర్శి పతకమూరి శ్రీనివాస రావు, శ్రీ సరస్వతీ విద్యాపీఠం ప్రాంత కార్యదర్శి అనఘా వెంకటలక్ష్మీ, ప్రాంత అకాడామిక్ ఇంచార్జీ కృష్ణమాచార్యులు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ జ్వాలా నర్సింహ్మారావు తదితరులు పాల్గొన్నారు.

ఫ్లైట్ ఎక్కిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

- పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ చూపిన వారికి ప్రోత్సాహం
- ఇన్‌స్పెక్టర్ మల్లేష్, సుశీల దంపతుల చొరవ


విమానాశ్రయంలో విద్యార్థులతో మల్లేష్, సుశీల దంపతులు

జీడిమెట్ల: ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ 10వ తరగతి ఫలితాల్లో మంచి ప్రతిభ కనబరిచిన ఆరుగురు విద్యార్థులను జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేష్, సుశీల దంపతులు సొంత ఖర్చులతో బెంగుళూర్ తీసుకెళ్లారు. ఈ ప్రయాణానికి బీటూబీ (బిక్కనూరు టు బెంగుళూర్) అనే పేరు పెట్టారు. వివరాలు...కామారెడ్డి జిల్లా బిక్కనూర్, జంగంపల్లికి చెందిన ఆరుగురు విద్యార్థులు ఇటీవల వెలువడిన 10వ తరగతి పరీక్షల్లో అత్యధిక ప్రతిభ కనబరిచారు. ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేష్ చదివిన ప్రాంతానికి చెందిన పాఠశాల విద్యార్థులు కావడంతో ఆయన వారికి ఏదైనా చేయాలనుకున్నారు. ప్రభుత్వ కాలేజీ లెక్చరర్ అయిన తన భార్య సుశీల సూచన మేరకు బెంగుళూర్‌లోని విశ్వేశ్వరయ్య విజ్ఞాన కేంద్రానికి తీసుకువెళ్లాలని నిర్ణయించారు. వెంటనే ఆరుగురు విద్యార్థులు సహస్ర, స్పందన, వంశిక, సహస్ర, నౌషేన్, మహేష్‌లకు సొంత డబ్బుతో విమాన టికెట్లు బుక్ చేసి శుక్రవారం ఉదయం హైదరాబాద్ విమానాశ్రయం నుంచి విమానంలో బెంగుళూరు తీసుకెళ్లారు. అక్కడ విశ్వేశ్వరయ్య విజ్ఞాన కేంద్రాన్ని చూపించి వారికి మరింత మోటివేషన్ ఇచ్చి తీసుకువచ్చారు. ఈ విషయమై 'సాక్షి'తో ఇన్‌స్పెక్టర్ మల్లేష్, సుశీల దంపతులు మాట్లాడుతూ తాము కూడా అక్కడి ప్రభుత్వ పాఠశాల, కళాశాలల్లో చదివి ఈ స్థాయికి వచ్చామని, ఎంత ఎదిగినా మూలాలు మరవకూడదనే ఇలా చేశామని అన్నారు.

బేగంపేట రైల్వేస్టేషన్ పునఃప్రారంభం

వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని మోదీ

సనత్‌నగర్: ఆధునిక హంగులతో రూపుదిద్దుకున్న బేగంపేట రైల్వేస్టేషన్ పునః ప్రారంభ కార్యక్రమం గురువారం అట్టహాసంగా జరిగింది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ దీనిని వర్చువల్‌గా ప్రారంభించారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్‌యాదవ్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, మాజీ ఎమ్మెల్యేలు మర్రి శశిధర్‌రెడ్డి, చింతల రాంచంద్రారెడ్డి, రైల్వే జీఎం అరుణ్‌కుమార్‌జైన్, ఎస్ఆర్ఎం భరతేష్‌కుమార్ తదితరులు ఈ ప్రారంభోత్సవానికి హాజరై రైల్వేస్టేషన్‌తో పాటు ప్రాంగణంలో కలియదిరిగారు. ప్రారంభోత్సవ వేదికపై సాంస్కృతిక కార్యక్రమాలు దేశభక్తిని చాటాయి. సైనికుల త్యాగాలను స్మరిస్తూ సాగిన నృత్యం అందరిలో జాతీయతను తట్టిలేపింది. 'మేరా అమృత్ స్టేషన్స్', 'ఆపరేషన్ సింధూర్'ఇతివృత్తంతో రైల్వే అధికారులు నిర్వహించిన వ్యాసరచన, డ్రాయింగ్, వక్తృత్వ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

భారీగా తరలివచ్చిన బీజేపీ శ్రేణులు..

ప్రధానమంత్రి నరేంద్రమోదీ వర్చువల్‌గా ప్రారంభించిన బేగంపేట రైల్వేస్టేషన్ వద్దకు బీజేపీ శ్రేణులు భారీగా తరలివచ్చాయి. సికింద్రాబాద్–మహంకాళి జిల్లా అధ్యక్షుడు భరత్‌గౌడ్ ఆధ్వర్యంలో జిల్లాలోని నియోజకవర్గాల నుంచి పెద్ద సంఖ్యలో నేతలు, కార్యకర్తలు స్టేషన్ ప్రాంగణానికి చేరుకున్నారు.


బేగంపేట రైల్వేస్టేషన్‌లో ఏర్పాటైన ఎస్కలేటర్‌పై వెళ్తూ స్టేషన్ అందాలను తిలకిస్తున్న కిషన్‌రెడ్డి, కోమటిరెడ్డి, అనిల్‌కుమార్, కార్పొరేటర్లు

నిలోఫర్‌లో నిర్మాణాలకు అనుమతి ఇవ్వలేదు

జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి వెల్లడి

లక్డీకాపూల్: నిలోఫర్ దవాఖానాలోని పార్క్ స్థలంలో నిర్మాణాలు చేపట్టేందుకు ప్రైవేట్ వ్యక్తులెవరికీ ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆస్పత్రి స్థలంలో ప్రైవేట్ మెడికల్ షాప్ నిర్మాణం కోసం డీఎంఈ, హైదరాబాద్ కలెక్టర్ నుంచి అనుమతులు తీసుకున్నామని నిలోఫర్ ఆస్పత్రి సూపరింటెండెంట్ తెలిపినట్లు తన దృష్టికి వచ్చిందని పేర్కొన్నారు. ఆయా నిర్మాణాలకు అనుమతి ఇచ్చినట్లు సూపరింటెండెంట్ చెప్పినదానిలో వాస్తవంలేదని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ అనుమతి లేకుండా ఎవరైనా నిలోఫర్ ఆస్పత్రిలో నిర్మాణాలు చేపడితే సంబంధిత వ్యక్తులు, అధికారులపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు.

పశువుల అక్రమ రవాణాను అడ్డుకోండి

- నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్
- బక్రీద్ నేపథ్యంలో సమన్వయ సమావేశం



సాక్షి, సిటీబ్యూరో: బక్రీద్ పండుగ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా చూడటంపై హైదరాబాద్ పోలీసులు దృష్టి పెట్టారు. ఇందులో భాగంగా ఇప్పటికే అనేక ప్రాంతాల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేసి పశువుల అక్రమ రవాణాను అడ్డుకోవడానికి తనిఖీలు చేస్తున్నారు. భవిష్యత్తులో తీసుకోవాల్సిన చర్యలపై నగర కొత్వాల్ సీవీ ఆనంద్ గురువారం సమన్వయ సమావేశం నిర్వహించారు. ఇందులో జీహెచ్ఎంసీ కమిషన్ ఆర్‌వీ కర్ణన్‌తోపాటు రవాణా, ఆరోగ్య శాఖ, పశు సంవర్ధక శాఖ అధికారులు, సైబరా బాద్, రాచకొండ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఆనంద్ మాట్లాడుతూ వధకు అనుమతిస్తూ పశువైద్యులు జారీ చేసిన ధ్రువీకరణ పత్రాలు లేకుండా తీసుకు వెళ్తున్న పశువులను అడ్డుకోవడానికి మరికొన్ని చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జంతువులను తీసుకువెళుతున్న వాహనాలను ఆపడానికి, తనిఖీ చేయడానికి ప్రభుత్వ అధికారులకు మా త్రమే అధికారం ఉందని, ఇతరులు ఎవరూ అలాంటి ప్రయత్నాలు చేసి చట్టాన్నిచేతుల్లోకి తీసుకోవద్దని సూచించారు. పండుగ రోజు చెత్త, కళేబరాల సేకరణకు ప్రత్యేక బృందాలను నియమించాలని అన్నారు. పండుగ రోజు నిరంతరం విద్యుత్, నీరు సరఫరా చేయాలని అధికారులకు సూచించారు.

రాష్ట్రానికి రైల్వే కనెక్టివిటీ పెంచాలి

బేగంపేట రైల్వేస్టేషన్ ప్రారంభోత్సవంలో మంత్రి కోమటిరెడ్డి

సనత్‌నగర్: తెలంగాణకు రైల్వే కనెక్టివిటీ పెంచాలని, గ్రామీణ ప్రాంతాలకు అనుసంధానాన్ని పెంచడానికి ఆరు కొత్త రైల్వే లైన్లను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ఆర్ అండ్ బీ, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. బేగంపేట రైల్వేస్టేషన్ పునఃప్రారంభ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. బేగంపేట తరహాలోనే మిర్యాలగూడ, నల్లగొండ రైల్వేస్టేషన్లు కూడా ఆధునీకరించాలని కోరారు. హైదరాబాద్ నుంచి యాదగిరిగుట్ట వరకు ఎంఎంటీఎస్ సౌకర్యం కల్పించాలన్నారు. మౌలిక వసతుల కల్పనలో వేగం పెంచితే తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి మరింత ఊతమిచ్చినట్లు అవుతుందని పేర్కొన్నారు. తెలంగాణకు మరిన్ని నగరాలతో రైల్వే నెట్ వర్క్ కల్పించాలని కోరారు. రీజినల్ రింగ్ రోడ్డు ఏర్పాటుతోపాటు ఈ రింగ్ రైల్ నిర్మాణం కూడా ప్రారంభించాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ, రైల్వేమంత్రి అశ్వినీ వైష్ణవ్‌లకు విజ్ఞప్తి చేశారు. రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన పెంచేందుకు కట్టుబడి ఉందన్నారు. తెలంగాణ అభివృద్ధిలో రీజినల్ రింగ్ రోడ్డు ప్రధానపాత్ర పోషిస్తోందన్నారు. ఈ రీజనల్ రింగ్ రోడ్డు మార్గంలో హైదరాబాద్‌కు లాజిస్టిక్ హబ్ కనెక్టివిటీగా ప్రాంతీయ రింగ్ రైలు మార్గం ఏర్పాటు చేయాలని రైల్వేను అభ్యర్థిస్తున్నట్లు తెలిపారు. భూసేకరణసహా అన్ని సహకారాలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

'నిజాం కాలేజీలో పోలీసు బలగాలను ఉపసంహరించాలి'

గన్‌ఫౌండ్రీ: నిజాం కళాశాలలో పోలీసులను మోహరించడంపై నిజాం కళాశాల ఐక్య వేదిక అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ మేరకు గురువారం నిజాం కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఐక్యవేదిక ప్రతినిధులు మాట్లాడుతూ ఫీజులను వసూలు చేసి పలువురు విద్యార్థులను పరీక్షలకు అనుమతించకపోవడం న్యాయమా అని ప్రశ్నించారు. విద్యార్థులు సమస్యలపై కళాశాల ప్రాంగణంలో శాంతియుతంగా నిరసన తెలుపుతుంటే భద్రతా చర్యల పేరిట భారీ సంఖ్యలో పోలీసు బలగాలను మోహరించడం ఏంటని మండిపడ్డారు. నిజాం కళాశాల పోలీస్ క్యాంప్ కాదన్న విషయాన్ని యాజమాన్యం గుర్తించాలన్నారు. విద్యార్థుల హాల్ టికెట్ల సమస్యను తక్షణమే పరిష్కరించాలని, కళాశాల నుంచి పోలీసులను తక్షణమే వెనక్కి పంపాలని డిమాండ్ చేశారు. ఇటీవల నిజాం కళాశాలలో హాల్ టికెట్ల జారీ విషయంలో ఏర్పడిన వివాదం వల్ల 300 మందికి పైగా విద్యార్థులను పరీక్షలకు అనుమతించని విషయమే విదితమే.

భాగ్యరెడ్డి వర్మ స్ఫూర్తిప్రదాత

మేయర్ గద్వాల్ విజయలక్ష్మి


భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

లక్డీకాపూల్: ప్రముఖ సంఘ సంస్కర్త భాగ్యరెడ్డి వర్మ అడుగుజాడల్లో నడుస్తూ, ఆయన ఆశయాల సాధనకు కృషి చేయాలని నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి పిలుపునిచ్చారు. భాగ్యరెడ్డి 137వ జయంతిని పురస్కరించుకొని జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మేయర్ మాట్లాడుతూ దళిత బాలికలు, విద్యార్థుల అభ్యున్నతికి విశేషంగా కృషి చేసి వైతాళికుడిగా ఆయన ప్రసిద్ధిగాంచారని, ఆయన స్ఫూర్తి ప్రదాత అని కొనియాడారు. 1906–1933 మధ్య హైదరాబాద్ సంస్థానంలో 26 దళిత బాలికల పాఠశాలలను స్థాపించి, వారి అభ్యున్నతికి గట్టి పునాదులు వేశారని పేర్కొన్నారు. సమాజ హితం కోసం ముందుకు సాగేందుకు ఈ వేడుకలు దోహదపడతాయని మేయర్ అన్నారు.

అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి

జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. కమిషనర్ మాట్లాడుతూ భాగ్యరెడ్డి వర్మ అణగారిన వర్గాల అభ్యున్నతికి ఎనలేని కృషి చేశారన్నారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ హేమంత్ సహదేవ్ రావు, అడిషనల్ కమిషనర్లు వేణుగోపాల్, గీతా రాధిక, యాదగిరి రావు పాల్గొన్నారు.

బాలికల విద్య కోసం పాటుపడ్డారు..

స్థానిక కలెక్టరేట్‌లో భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి హైదరాబాద్ అదనపు కలెక్టర్ కదిరవన్ పలని పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దళిత సమాజోద్ధరణ, అంటరానితనం నిర్మూలన, జోగిని వ్యవస్థను తొలగించడానికి పాటుపడ్డారన్నారు. కార్యక్రమంలో షెడ్యూల్డ్ కులాల ఉప సంచాలకులు డాక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జీహెచ్ఎంసీ ఆఫీసులోని విగ్రహాల తరలింపు

ముసుగులో ఉన్నవాటిని తొలగించాలని స్టాండింగ్ కమిటీ నిర్ణయం

సాక్షి, సిటీబ్యూరో: దాదాపు దశాబ్దంన్నర కాలంగా జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ముసుగులతో కప్పి ఉన్న ముగ్గురు నేతల విగ్రహాలను అక్కడి నుంచి తరలించి, సముచిత గౌరవం లభించేలా ఇప్పటికంటే అనువైన ప్రదేశంలో ఏర్పాటు చేయాలని గురువారం జరిగిన స్టాండింగ్ కమిటీ నిర్ణయించింది. ఆ విగ్రహాలున్న ప్రదేశంలో వాటర్ ఫౌంటెయిన్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. రాజకీయ కారణాలతో ఈ విగ్రహాలను ఇన్నేళ్లుగా ముసుగులతో మూసివేశారు. ఈ విగ్రహాలను జీహెచ్ఎంసీ ఆవరణలోనే వేర్వేరు ప్రాంతాల్లో ఉంచేందుకు మేయర్ కొన్ని నెలల క్రితమే ఆలోచనలు చేశారు. జీహెచ్ఎంసీలో గుర్తింపు పొందిన ఐదు యూనియన్ల నేతలతో సంప్రదింపులు జరపగా, అందుకు వారు సుముఖత వ్యక్తం చేశారు. ఆ మేరకు లిఖిత పూర్వకంగా ఇవ్వాలని కోరగా, ఇప్పటికే మూడు యూనియన్లు ఆ పని పూర్తి చేసినట్లు తెలిసింది.

ముసుగులతో అప్రతిష్ట..

జీహెచ్ఎంసీ తూర్పు ప్రవేశ ద్వారం(మేయర్ ఎంట్రెన్స్) వద్ద మహాత్మాగాంధీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డిల విగ్రహాలు ముసుగులు కప్పి ఉన్నాయి. అవి అలా తెల్లగుడ్డతో కప్పబడి ఉండటం వల్ల వాటి గౌరవం దెబ్బతింటోందని, చారిత్రంగా, సాంస్కృతికంగానే కాకుండా భావోద్వేగ పరంగానూ ప్రజలు ఎంతో ప్రాధాన్యం ఇచ్చే ఆ విగ్రహాలు అలా ఉండటం బాగాలేదని, వాటిని గౌరవప్రదమైన, ఇంతకంటే అనుకూలమైన ప్రదేశాలకు తరలించాలని పేర్కొంటూ మేయర్ ఈ నెల 19న జీహెచ్ఎంసీ కమిషనర్‌కు రాసిన లేఖలో పేర్కొన్నారు. ఇటీవల జీహెచ్ఎంసీ పనులకు సంబంధించి సమీక్ష సమావేశానికి హాజరైన మంత్రి పొన్నం ప్రభాకర్ వద్ద కూడా వాటి గురించి ప్రస్తావించినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలోనే మేయర్ కమిషనర్‌కు నోట్ రాసినట్లు తెలుస్తోంది. యూని యన్ నేతలతో సంప్రదింపుల సందర్భంగానూ వాటిని పారదర్శకత, ప్రజా సంప్రదింపుల ద్వారా నేతల గౌరవానికి తగ్గట్లుగా తగిన ప్రదేశాల్లో ఏర్పాటుకు ఏకాభిప్రాయం కుదిరినట్లు సమాచారం. అ యితే జీహెచ్ఎంసీ ఆవరణలోనే మేయర్ ప్రవేశ ద్వారం ఎదుట ఉన్న ఐలాండ్ పార్కుల్లో కానీ, కమిషనర్ ఎంట్రెన్స్ వైపు కానీ అంబేడ్కర్, గాంధీల విగ్రహాలను తరలిస్తారని అంటున్నారు. యూనియన్ నేతలతో సంప్రదింపుల సమయంలోనూ మేయర్ ఇదే విషయాన్ని చెప్పినట్లు సమాచారం. మరోమారు సమావేశమై ఏ విగ్రహం ఎక్కడ ఏర్పాటు చేయాలనే విషయంపై నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది.

ఫ్లాష్‌బ్యాక్..

జీహెచ్ఎంసీ ఏర్పాటుకు కారణమైన వైఎస్ విగ్రహాన్ని ప్రధాన కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేయాలని గతంలో నిర్ణయించారు.2010 సెప్టెంబర్‌లో ఆయన వర్ధంతి నాటికి ఆవిష్కరించాలనుకున్నారు.అప్పటికి పనులు పూర్తి కాలేదు. అనంతరం విగ్రహం పూర్తయ్యాక ఆవిష్కరణకు ఏర్పాట్లు జరుగుతుండగా, అప్పుడు జీహెచ్ఎంసీలో టీడీపీ ఫ్లోర్‌లీడర్‌గా ఉన్న నాయకుడు రాత్రికి రాత్రి మహాత్మాగాంధీ, అంబేడ్కర్ విగ్రహాలను తెప్పించి వైఎస్ విగ్రహానికి చెరోవైపు ఉంచారు. ఆ విగ్రహాలు వైఎస్ విగ్రహం కంటే చిన్నవిగా ఉండటంతో ఆ మూడింటినీ ఆవిష్కరించకుండా ఇన్నాళ్లు ముసుగులతో కప్పేశారు. తర్వాత కొంతకాలానికి అప్పటి మేయర్ బండ కార్తీకరెడ్డి.. వైఎస్సార్ వల్లే తాను మేయర్ కావడం, నగరం అభివృద్ధి చెందుతుండటంతో ఎలాగైనా ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించాలని భావించారు. వైఎస్ విగ్రహాన్ని మేయర్ ప్రవేశ ద్వారం ఎదుట అలాగే ఉంచి, మిగతా విగ్రహాలను వేరే ప్రాంతాల్లో ఆవిష్కరించాలనుకున్నారు. ఆ మేరకు స్టాండింగ్ కమిటీలోనూ తీర్మానం చేశారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, శుక్రవారం, 23, మే, 2025

సందడిగా అచీవర్స్ అవార్డ్స్..

సాక్షి, సిటీబ్యూరో: కేఎల్‌హెచ్ గ్లోబల్ బిజినెస్ స్కూల్ ఆవరణలో నిర్వహించిన అచీమ్‌మెంట్స్ అవార్డ్ సెర్మనీ 2025 సందడిగా సాగింది. ఈ కార్యక్రమంలో భాగంగా చదువుతో పాటు ఇతర రంగాల్లో విద్యార్థుల ప్రతిభను గుర్తించి ధృవీకరణ పత్రాలు అందజేశారు. సర్టిఫికెట్ ఆఫ్ అకడమిక్ ఎక్సలెన్స్, సర్టిఫికెట్ ఆఫ్ అచీమ్‌మెంట్ ఇన్ కోకరిక్యులర్ యాక్టివిటీస్, సర్టిఫికెట్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ ఎక్సలెన్స్, స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్ వంటి విభాగాల్లో విద్యార్థులను సత్కరించారు. యానిమేషన్, గేమింగ్, ఫిన్‌టెక్ వంటి కోర్సులను అభ్యసిస్తున్న విద్యార్థులకు అవార్డులు ప్రదానం చేశారు. కేఎల్‌హెచ్ డీమ్డ్ టు బీ యూనివర్సిటీ వైస్ ప్రెసిడెంట్ కోనేరు లక్ష్మణ్ హవీష్, డీన్ డాక్టర్ ఆనంద్ బేతపూడి పాల్గొన్నారు.







లైట్ తీస్కో భయ్యా..!

నగరంలో టర్కిష్ దేశపు వంటకాలపై బాయ్‌కాట్

'ఇదిగోండి సార్ మీ ఫుడ్...' 'ఏమిటిది?' 'అదే సార్.. మీరు బాగా ఎంజాయ్ చేసే టర్కిష్ డిలైట్' 'సారీ.. నేనిప్పుడు టర్కీ ఫుడ్ తినడం లేదు.. ప్లీజ్ క్యాన్సిల్' 'అదేంటి మీకు ఈ ఫుడ్ అంటే చాలా ఇష్టం కద సార్..' 'లైట్ తీస్కో భయ్యా..!' ప్రస్తుతం ఇలాంటి సన్నివేశాలు నగరంలోని రెస్టారెంట్స్‌లో సర్వ సాధారణంగా మారాయి. ఒకప్పుడు టర్కీ వంటకాలంటే లొట్టలేసుకుని తినే సిటీ ఫుడ్ లవర్స్ ఇప్పుడు టర్కీ ఫుడ్ అంటే పీచే ముడ్ అంటున్నారు. దీంతో గత కొంత కాలంగా టర్కిష్ రుచులపైనే ఆధారపడి వ్యాపారం చేస్తున్న పలు రెస్టారెంట్స్ వెలవెలబోతున్నాయి.

– సాక్షి, సిటీబ్యూరో





నగరంలో గత కొంత కాలంగా టర్కీ వంటకాలకు ఫుల్ డిమాండ్. అత్యంత ఆదరణ పొందుతున్న సిటీలోని విదేశీ క్యుజిన్స్‌లో ఇటలీ వంటకాల తరహాలోనే టర్కీ వెరైటీస్‌కి కూడా మంచి క్రేజ్ ఉంది. దీంతో గత కొన్నేళ్లుగా ప్రత్యేకించి టర్కీ వంటకాలను అందించే రెస్టారెంట్లు నగరమంతా విస్తరించాయి. అయితే తాజాగా సరిహద్దుల్లో సంభవించిన పరిణామాల నేపథ్యంలో బాయ్ కాట్ టర్కీ ఉద్యమంలో నగరంలోని టర్కీ ఫుడ్ లవర్స్ కూడా మేము సైతం అంటున్నారు. టర్కీ పేరుతో ఉన్న వంటకాలను తినబోం అంటూ వారు తెగేసి చెబుతుండడంతో నగరంలో సదరు వంటకాలకు డిమాండ్ సగానికి పడిపోయింది. సోషల్ మీడియాలో వైరల్ అయిన సాన్ సెబాస్టియన్ చీజ్‌కేక్ నుంచి టర్కీ టీ దాకా పేరు వింటనే సై అనే నగరవాసులు ఇప్పుడ నై అంటుండడంతో రెస్టారెంట్ల నిర్వాహకులు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు..

> అతిథులను కన్విన్స్ చేసేందుకు రెస్టారెంట్స్, చెఫ్స్ పాట్లు..

> దశాబ్దాలుగా నగరవాసులకు ఇష్టంగా మారిన టర్కీ డిష్‌లు

> తాజా పరిణామాలతో వీడ్కోలు పలుకుతున్న ఫుడ్ లవర్స్



ఎన్నో కేఫ్స్, రెస్టారెంట్స్..

నగరంలో అత్యంత తొలిగా తుర్కీ వంటకాలు అందించడం ప్రారంభించిన రెస్టారెంట్ బంజారాహిల్స్‌లోని లెవంట్‌గా చెప్పొచ్చు. ఇక్కడి లెవంట్ మషావీ ముషక్కల్, బుర్జ్ దజాజ్, మనకీష్, తజీన్ దజాజ్ వంటివన్నీ నగరవాసుల ఆదరణకు నోచుకున్నవే. అదే విధంగా బెంగళూరు నుంచి వచ్చిన మరో టర్కీ రెస్టారెంట్ కెబెప్సీ సైతం వెరైటీల మెనూతో టర్కీ ఫుడ్ లవర్స్‌కు చిరునామాగా ఉండేది. ఇక్కడి బెయ్తా చికెన్, లాంబ్ మండీ, జిహాన్ కబాబ్ వంటివి బాగా ఫేమస్. ఇక టోలీచౌకిలోని కెబాబ్‌జాదెహ్ సంప్రదాయ టర్కీ వంటకాలకు పేరొందింది. చీజ్ ఖీమా నాన్, గ్రీక్ చికెన్, ఇజ్మిర్ చికెన్, లాంబ్ చాప్స్‌తో నోరురిస్తుంది. టర్కీ టీ, రెడ్ సెంటిల్ సూప్‌లకు పేరొందిన జౌక్, పిలాఫ్ ప్లాటర్, లహ్మకున్ తదితర టర్కీ స్ట్రీట్ ఫుడ్‌కి బెస్ట్‌గా పేరొందింది.

వివిధ వెరైటీలు..

నగరంలోని పలు ప్రాంతాల్లో ఉన్న ఇస్తాంబుల్, టర్కిష్ డిలైట్, టర్కీ మిల్క్ కేక్స్ తదితర టర్కీ స్వీట్స్‌కి కేరాఫ్‌గా నిలిచిన గోర్మేట్ బక్లావా, టర్కీ బ్రేక్ ఫాస్ట్ అందించే జూబ్లీహిల్స్‌లోని కార్డ్ యార్డ్ కేఫ్.. టర్కీ డెజర్ట్ కునాఫాలకు పేరొందిన కెపెన్ కునాఫా, టర్కీ షావర్మాతో ఆకట్టుకునే మల్లేపల్లిలోని టర్కిష్ సెంట్రల్.. కెబాబ్ క్రాలిక్ తదితర రెస్టారెంట్స్, కేఫ్స్ గత కొంత కాలంగా టర్కీ వంటకాలకు పేరొందాయి.



రణ వేళ.. రుచుల వెలవెల..

'టర్కీ వంటకాలు అంటే అక్కడ నుంచి దిగుమతి అయినవి కాదు. కేవలం అక్కడి స్టైల్‌ను అనుసరించి మేము సొంతంగా తయారు చేసేవి మాత్రమే' అంటూ పలు రెస్టారెంట్స్ అతిథులకు, భోజన ప్రియులకు సర్ది చెప్పాల్సిన పరిస్థితి నగరంలో ఏర్పడిందని ఓ చెఫ్ 'సాక్షి'కి వివరించారు. అంతే కాకుండా మెనూలోని వంటకం పేరు ముందు టర్కీ తొలగించడం వంటి మార్పు చేర్పులు కూడా చేసుకుంటున్నామని పలువురు రెస్టారెంట్ నిర్వాహకులు చెబుతున్నారు. ఏదేమైనా.. వంటకాల పట్ల అనూహ్యంగా ఏర్పడిన ఈ వ్యతిరేక ధోరణి కొన్ని రోజులకు సద్దుమణిగిపోతుందని, టర్కీ ఫుడ్‌కి డిమాండ్ ఎప్పటిలా పుంజుకుంటుందని మరికొందరు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

చిన్నారుల ప్రదర్శన సందేశాత్మకం..

పర్యావరణ హితం.. సామాజిక బాధ్యతను గుర్తు చేస్తూ

సందేశాత్మక నృత్యాలతో ప్రతిధ్వనించిన టీజీపీసీబీ ఆడిటోరియం



సనత్‌నగర్: మానవులు, జంతువులు, పక్షులు, సముద్ర జీవులపై ప్లాస్టిక్ కాలుష్యపు వినాశకరమైన ప్రభావాన్ని ఆ చిన్నారులు నృత్యరూపకం ద్వారా నేటి సమాజానికి తెలియజెప్పారు. జీవరాశులకు ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలను తెలియజేస్తూ వాడకాన్ని తగ్గించాలంటూ విద్యార్థుల బృందం చేసిన సందేశాత్మక స్కిట్లు ఆలోచింపజేశాయి. ప్రపంచ పర్యావరణ దినోత్సవం (జూన్ 5) పురస్కరించుకుని తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (టీజీపీసీబీ) ఆధ్వర్యంలో 'విద్యార్థుల నృత్యం: పర్యావరణ సాంస్కృతిక కార్యక్రమం' గురువారం ఉత్సాహంగా జరిగింది. చెట్లను విస్తృతంగా పెంచడం ద్వారా కలిగే ప్రయోజనాలను జానపద నృత్యం ద్వారా చాటిచెప్పారు. ప్లాస్టిక్ కాలుష్యం నివారణతో పాటు గాలి, నీరు సంరక్షణ, మొక్కల పెంపకం, సుస్థిరమైన ప్రజా రవాణా వ్యవస్థను మెరుగుపరచాల్సిన అవసరాన్ని గుర్తుచేశారు. విద్యార్థుల సృజనకు అద్దంపట్టే రీతిలో పర్యావరణ పరిరక్షణపై చేసిన నృత్య ప్రదర్శనకు టీజీపీసీబీ ఆడిటోరియం వీక్షకుల చప్పట్లతో ప్రతిధ్వనించింది. నగరంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు హాజరై కళా ప్రతిభను ప్రదర్శించి ప్రశంసలు పొందారు. జిల్లా సైన్స్ అధికారి ధర్మేందర్ పాల్గొన్నారు.





రానూ.. బొంబైకి రానూ..

- అలరించిన కంటెస్టెంట్ల కళారూపాలు
- టాలెంట్ కాంపిటీషన్ ఫినాలే మొదటి స్థానంలో మిస్ ఇండోనేషియా
- సంప్రదాయ దుస్తుల్లో మెరిసిన భారత్, శ్రీలంక పోటీదారులు



సాక్షి, సిటీబ్యూరో

నగరంలోని శిల్పకళా వేదికగా గురువారం నిర్వహించిన ప్రతిష్టాత్మక 72వ మిస్ వరల్డ్ 2025 వేదిక పై మిస్ వరల్డ్ కంటెస్టెంట్‌లు విభిన్నకళారూపాలతో ఆకట్టుకున్నారు. ఈ టాలెంట్ కాంపిటీషన్ ఫినాలేలో తెలుగు సాంగ్ రాను బొంబైకి రాను అనే సాంగ్‌తో పలువురు ఉర్రూతలూగించారు. 24 దేశాలకు చెందిన కంటెస్టెంట్లు వారి దేశాలకు చెందిన విభిన్న కళలతో అలరించారు. దీంతో పాటు పాటలు, నృత్యాలు, ఇతర సాంస్కృతిక అంశాలు, ఐస్ స్కేటింగ్, డ్యాన్సింగ్, డీజే ప్లేయింగ్ వంటి ప్రదర్శనలిచ్చారు. ఈ టాలెంట్ గ్రాండ్ ఫినాలేలో మిస్ ఇండోనేషియా (పియానో) మొదటి స్థానంలో నిలవగా, మిస్ కామెరూన్ (సింగింగ్) రెండో స్థానంలో, మిస్ ఇటలీ (బ్యాలే నృత్యం) మూడో స్థానంలో నిలిచారు.

- సంప్రదాయ శ్రీలంక సింహళీ నృత్యంతో అలరించారు మిస్ శ్రీలంక. ఒక్క రోజులో తన కోసం సంప్రదాయ డ్రెస్‌ను తన తల్లి డిజైన్ చేసి ఇచ్చినందుకు ఆమె సంతోషాన్ని వ్యక్తం చేశారు.
- ఈ టాలెంట్ గ్రాండ్ ఫినాలేలో భారతీయ కంటెస్టెంట్ మిస్ ఇండియా నందిని గుప్తా బాలీవుడ్ హిట్ సాంగ్ రామ్ లీలా సినిమాలోని దోల్ భాజే సాంగ్ ప్రేక్షకులు, జ్యూరీ సభ్యుల ప్రశంసలు అందుకున్నారు. భారతీయ సంప్రదాయ దుస్తుల్లో నందినీ గుప్తా చేసిన నృత్యం ఆద్యాంతం ఆకట్టుకుంది.
- చివరగా 24 దేశాలకు చెందిన కంటెస్టెంట్లు అద్దాల మేడలున్నవే, రాను బొంబైకి రానూ.. అనే తెలుగు పాటలకు స్టెప్స్ వేస్తూ అదరగొట్టారు.



విజ్ఞాన సముపార్జనే ప్రధానం..

- చిన్నారుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించిన మిస్ వరల్డ్ అభ్యర్థులు
- విక్టోరియా హోమ్ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ సందర్శనలో కంటెస్టెంట్లు



సాక్షి, సిటీబ్యూరో: మిస్ వరల్డ్ అంటే అందమొక్కటే కాదు, అందమైన మనసు కూడా..!! మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొనే ప్రతి ఒక్కరూ ఏదో ఒక సామాజిక సేవ అంశాన్ని, లక్ష్యాన్ని కొనసాగిస్తున్న వారే. ఇందులో భాగంగానే నగరంలోని సరూర్ నగర్ విక్టోరియా హోమ్‌లోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్‌ను సందర్శించి అక్కడి విద్యార్థుల లక్ష్యాలను అడిగి తెలుసుకున్నారు. వాటిని చేరుకోవడానికి అవసరమైన సూచనలిచ్చారు. ప్రతిష్టాత్మక మిస్ వరల్డ్ 2025 పోటీదారులు విక్టోరియా హోమ్ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ విద్యార్థులతో గురువారం ముచ్చటించారు. మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొంటున్న 107 మంది పోటీదారులతో పాటు మాజీ మిస్ వరల్డ్ క్రిస్టినా కలసి విక్టోరియా హోమ్‌ను సందర్శించి ప్రభుత్వ హాస్టల్లో ఉంటున్న విద్యార్థులకు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించారు. కష్టపడే తత్వం, విజ్ఞాన సముపార్జనతో పాటు విద్యలో రాణిస్తేనే భవిష్యత్తు బాగుంటుందని చిన్నారులకు వివరించారు. ఉన్నత స్థానాలకు చేరుకోవాలంటే పటిష్టమైన కలలు ఉంటేనే తమ లక్ష్యాలను చేరుకుంటారని అన్నారు. అనంతరం విక్టోరియా హోమ్ విద్యార్థినులకు బహుమతులతో పాటు వారికి నిత్య జీవితంలో ఉపయోగపడే వస్తువులను మిస్ వరల్డ్ ప్రతినిధులు అందజేశారు. ఈ సందర్భంగా విక్టోరియా హోమ్ విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలను అలకించి అభినందించారు. అందాల తారలు.. ముచ్చటపడి ఆ చిన్నారులతో కలిసి ఆడారు. విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను వారు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మిస్ వరల్డ్ చైర్మన్ మోర్లే, పర్యాటక శాఖ డైరెక్టర్ హనుమంతు, రాచకొండ సీపీ, ఎస్సీ వెల్ఫేర్ అడిషనల్ డైరెక్టర్ ఉమాదేవి శ్రీనివాస్ రెడ్డి, జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్‌లతోపాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మద్యం ముడుపుల డాన్ బాబే

దాన్ని కప్పిపుచ్చుకునేందుకే లిక్కర్ స్కామ్ అంటూ బాబు కుతంత్రం

వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్వజం

- 2019–24 మధ్య మద్యం స్కామ్ జరగకపోయినా.. జరిగినట్లుగా భేతాళ కుట్రలు చేస్తున్నారు
- ఒక్క ఫైలైనా సీఎంవోకు వచ్చినట్లు, సంతకం చేసినట్లు చూపించగలరా?

సాక్షి, అమరావతి: ఏపీలో మద్యం కుంభకోణానికి పాల్పడి ఆ కేసులో బెయిల్‌పై ఉన్న సీఎం చంద్రబాబు దర్యాప్తును నీరుగారుస్తూ గత ప్రభుత్వ పారదర్శక మద్యం విధానంపై అబద్ధపు వాంగ్మూలాలతో తప్పుడు కేసులు బనాయిస్తున్నారని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మండిపడ్డారు. 2019–24 మధ్య అసలు మద్యం స్కామ్ ఎక్కడ జరిగిందో చెప్పాలని సూటిగా ప్రశ్నించారు. భేతాళ కథలు సృష్టించి.. జరగని స్కామ్‌ను జరిగినట్లు చిత్రీకరించి.. ప్రలోభపెట్టి, బెదిరించి, భయపెట్టి లొంగదీసుకున్న వ్యక్తులతో తప్పుడు వాంగ్మూలాలు తీసుకుని.. వాటి ఆధారంగా సంబంధం లేని వ్యక్తులపై తప్పుడు కేసులు పెడుతూ అరాచకంగా వ్యవహరిస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మద్యానికి సంబంధించి ఒక్క ఫైలైనా సీఎంవోకు వచ్చినట్లుగానీ.. సంతకం చేసినట్లుగానీ చూపించగలరా? అంటూ సీఎం చంద్రబాబుకు సవాల్ విసిరారు. ఎవరికైనా లాభాలు వచ్చేలా చేస్తే లంచాలు ఇస్తారేమోగానీ.. పన్నులు బాదేసి, పర్మిట్లు రద్దు చేసి, వారి లాభాలు తగ్గించి, రాష్ట్ర ఖజానాకు ఆదాయం పెంచితే ఎవరైనా లంచాలు ఇస్తారా? అంటూ సూటిగా ప్రశ్నించారు. నిజమైన మద్యం స్కామ్‌స్టర్ చంద్రబాబేనని పునరుద్ఘాటించారు. 2014–19 మధ్య చంద్రబాబు మద్యం కుంభకోణానికి పాల్పడి సాక్ష్యాధారాలతో పట్టుబడ్డారని.. ఆ కేసులో ఆయన బెయిల్‌పై ఉన్నారని గుర్తు చేశారు. ఆ కేసును నీరుగార్చడానికే అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని దుయ్యబట్టారు. అప్పుడు మద్యం కుంభకోణానికి పాల్పడి దోపిడీ చేసిన తరహాలోనే ఇప్పుడూ దోచేస్తున్నారని.. దాన్ని సమర్థించుకోవడానికే 2019–24 మధ్య జరగని మద్యం స్కామ్ జరిగినట్లుగా చిత్రీకరిస్తూ తప్పుడు కేసులు పెట్టి.. సంబంధం లేని వ్యక్తులను వేధిస్తున్నారని మండిపడ్డారు. గురువారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో వైఎస్ జగన్ మీడియాతో మాట్లాడారు. సీసీఐ (కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా) తీర్పు, 2014–15 మధ్య కేబినెట్ ఆమోదం లేకుండా.. ఆర్థిక శాఖ అనుమతి తీసుకోకుండా మద్యంపై ప్రివిలేజ్ ఫీజును రద్దు చేస్తూ సీఎం చంద్రబాబు మూడు చోట్ల సంతకం చేసిన నోట్ ఫైలు.. 2014–19 మధ్య మద్యం అమ్మకాలు పెరిగినా ప్రభుత్వానికి ఆదాయం తగ్గడం లాంటి వాటిని సాక్ష్యాధారాలతో ఎండగడుతూ టీడీపీ కూటమి ప్రభుత్వ దుర్నీతిని కడిగి పారేశారు. రెడ్ బుక్ రాజ్యాంగంతో చేస్తున్న అరాచకాలు, అన్యాయాలపై గళమెత్తుతూ జూన్ 4వ తేదీన 'వెన్నుపోటు'దినం నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఆయన ఇంకా ఏమన్నారంటే..

పాలనలో ఘోర వైఫల్యం..

ఒక్క అవినీతి మాత్రమే కాదు.. పాలనలో కూడా ఈ ప్రభుత్వం దారుణంగా విఫలమైంది. ఏడాదిలోనే తీవ్ర వ్యతిరేకత పెల్లుబుకుతోంది. అందుకే నెలకో డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారు. ప్రజల దృష్టి మళ్లించేందుకు చంద్రబాబు, ఆయన దొంగల ముఠా (ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ 5) రకరకాల పనులు చేస్తున్నారు. చంద్రబాబు ప్రభుత్వం ఏర్పడి ఏడాది అవుతున్నా ఒక్కటంటే ఒక్క పథకం అమలు లేదు. మా ప్రభుత్వంలో ప్రవేశపెట్టిన పథకాలన్నీ రద్దు చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో.. చంద్రబాబు తనకు తెలిసిన మాస్టర్ ఆర్ట్‌ను బయటకు తెచ్చారు. వ్యవస్థలను నాశనం చేయడంతోపాటు ప్రశ్నించే గొంతులను నొక్కడానికి రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారు. తాజాగా లిక్కర్ స్కామ్ అంటూ రాజకీయ కక్షకు దిగారు. అసలు స్కామ్ ఎక్కడ జరిగింది? ఆలోచించమని కోరుతున్నా.

అసలు లంచాలు ఎప్పుడిస్తారు..?

మద్యాన్ని ప్రభుత్వమే స్వయంగా అమ్మితే లంచాలు ఇస్తారా? షాపులు తగ్గించి, పర్మిట్ రూమ్‌లు, బెల్టు షాపులను రద్దు చేస్తే లంచాలు ఇస్తారా? లేక ప్రైవేటు వ్యక్తులకు లిక్కర్ వ్యాపారం అప్పజెప్పి అడ్డగోలుగా రోజంతా అమ్మి లాభాలు గడిస్తే, డిస్టిలరీలకు ఎక్కువ ఆదాయం వస్తే లంచాలు ఇస్తారా? పేరుకు లాటరీ ద్వారా మద్యం షాపులను కేటాయించినా తమకు కావాల్సిన వారికే షాపులు దక్కేలా చేశారు. ఇతరులు ఎవరైనా షాపులు దక్కించుకుంటే నిస్సిగ్గుగా 30 శాతం వాటా తీసుకున్నారు. ఎమ్మార్పీ కంటే ఎక్కువకు అమ్ముతున్నారు. ఊరూరా బెల్టు షాపులు ఏర్పాటు చేశారు. రోజంతా యథేచ్ఛగా అమ్ముతున్నారు. చివరకు డోర్ డెలివరీ కూడా చేస్తున్నారు. బెల్టు షాప్‌ల నిర్వహణకు వేలంపాట పాడుతున్నారు. పోలీసులు దగ్గరుండి మద్యం అమ్మిస్తున్నారు. అలా వస్తున్న ఆదాయాన్ని పంచుకుంటున్నారు. ఇది మా హయాంలో జరిగిందా? ఎక్కడైనా ఎమ్మార్పీ కంటే ఎక్కువకు అమ్మారా? మరి లంచాలు ఎవరికి ఇస్తారు? ప్రైవేటు షాపుల చేత, వీరు ఎంపిక చేసుకున్న డిస్టిలరీకి ఎక్కువ ఆర్డర్ ఇస్తే లంచాలు ఇస్తారా?



2014–19 మద్యంలో అవినీతి..

చంద్రబాబు ఇప్పుడు చేస్తున్నట్లుగానే కొన్ని డిస్టిలరీలకు మాత్రమే మేలు చేసేలా ప్రైవేటు లిక్కర్ షాప్‌ల నుంచి ఇండెంట్ పెట్టించేడం ద్వారా 2014–19 మధ్య కేవలం ఐదు డిస్టిలరీలు రాష్ట్రంలో 69 శాతం మద్యాన్ని సరఫరా చేశాయి. రాష్ట్రంలో 20 డిస్టిలరీలు ఉంటే వాటిలో 14 డిస్టిలరీలకు చంద్రబాబే అనుమతి ఇచ్చారు. మిగిలిన ఆరు వేర్వేరు ప్రభుత్వాల్లో అనుమతి పొందాయి. అంతేకాదు.. మద్యం సేకరణకు ఆ 20 డిస్టిలరీలను లిస్ట్ చేసింది కూడా చంద్రబాబు ప్రభుత్వమే. మేం కొత్తగా ఏ డిస్టిలరీనీ చేర్చలేదు.

తప్పుడు సాక్ష్యాలు, కేసులు..

వాస్తవాలు ఇలా ఉంటే అక్రమ కేసులో భయపెట్టి, బెదిరించి తప్పుడు సాక్ష్యాలు, తప్పుడు వాంగ్మూలాలు సృష్టించి చంద్రబాబు అరాచకంగా వ్యవహరిస్తున్నారు. బెవరేజెస్ కార్పొరేషన్‌లో పని చేస్తున్న సత్యప్రసాద్ ఒక సాధారణ సూపరింటెండెంట్ స్థాయి ఉద్యోగి. అనూష ఔట్ సోర్సింగ్‌లో పని చేసిన క్లరికల్ ఉద్యోగి. వాళ్లను బెదిరించి అబద్ధపు వాంగ్మూలాలు ఇప్పించారు. బెవరేజెస్ కార్పొరేషన్ ఎండీగా పని చేసిన వాసుదేవరెడ్డి ఈ ప్రభుత్వం తనను వేధిస్తోందని హైకోర్టులో మూడు సార్లు ముందస్తు బెయిల్ పిటిషన్లు వేశారు. ఆయన్ను బెదిరించి, భయపెట్టి, లొంగదీసుకుని అబద్ధపు వాంగ్మూలం ఇప్పించాక కేంద్ర సర్వీస్‌కు వెళ్లిపోవడానికి ఎన్‌ఓసీ ఇచ్చారు.

ఏం విలువ ఉంటుంది?

చంద్రబాబుకు లొంగిపోయిన మరో వ్యక్తి విజయసాయిరెడ్డి. రాజ్యసభ సభ్యుడిగా మరో మూడున్నర సంవత్సరాలు టర్మ్ ఉండగానే చంద్రబాబు కూటమికి మేలు చేసేందుకు రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేశాడు. వైఎస్సార్‌సీపీకి తగినంత ఎమ్మెల్యేల బలం లేదు.. మళ్లీ రాజ్యసభకు వైఎస్సార్‌సీపీ తన అభ్యర్థిని పంపించే అవకాశం ఉండదని, చంద్రబాబు కూటమికి మేలు జరుగుతుందని తెలిసి కూడా ప్రలోభాలకు గురై రాజీనామా చేశారు. అలాంటి వ్యక్తి ఇచ్చే స్టేట్‌మెంట్స్‌కు ఏం విలువ ఉంటుంది? మరో నిందితుడిగా చెబుతున్న రాజ్ కేసిరెడ్డికి బెవరేజెస్ కార్యకలాపాలతో ఏం సంబంధం? ఐటీ రంగంలో అనుభవం ఉన్న ఆయన ఒక వ్యాపారస్తుడు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు అనేక మందిలో ఒకరు. ఆయనకు ప్రస్తుత టీడీపీ విజయవాడ ఎంపీతో సన్నిహిత సంబంధాలు ఏ స్థాయిలో ఉన్నాయంటే ఇద్దరూ కలిసి వ్యాపారాలు కూడా చేస్తున్నారు. ఈ వ్యక్తి అయితే తెలుగుదేశం పార్టీతో సన్నిహిత సంబంధాలు కలిగి ఉన్నాడని, సులభంగా ప్రలోభ పెట్టవచ్చని తీసుకొచ్చారు. ఒత్తిడి తీసుకొచ్చి ప్రలోభాలు పెట్టి అప్రూవర్ మారుస్తామన్నారు. అయితే అబద్ధం చెప్పకపోవడం వల్ల నిందితుడిగా చేర్చారని ఆయన సుప్రీంకోర్టులో కేసు వేశాడు. ఇలా చేయదల్చుకుంటే ఎవరి మీదనైనా భేతాళ విక్రమార్క కథలు అల్లేసి ఏమైనా చెప్పించవచ్చు. బెవరేజెస్ కార్పొరేషన్, లిక్కర్‌తో ఎంపీ మిథున్‌రెడ్డికి ఏం సంబంధం? వాళ్ల నాన్న కనీసం ఈ శాఖ మంత్రి కూడా కాదు. అరెస్టు చేసిన రిటైర్డ్ ఐఏఎస్ కె.ధనుంజయరెడ్డి, మాజీ ప్రభుత్వ అధికారి పి.కృష్ణమోహన్‌రెడ్డికి ఈ కేసుతో ఏం సంబంధం? మద్యానికి సంబంధించి ఒక్క ఫైలు అయినా సీఎంవోకు వచ్చినట్లు, ఒక్క సంతకం అయినా చూపించగలరా? అని సవాల్ విసురుతున్నా చంద్రబాబుకు. ధనుంజయరెడ్డి కనీసం ఎక్సైజ్ శాఖ కూడా చూసేవారు కాదు.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

న్యాయం, ధర్మానిదే అంతిమ విజయం

''వైఎస్సార్‌సీపీకి... వైఎస్ జగన్‌కు ఈ పోరాటాలు కొత్త కాదు. అప్పట్లో అధికారంలో ఉన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ కుమ్మక్కై అక్రమ కేసులు బనాయించి... నన్ను ఇబ్బందిపెట్టి, వేధింపులకు గురిచేస్తేనే వైఎస్సార్‌సీపీ పుట్టింది... పెరిగింది... ప్రజల ఆశీర్వాదంతో జగన్ అనే వ్యక్తి ఎదిగాడు... ఈ పోరాటాలు మాకు కొత్తేం కాదు. తప్పుడు కేసులకు అదిరేది లేదు... బెదిరేది లేదు''అని వైఎస్ జగన్ స్పష్టం చేశారు. ఎవరు ఎన్ని ఇబ్బందులు పెట్టినా అంతిమంగా న్యాయం, ధర్మం గెలుస్తుందని, ఎన్ని కేసులు పెట్టి అణచివేయాలని చూసినా... చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలని నిలదీస్తూ... ప్రజా సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ.. అక్రమ కేసులపై గళమెత్తుతూ ప్రజల పక్షాన పోరాడుతూనే ఉంటామని తేల్చిచెప్పారు. మద్యం కేసులో మిమ్మల్ని అరెస్టు చేయడానికి చంద్రబాబు కూటమి ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందంటున్నారు కదా.. మీరేమంటారు అని విలేకరులు అడగ్గా.. తాను విజయవాడలోనే ఉన్నానంటూ స్పందించారు.

టీడీపీకి ఇప్పుడా పరిస్థితి రాకుండా చూడండి

పొత్తులపై జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ హాట్ కామెంట్స్



సాక్షి ప్రతినిధి, కాకినాడ: 'అప్పట్లో మనం తెలివిగా రాజకీయం చేసి ఉభయ కమ్యూనిస్టు పార్టీలను రాష్ట్రంలో నిర్వీర్యం చేసేశాం. మన పార్టీతో పొత్తు పెట్టుకున్న కారణంగానే నాడు ఆ రెండు పార్టీలూ రాష్ట్రంలో శాశ్వతంగా నష్టపోయాయి. పొత్తుతో ఉభయ కమ్యూనిస్టు పార్టీలకు ఒకటో, రెండో పదవులు వచ్చి ఉండవచ్చు. ఆ తరువాత మాత్రం ఆ పార్టీలు రాష్ట్రంలో అడ్రస్ లేకుండా పోయాయి. ఇప్పుడు ఆ పరిస్థితి మన పార్టీకి రాకుండా రాష్ట్ర నాయకత్వం చూడాలి' అని కాకినాడ జిల్లా జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ సంచలన వ్యాఖ్యలు చేశారు. కాకినాడలో గురువారం జరిగిన టీడీపీ జిల్లా మహానాడులో ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు పెద్ద దుమారాన్నే రేపాయి.

జనసేన, బీజేపీతో పొత్తు మనకే నష్టం

'జనసేన, బీజేపీ పొత్తుతో రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ నిర్వీర్యమైపోతుంది. ఈ పరిస్థితిని అధిష్టానం ఇప్పుడు గుర్తించకపోతే టీడీపీ పరిస్థితి కూడా ఉభయ కమ్యూనిస్టు పార్టీల మాదిరిగానే తయారవుతుంది' అని జ్యోతుల హెచ్చరించారు. 'రాజకీయాల్లో కూటములుంటాయి. పార్టీలతో కలిసి పని చేసే విధానం ఉంటుంది. టీడీపీ ఏర్పడిన తరువాత ఎన్నిసార్లు కూటములు ఏర్పడలేదు? ఎన్ని రాజకీయ పార్టీలతో కలవలేదు? ఎన్నిసార్లు బయటకు రాలేదు? పొత్తు నుంచి బయటకు వచ్చినప్పుడు మన పరిస్థితి ఏమిటో ఒక్కసారి చూడండి' అని అన్నారు. 'ఇది కరెక్ట్ కాదు. ఇలా ఎన్నాళ్లుంటుంది. ఆ పరిస్థితి తెలుగుదేశం పార్టీకి రాకుండా నాయకత్వం చూడాలి' అని అన్నారు.


తాండూరు ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్ సస్పెన్షన్

తాండూరు: నిబంధనలకు విరుద్ధంగా ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేసిన తాండూరు ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్ ఫసియుద్దీన్‌పై ఉన్నతాధికారులు సస్పెన్షన్ వేటు వేశారు. ఐదు రోజులపాటు విధుల్లో కొనసాగిన ఆయన రోజుకు ఏకంగా 50 రిజిస్ట్రేషన్లు చేశారు. 4 రోజుల్లోనే 200 రిజిస్ట్రేషన్లు పూర్తిచేసినా ఆన్‌లైన్‌లో నమోదు కాకపోవడంతో ఉన్నతాధికారులకు అనుమానం వచ్చింది. దీ నిపై విచారణకు ఆదేశించడంతో అసలు విషయం బయటకు వచ్చింది. వ్యవసాయ భూములను కమర్షియల్‌గా మార్చకుండానే 200 ప్లాట్లకు రిజిస్ట్రేషన్ చేసి నట్లు తేలింది. దీనికి భారీగా ముడుపులు తీసుకున్నట్లు సమాచారం. ఫసియుద్దీన్ నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్లు చేసినట్లు తెలింది. ఆడిట్ రిపోర్ట్ ఆధారంగా శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా రిజిస్ట్రార్ సంతోష్, తెలిపారు.

తాగునీటి కోసం కృష్ణా జలాల కేటాయింపు

- తెలంగాణకు 10.26, ఏపీకి 4 టీఎంసీలు
- కృష్ణా బోర్డు ఉత్తర్వులు జారీ

సాక్షి, హైదరాబాద్/ నాగార్జునసాగర్: తాగునీటి అవసరాల కోసం తెలంగాణకు 10.26, ఆంధ్రప్రదేశ్‌కు 4 టీఎంసీల కృష్ణా జలాలను కేటాయిస్తూ కృష్ణా నది యాజమాన్య బోర్డు (కేఆర్‌ఎంబీ) చైర్మన్ అతుల్ జైన్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆంధ్రప్రదేశ్ తాగునీటి అవసరాల కోసం నాగార్జునసాగర్ కుడి కాలువ ద్వారా ఈనెల 22 నుంచి అంటే గురువారం నుంచే రోజుకు 5,500 క్యూసెక్కుల చొప్పున 4 టీఎంసీలను విడుదల చేయాలని సాగర్ సీఈని ఆదేశించారు. శ్రీశైలం ప్రాజెక్టులో జూలై 31 నాటికి 800 అడుగుల స్థాయిలో నీరు నిల్వ ఉండేలా చూసి.. మిగతా నీటిని విద్యుదుత్పత్తి చేస్తూ సాగర్‌కు తరలించాలని తెలంగాణ ప్రభుత్వానికి సూచించారు. ఉమ్మడి ప్రాజెక్టులైన శ్రీశైలం, నాగార్జునసాగర్‌లలో నీటి లభ్యతను సమీక్షించి.. కేటాయింపులపై బోర్డు చైర్మన్‌కు సిఫార్సు చేసేందుకు ఈనెల 5న హైదరాబాద్‌లో త్రిసభ్య కమిటీ సమావేశాన్ని నిర్వహించింది. ఈ సమావేశానికి తెలంగాణ ఈఎన్‌సీ హాజరుకాగా, ముందస్తు షెడ్యూలు వల్ల ఏపీ ఈఎన్‌సీ హాజరుకాలేదు. కాగా, రాష్ట్రంలో తాగునీటి అవసరాల కోసం 10.26 టీఎంసీలు కేటాయించాలని తెలంగాణ ఈఎన్‌సీ త్రిసభ్య కమిటీ సమావేశంలో కోరారు. అలాగూ తాగునీటి అవసరాల కోసం పది టీఎంసీలు విడుదల చేయాలని ఈనెల 20న ఏపీ ఈఎన్‌సీ కృష్ణా బోర్డు చైర్మన్‌కు లేఖ రాశారు. శ్రీశైలంలో ఈనెల 5 నాటికి 800 అడుగులకు ఎగువన, సాగర్‌లో 510 అడుగులకు ఎగువన 10.81 టీఎంసీలు మాత్రమే లభ్యతగా ఉన్నాయని తెలంగాణ ఈఎన్‌సీ కృష్ణా బోర్డుకు లేఖ రాశారు. ఇదిలా ఉండగా రెండు రాష్ట్రాల తాగునీటి అవసరాలు తీర్చడానికి శ్రీశైలంలో 800 అడుగుల వరకూ.. సాగర్‌లో 505 అడుగుల స్థాయి వరకూ నీటిని వినియోగించుకోవాలని కృష్ణా బోర్డు నిర్ణయించింది.



నాగార్జునసాగర్ ప్రాజెక్టు నుంచి కుడి కాలువకు విడుదలవుతున్న నీరు

బుధవారం సాయంత్రానికి శ్రీశైలం ప్రాజెక్టులో 800 అడుగులకు ఎగువన 8.422, సాగర్‌లో 505 అడుగులకు ఎగువన 12.793.. వెరసి మొత్తం 21.215 టీఎంసీలు లభ్యతగా ఉన్నట్లు బోర్డు లెక్కగట్టింది. ఇందులో 4.243 టీఎంసీలు ఆవిరి, ప్రవాహ నష్టాలుపోనూ 16.972 టీఎంసీల్లో తెలంగాణకు 10.26, ఆంధ్రప్రదేశ్‌కు 4 టీఎంసీల చొప్పున బోర్డు కేటాయించింది. కాగా, కేఆర్‌ఎంబీ ఆదేశాలతో ప్రాజెక్టు అధికారులు సాగర్ కుడి కాలువకు గురువారం 5,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. రోజుకు 5,500 క్యూసెక్కుల చొప్పున 8 రోజుల పాటు 4 టీఎంసీల నీటిని విడుదల చేయనున్నట్లు అధికారులు తెలిపారు. కుడి కాలువ పరిధిలోని చెరువులు, కుంటలను నింపుకొని తాగునీటి అవసరాలకు వాడుకోవాలని బోర్డు అధికారులు సూచించారు.

జూన్ 20లోపు కోర్టులో హాజరుకండి!

- లేదంటే ప్రొక్లైమ్డ్ అఫెండర్‌గా ఖరారవుతారు
- ఎస్‌ఐబీ మాజీ చీఫ్ టి.ప్రభాకర్‌రావుకు నోటీసులు
- ఆయన ఇంటి గోడకు అతికించిన సిట్ అధికారులు

సాక్షి, హైదరాబాద్: అక్రమ ఫోన్‌ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్‌ఐబీ) మాజీ చీఫ్ టి.ప్రభాకర్‌రావు చుట్టూ ఉచ్చు బిగుస్తోంది. ఆయన్ను అమెరికా నుంచి రప్పించడానికి ప్రకటిత నేరస్తుడి అస్త్రం వాడుతున్నారు. ఈ మేరకు నాంపల్లి కోర్టు నుంచి బుధవారం అనుమతి తీసుకున్న పోలీసులు దానికి సంబంధించిన నోటీసులను గురువారం సిద్ధం చేశారు. గోల్కొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని వెస్పెల్లా మెడోస్‌లోని ప్రభాకర్‌రావు ఇంటికి వెళ్లిన అధికారులు.. ఆయన కుటుంబీకులకు ఈ నోటీసులు ఇవ్వాలని భావించారు. అయితే ఎవరూ అందుబాటులో లేకపోవడంతో ఇంటిగోడకు అతికించి వచ్చారు. అక్రమ ఫోన్ ట్యాపింగ్‌పై గత ఏడాది మార్చి 10న పంజగుట్ట పీఎస్‌లో కేసు నమోదైన విషయం తెలిసిందే. కేసు నమోదైన తర్వాత అజ్ఞాతంలోకి వెళ్లిపోయిన ప్రభాకర్‌రావు విచారణకు మాత్రం అప్పుడు వస్తా.. ఇప్పుడు వస్తా అంటూ పోలీసులతో దోబూచులాడారు. తాను వచ్చి లొంగిపోవడానికి కొన్ని షరతులూ విధించారు. ఈయన దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను న్యాయస్థానం కొట్టేసింది. పాస్‌పోర్టు రద్దు కావడంతోపాటు ఇంటర్‌పోల్ రెడ్‌కార్నర్ నోటీసులు జారీ చేసింది. అయినా ప్రభాకర్‌రావు తిరిగి రాకపోవడంతో పోలీసులు ప్రొక్లైమ్డ్ అఫెండర్‌గా ప్రకటించాలంటూ ఈ ఏడాది జనవరిలో నాంపల్లి కోర్టును ఆశ్రయించారు. పోలీసుల అభ్యర్థనను అంగీకరించిన కోర్టు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. వచ్చే నెల 20 వరకు ప్రభాకర్‌రావుకు గడువు ఇస్తూ.. ఆ లోపు న్యాయస్థానంలో హాజరుకావాలని స్పష్టం చేసింది. అలాకాకుంటే ఆయన్ను ప్రకటిత నేరస్తుడిగా ఖరారు చేస్తామని పేర్కొంది. ఈ మేరకు రూపొందించిన నోటీసులను సిట్ అధికారులు గురువారం ప్రభాకర్‌రావు ఇంటికి అతికించారు. ప్రభాకర్‌రావు ప్రొక్లైమ్డ్ అఫెండర్‌గా ఖరారైతే సాధారణ పౌరులు సహా ఎవరైనా ఆయన్ను పట్టుకొని పోలీసులకు అప్పగించొచ్చు. ఆయన పేరుతో ఉన్న ఆస్తులను సైతం జప్తు చేయడానికి పోలీసులకు అధికారం లభిస్తుంది. అక్రమ ట్యాపింగ్ వ్యవహారంలో తెరవెనుక ఉన్న వ్యక్తులు, రాజకీయ నాయకుల వ్యవహారం వెలుగులోకి రావాలంటే ప్రభాకర్‌రావు విచారణ అనివార్యమని పోలీసులు చెబుతున్నారు.

రక్షణ ఆవిష్కరణల కేంద్రం ఐఐటీహెచ్

▶ మొదటి పేజీ తరువాయి

పరిశోధనలు ఏఐ, అడిటివ్ మాన్యుఫాక్చరింగ్, బయో మెడికల్ రిసెర్చ్ వంటి రంగాల్లో భారత సైనిక బలగాలకు అవసరమైన అత్యాధునిక సాంకేతిక పరిష్కారాలు చూపే దిశగా సాగుతున్నాయి. రక్షణ రంగంలో ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు స్టార్టప్‌లను కూడా ఐఐటీహెచ్ ప్రోత్సహిస్తోంది. ఈ నేపథ్యంలో ఆర్మీ, నౌకదళాలు కూడా ఐఐటీహెచ్‌లో తమ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లు ఏర్పాటు చేసేందుకు ఆసక్తి చూపుతున్నాయి. 2030 నాటికి విదేశాల నుంచి దిగుమతి అవుతున్న రక్షణరంగ ఉత్పత్తులను సగానికి తగ్గించాలనే కేంద్ర ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా స్వదేశీ సాంకేతికతను అభివృద్ధి చేయడం లక్ష్యంగా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లు పనిచేస్తాయి.

స్వదేశీ ఆవిష్కరణలు

డీఆర్‌డీఓ సహకారంతో ఐఐటీహెచ్‌లో 2023 ఏప్రిల్ 16న 'డీఆర్‌డీఓ ఇండస్ట్రీ అకాడమియా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'(డీఐఏ– సీఓఈ) ప్రారంభమైంది. రక్షణరంగ ఉత్పత్తుల్లో స్వదేశీ ఆవిష్కరణలను ప్రోత్సహించడం లక్ష్యంగా ఇది పనిచేస్తోంది. హైపర్‌సోనిక్ వాహనాలకు అవసరమైన అధిక ఉష్ణోగ్రతలను తట్టుకునే మెటీరియల్స్ అభివృద్ధి చేయడంతోపాటు లార్జ్ ఏరియా అడిటివ్ మాన్యుఫాక్చరింగ్ (అధునాతన 3డీ ప్రింటింగ్) వంటి అధునాతన సాంకేతికతలను అభివృద్ధి చేస్తోంది. రాకెట్ భాగాల తయారీకి దేశంలో అతిపెద్ద మెటల్ 3డీ ప్రింటర్‌ను ఉపయోగిస్తోంది. దేశ రక్షణ అవసరాలకు అనుగుణంగా భవిష్యత్తు ప్రాజెక్టులపై ఈ సీఓఈ దృష్టి సారిస్తోంది. మిస్సైల్ డిజైన్, ఆపరేషన్స్ కోసం కృత్రిమ మేధస్సు వినియోగం వంటి వాటిలో పరిశోధనలు సాగుతున్నాయి.

3డీ ముద్రిత సైనిక బంకర్లు

సైన్యం సహకారంతో ఐఐటీహెచ్‌కు చెందిన డీప్ టెక్ స్టార్టప్ 'సింప్లిఫోర్జ్ క్రియేషన్స్'లద్దాఖ్‌లోని లేహ్ ప్రాంతంలో 'ప్రాజెక్టు ప్రబల్'పేరిట సముద్ర మట్టానికి 11వేల అడుగుల ఎత్తులో ఆన్‌సైట్ 3డీ ప్రింటెడ్ బంకర్‌ను నిర్మించింది. కేవలం 14 గంటల వ్యవధిలోనే రోబోటిక్ 3డీ ప్రింటింగ్ టెక్నాలజీతో దీన్ని నిర్మించింది. ఎక్కువ ఎత్తులో, తక్కువ ఆక్సిజన్, తీవ్రమైన వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా స్థానికంగా లభించే పదార్థాలతో రూపొందించిన కస్టమ్ కాంక్రీట్ మిశ్రమాన్ని బంకర్ నిర్మాణంలో ఉపయోగించారు. హిమాలయ పర్వత సానువుల్లో కఠినమైన వాతావరణ పరిస్థితులు, శత్రుదాడుల నుంచి సైనికులను రక్షించడంలో ఈ బంకర్‌లు తోడ్పడతాయి. రక్షణ రంగంలో స్వదేశీ సాంకేతికతను ప్రోత్సహిస్తే సాధించే ఫలితాలకు ఈ బంకర్ ఒక మైలురాయి వంటిదని ఐఐటీహెచ్ వర్గాలు చెప్తున్నాయి.

సైనిక వైద్య సవాళ్లకు పరిష్కారం

సైనికులు ఎదుర్కొంటున్న వైద్య సవాళ్లకు సాంకేతిక పరిష్కారాలను అభివృద్ధి చేయడంపైనా ఐఐటీహెచ్‌లో పరిశోధనలు జరుగుతున్నాయి. వైద్య పరిష్కారాలు, నవీన వైద్య పరికరాల అభివృద్ధి, శిక్షణ కోసం ఆర్మ్‌డ్ ఫోర్సెస్ మెడికల్ సర్వీసెస్‌తో గత ఏడాది ఐఐటీహెచ్ ఒప్పందం కుదుర్చుకుంది. ఐఐటీహెచ్‌లోని బయోటెక్నాలజీ, బయోమెడికల్ ఇంజనీరింగ్ విభాగాల నైపుణ్యాన్ని ఉపయోగించి సైనికుల ఆరోగ్య సవాళ్లను పరిష్కరించడం లక్ష్యంగా ఈ ఒప్పందం కుదిరింది. మరోవైపు నౌకా రంగంలో రక్షణ సాంకేతికతను మెరుగుపరిచేందుకు ఆవిష్కరణల కోసం నావికాదళంతో ఐఐటీహెచ్ ఒప్పందం కుదుర్చుకుంది. ఏబీసీడీ (ఆర్మీ, బోర్డర్, సైబర్, డ్రోన్స్) ప్రోగ్రామ్ ద్వారా స్టార్టప్‌లను రక్షణ సాంకేతిక ఆవిష్కరణల దిశగా ప్రోత్సహిస్తూ నిధులు సమకూర్చేందుకు సహాయపడుతోంది.

స్వదేశీ పరిజ్ఞానంతో ఆవిష్కరణలు


ఐఐటీ హైదరాబాద్‌లో రక్షణ రంగానికి సంబంధించి అనేక సాంకేతిక పరిశోధనలు జరుగుతున్నాయి. ఒక మీటరు నుంచి రెండున్నర మీటర్ల ఎత్తుకలిగిన వస్తు సామగ్రిని ముద్రించే అధునాతన 3డీ ప్రింటింగ్ టెక్నాలజీని ఇక్కడ అభివృద్ధి చేశాం. 200 కిలోల పేలోడ్ లేదా ఇద్దరు వ్యక్తులను మోసుకెళ్లే డ్రోన్లను అభివృద్ధి చేశాం.

–బీఎస్ మూర్తి, డైరెక్టర్, ఐఐటీహెచ్

● ఉమన్ ఎంపవర్‌మెంట్

జై.. యశోద ఏఐ

అంతంత మాత్రమే చదువుకున్న మహిళలను టెక్-సావీలుగా తీర్చిదిద్దవచ్చా? 'అవును' అని చెప్పడానికి దేశవ్యాప్తంగా ఎంతోమంది మహిళల విజయాలే సాక్ష్యం. తాజాగా... దేశవ్యాప్తంగా లక్షలాది మంది మహిళలను టెక్-సావీలుగా తీర్చిదిద్దడానికి నేషనల్ కమిషన్ ఫర్ ఉమెన్(ఎన్‌సీడబ్ల్యూ) ఆధ్వర్యంలో 'యశోద ఏఐ క్యాంపెయిన్' మొదలైంది...



నేషనల్ కమిషన్ ఫర్ వుమెన్ (ఎన్‌సీడబ్ల్యూ) ఆధ్వర్యంలో ప్రత్యేకమైన క్యాంపెయిన్ ప్రారంభమైంది. ఈ క్యాంపెయిన్ ద్వారా లక్షలాది మహిళలకు డిజిటల్ లిటరసీ ప్రాముఖ్యత గురించి తెలియజేస్తారు. సైబర్ నేరాల బారిన పడకుండా మహిళలకు అవసరమైన శిక్షణ ఇస్తారు.

రాబోయే రోజుల్లో మహిళలను టెక్-సావీగా మార్చడానికి రకరకాల కార్యక్రమాలకు రూపకల్పన చేశారు.

ఉత్తర్‌ప్రదేశ్ బరేలీలోని మహాత్మా జ్యోతిబా పులే యూనివర్శిటీలో ప్రారంభమయ్యే 'యశోద ఏఐ క్యాంపెయిన్' (యువర్ ఏఐ సాక్షి ఫర్ షేపింగ్ హరైజన్స్ విత్ డిజిటల్ అవేర్‌నెస్) ద్వారా రాబోయే నెలల్లో దేశవ్యాప్తంగా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), సైబర్ సెక్యూరిటీ, డిజిటల్ లిటరసీలో శిక్షణ ఇస్తారు.

'యశోద ఏఐ' లక్ష్యం దేశంలోని ప్రతి మూలలో మహిళలకు సాంకేతిక విషయాల్లో ప్రావీణ్యం కల్పించడం.

తొలిదశలో రెండు లక్షల కంటే ఎక్కువ మంది మహిళలకు సాంకేతిక విషయాల్లో శిక్షణ ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

స్కూల్, కాలేజి, స్వయంసహాయక బృందాలు, ఆశా వర్కర్స్, టీచర్స్, ప్రభుత్వ ఉద్యోగులు... ఇలా వివిధ వర్గాల మహిళలకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)లో శిక్షణ ఇవ్వనున్నారు. ఈ శిక్షణలో పాల్గొనేవారికి స్థానిక భాషల్లో కోర్సు మెటీరియల్ అందిస్తారు. వర్క్‌షాప్‌లు నిర్వహించి డిజిటల్ టూల్స్ వాడకంపై అవగాహన కలిగిస్తారు.

చేంజ్ మేకర్స్

గ్రామీణ, పట్టణ ప్రాంతం అని తేడా లేకుండా అంతంత మాత్రం చదువుకున్న అమ్మాయిలు కూడా సాంకేతిక విషయాల్లో ప్రావీణ్యం సాధించేలా చేయవచ్చని చెప్పడానికి ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి. వాటిలో కొన్ని...

ఒడిషాలోని రఘురాజ్‌పూర్ గ్రామానికి చెందిన పద్దెనిమిది సంవత్సరాల చంద్రమాకు నెలకు వెయ్యి రూపాయల ఆదాయం అనేది కష్టంగా ఉండేది. తన మాతృభాషలో మాట్లాడిన మాటలను సెల్‌ఫోన్‌లో రికార్డ్ చేయడం ద్వారా ఇప్పుడు నెలకు అయిదువేలు సంపాదిస్తోంది. బెంగళూరుకు చెందిన స్వచ్ఛంద సంస్థ 'కార్య' కోసం పనిచేస్తోంది చంద్రమా. స్థానికభాషల్లో డేటా సెట్స్‌ను రూపొందించడంపై 'కార్య' దృష్టి పెట్టింది.

కోల్‌కత్తాలోని గ్రామీణ ప్రాంతానికి చెందిన మౌమితా షా దాస్ రోజూ ఉదయాన్నే తన ఫోన్‌లో డిజిటైజింగ్ వర్క్ మొదలుపెడుతుంది. స్కూలుకు వెళ్లి వచ్చిన తరువాత మళ్లీ డిజిటైజింగ్ వర్క్‌లోకి వెళుతుంది.

'తక్కువ టైమ్ పని చేసినా మంచి ఆదాయం సంపాదిస్తున్నాను. ఈ డిజిటల్ టాస్క్‌ల ద్వారా నేను ఏ పని అయినా చేయగలను అనే నమ్మకం వచ్చింది' అంటుంది మౌమిత.

స్మార్ట్ ఫోన్ ఉంటే చాలు...

ఏఐ మోడల్స్‌ని ట్రెన్ చేయడంపై ఫోకస్ చేసే జాబ్స్‌లో హైరింగ్ పెరగడంతో గ్రామీణ ప్రాంతాలకు చెందిన చంద్రమా, మౌమితలాంటి ఎంతో మంది అమ్మాయిలకు ఉపాధి లభిస్తోంది.

వారు చేసే పనికి సాంకేతిక విద్యలో పట్టా అవసరం లేదు. స్మార్ట్‌ఫోన్, డిజిటల్ స్కిల్స్ ఉంటే సరిపోతుంది.

'గ్రామీణ ప్రాంతాలలోని మహిళలు సబ్జెక్ట్ మ్యాటర్ ఎక్స్‌పర్ట్‌గా మారేలా శిక్షణ ఇస్తాం. మన దేశానికి సంబంధించి ప్రాంతీయ భాషలలో ఏఐ మోడల్స్ అభివృద్ధిపై దృష్టి పెట్టాం' అంటున్నారు 'కార్య' సీయివో మనూ చోప్రా.

ఒకప్పుడు కన్‌స్ట్రక్షన్ వర్కర్‌గా పనిచేసిన రాజస్థాన్‌కు చెందిన రోమల దీదీ ఇలా అంటోంది.

'కార్య ద్వారా నాకు వచ్చే డబ్బుతో పిల్లల బడిఫీజులు చెల్లిస్తున్నాను. ఇతర ఖర్చులకు కూడా ఈ డబ్బు ఉపయోగపడుతోంది'.



ఐ-సాక్ష్యమ్

బీహార్‌కు చెందిన 'ఐ-సాక్ష్యమ్' సంస్థ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఉపయోగించి రూపొందించిన ఫెలోషిప్ ప్రోగ్రామ్స్ ద్వారా ఎంతో మంది యువతులను చేంజ్‌మేకర్స్‌గా మారుస్తోంది. నిజానికి వీరిలో చాలామందికి స్మార్ట్‌ఫోన్ గురించి తెలియదు. అలాంటి వారిని కూడా సాంకేతిక అంశాలలో పట్టు సాధించేలా, ఉపాధి పొందేలా చేస్తున్నారు. సాంకేతిక విషయాల్లో పురుషులతో సమానంగా మహిళలు ముందుండే లక్ష్యంతో ఐ-సాక్ష్యమ్ కృషి చేస్తోంది.

ఫ్యాషన్

ట్రెడిషనల్ కట్టు.. వెస్టర్న్ కట్..

ఏ వేడుకయినా ముందుగా గుర్తుకు వచ్చేది పట్టు చీరల రెపరెపలే. ఎంత కాస్ట్‌లీ చీర అయినా దానికి తగిన కట్ బ్లౌజ్ ఉంటేనే ఆ కాంబినేషన్ చూడటానికి ఆకర్షణీయంగా ఉంటుంది. పట్టుచీరలకు ట్రెడిషనల్ ఎంబ్రాయిడరీ వర్క్ బ్లౌజ్‌ల కాంబినేషన్‌ని వెనక్కి నెట్టి, ఇండో- వెస్టర్న్ స్టైల్ కట్ బ్లౌజ్‌లు ఫ్యాషన్‌లో ముందు వరుసలోకి వచ్చాయి. పట్టుచీరలు వెస్టర్న్ స్టైల్ బ్లౌజ్ కాంబినేషన్స్ ఇవి...



పట్టు చీరలకి మోడర్న్ బ్లౌజ్ డిజైన్స్ వేసుకుంటే ఎంతో ట్రెండీ లుక్ వస్తుంది. అలాగే ఇండో వెస్టర్న్ స్టైల్స్ తో ట్రెడిషనల్ గానూ మోడ్రన్ ఫ్యూజన్ స్టైల్ కూడా అట్రాక్ట్ చేస్తుంది.



ట్యూనిక్ స్టైల్..

ఫ్రాక్స్, జీన్స్ మీదకు వేసుకునే టూనిక్స్ మోడల్స్ బ్లౌజ్ స్టైల్ పట్టు చీరకు కాంబినేషన్ సెట్ అయ్యింది. దీనికి కొంత ఎంబ్రాయిడరీ వర్క్ టచ్ ఇవ్వడంతో ట్రెడిషనల్ లుక్ గా మారిపోయింది.

హై-నెక్ టు కాలర్ నెక్

షర్ట్ స్టైల్ బ్లౌజ్ కాన్సెప్ట్ ఇప్పుడు పట్టుచీరలకు చక్కని అమరికగా మారాయి. శారీ కలర్ లేదా కాంట్రాస్ట్ కలర్ కాలర్ నెక్ బ్లౌజులు ట్రెండీ లుక్ నిస్తాయి.

● **షీర్ అండ్ బెలూన్ స్లీవ్స్ బ్లౌజ్**
శారీ కలర్ నెటెడ్ మెటీరియల్ బెలూన్ స్లీవ్స్ పర్ఫెక్ట్ మ్యాచ్ అవుతుంది.

● **లాంగ్ స్లీవ్స్ పెప్లమ్ బ్లౌజ్**
వెస్టర్న్ లుక్ లో అట్రాక్ట్ చేసే ఈ స్టైల్ చీరను హైలైట్ చేస్తుంది.

● **క్రాప్ టాప్ బ్లౌజ్**
జీన్స్ టాప్‌లా కనిపించే క్రాప్ టాప్‌లను ట్రెండీ బ్లౌజ్‌లా డిజైన్ చేయడం

● **బెల్ట్‌తో చీర**
వెస్టర్న్ స్టైల్ బ్లౌజ్ కి ఎంబ్రాయిడరీ బెల్ట్‌తో స్పెషల్ లుక్‌తో అట్రాక్ట్ చేస్తుంది.

● **కేప్ స్టైల్ బ్లౌజ్**
పట్టు చీర మీద వెస్టర్న్ కేప్ స్టైల్ బ్లౌజ్ రెడ్ కార్పెట్ లుక్ ఇస్తాయి.

● ప్లెయిన్ పట్టు చీరకు, హెవీ వెస్టర్న్ టాప్ - ట్రెండీ పార్టీలకి సూపర్ ఐడియాగా ప్రశంసలు దక్కుతాయి.



● బ్యూటిప్

టొమాటో ఫేషియల్

పార్లర్‌లో ఫేషియల్‌తో పనిలేకుండా, ఖరీదైన క్రీములు కొనకుండా ముఖం చక్కగా మెరవాలంటే ఇంట్లోనే టొమాటో ఫేషియల్‌ను ప్రయత్నించండి. పెళ్లికూతురులా మెరిసిపోతారు.



- టొమాటోను గుండ్రని ముక్కలుగా కోయాలి. ఒక ముక్కను తీసుకుని పైన టీస్పూను పంచదార, టీస్పూను కాఫీ పొడి చల్లి ఐదు నిమిషాల పాటు ముఖంపైన రుద్దాలి. తరువాత చేతులతో మర్దన చేసి కడిగేయాలి.
- ఇప్పుడు మరో టొమాటో ముక్కపై టీస్పూను అలోవెరా జెల్ వేసి ఐదు నిమిషాలు మర్దన చేయాలి. ఈ మర్దన అయిన వెంటనే మరో టొమాటో ముక్కపై రెండు టీస్పూన్ల పసుపు వేసి ఐదు నిమిషాలు మర్దన చేయాలి.
- పసుపు పూర్తిగా ఆరాక నీటితో కడిగేసి, తడి లేకుండా తుడిచి మాయిశ్చరైజర్ రాసుకోవాలి. ఈ టొమాటో ఫేషియల్‌లోని ప్రతి స్టెప్‌ను జాగ్రత్తగా అనుసరిస్తే ముఖం కాంతిమంతంగా మెరిసిపోతుంది.

బులియన్

(బంగారం 10 గ్రా.; వెండి కిలో) 22న ముగింపు రూ.లలో

హైదరాబాద్	
బంగారం (24 క్యారెట్లు)	97,110
బంగారం (22 క్యారెట్లు)	95,150
వెండి	99,500
విజయవాడ	
బంగారం (24 క్యారెట్లు)	99,570
బంగారం (22 క్యారెట్లు)	89,750
వెండి	1,01,700
విశాఖపట్నం	
బంగారం (24 క్యారెట్లు)	97,910
బంగారం (22 క్యారెట్లు)	89,750
వెండి	1,12,000
రాజమండ్రి	
బంగారం (24 క్యారెట్లు)	99,570
బంగారం (22 క్యారెట్లు)	92,440
వెండి	1,01,700
ప్రొద్దుటూరు	
బంగారం (24 క్యారెట్లు)	96,600
బంగారం (22 క్యారెట్లు)	88,870
వెండి	1,00,000
చెన్నై	
బంగారం (24 క్యారెట్లు)	97,900
బంగారం (22 క్యారెట్లు)	89,750
వెండి	1,12,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.





పిల్లలూ...
భారతం తెలుసా మీకు?
రామాయణ, మహాభారతాలు
మన తొలి పాఠ్యపుస్తకాలు.
మీకు పదేళ్లు దాటితే ఈ రెండూ ఏదో ఒక మేరకు తెలిసుండాలి.
వినడం, చదవడం ద్వారా మాత్రమే కాక
చూడటం వల్ల కూడా భారతం తెలుసుకోవచ్చు.
స్కూళ్లు తెరవడానికి ఇంకా రెండు వారాలుంది.
భారతం మీద వచ్చిన సినిమాలు వరుసపెట్టి చూడండి చాలు.
ఆ లిస్టు ఇవాళ ఇస్తున్నాం.
రేపు రామాయణం సినిమాల లిస్ట్ ఇస్తాం.

చూస్తే భారతం చూడాలి

పిల్లలూ...

మహాభారతం అంటే పాండవులకు కౌరవులకు మధ్య వార్ అని మాత్రమే అనుకుంటున్నారా మీరు? మహాభారతంలో ఎన్నో ఎపిసోడ్స్ ఉన్నాయి, క్యారెక్టర్స్ ఉన్నాయి, వీరత్వాలూ శూరత్వాలూ ఉన్నాయి, చీటింగ్ ఉంది, నిజాయితీ ఉంది, ట్రూత్ కోసం నిలబడిన వారు ఉన్నారు, గొప్ప విమెన్ ఉన్నారు, ఆటవిక వీరులున్నారు... వీరందరినీ మీరు తెలుసుకోవాలి.

మహాభారతంలో పాండవులు రాజ్యం కోల్పోయి అరణ్యవాసం చేస్తారు. అజ్ఞాతవాసం కూడా చేస్తారు. కొన్ని సందర్భాల్లో లైఫ్‌లో ఇలాంటి సవాళ్లు వస్తాయి. పాండవులు భయపడలేదు. అరణ్యవాసం చేసి, అజ్ఞాతవాసం చేసి మళ్లీ యుద్ధం చేసి గెలిచారు. అరణ్యవాసం అంటే అడవుల్లో ఉండటం, అజ్ఞాతవాసం అంటే ఐడెంటిటీని దాచి బతకడం.

ఇవాళ ప్రపంచంలో చాలా చోట్ల వార్స్ జరుగుతున్నాయి. వార్‌ను ప్రజలు కోరుకోరు. పాలకులే కోరుకుంటారు. వాళ్లకు కావాల్సినదాని కోసం కొట్లాడుకుంటారు. కాని వార్‌ని ఆపడానికి కొంతమంది ట్రై చేస్తారు. పీస్ అంబాసిడర్స్‌గా మారి వార్ వద్దని మంచి మాటలు చెప్తారు. భారతంలో కృష్ణుడు అలా పాండవులకు, కౌరవులకు రాయబారం చేయాలని చూశాడు. కాని కుదరలేదు. మహాభారతంలో ద్రోణుడు వంటి గొప్ప టీచర్ ఉన్నాడు. శకుని వంటి విలన్ ఉన్నాడు. మాట వినని, మొండికేసే దుర్యోధనుడున్నాడు. వీళ్లందరి నుంచి మనం నేర్చుకోదగ్గ లెసన్స్ ఉంటాయి. అలాగే మహాభారతంలో కుంతి, ద్రౌపది, సుభద్ర... వంటి గొప్ప స్త్రీ పాత్రలను మనం తెలుసుకోవాలి.

మహాభారతాన్ని పిల్లల కోసం సులభంగా అర్థమయ్యేలా కొన్ని పుస్తకాలు రాశారు. అవి తెప్పించుకుని చదవండి. లేదా సినిమాలు చూసి కూడా భారతాన్ని తెలుసుకోవచ్చు. ఎంజాయ్ చేయొచ్చు. సెలవులు కొన్నాళ్లే మిగిలాయి. ఈ సినిమాలు చూసేయండి మరి. అన్నీ యూట్యూబ్‌లో ఉన్నాయి.

1. బాలభారతం: ఇది 1972లో వచ్చిన తెలుగు సినిమా. పాండవుల, కౌరవుల చైల్డ్‌హుడ్ ఇందులో ఉంటుంది. అందరూ పిల్లలే నటించారు.

2. మాయాబజార్: ఇది తప్పకుండా చూడాల్సిన క్లాసిక్. ఇందులో ఘటోత్కచుడు స్పెషల్ అట్రాక్షన్. ఈ కథ భారతంలో లేదుగానీ ఇందులో ఉన్నవన్నీ భారతంలోని క్యారెక్టర్లే. దుష్ట చతుష్టయం అనే నలుగురు ఎవరో ఈ సినిమాలో చూడొచ్చు. చెడు ఆలోచనలు చేస్తే చెడు ఫలితమే వస్తుందని తెలుసుకుంటారు.





3. భీష్మ: మహా భారతంలో భీష్ముడు చాలా ముఖ్యమైన పాత్ర. మహాభారతంలో ఆది నుంచి అంతం వరకూ ఆయన ఉంటాడు. ఆయన మీద తీసిన సినిమా ఇది. పెద్దవాళ్లను తోడు చేసుకుని డౌట్స్ అడుగుతూ ఈ సినిమా చూస్తే మీకు చాలా విషయాలు తెలుస్తాయి.

4. నర్తన శాల: ఇది పాండవులు అజ్ఞాతవాసంలో ఉన్నప్పుడు జరిగిన కథ. పాండవుల్లో భీముడు ఎంత బలం కలిగినవాడో ఈ సినిమాలో చూడొచ్చు. అలాగే కీచకుడు అనే క్యారెక్టర్ ఉంటుంది. బ్యాడ్ క్యారెక్టర్. ఉమెన్‌తో మిస్ బిహేవ్ చేసి తగిన పనిష్మెంట్ పొందుతాడు. తప్పకుండా చూడండి.

5. వీరాభిమన్యు: భారతంలో అభిమన్యుడు అద్భుతమైన పాత్ర. పద్మవ్యూహంలోకి చొచ్చుకు వెళ్లి గొప్పగా పోరాడుతాడు. కాని తిరిగి రావడం తెలియక మరణిస్తాడు. అతని మీద తీసిన సినిమా ఇది.

6. పాండవ వనవాసము: పాండవులు వనవాసం చేసినప్పుడు అంటే అడవుల్లో ఉన్నప్పుడు ఏమేమి ఘటనలు జరిగాయో ఈ సినిమా చూపిస్తుంది.

7. దానవీరశూర కర్ణ: మహాభారతాన్ని ఒక్కొక్కరు ఒక్కో పర్స్‌పెక్టివ్‌లో చూస్తారు. ఈ సినిమా కర్ణున్ని ఒక వీరుడుగా, శూరుడుగా చూపుతుంది. అతను దానం ఇవ్వడంలో మేటి అట. అలాగే అతను పొందిన అవమానాలను ఎలా తట్టుకున్నాడో కూడా ఈ సినిమా చూపుతుంది. కర్ణుడు దుర్యోధనుడితో స్నేహం చేస్తాడు. వాళ్లిద్దరూ బెస్ట్ ఫ్రెండ్స్. యుద్ధ సమయంలో ఫ్రెండ్ పక్షాన నిలవడం అతని ధర్మం. ఈ సినిమా తప్పక చూడండి.



8. ఏకలవ్య: ఏకలవ్య శిష్యరికం అని మీరు సామెత వింటూనే ఉంటారు కదా... ద్రోణుడి బొమ్మ పెట్టుకుని విలువిద్య నేర్చుకుంటాడితను. అర్జునుడిని మించిన విలుకాడితను. ద్రోణుడు గురుదక్షిణ అడగగానే ఏమాత్రం ఆలోచించకుండా బొటనవేలు కోసి ఇచ్చేస్తాడు.

అన్నట్టు పిల్లలూ... ఈ సినిమాల్లో భాష మీకు పూర్తిగా అర్థం కాకపోవచ్చు. ఇందులో గ్రాంథిక తెలుగు ఉంటుంది. అయినా సరే చూస్తూ ఉంటే భాష కూడా మీకు తెలుస్తుంది. తెలుగు గొప్ప భాష. అందులో ఎన్నో స్థాయిలు ఉన్నాయి. అన్నింటితో మనకు పరిచయం ఉండాలి.

ఇంకెందుకు ఆలస్యం. మీ అమ్మతోనో నానమ్మతోనో కలిసి భారతం సినిమాలు చూడటం మొదలుపెట్టండి.

మిస్ వరల్డ్ 2025



అమేజింగ్ అమ్మాయిలు

ఈమె పేరు.. వలేరియా పేరస్. మిస్ ప్యూర్టో రికో!

వృత్తిరీత్యా టీచర్. మిడిల్ స్కూల్ పిల్లలకు సైన్స్ బోధిస్తోంది. మిస్ వరల్డ్ పోటీలు, ఆతిథ్యం గురించి వలేరియా పంచుకున్న విషయాలు...



వలేరియా పేరస్. మిస్ ప్యూర్టో రికో

"మిస్ వరల్డ్ కోసం 119 మంది అమేజింగ్ అమ్మాయిలతో పోటీ వావ్ అనిపిస్తోంది. ఈ పోటీల కోసం ఇండియా.. ఎస్పెషల్లీ హైదరాబాద్ రావడం సూపర్బ్ ఫీలింగ్. ఇక్కడి హాస్పిటాలిటీ నాకు చాలా నచ్చింది. మా ఇంటిని, దేశాన్ని వదిలి ఎక్కడో సుదూర తీరాలకు వచ్చినట్టేమీ అనిపించడం లేదు. ప్రతి క్షణాన్నీ ఎంజాయ్ చేస్తున్నాను. మేమంతా భిన్న దేశాల నుంచి వచ్చినవాళ్లమనే భావన కలగట్లేదు. చాలా త్వరగా మా మధ్య బాండింగ్ ఏర్పడింది. ఇనాగ్యురల్ ఫంక్షన్ రోజు.. మేమంతా ఒకరికొకరం మేకప్ చేసుకున్నాం. హెయిర్ స్టయిల్ చేసుకున్నాం. జ్యూవెలరీ కూడా ఎక్స్‌ఛేంజ్ చేసుకున్నాం. అంత అద్భుతమైన సిస్టర్‌హుడ్ డెవలప్ అయింది మా మధ్య! ఇక్కడికి రావడానికి ముందు కొంచెం భయమేసింది.. ఇక్కడి మనుషులు ఎలా రిసీవ్ చేసుకుంటారో.. వాతావరణం ఎలా ఉంటుందో అని! కానీ ల్యాండ్ అయ్యాక.. ఇక్కడి వాళ్ల మర్యాద చూస్తున్నాను కదా.. ట్రిమండస్! పహల్‌గామ్ ఘటనతో దేశంలో ఊహించని పరిణామాలు ఏర్పడ్డాయి కదా! అది కూడా కొంచెం భయపెట్టింది. ఫార్చునేట్లీ అంతా ప్రశాంతంగానే ఉంది. ఉండాలి కూడా! అయితే ఆ ఉద్రిక్త పరిస్థితుల్లో కూడా మా సేఫ్ అండ్ సెక్యూరిటీ విషయంలో ప్రభుత్వం చాలా అప్రమత్తంగా ఉంది. మాకెలాంటి ఇబ్బందీ కలగకుండా చూసుకుంది. చూసుకుంటోంది. తెలంగాణ కల్చర్, ఆర్ట్.. రిచ్ అండ్ క్రియేటివ్‌గా ఉంది. ఫుడ్ కొంచెం కారంగా ఉన్నా డెలీషియస్‌గా ఉంది. నచ్చింది. నా బ్యూటీ విత్ పర్పస్ విషయానికి వస్తే.. ఆటిజం, డౌన్‌సిండ్రోమ్ పిల్లల కోసం వర్క్ చేస్తున్నాను. అంతేకాదు సమాజంలోని అట్టడుగు వర్గాల సాధికారత కోసమూ కృషిచేస్తున్నాను. మనుషులందరూ సమానమే! కాబట్టి అవకాశాలూ సమానంగా ఉండాలి. ఉన్నవాళ్లు, లేనివాళ్లు, జెండర్ విభేదాలు ఉండకూడదు. అంతేకాదు ప్రతివారికీ వారికే ప్రత్యేకమైన ప్రతిభ ఉంటుంది. దాన్ని వాళ్లు గుర్తించి, ఆ దిశగా వాళ్ల ప్రయాణం సాగేందుకు సాయపడుతున్నాను" అన్నారు వలేరియా.

– రమ సరస్వతి

ఫొటో: ఎస్ ఎస్ ఠాకూర్

● యంగ్ టాలెంట్

ఈ అన్నదమ్ములు... సినిమాల గురించి మాట్లాడుకున్నంత ఇష్టంగా ఏఐ టెక్నాలజీ గురించి మాట్లాడుకుంటారు. అవి కాలక్షేప కబుర్లు కావు. ఈ కాలానికి అవసరమైన కబుర్లు. 'ఏఐ టెక్నాలజీలో మనం ఎక్కడ ఉన్నాం? మనం చేయాల్సింది ఏమిటి?' అనేది వారి మాటల సారాంశం. కేవలం మాటలకే పరిమితం కాకుండా '169పై. ఏఐ' స్టార్టప్‌తో ఏఐ స్టార్స్‌గా పేరు తెచ్చుకున్నారు రజత్, చిరాగ్...

టెక్నో బ్రదర్స్


● చిరాగ్ ఆర్య ● రజత్ ఆర్య

మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌కు చెందిన రజత్ ఆర్య, అతని తమ్ముడు చిరాగ్ ఆర్యకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) అనేది చాలా ఇష్టమైన సబ్జెక్ట్. ఆ రంగంలో వస్తున్న మార్పుల గురించి ఎప్పటికప్పుడు తెలుసుకునేవారు. ఆ ఆసక్తే వారిని ఏఐ స్టార్టప్ కంపెనీ '169పై.ఏఐ' స్థాపించేలా చేసింది.

అమెరికాలో కస్టమర్‌ల కోసం కొన్ని బ్లాక్‌చైన్ సొల్యూషన్స్‌ను డెవలప్ చేసి, చిన్నపాటి సాఫ్ట్‌వేర్ బిజినెస్ నిర్మించడంలో ఈ సోదరులకు కొంత అనుభవం ఉంది.

రెండు సంవత్సరాల క్రితం ప్రసిద్ధ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కంపెనీ 'ఓపెన్ ఏఐ' సీయివో సామ్ ఆల్ట్‌మాన్ మన దేశానికి వచ్చినప్పుడు లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్ బిల్డ్ చేయడం గురించి మాట్లాడారు. ఈ నేపథ్యంలో 'మనం కొత్తగా ఏంచేయవచ్చు' అని ఆలోచించారు ఆర్య బ్రదర్స్. ఇంటర్‌నెట్‌లో వెస్ట్-ఒరియెంటెడ్ సమాచారానికి బదులుగా మరింత దేశీయంగా ఏదైనా చేయడానికి ఒక అవకాశం ఉందని గ్రహించారు.

అలా....'169పై. ఏఐ' స్టార్టప్ మొదలైంది. స్మాల్ లాంగ్వేజ్ మోడల్స్‌పై ప్రత్యేకంగా దృష్టి పెట్టారు.

ఈ స్టారప్‌కు తొలి యూజర్....ఇస్రో!

'169పై. ఏఐ' క్రియేట్ చేసిన పీడీఎఫ్ ఏజెంట్‌ను 'ఇస్రో' పరీక్షించి పచ్చ జెండా ఊపింది. టన్నుల కొద్దీ డేటా ఉన్న 'ఇస్రో'కి ఉపయోగపడేలా పీడీఎఫ్ ఏజెంట్‌ను క్రియేట్ చేశారు. తాము సృష్టించిన ప్రోగ్రామ్ టేబుల్స్, డాక్యుమెంట్లు, చార్ట్‌లు జనరేట్ చేయడానికి ఇది యూజర్‌లకు ఉపయోగపడుతుంది.

పదకొండు మందితో కూడిన '169పై. ఏఐ' బృందం ఎడ్యుకేషనల్ సొల్యూషన్‌లను డెవలప్ చేస్తోంది. బిహార్‌లోని ప్రభుత్వ బడుల కోసం ఎడ్యుకేషనల్ మెటీరియల్‌ను క్రియేట్ చేయడానికి ఎన్‌సీఈఆర్‌టీ టెక్స్ట్‌బుక్స్ డేటాను ఉపయోగిస్తున్నారు. 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అనేది చాలా ఖరీదు అనే భావన ఉంది. ఈ సాంకేతికత అందరికీ అందుబాటులో ఉండాలి. రైతు నుండి సామాన్యుడి వరకు ప్రతి ఒక్కరూ దీన్ని ఉపయోగించాలి. ఎందుకంటే ఏఐ వారి పనిని సులభతరం చేస్తుంది. మా ఏఐ మోడల్ విదేశీ ఏఐ మోడల్స్‌లాగా డబ్బు తీసుకునేది కాదు. ఇది అందరికీ ఉచితంగా అందుబాటులో ఉంటుంది. ఇక స్టార్టప్ పేరు విషయానికి వస్తే 13 సంఖ్య స్క్వేర్, పై కన్‌స్టంట్ నుంచి స్ఫూర్తి పొందాం' అంటున్నాడు కంపెనీ చీఫ్ టెక్నికల్ ఆఫీసర్ చిరాగ్ ఆర్య. పాతదారిలో నడవడం విశేషమేమీ కాదు.

అయితే పాత దారిలో నడుస్తూనే కొత్త దారి గురించి ఆలోచించడం, అన్వేషించడమే విశేషం. అప్పుడే '169పై. ఏఐ' రూపంలో కొత్త ఆవిష్కరణలు ప్రజలకు పరిచయం అవుతాయి.

మన దేశానికి తనదైన ఏఐ మోడల్ లేకపోవడం నన్ను ఎప్పుడూ నిరాశకు గురి చేసేది. మనం విదేశీ ఏఐ మోడల్స్ మీద ఎక్కువగా ఆధారపడుతున్నాం. ఏఐ సాంకేతికతకు సంబంధించి విదేశాలపై ఎక్కువగా ఆధారపడకూడదు అనే ఆలోచన నుంచే స్టార్టప్ ఆలోచన వచ్చింది. మన ఫోన్‌లో ఉన్న అత్యధిక యాప్స్ విదేశాల నుంచి వచ్చినవే. మనకంటూ స్వంతమైన ప్లాట్‌ఫామ్ లేదు. భవిష్యత్తులో మనం ఏ దేశం మీద ఆధారపడకుండా ఉండడానికి మా స్టార్టప్ ఒక ప్రయత్నం.

– రజత్ ఆర్య, 169పై. ఏఐ ఫౌండర్, సీయివో

● టెక్.. టాక్

మోటోరోలా ఎడ్జ్ 60 ప్రో



డిస్‌ప్లే: 6.70 అంగుళాలు ఓఎస్: ఆండ్రాయిడ్ 15
రిజల్యూషన్: 1220×2712 పిక్సెల్స్ ఫ్రంట్ కెమెరా: 50 ఎంపీ
బ్యాటరీ: 6000 ఎంఏహెచ్ రిఫ్రెష్ రేట్: 120 హెచ్‌జెడ్ మెమోరీ: 256జీబి
8జీబి ర్యామ్/256జీబి 12జీబి ర్యామ్/ 512జీబి 12జీబి ర్యామ్

ఓపెన్ ఏఐ.... కోడక్స్



'కోడక్స్' అనే కొత్త ఏఐ టూల్‌ను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కంపెనీ 'ఓపెన్ ఏఐ' ఇంట్రడ్యూస్ చేసింది. మల్టీపుల్ సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్-రిలేటెడ్ టాస్క్‌లను హ్యాండిల్ చేయడానికి దీనిని రూపొందించారు. ఈ క్లౌడ్-బేస్డ్, ఏఐ ఏజెంట్-డ్రైవెన్ కోడింగ్ టూల్ కోడ్ జనరేట్ చేయడం, కోడ్‌బేస్ గురించి యూజర్ అడిగే ప్రశ్నలకు జవాబులు ఇవ్వడం, బగ్స్ ఫిక్స్ చేయడం, కోడ్ రివ్యూ కోసం పుల్ రిక్వెస్ట్ సజెస్ట్ చేయడంలాంటి పనులు చేస్తుంది. చాట్‌జీపీటీ ప్రో, ఎంటర్‌ప్రైజ్, టీమ్ యూజర్‌లకి ఈ ఏఐ కోడింగ్ టూల్‌తో యాక్సెస్ ఉంటుంది.

రీడిజైన్ విండోస్ 11



ఎట్టకేలకు రీడిజైన్ చేసిన విండోస్ 11 స్టార్ట్ మెనూను పరిచయం చేసింది మైక్రోసాఫ్ట్. మూడు వందల మందికి పైగా విండోస్ 11 ఫ్యాన్స్‌తో కలిసి ఈ స్టార్ట్ మెనూను డెవలప్ చేశారు. 'యాప్స్, ఫైల్స్, ఇతర కంటెంట్‌ని త్వరగా కనుగొనడంలో స్టార్ట్ మెనూ ఉపయోగపడుతుంది. అవసరమైన సలహాలు ఇస్తుంది. మొబైల్, డెస్క్‌టాప్ కంటెంట్ మధ్య తేడాను సులువుగా గుర్తించవచ్చు' అంటుంది మైక్రోసాఫ్ట్ డిజైనర్ టీమ్. కొత్త స్టార్ట్ మెనూలో 'ఆల్ యాప్స్' వ్యూ మూడు రకాలుగా ఉంటుంది. ఇందులో తరచుగా వాడే యాప్స్‌ని గ్రిడ్ రూపంలో కేటగిరీ ప్రకారం చూపిస్తుంది. ఈ కొత్త లేఅవుట్ నచ్చని యూజర్‌లు ఎప్పుడంటే అప్పుడు పాత వ్యూలోకి వెళ్లవచ్చు.

క్లీనింగ్ కిట్



బ్రాండ్: అమెజాన్ బేసిక్స్ కలర్: వైట్ మెటీరియల్: ప్లాస్టిక్ ఫర్: లాప్‌టాప్, మొబైల్, ఎయిర్ ప్యాడ్స్
● కీక్యాప్ పుల్లర్, క్లీనింగ్ క్లాత్ ● ఈ క్లీనింగ్ పెన్ చిన్న రంధ్రాలు, సందుల నుంచి దుమ్ము, మురికిని తొలగిస్తుంది. చార్జింగ్ పోర్ట్స్, హెడ్‌ఫోన్ జాక్స్‌లాంటి డెలికేట్ ఏరియాలను క్లీన్ చేయడానికి ఉపయోగపడుతుంది.
కీక్యాప్ పుల్లర్ దెబ్బతినకుండా 'కీ'లను సులభంగా తీసేలా డిజైన్ చేశారు. మైక్రోఫైబర్ క్లీనింగ్ క్లాత్, బ్యాక్ ఫైబర్ వైప్ ద్వారా నూనె మరకలు, దుమ్ము తొలగించి స్క్రీన్ కొత్తగా కనిపించేలా చేస్తాయి.

గూగుల్ ఏఐ మోడ్

గూగుల్ మొదలైనప్పటి నుంచి 'ఐయామ్ ఫీలింగ్ లక్కీ' ఆప్షన్ ఉంది. ఈ ఆప్షన్‌ని కొత్త 'ఏఐ మోడ్' బటన్‌తో రిప్లేస్ చేయనుంది గూగుల్. ప్రస్తుతం ఇది పరిమిత సంఖ్యలో యూజర్‌లకు మాత్రమే అందుబాటులో ఉంది. గూగుల్ తన కోర్ సెర్చ్ ఇంజిన్‌ను తన ఫ్లాగ్‌షిప్ ఏఐ మోడల్ జెమినితో మెర్జ్ చేసే ప్రయత్నంలో 'ఏఐ మోడ్'ని తీసుకువచ్చింది. ఓపెన్ ఏఐ, చాట్‌జీపీటీని దృష్టిలో పెట్టుకొని యూత్ కోసం ఏఐ సెర్చ్ ఫీచర్‌లను గూగుల్ పరీక్షిస్తోంది.



అవును.... ఇది నిజమే!



● 'వైట్ హౌజ్'ను ఒకప్పుడు ఎగ్జిక్యూటివ్ మాన్షన్, ప్రెసిడెంట్ ప్యాలెస్ అని పిలిచేవారు. ప్రెసిడెంట్ థియోడర్ రూజ్వెల్ట్ ఈ మాన్షన్‌కు 'వైట్ హౌజ్' అని నామకరణం చేశాడు.
● గోల్డ్‌ఫిష్ కేవలం మూడు సెకన్‌ల మెమరీ కలిగి ఉంటుందనేది అపోహ అని శాస్త్రీయ అధ్యయనాలు తెలియజేస్తున్నాయి.
● నూడుల్స్ లేదా పాస్తాను మార్కో పోలో కనిపెట్టాడని, చైనా నుంచి ఇటలీకి తీసుకువచ్చాడనేది విస్తృతంగా ప్రచారంలో ఉంది. అయితే దీంట్లో నిజం లేదు. నిజానికి మార్కో పోలో చైనాకు వెళ్లడానికి ముందుగానే ఇటలీలో పాస్తా ఉంది.
● మెదడులో మనం కేవలం పది శాతం మాత్రమే ఉపయోగిస్తామనేది అపోహ మాత్రమే.

యువర్స్

● గేమింగ్

వస్తున్నారు... వచ్చేశారు!



యాక్షన్-అడ్వెంచర్ గేమ్ 'ఒనిముష 2: సమురాయ్స్ డెస్టినీ' రీమాస్టర్డ్ రిలీజ్ ట్రైలర్ విడుదల అయింది. రీమాస్టర్డ్ రిలీజ్‌లో భాగంగా గేమ్‌లో కొత్త ఫీచర్‌లు వచ్చాయి. గేమ్‌ప్లే సైడ్ విషయానికి వస్తే...ఈజీ మోడ్, హెల్ మోడ్ అనేవి చేర్చారు. స్టోరీని ఎంజాయ్ చేయడానికి ప్లేయర్స్‌కు పర్‌ఫెక్ట్‌గా ఉపయోగపడే 'ఈజీ మోడ్' గేమ్ ప్రారంభం నుంచి ఉంటుంది. 'హెల్ మోడ్' అనేది డిఫికల్ట్ మోడ్. ఈ మోడ్‌లో 'వన్-షాట్ డెత్' ఉంటుంది. అంటే...యుద్ధంలో సింగిల్ మిస్టేక్ చేసినా ఆట తారుమారవుతుంది.

గేమ్ ప్రారంభం నుంచి మినీ గేమ్స్ అందుబాటులో ఉంటాయి.
ఉదా: ది మ్యాన్ ఇన్ బ్లాక్, టీమ్ ఒనీ, పజిల్ ఫాంటమ్
ఈ గేమ్ కోసం వందకు పైగా స్కెచ్‌లను క్యారెక్టర్ డిజైనర్ కైటా రూపొందించారు. 'మరింత స్టైలిష్ ఎక్స్‌పీరియెన్స్ కోసం' అంటున్నారు గేమ్ మేకర్స్.
ఫ్రాంచైజ్‌లో భాగంగా వస్తున్న కొత్త గేమ్ పేరు కూడా ప్రకటించారు.
ఒనిముషా: వే ఆఫ్ ది స్వోర్డ్ ప్లాట్‌ఫామ్స్: పీసీ, పీఎస్ 4, ఎక్స్‌బాక్స్ వన్, నిన్‌టెండో స్విచ్ జానర్: యాక్షన్-అడ్వెంచర్

● ఇంగ్లీష్ ఇడియమ్స్

కెటిల్ ఆఫ్ ఫిష్



కష్టకాలంలో, కన్‌ఫ్యూజింగ్‌గా ఉన్నప్పుడు, సమస్యలు ఎదురైనప్పుడు ఉపయోగించే మాట...కెటిల్ ఆఫ్ ఫిష్.
ఉదా: ఆఫ్టర్ ది టీమ్ లీడర్ క్విట్ అన్‌ఎక్స్‌పెక్టెడ్‌లీ, ఇట్ లెఫ్ట్ అజ్ విత్ ఏ ఫైన్ కెటిల్ ఆఫ్ ఫిష్ రైట్ బిఫోర్ ది డెడ్‌లైన్.

గ్రేట్ స్కాట్

పాజిటివ్ కావచ్చు, నెగెటివ్ కావచ్చు... ఒక విషయానికి సంబంధించి ఆశ్చర్యం వ్యక్తం చేసినప్పుడు, అద్భుతం అనే సందర్భం వచ్చినప్పుడు ఉపయోగించే మాట...గ్రేట్ స్కాట్.
ఉదా: సైంటిస్ట్స్ హ్యావ్ డిస్కవర్డ్ వాటర్ ఆన్ మార్స్.... గ్రేట్ స్కాట్స్

సాక్షి సినిమా


● అభిరామి, సుహాసిని, త్రిష, మణిరత్నం, కమల్‌హాసన్, శింబు, అశోక్ సెల్వన్, తనికెళ్ల భరణి, నాజర్, సుధాకర్ రెడ్డి

నేను ద్రోణాచార్య కాదు.. విద్యార్థినే - కమల్‌హాసన్

''నేను మనసు పెట్టి చేసిన ప్రతి సినిమా గొప్ప విజయాన్ని సాధించింది. 'థగ్ లైఫ్' కూడా మనసు పెట్టి చేసిన సినిమా. అద్భుతమైన టీమ్‌తో పని చేశాను. గొప్పగా సెలబ్రేట్ చేసుకునే ఇలాంటి సినిమా మళ్లీ మళ్లీ రాదు. మణిరత్నంగారు, నా కాంబినేషన్‌లో వచ్చిన 'నాయకుడు' చిత్రం కంటే 'థగ్ లైఫ్' పెద్ద విజయం సాధిస్తుంది... ఇది నా ప్రామిస్'' అని కమల్‌హాసన్ చెప్పారు.

మణిరత్నం దర్శకత్వంలో కమల్‌హాసన్ హీరోగా నటించిన చిత్రం 'థగ్ లైఫ్'. శింబు, త్రిష, అభిరామి, నాజర్ ముఖ్య పాత్రలు పోషించారు. రాజ్‌కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్, మద్రాస్ టాకీస్, రెడ్ జెయింట్ మూవీస్ పతాకాలపై రూపొందిన ఈ చిత్రం జూన్ 5న పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది. తెలుగులో శ్రేష్ఠ మూవీస్ పతాకంపై హీరో నితిన్ తండ్రి ఎస్. సుధాకర్ రెడ్డి విడుదల చేస్తున్నారు. గురువారం హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా మీట్‌లో కమల్‌హాసన్ మాట్లాడుతూ- ''నన్ను ద్రోణాచార్యతో పోల్చారు. కానీ, కాదు... ఇప్పటికీ విద్యార్థినే. ఇంకా నేర్చుకుంటూనే ఉన్నాను. మణిరత్నంగారి సినిమాలో నేను యాక్ట్ చేయను... జస్ట్ బిహేవ్ చేస్తాను. మేమంతా సినిమా అభిమానులం. సినిమాని ఎప్పుడు కూడా భుజాలపై మోస్తాం. నేను తెలుగులోనే స్టార్‌గా ఎదిగాను. అందుకు తెలుగు ప్రేక్షకులకు కృతజ్ఞతలు'' అన్నారు. మణిరత్నం మాట్లాడుతూ- ''నాయకుడు' తర్వాత ఇన్నేళ్లకు కమల్‌గారితో 'థగ్ లైఫ్' చేసే అవకాశం రావడం ఆనందంగా ఉంది. దర్శకుడికి సపోర్ట్ చేసే హీరో ఆయన'' అని తెలిపారు. ''నేను ఇక్కడికి వస్తే పుట్టింటికి వచ్చిన అనుభూతి కలుగుతుంది. 'థగ్ లైఫ్'ని ఆదరిస్తారనే నమ్మకం ఉంది'' అని నటి సుహాసినీ మణిరత్నం పేర్కొన్నారు. ''మణిరత్నంగారి క్రమశిక్షణ, టైమింగ్ అద్భుతం. కమల్‌గారితో వర్క్ చేయడం గొప్ప అనుభూతి'' అన్నారు శింబు. ''మణిరత్నం, కమల్‌హాసన్‌గార్లతో పని చేసే అవకాశం రావడం గొప్ప అదృష్టంగా భావిస్తున్నాను'' అని త్రిష చెప్పారు. సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ- ''ఈ సినిమా ట్రైలర్, సాంగ్స్ చూసిన తర్వాత కమల్ సార్ కెరీర్‌లోనే బిగ్గెస్ట్ హిట్ అవుతుందనే నమ్మకం కలిగింది'' అన్నారు.

విలేజ్‌లో పెద్ది యాక్షన్


● రామ్‌చరణ్

విలేజ్‌లోకి ఎంట్రీ ఇచ్చారు పెద్ది. రామ్‌చరణ్ హీరోగా బుచ్చిబాబు సానా దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'పెద్ది'. ఈ మల్టీస్పోర్ట్స్ చిత్రంలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, శివ రాజ్‌కుమార్, జగపతిబాబు, దివ్యేందు శర్మ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీష్ కిలారు ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ప్రొడక్షన్ డిజైనర్ అవినాష్ కొల్లా నేతృత్వంలో హైదరాబాద్ శివార్లలో ఓ భారీ విలేజ్ సెట్‌ని 'పెద్ది' సినిమా కోసం సిద్ధం చేశారు. ప్రస్తుతం ఈ సెట్‌లోనే ఓ భారీ యాక్షన్ సీక్వెన్స్, కొంత టాకీ పార్ట్ చిత్రీకరించడానికి ప్లాన్ చేశారు మేకర్స్. గురువారం హనుమాన్ జయంతి సందర్భంగా ఈ సినిమా వర్కింగ్ స్టిల్స్‌ను 'ఇన్ స్టా'లో షేర్ చేశారు రామ్‌చరణ్. ''ఇప్పటికే 30 శాతం షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా చిత్రీకరణ ఈ షెడ్యూల్‌తో కీలక దశకు చేరుకుంటుంది'' అని యూనిట్ పేర్కొంది. వచ్చే ఏడాది మార్చి 27న 'పెద్ది' విడుదల కానుంది.

ఈ ప్రేమ చాలా విలువైనది - ఎన్టీఆర్

''వార్ 2' టీజర్‌కి ప్రజల నుంచి వస్తున్న ప్రేమ, ప్రశంసలు చూస్తుంటే నేను నటుణ్ణి అయినందుకు చాలా సంతోషంగా ఉంది. ఇంతటి ప్రేమ లభించడం ఒక వరంలా అనిపిస్తోంది. మీరు చూపించే ఈ ప్రేమ నాకు చాలా విలువైనది'' అని హీరో ఎన్టీఆర్ అన్నారు. హృతిక్ రోషన్, కియారా అద్వానీ జంటగా నటించిన చిత్రం 'వార్ 2'. అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహించిన ఈ సినిమా ద్వారా ఎన్టీఆర్ హిందీ పరిశ్రమకి పరిచయమవుతున్నారు. యశ్ రాజ్ ఫిల్మ్స్‌పై ఆదిత్యా చోప్రా నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 14న హిందీ, తెలుగు, తమిళ భాషల్లో విడుదల కానుంది. ఈ నెల 20న ఎన్టీఆర్ పుట్టినరోజు సందర్భంగా 'వార్ 2' టీజర్‌ని విడుదల చేశారు. ఈ టీజర్‌కు ప్రపంచవ్యాప్తంగా అద్భుతమైన స్పందన వచ్చినట్లు చిత్రయూనిట్ పేర్కొంది. ఈ నేపథ్యంలో ఎన్టీఆర్ స్పందిస్తూ- ''వార్ 2'లో నా పాత్ర నాకు చాలా ప్రత్యేకమైనది. నన్ను పూర్తిగా కొత్తగా చూపించారు. యూనిట్ అంతా సరదాగా కలిసి పని చేశాం. థియేటర్లో మీ స్పందన చూడటానికి నాకు మరింత ఆనందంగా, ఉత్సాహంగా ఉంటుంది. 'వార్ 2' మీద మీరు చూపిస్తున్న ప్రేమకు థ్యాంక్స్. దేశంలోని ప్రతి మూల నుంచి వస్తున్న ప్రేమని చూసి ఉప్పొంగిపోయాను. టీజర్ ఇంతటి ప్రభావం చూపించడం సంతోషంగా ఉంది. ఆగస్టు 14 నుంచి థియేటర్లలో అభిమానుల సందడి చూసేందుకు నేను ఎంతగానో ఎదురు చూస్తున్నాను'' అని పేర్కొన్నారు.



వినోదం వైభవం


● సాత్విక్, రమాదేవి, రుత్విక్

రుత్విక్, ఇక్రా ఇద్రిసి జంటగా నటించిన చిత్రం 'వైభవం'. సాత్విక్ దర్శకత్వంలో రమాదేవి నిర్మించిన ఈ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ మూవీ నేడు విడుదల అవుతోంది. ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో రమాదేవి మాట్లాడుతూ- ''నా కుమారులు (రుత్విక్, సాత్విక్) చదువు, ఆటపాటల్లో అన్నింటా ముందుండి, మంచి ఉద్యోగాలు సంపాదించుకుని, పుత్రోత్సాహం కలిగించారు. సినిమా రంగంపై ప్యాషన్‌తో ఉద్యోగాలు వదలిపెట్టి, 'వైభవం'తో సినీ రంగ ప్రవేశం చేస్తున్నారు. ఈ రంగంలోనూ విజయ బావుటా ఎగురవేస్తారనే నమ్మకం ఉంది'' అని అన్నారు లాయర్, ఈ చిత్రనిర్మాత రమాదేవి. ''మా అమ్మ (రమాదేవి) మాపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము కానివ్వం. 'వైభవం' మాకు సినిమా రంగంలోనూ మంచి ఆరంభం ఇస్తుందన్న నమ్మకం ఉంది'' అని తెలిపారు రుత్విక్-సాత్విక్.

మాస్ ఉస్తాద్


● పవన్ కల్యాణ్

హీరో పవన్ కల్యాణ్, దర్శకుడు హరీష్ శంకర్ కాంబినేషన్‌లో రూపొందుతున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ మూవీ 'ఉస్తాద్ భగత్‌సింగ్'. ఈ చిత్రంలో శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ జూన్ నుంచి ప్రారంభం కానున్నట్లుగా గురువారం మేకర్స్ వెల్లడించారు. ''ఈ సినిమాలో పవన్ కల్యాణ్ పూర్తి స్థాయి కమర్షియల్ మాస్ అవతార్‌లో అలరించనున్నారు'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: దేవిశ్రీ ప్రసాద్.

లైఫ్ జర్నీ


● బాలు, షిన్నోవా

బాలు, షిన్నోవా జంటగా నటించిన చిత్రం 'ఒక బృందావనం'. బొత్స సత్య దర్శకత్వంలో కిశోర్ తాటికొండ, వెంకట్ రేగట్టే, ప్రహ్లాద్ బొమ్మినేని, మనోజ్ ఇందుపూరు నిర్మించారు. మైత్రీ మూవీస్ ద్వారా ఈ చిత్రం నేడు విడుదల అవుతోంది. ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో అతిథిగా పాల్గొన్న హీరో నారా రోహిత్ మాట్లాడుతూ- ''ఓ అబ్బాయి లైఫ్ జర్నీయే ఈ సినిమా. బాలు పెర్ఫార్మెన్స్ ప్రేక్షకులను అలరిస్తుంది'' అన్నారు. ''చక్కని ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన చిత్రమిది. థియేటర్స్‌లో కుటుంబంతో కలిసి చూసి, ఎంజాయ్ చేయాల్సిన మూవీ'' అని చెప్పారు బాలు, కిశోర్, మనోజ్.

నిశ్శబ్ద ప్రేమ

శ్రీరామ్, ప్రియాంకా తిమ్మేష్ జంటగా నటించిన చిత్రం 'నిశ్శబ్ద ప్రేమ'. రాజ్ దేవ్ దర్శకత్వంలో ఎస్. కార్తికేయన్ నిర్మించిన ఈ చిత్రం నేడు విడుదల కానుంది. ఈ చిత్రం ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో దర్శకుల సంఘం అధ్యక్షుడు వీరశంకర్ సాంగ్‌ను రిలీజ్ చేయగా, ప్రొడ్యూసర్ కౌన్సిల్ సెక్రటరీ ప్రసన్న కుమార్ ట్రైలర్‌ను లాంచ్ చేశారు. నిర్మాతలు చింతపల్లి రామారావు, రాజేశ్ పుత్ర, డిస్ట్రిబ్యూటర్ సుబ్బారెడ్డి కూడా అతిథులుగా హాజరయ్యారు. వీరశంకర్ మాట్లాడుతూ- ''తమిళంలో 50 కోట్ల రూపాయలకు పైగా వసూళ్లు సాధించిన ఈ చిత్రం తెలుగులోనూ విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది. ఈ చిత్రంతో మా పరిటాల రాంబాబు డిస్ట్రిబ్యూటర్‌గా మారడం హ్యాపీగా ఉంది'' అన్నారు. ''లవ్‌స్టోరీ, థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో గ్రిప్పింగ్‌గా సాగే ఈ మూవీ ప్రేక్షకులను నిరాశపరచదు'' అని అన్నారు శ్రీరామ్. ''నిశ్శబ్ద ప్రేమ' సినిమాను తెలుగు ప్రేక్షకులు కూడా సక్సెస్ చేస్తారని ఆశిస్తున్నాను'' అని చెప్పారు రాజ్ దేవ్.


● ప్రియాంక, శ్రీరామ్

ఏస్ అలరిస్తుంది - విజయ్ సేతుపతి


● ఆరుముగ కుమార్, విజయ్ సేతుపతి, శివప్రసాద్, హరిప్రసాద్

విజయ్ సేతుపతి, రుక్మిణీ వసంత్ హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'ఏస్'. ఆరుముగ కుమార్ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన ఈ చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ చిత్రాన్ని బి. శివ ప్రసాద్ తెలుగులో విడుదల చేస్తున్నారు. హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో విజయ్ సేతుపతి మాట్లాడుతూ- ''నాకు సినిమాలో తొలి అవకాశం ఇచ్చిన ఆరుముగ కుమార్‌తో మళ్లీ ఇప్పుడు సినిమా చేయడం సంతోషంగా ఉంది. 'ఏస్' ప్రేక్షకులందరిని అలరించేలా ఉంటుంది'' అని అన్నారు. ''యాక్షన్... రొమాన్స్... ఫన్... ఇలా అన్ని రకాల అంశాలతో 'ఏస్' ఫుల్ మీల్స్‌లా ఉంటుంది'' అని తెలిపారు ఆరుముగ కుమార్. ''ఏస్' సినిమా కథ, క్యారెక్టర్స్ అన్నీ అద్భుతంగా ఉంటాయి'' అని బి. శివ ప్రసాద్ పేర్కొన్నారు.

సాక్షి బిజినెస్
శుక్రవారం
23-5-2025

స్టాక్ మార్కెట్లు

(తొలి రెండు రాత్రి 11:30 ముగింపు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
645	204
80,952	24,610

విదేశీ సూచీలు

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	18,996	△	123
డోజోన్స్	41,983	△	122
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,739	▽	47
డాక్స్	23,999	▽	123
షాంఘై	3,380	▽	7
నికాయ్	36,986	▽	313

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు (రూ. లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	85.20	86.22
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	113.60	116.56
€	యూరో	ఎస్‌బీఐ	95.82	98.52
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	59.07	60.62
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	54.17	56.37
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	64.32	69.01
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	22.03	23.55
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.53	24.31
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.06	12.88

ఓఎన్‌జీసీ లాభం నేలచూపు

క్యూ4లో రూ. 6,448 కోట్లు



ముంబై: ప్రభుత్వ రంగ ఇంధన దిగ్గజం ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ (ఓఎన్‌జీసీ) గతేడాది (2024–25) చివరి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. జనవరి–మార్చి(క్యూ4)లో నికర లాభం 35% క్షీణించి రూ. 6,448 కోట్లకు పరిమితమైంది. అంతక్రితం ఏడాది (2023–24) ఇదే కాలంలో రూ. 9,869 కోట్లు ఆర్జించింది. ముడిచమురు ఉత్పత్తి, రిఫైనరీలకు విక్రయంపై ఒక్కో బ్యారల్‌కు 73.72 డాలర్ల చొప్పున లభించినట్లు కంపెనీ పేర్కొంది. అంతక్రితం క్యూ4లో 80.81 డాలర్లు చొప్పున అందుకుంది. మొత్తం ఆదాయం నామమాత్ర వృద్ధితో రూ. 34,982 కోట్లను తాకింది. ఈ కాలంలో యథాతథంగా 4.7 మిలియన్ టన్నుల (ఎంటీ) చమురు ఉత్పత్తి చేసింది. సహజవాయు ఉత్పత్తి సైతం 4.951 బిలియన్ క్యూబిక్ మీటర్ల (బీసీఎం) నుంచి 4.893 బీసీఎంకు స్వల్పంగా మందగించింది.

పూర్తి ఏడాదికి చూస్తే...

మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి ఓఎన్‌జీసీ నికర లాభం 12 శాతం క్షీణించి రూ. 35,610 కోట్లకు పరిమితమైంది. మొత్తం ఆదాయం యథాతథంగా రూ. 1.37 లక్షల కోట్లకు చేరింది. చమురు ధరలు 5 శాతం తక్కువగా బ్యారల్‌కు 76.9 డాలర్లు చొప్పున లభించాయి. గ్యాస్ విక్రయాలపై ఒక్కో ఎంబీటీయూకి 6.5 డాలర్లు చొప్పున అందుకుంది. స్టాండెలోన్ చమురు ఉత్పత్తి 18.558 ఎంటీకి చేరగా.. సహజవాయు ఉత్పత్తి 19.654 బీసీఎంగా నమోదైంది. గత 35ఏళ్లలోనే అత్యధికంగా 578 బావులలో తవ్వకాలు చేపట్టినట్లు కంపెనీ వెల్లడించింది. 2023– 24లో 544 బావులలో తవ్వకాలు సాగించింది. ఈ కాలంలో మొత్తం రూ. 62,000 కోట్ల పెట్టుబడులు వెచ్చించింది.

ఫలితాల నేపథ్యంలో ఓఎన్‌జీసీ షేరు బీఎస్‌ఈలో 3% నష్టంతో రూ. 242 వద్ద ముగిసింది.

బజాజ్ ఆటో చేతికి కేటీఎమ్

- మెజారిటీ వాటా కొనుగోలుకి రెడీ
- రూ. 7,765 కోట్ల పెట్టుబడులకు సై



న్యూఢిల్లీ: ద్విచక్ర, త్రిచక్ర వాహన రంగ దిగ్గజం బజాజ్ ఆటో తాజాగా ఆస్ట్రియన్ బైక్ తయారీ కంపెనీ కేటీఎమ్‌లో మెజారిటీ వాటా కొనుగోలు చేయనుంది. ఇందుకు వీలుగా సొంత అనుబంధ సంస్థ బజాజ్ ఆటో ఇంటర్నేషనల్ హోల్డింగ్స్ బీవీ ద్వారా ఆర్థిక సవాళ్లు ఎదుర్కొంటున్న కేటీఎమ్‌కు డెట్ ఫండింగ్ ప్యాకేజీ ద్వారా 80 కోట్ల యూరోలు(సుమారు రూ. 7,765 కోట్లు) అందించనుంది. వెరసి కేటీఎమ్‌లో మైనారిటీ వాటాదారు స్థాయినుంచి మెజారిటీ (యాజమాన్య) సంస్థగా అవతరించనున్నట్లు బజాజ్ ఆటో తాజాగా వివరించింది. సంయుక్త డెవలప్‌మెంట్ పథకంలో భాగంగా కేటీఎమ్ బిజినెస్‌ను పట్టాలెక్కించనున్నట్లు తెలియజేసింది. అభివృద్ధి, తయారీ, అమ్మకాలు చేపట్టడం ద్వారా భారత్‌సహా 80 దేశాలకు ఎగుమతి చేయనున్నట్లు వెల్లడించింది. డెట్ ఫండింగ్ ప్యాకేజీలో భాగంగా ఆస్ట్రియన్ కోర్టు ఆదేశాల ప్రకారం రుణదాతలకు తగినస్థాయిలో చెల్లింపులతోపాటు కంపెనీ కార్యకలాపాల పునరుద్ధరణకు నిధులు అందించనున్నట్లు వివరించింది. ఇప్పటికే 20 కోట్ల యూరోలు విడుదల చేయగా.. మిగిలిన 60 కోట్ల యూరోలను అందించనున్నట్లు తెలియజేసింది. కంపెనీ కేటీఎమ్, హుస్క్వానా, గ్యాస్‌గ్యాస్ పేరుతో సుప్రసిద్ధ మోటార్‌సైకిళ్ల బ్రాండ్లను కలిగి ఉన్న సంగతి తెలిసిందే. కేటీఎమ్ ఏజీ హోల్డింగ్ సంస్థ పీరర్ మొబిలిటీ ఏజీ(పీఎంఏజీ) కాగా.. తాజా లావాదేవీకి ముందు పీఎంఏజీ/కేటీఎమ్‌లో బజాజ్ ఆటో 37.5 శాతం వాటాను కలిగి ఉంది.

బీఎస్‌ఈలో బజాజ్ ఆటో షేరు 0.5 శాతం బలపడి రూ. 8,734 వద్ద ముగిసింది.

ఐటీసీ లాభం ఫ్లాట్

- క్యూ4లో రూ. 6,417 కోట్లు
- షేరుకి రూ. 7.85 డివిడెండ్

ముంబై: ఎఫ్‌ఎంసీజీ దిగ్గజం ఐటీసీ గతేడాది(2024–25) చివరి త్రైమాసికంలో పటిష్ఠ ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి(క్యూ4)లో పన్ను, అసాధారణ పద్దుకుముందు స్టాండెలోన్ నికర లాభం స్వల్పంగా 2 శాతం పుంజుకుని రూ. 6,417 కోట్లకు చేరింది. సిగరెట్ల ఆదాయం పుంజుకోవడం ఇందుకు ప్రధానంగా తోడ్పడింది. అంతక్రితం ఏడాది (2023–24) ఇదే కాలంలో రూ. 6,288 కోట్లు ఆర్జించింది. హోటళ్ల బిజినెస్ విడదీత తదుపరి ఫలితాలివి. ఐటీసీ హోటళ్ల విడదీతతో రూ. 15,179 కోట్ల వన్‌టైమ్ లాభం అందుకుంది. పట్టణాలలో వినియోగం మందగించినప్పటికీ గ్రామీణ ప్రాంతాల డిమాండ్ అమ్మకాలకు అండగా నిలిచినట్లు ఐటీసీ పేర్కొంది. వాటాదారులకు కంపెనీ బోర్డు షేరుకి రూ. 7.85 చొప్పున తుది డివిడెండ్ ప్రకటించింది. సిగరెట్ల బిజినెస్ ద్వారా 4 శాతం అధికంగా రూ. 5,118 కోట్ల అమ్మకాలు సాధించింది. కన్సూమర్ బిజినెస్ ఆదాయం 4 శాతం వృద్ధితో రూ. 5,495 కోట్లను తాకింది. కాగా.. క్యూ4లో మొత్తం ఆదాయం 9 శాతం ఎగసి రూ. 18,266 కోట్లను తాకింది.

పూర్తి ఏడాదికి...

మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి రూ. 20,092 కోట్ల నికర లాభం ఆర్జించింది. 2023–24లో లాభం రూ.19,910 కోట్లు. మొత్తం ఆదాయం రూ. 66,657 కోట్ల నుంచి రూ. 73,465 కోట్లకు జంప్ చేసింది. ఇక హోటళ్ల బిజినెస్ తొలి 9 నెలల్లో(ఏప్రిల్–డిసెంబర్ 2024) రికార్డ్ నెలకొల్పుతూ రూ. 573 కోట్ల నిర్వహణ లాభం ఆర్జించినట్లు ఐటీసీ వెల్లడించింది. అసాధారణ పద్దుతోపాటు, పన్నుకు ముందు లాభమిది. హోటళ్ల బిజినెస్‌ను 2025 జనవరిలో విడదీయడం తెలిసిందే.

ఫలితాల నేపథ్యంలో ఐటీసీ షేరు బీఎస్‌ఈలో 1.6 శాతం నష్టంతో రూ. 426 వద్ద ముగిసింది.

నైపుణ్యాలు, ఉద్యోగ పురోగతికే ప్రాధాన్యం

- జెన్ జెడ్, మిలీనియల్స్ అభిప్రాయం
- డెలాయిట్ సర్వేలో వెల్లడి



ముంబై: కంపెనీల కార్యకలాపాల్లో ఆటోమేషన్, జెనరేటివ్ ఏఐ వినియోగం విస్తరిస్తుండడంతో.. జెనరేషనల్ జెడ్, మిలీనియల్స్ తరగతి యువత నైపుణ్యాలు పెంచుకునేందుకు, ఉద్యోగంలో పురోగతికి ప్రాధాన్యం ఇస్తున్నారు. ఉద్యోగ నిర్ణయాల్లో పురోగతి, అభ్యాసనా అవకాశాలకే తమ ప్రాధాన్యమని డెలాయిట్ సర్వేలో వారు చెప్పారు. జెన్ జెడ్, మిలీనియల్స్‌లో 85 శాతం మంది ప్రతి వారం చివర్లో నైపుణ్యాలు పెంచుకునేందుకు, పనిచేస్తూనే నేర్చుకునేందుకు ప్రాధాన్యం ఇస్తున్నట్టు డెలాయిట్ ఇండియా చీఫ్ హ్యాపినెస్ ఆఫీసర్ సరస్వతి కస్తూరి రంగన్ తెలిపారు. కాకపోతే వీరికి తగినంత మార్గదర్శకత్వం లభించడం లేదని డెలాయిట్ సర్వే పేర్కొంది. సర్వేలో పాల్గొన్న వారిలో సగం మంది తమ మేనేజర్ల నుంచి మార్గదర్శనం కోరుకుంటుంటే.. అది కొందరికే లభిస్తున్నట్టు తెలిపింది. 505 మంది జెనరేషన్ జెడ్, 304 మిలీనియల్స్ అభిప్రాయాలను ఈ సర్వేలో భాగంగా డెలాయిట్ తెలుసుకుంది. 1981–1996 మధ్య జన్మించిన వారిని మిలీనియల్స్‌గా, 1997–2012 మధ్యకాలంలో జన్మించిన వారిని జెనరేషన్ జెడ్ కింద పరిగణిస్తుంటారు.

పట్టాలు కాదు.. అనుభవానికే పెద్ద పీట

వేగంగా మార్పులకు గురవుతున్న ఉద్యోగ మార్కెట్లో సంప్రదాయ డిగ్రీ అర్హతల కంటే.. అనుభవానికే అగ్ర తాంబూలం లభిస్తున్న విషయాన్ని ఈ సర్వే గుర్తు చేసింది. దీంతో సంప్రదాయ విద్యా వ్యవస్థ నాణ్యతపై సందేహాలు లేవనెత్తింది. 94 శాతం జెన్ జెడ్, 97 శాతం మిలీనియల్స్ సిద్ధాంతాల కంటే అనుభవానికే విలువ ఎక్కువని చెప్పారు. ఉన్నత విద్యపై 52 శాతం జెన్ జెడ్, 45 శాతం మిలీనియస్స్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఉన్నత విద్య వ్యయాలపై 36 శాతం జెన్ జెడ్, 40 శాతం మిలీనియల్స్ ఆందోళన వ్యక్తం చేశారు. ఆందోళన, ఒత్తిడి విషయంలో ఉద్యోగం కారణమవుతున్నట్టు 36 శాతానికి పైనే చెప్పారు.

ఉద్యోగుల శ్రేయస్సుపై దృష్టి పెట్టాలి..

''ఉద్యోగుల సంతోషం, శ్రేయస్సు విషయంలో సంస్థలు తమ విధానాలను తిరిగి పరిశీలన చేయాల్సిన అవసరం ఉంది. భౌతిక, మానసిక, ఆర్థిక శ్రేయస్సు ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్నాయి. నాయకత్వం స్థాయిలో వీటిని పరిష్కరించాల్సి ఉంది''అని ఈ సర్వే నివేదిక తెలిపింది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో..

సరికొత్తగా టాటా ఆల్ట్రోజ్	ఇండస్‌ఇండ్ బ్యాంక్‌లో ఉల్లంఘనలపై సెబీ దృష్టి

ప్రపంచ ప్రతికూలతలు పడేశాయ్

- అమెరికా ఆర్థిక పరిస్థితిపై ఆందోళనలు
- బాండ్లపై పెరిగిన రాబడులు
- ఐటీ, ఆయిల్ షేర్లలో అమ్మకాలు
- అరశాతానికిపైగా పతనమైన సూచీలు




ముంబై: అంతర్జాతీయ మార్కెట్లలోని ప్రతికూల సంకేతాల ప్రభావంతో దేశీయ స్టాక్ సూచీలు గురువారం అరశాతానికిపైగా నష్టపోయాయి. అమెరికా ఆర్థిక పరిస్థితిపై ఆందోళనలు, బాండ్లపై రాబడులు పెరగడంతో ఐటీ, ఆయిల్, ఎఫ్‌ఎంసీజీ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ఫలితంగా సెన్సెక్స్ 645 పాయింట్లు నష్టపోయి 80,952 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 204 పాయింట్లు కోల్పోయి 24,610 వద్ద నిలిచింది. ఒక దశలో సెన్సెక్స్ 1,107 పాయింట్లు క్షీణించి 80,490 వద్ద, నిఫ్టీ 351 పాయింట్లు పతనమై 24,462 వద్ద ఇంట్రాడే కనిష్టాలు తాకాయి.

- బీఎస్‌ఈలో రంగాల వారీగా ఎఫ్‌ఎంసీజీ 1.25%, ఐటీ 1.19%, ఆయిల్‌అండ్‌గ్యాస్ 1.13%, ఐటీ, ఆటో ఇండెక్సులు ఒకశాతం క్షీణించాయి. మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు 0.33%, 0.17% నష్టపోయాయి

ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు డీలా...

పన్నుల మినహాయింపు ప్రతిపాదిత బడ్జెట్‌తో అమెరికా రుణం మరింత పెరిగిపోతుందనే ఆందోళనలు రేకెత్తాయి. అలాగే యూఎస్ బాండ్లపై రాబడులు 5% మించగా, జపాన్ బాండ్ ఈల్డ్స్ 3.5 శాతానికి చేరుకున్నాయి. దీంతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు డీలాపడ్డాయి. ఆసియాలో జపాన్ నికాయ్, దక్షిణ కొరియా కోస్పీ, హాంగ్‌కాంగ్ హాంగ్ సెంగ్‌లు 1%, థాయిలాండ్ తైవాన్ వెయిటెడ్, చైనా షాంఘై సూచీలు అరశాతం నష్టపోయాయి. యూరప్ జర్మనీ డాక్స్, ఫ్రాన్స్ సీఏసీ, బ్రిటన్ ఎఫ్‌టీఎస్ఈ ఇండెక్సులు ఒకశాతం పతనమయ్యాయి. అమెరికా స్టాక్ సూచీలు స్వల్ప లాభాల్లో ట్రేడవుతున్నాయి.

రూపాయి 36 పైసలు క్రాష్



విదేశీ బ్యాంకులు, దిగుమతిదారుల నుంచి డాలర్లకు డిమాండ్ పెరగడంతో రూపాయి అమ్మకాల ఒత్తిడికి లోనైంది. డాలర్ మారకంలో 36 పైసలు క్షీణించి 85.95 వద్ద స్థిరపడింది. అమెరికా బాండ్లపై రాబడులు పెరగడం ప్రపంచ ఇన్వెస్టర్లను కలవరపెట్టింది. మధ్యప్రాచ్య దేశాల్లో భౌగోళిక ఉద్రిక్తతలు తారస్థాయికి చేరుకోవడంతో క్రూడాయిల్ ధరలు పెరిగాయి. ఈ పరిణామాలూ దేశీయ కరెన్సీపై ప్రభావాన్ని చూపాయి.

సాక్షి స్పోర్ట్స్



జాకబ్ బెథెల్ స్థానంలో టిమ్ సీఫెర్ట్

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) ఫ్రాంచైజీ... న్యూజిలాండ్ ప్లేయర్ టిమ్ సీఫెర్ట్‌ను జట్టులోకి తీసుకుంది. ఇంగ్లండ్ ప్లేయర్ జాకబ్ బెథెల్ ఆర్‌సీబీని వీడనుండటంతో... 'ప్లే ఆఫ్స్' కోసం ఫ్రాంచైజీ కివీస్ వికెట్ కీపర్‌ను ఎంపిక చేసుకుంది. న్యూజిలాండ్ తరఫున 66 అంతర్జాతీయ టి20 మ్యాచ్‌లాడిన సీఫెర్ట్ ఐపీఎల్‌లో చివరిసారిగా 2022లో బరిలోకి దిగాడు.



ముకేశ్ కుమార్‌కు జరిమానా

ఐపీఎల్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ పేసర్ ముకేశ్ కుమార్ మ్యాచ్ ఫీజులో 10 శాతం కోత పడింది. బుధవారం ముంబైతో జరిగిన మ్యాచ్‌లో ముకేశ్ లెవల్–1 తప్పిదానికి పాల్పడిన కారణంగా అతడి ఖాతాలో ఒక డీ మెరిట్ పాయింట్ చేరింది. క్రీడా పరికరాలను విసిరికొట్టడం, ప్రత్యర్థులు, అంపైర్లతో దురుసుగా ప్రవర్తించడం వంటివి లెవల్–1 కిందికి వస్తాయి.

గుజరాత్‌కు లక్నో షాక్

33 పరుగుల తేడాతో సూపర్‌జెయింట్స్ గెలుపు

- సెంచరీతో చెలరేగిన మార్ష్
- పూరన్ మెరుపు అర్ధసెంచరీ


మిచెల్ మార్ష్

అహ్మదాబాద్: ఐపీఎల్‌లో ప్లేఆఫ్స్‌కు చేరిన గుజరాత్ టైటాన్స్ తదుపరి లక్ష్యం టాప్–2లో చేరడం. ఈ ప్రయత్నానికి లక్నో సూపర్‌జెయింట్స్ అడ్డొచ్చింది. గురువారం జరిగిన పోరులో లక్నో 33 పరుగుల తేడాతో గుజరాత్‌పై గెలిచింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన లక్నో సూపర్‌జెయింట్స్ నిర్ణీత 20 ఓవర్లలో 2 వికెట్లు మాత్రమే కోల్పోయి 235 పరుగుల భారీ స్కోరు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' మిచెల్ మార్ష్ (64 బంతుల్లో 117; 10 ఫోర్లు, 8 సిక్స్‌లు) శతక్కొట్టగా, నికోలస్ పూరన్ (27 బంతుల్లో 56 నాటౌట్; 4 ఫోర్లు, 5 సిక్స్‌లు) చెలరేగాడు. అనంతరం గుజరాత్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 202 పరుగులు చేసి ఓడింది. షారుఖ్ ఖాన్ (29 బంతుల్లో 57; 5 ఫోర్లు, 3 సిక్స్‌లు), రూథర్‌ఫర్డ్ (22 బంతుల్లో 38; 1 ఫోర్, 3 సిక్స్‌లు) మాత్రమే రాణించారు. క్యాన్సర్ అవగాహన–ప్రచార కార్యక్రమంలో భాగంగా ప్రతీ సీజన్ తరహాలోనే ఈ సారి కూడా ఒక మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్ లావెండర్ రంగు జెర్సీతో బరిలోకి దిగింది.


పూరన్

ఓపెనింగ్ ధాటితో...

ఓపెనర్లు మార్ష్, మార్క్‌రమ్ జోడీ లక్నోకు శుభారంభం ఇచ్చింది. గుజరాత్ బౌలర్లపై మార్ష్ విరుచుకుపడటంతో 5.3 ఓవర్లో లక్నో స్కోరు ఫిఫ్టీ దాటింది. మరోవైపు నుంచి మార్క్‌రమ్ (24 బంతుల్లో 36; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) కూడా షాట్లతో పరుగుల వేగం పెంచాడు. ఈ క్రమంలో మార్ష్ 33 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఓపెనర్ మార్క్‌రమ్‌ను కిషోర్ అవుట్ చేసి 91 పరుగుల తొలి వికెట్ భాగస్వామ్యానికి తెరదించాడు. రషీద్‌ఖాన్‌పై మార్ష్ పిడుగల్లే చెలరేగాడు. అతను వేసిన ఇన్నింగ్స్ 12వ ఓవర్లో వరుసగా 6, 4, 6, 4, 4, 1లతో ఏకంగా 25 పరుగుల్ని రాబట్టాడు.

మార్ష్ సెంచరీ, పూరన్ ఫిఫ్టీ

మార్ష్‌తో పాటు వన్‌డౌన్ బ్యాటర్ పూరన్ కూడా ధాటిగా ఆడటంతో ప్రతీ ఓవర్‌కు 10 పైచిలుకు రన్‌రేట్‌తో పరుగులు వచ్చాయి. మార్ష్ 56 బంతుల్లో సెంచరీ సాధించాడు. కాసేపటికే పూరన్ కూడా 23 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేసుకున్నాడు. వీరిద్దరి వీరవిహారంతో లక్నో 17.4 ఓవర్లలో 200 మార్క్ దాటింది. డెత్ ఓవర్లలో భారీ షాట్లు ఆడేక్రమంలో మార్ష్ అవుట్ కాగా... రెండో వికెట్‌కు 121 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. పూరన్‌తో పంత్ (6 బంతుల్లో 16 నాటౌట్; 2 సిక్స్‌లు) అజేయంగా నిలిచాడు.

షారుఖ్ పోరాడినా...

కష్టమైన లక్ష్యాన్ని ఛేదించేందుకు ఆరంభం నుంచే దంచేందుకు దిగిన టాపార్డర్ బ్యాటర్లు అంతే వేగంగా వికెట్లు పారేసుకున్నారు. సాయి సుదర్శన్ (21; 4 ఫోర్లు), శుబ్‌మన్ గిల్ (20 బంతుల్లో 35; 7 ఫోర్లు), బట్లర్ (18 బంతుల్లో 33; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) నిష్క్రమించడంతో లక్నో శిబిరం సంబరం చేసుకుంది. కానీ రూథర్‌ఫర్డ్, షారుఖ్ ఖాన్‌లు ధనాధన్ షోకు శ్రీకారం చుట్టడంతో లక్నో గుండెల్లో గుబులు రేగింది. చెరోవైపు నుంచి రూథర్‌ఫోర్డ్, షారుఖ్‌లు సిక్స్‌లు, ఫోర్లతో విజృంభించారు. అంతే... 16 ఓవర్లు గడిచేసరికి స్కోరు 182/3కి చేరింది. 24 బంతుల్లో 54 పరుగుల సమీకరణం గుజరాత్‌ను ఆశల పల్లకిలో ఉంచింది. రూథర్‌ఫోర్డ్, షారుఖ్ నాలుగో వికెట్‌కు 40 బంతుల్లో 86 పరుగులు జోడించారు. అయితే 17వ ఓవర్లో రూథర్‌ఫర్డ్, తెవాటియా (2), మరుసటి ఓవర్లో అర్షద్ ఖాన్ (1) అవుట్ కావడంతో లక్నో కు ఊరట లభించింది. 22 బంతుల్లో ఫిఫ్టీ పూర్తి చేసుకున్న షారుఖ్ ఖాన్ పోరాటం సరిపోలేదు.

స్కోరు వివరాలు

లక్నో సూపర్‌జెయింట్స్ ఇన్నింగ్స్: మార్క్‌రమ్ (సి) షారుక్ (బి) సాయి కిషోర్ 36; మార్ష్ (సి) రూథర్‌ఫోర్డ్ (బి) అర్షద్ 117; పూరన్ నాటౌట్ 56; రిషభ్ పంత్ నాటౌట్ 16; ఎక్స్‌ట్రాలు 10; **మొత్తం (20 ఓవర్లలో 2 వికెట్లకు) 235. వికెట్ల పతనం:** 1-91, 2-212. **బౌలింగ్:** సిరాజ్ 4-0-37-0, అర్షద్ ఖాన్ 3-0-36-1, రబడ 4-0-45-0, ప్రసిధ్‌కృష్ణ 4-0-44-0, సాయి కిషోర్ 3-0-34-1, రషీద్ ఖాన్ 2-0-36-0.

గుజరాత్ టైటాన్స్ ఇన్నింగ్స్: సాయి సుదర్శన్ (సి) మార్క్‌రమ్ (బి) రూర్కే 21; గిల్ (సి) సమద్ (బి) అవేశ్ 35; బట్లర్ (బి) ఆకాశ్ సింగ్ 33; రూథర్‌ఫర్డ్ (సి)సబ్-బిష్ణోయ్ (బి) రూర్కే 38; షారుఖ్ (సి) సబ్-బిష్ణోయ్ (బి) అవేశ్ 57; తెవాటియా (సి) హిమ్మత్ (బి) రూర్కే 2; అర్షద్ (సి) రూర్కే (బి) షాబాజ్ 1; రషీద్ ఖాన్ నాటౌట్ 4; రబడా (బి) బదోని 2; సాయి కిషోర్ (బి) బదోని 1; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (20 ఓవర్లలో 9 వికెట్లకు) 202. వికెట్ల పతనం:** 1-46, 2-85, 3-96, 4-182, 5-186, 6-193, 7-197, 8-200, 9-202. **బౌలింగ్:** ఆకాశ్ సింగ్ 3.1-0-29-1, ఆకాశ్‌దీప్ 4-0-49-0, రూర్కే 4-0-27-3, అవేశ్‌ఖాన్ 3.5-0-51-2, షాబాజ్ 4-0-41-1, బదోని 1-0-4-2.

ఐపీఎల్-2025 పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	ర.రే
గుజరాత్	13	9	4	0	18	0.602
బెంగళూరు	12	8	3	1	17	0.482
పంజాబ్	12	8	3	1	17	0.389
ముంబై	13	8	5	0	16	1.292
ఢిల్లీ	13	6	6	1	13	-0.019
లక్నో	13	6	7	0	12	-0.337
కోల్‌కతా	13	5	6	2	12	0.193
హైదరాబాద్	12	4	7	1	9	-1.005
రాజస్తాన్	14	4	10	0	8	-0.549
చెన్నై	13	3	10	0	6	-1.030

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, ఫ.తే- ఫలితం తేలనివి, పా-పాయింట్లు, ర.రే- రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

బెంగళూరు × హైదరాబాద్
వేదిక: లక్నో

రాత్రి 7:30 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

క్వార్టర్‌ఫైనల్లో శ్రీకాంత్

- ప్రణయ్ అవుట్
- మలేసియా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ



శ్రీకాంత్

కౌలాలంపూర్: తొలి రౌండ్లో మెరుగైన ర్యాంకింగ్ ప్లేయర్లపై రాణించిన భారత షట్లర్లకు ప్రిక్వార్టర్స్‌లో మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. మలేసియా ఓపెన్ మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్-500 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో కిడాంబి శ్రీకాంత్ క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించగా, హెచ్.ఎస్.ప్రణయ్, ఆయుశ్ శెట్టి, సతీశ్ కుమార్ కరుణాకరన్‌లకు పరాజయం ఎదురైంది. మిక్స్‌డ్ డబుల్స్‌లో ధ్రువ్ కపిల-తనీషా క్రాస్టో జోడీ క్వార్టర్స్ చేరగా... మహిళల డబుల్స్‌లో ప్రేరణ ఆల్వేకర్-మృణ్మయి దేశ్‌పాండేలకు నిరాశ ఎదురైంది. ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రేరణ-మృణ్మయి జంట 9-21, 14-21తో సూ యిన్ హుయ్-లిన్ జి యున్ (చైనీస్ తైపీ) జంట చేతిలో పరాజయం చవిచూసింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో తనీషా-ధ్రువ్ కపిల జోడీ 21-17, 18-21, 21-15తో ఫ్రాన్స్‌కు చెందినలీ పాలెర్మో-జులియెన్ మైయో జంటపై గెలిచింది.

శ్రీకాంత్ వరుస గేముల్లో...

పురుషుల సింగిల్స్‌లో ఒక్క శ్రీకాంత్ మాత్రమే ముందంజ వేశాడు. గురువారం జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 65వ ర్యాంక్ ప్లేయర్ శ్రీకాంత్ 23-21, 21-17తో తనకన్నా మెరుగైన 33వ ర్యాంకర్ ఎన్‌హట్ ఎన్గుయెన్ (ఐర్లాండ్)పై వరుస గేముల్లో విజయం సాధించాడు. ఈ రెండు గేములు గెలిచేందుకు శ్రీకాంత్ 59 నిమిషాలు పాటు చెమటోడ్చాడు. శుక్రవారం జరిగే క్వార్టర్ ఫైనల్లో శ్రీకాంత్ ఫ్రాన్స్‌కు చెందిన తొమా పొపొవ్‌తో తలపడతాడు. మిగతా పురుషుల సింగిల్ పోటీల్లో సతీశ్ కరుణాకరన్ 14-21, 16-21తో క్రిస్టో పొపొవ్ (ఫ్రాన్స్) చేతిలో పరాజయం చవిచూశాడు. ఆశించిన స్థాయి ఆటతీరు కనబరచలేకపోయిన ప్రణయ్ 9-21, 18-21తో వరుస గేముల్లో యుషి తనక (జపాన్) చేతిలో కంగుతినగా... ఆయుశ్ శెట్టి 13-21, 17-21తో తొమ పొపొవ్ ధాటికి నిలువలేకపోయాడు.

పతకమే లక్ష్యంగా...

ఆసియా చాంపియన్‌షిప్‌కు జ్యోతి యర్రాజి సిద్ధం


జ్యోతి

న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ అథ్లెట్ జ్యోతి యర్రాజి ఆసియా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ కోసం ముమ్మరంగా సాధన చేస్తోంది. ఈ నెల 27 నుంచి 31 వరకు దక్షిణ కొరియాలో జరగనున్న ఈ టోర్నీ మహిళల 100 మీటర్ల హర్డిల్స్‌లో జ్యోతి డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగనుంది. 2023లో బ్యాంకాక్ వేదికగా జరిగిన ఈ టోర్నీలో తెలుగమ్మాయి స్వర్ణం సాధించింది. 2024 పారిస్ ఒలింపిక్స్‌లో నిరాశజనక ప్రదర్శన తర్వాత గాయాల నుంచి కోలుకున్న 25 ఏళ్ల జ్యోతి పూర్తి స్థాయిలో సత్తా చాటేందుకు తన టెక్నిక్‌లో మార్పులు చేసుకొని పాత పద్ధతిలోనే ప్రాక్టీస్ చేస్తున్నట్లు వెల్లడించింది. 'పారిస్ విశ్వక్రీడల కోసం 'సెవెన్ స్ట్రయిడ్' టెక్నిక్ ప్రయత్నించాను. కానీ అది నాకు ఉపయోగపడలేదు. దాని వల్ల రెండుసార్లు గాయపడ్డా. అందుకే పాత పద్ధతైన 'ఎయిట్ స్ట్రయిడ్'లోనే పరుగెత్తాలని నిర్ణయించుకున్నా. గాయాల బారిన పడకుండా ఉంటే 13 సెకన్ల లోపే లక్ష్యాన్ని చేరుతాననే నమ్మకముంది' అని జ్యోతి చెప్పింది. హర్డిల్స్ మధ్య అడుగుల వ్యూహాన్ని స్ట్రయిడ్ అంటారు. 100 మీటర్ల హర్డిల్స్‌లో జాతీయ రికార్డు (12.78 సెకన్లు) కలిగిన జ్యోతి... గత ఆసియా చాంపియన్‌షిప్ 200 మీటర్ల పరుగులో రజత పతకం కూడా నెగ్గింది. ఈ క్రీడల్లో పాల్గొనేందుకు 59 మందితో కూడిన భారత అథ్లెట్ల బృందం గురువారం దక్షిణ కొరియాకు బయల్దేరింది.

రోబోలకు బాబు.. మనిషిలాంటి డాబు
హ్యూమనాయిడ్

'మనసున మనసై.. బ్రతుకున బ్రతుకై...'
- తోడొకరు ఉండటానికేముంది కానీ..
ఇంట్లో వంట పనికి తోడుండగలరా?
ఇల్లు తుడవటానికి తోడుండగలరా?
గిన్నెలు తోమటానికి, బట్టల్ని నీళ్లలో
జాడించటానికీ, దండెం మీద ఆరేయటానికీ
తోడుండగలరా?

అది కదా నిజంగా తోడుగా ఉండటం అంటే! ఒక్క ఇల్లనే కాదు; ఇంటి పనీ, వంట పనీ అనే కాదు - చేదోడు అవసరమైన ప్రతి చోటా, ప్రతి రంగంలో మనసెరిగి పనులు చక్కబెట్టే మనిషొకరు ఉంటే ప్రపంచం ఎంత సౌఖ్యంగా మారిపోతుంది!

నిజమే కానీ, మానవ మాత్రులెవ్వరూ అలా తోడుగా ఉండలేరు. అందుకొక మెషీన్ కావలసిందే. వట్టి మెషీన్ కాదు.. మనిషి లాంటి మెషీన్.. అంటే.. హ్యూమనాయిడ్!!

సులభంగా పనులు చక్క బెట్టేస్తుంది

- విభిన్న రంగాల్లో పెరుగుతున్న వినియోగం.. స్మార్ట్ టెక్నాలజీతో మారుతున్న వీటి పనితీరు
- హ్యూమనాయిడ్స్ తయారీలోకి దిగ్గజ సంస్థలు.. ఈ రంగంలో కొత్త ఆశలు రేపుతున్న భారత్

మొన్న మే 21న..

టెస్లా కంపెనీ అధినేత ఎలాన్ మస్క్ 'కనీ విని ఎరుగని'అంటూ ఒక వీడియో క్లిప్ విడుదల చేశారు. అందులో 'ఆప్టిమస్'అనే హ్యూమనాయిడ్ ఇంటి పనుల్ని చలాకీగా చక్కబెట్టేస్తోంది. వంగి, చెత్త బ్యాగును తీసి డస్ట్ బిన్‌లో పడేస్తోంది. ఒక చేత్తో బ్రష్, ఇంకో చేత్తో డస్ట్ ప్యాన్ ఉపయోగించి టేబుల్‌ని శుభ్రం చేస్తోంది. టిష్యూ పేపర్ రోల్ నుంచి చిన్న ముక్కను లాగి తీసుకుంటోంది. స్టౌ మీద గిన్నెలో కూరగాయల్ని గరిటెతో కలియదిప్పుతోంది. గచ్చును తుడుస్తోంది. ప్రశాంతంగా సూచనలు పాటిస్తూ.. 'ఇంకేమైనా పనుందా అమ్మ గారూ...'అనే మన పాతకాలపు పనిమనిషిలా తర్వాతి ఆదేశాల కోసం చూస్తోంది. త్వరలోనే మార్కెట్‌లోకి రానున్న ఈ 'ఆప్టిమస్'హ్యూమనాయిడ్ రూ.18–25 లక్షల వరకు ఉంటుందట.


వంట చేస్తున్న టెస్లా హ్యూమనాయిడ్ 'ఆప్టిమస్'

పోటీలో దూసుకుపోతున్న భారత్

హ్యూమనాయిడ్ రోబో రేసులో దేశీయ కంపెనీలు చురుగ్గా ఉన్నాయి. మెక్స్ రోబోటిక్స్, స్వాయ రోబోటిక్స్, ఇన్వెంటో రోబోటిక్స్, సిరెనా టెక్నాలజీస్, విస్టాన్‌నెక్స్ట్‌జెన్ తదితర సంస్థలు వీటి తయారీలో ఉన్నాయి.

- షాపులు, ఫ్యాక్టరీలు, కస్టమర్ సేవల కోసం అహ్మదాబాద్‌కు చెందిన కోడీ టెక్నోలాబ్ తయారు చేసిన 'స్కంద'2024లో రంగ ప్రవేశం చేసింది. షాపుల్లో స్టాక్ నిర్వహణ వంటి పనులు చేస్తుంది.
- రిలయన్స్ ఇండస్ట్రీస్ పెట్టుబడులు పెట్టిన నోయిడాకు చెందిన యాడ్‌వర్బ్ టెక్నాలజీస్ ఫ్యాషన్, రిటైల్, ఎనర్జీ రంగాల్లో వాడేందుకు హ్యూమనాయిడ్‌ను తీసుకొస్తోంది. ఉత్పత్తులను అసెంబుల్ చేయడం, గిడ్డంగుల్లో వస్తువులను తీసుకెళ్లడం వంటి క్లిష్టమైన పనులు ఇది చేస్తుంది.
- ప్రమాదకర మిలటరీ పనుల కోసం డీఆర్‌డీఓ, స్వాయ రోబోటిక్స్‌తో కలిసి 2027 నాటికి హ్యూమనాయిడ్‌ను పరిచయం చేయనుంది. ఇది 24 విధాలుగా కదల గలదు. 3డీలో ప్రాంతాలను మ్యాప్ చేయగలదు. బాంబులను నిర్వీర్యం చేయగలదు. ప్రమాదకర ప్రాంతాల్లో సమాచారాన్ని సేకరించగలదు.
- భారత్ అంతరిక్ష పరిశోధన సంస్థ అంతరిక్ష మిషన్లలో సహాయపడేందుకు వ్యోమమిత్ర హ్యూమనాయిడ్ రోబో తయారుచేసింది.

హ్యూమనాయిడ్, రోబో ఒకటి కాదా..?

ఈ ప్రశ్నకు సమాధానం... 'కాదు', 'అవును' కూడా. హ్యూమనాయిడ్‌లన్నీ రోబోలే. కానీ, రోబోలన్నీ హ్యూమనాయిడ్‌లు కావు. రోబో యంత్రమైతే, హ్యూమనాయిడ్ మానవ యంత్రం. రోబో ఏ ఆకారంలోనైనా ఉండొచ్చు. హ్యూమనాయిడ్ మాత్రం కృత్రిమ మేధస్సుతో ప్రత్యేక మానవ నైపుణ్యాలను, మానవాకృతిని కలిగి ఉంటుంది. ఫ్యాక్టరీలో కారు భాగాలు జోడించే సాధారణ రోబోలు, లేదా నేలను శుభ్రం చేసే వాక్యూమ్ క్లీనర్ రోబోలతో పోలిస్తే ఈ హ్యూమనాయిడ్‌లు చాలా వైవిధ్యమైనవి. ఇవి కష్టమైన పనులను సైతం చేయగలవు, మనుషులతో మాట్లాడగలవు, కొత్త పరిస్థితులకు అలవాటు పడగలవు. వీటి ప్రత్యేకత ఏమిటంటే.. వీటి రూపం మనుషులకు సౌకర్యంగా అనిపించడం.

ఇంత తెలివి ఎలా?

హ్యూమనాయిడ్‌లు మనుషుల్లా పనిచేయడానికి స్మార్ట్ టెక్నాలజీలను ఉపయోగించుకుంటాయి. ఏఐ మస్తిష్కంతో ఇవి ప్రపంచాన్ని అర్థం చేసుకుంటాయి. వాటిల్లోని సెన్సార్లే.. వాటి పంచేంద్రియాలు. గదిని 3డీలో చూడటానికి, వస్తువులను గుర్తించడానికి 3డీ కెమెరాలు, 'లైడార్' సహాయపడతాయి. గైరోస్కోప్‌లు, యాక్సిలరోమీటర్లు వీటి నడకను బ్యాలెన్స్ చేస్తాయి. 'ఫోర్స్'సెన్సార్లు వస్తువులను అవి పగలనంత సున్నితంగా పట్టుకోవడానికి తోడ్పడతాయి. విజన్ సెన్సార్లు ముఖాలను గుర్తించడానికి, దారులను కనుక్కోటానికి ఉపకరిస్తాయి. హ్యూమనాయిడ్‌లు మైక్రోఫోన్లతో మాటలను విని, అర్థం చేసుకోగలవు. మోటార్లు, యాక్చుయేటర్లు వాటి కండరాలు. శక్తిమంతమైన కంప్యూటర్లు సెన్సార్ల నుండి వచ్చే సమాచారాన్ని వేగంగా ప్రాసెస్ చేస్తాయి. అందువల్ల హ్యూమనాయిడ్‌లు తక్షణం ఆలోచించి పనిచేయగలవు. బ్యాటరీలతో ఇవి 5 గంటల వరకు పనిచేస్తాయి. కానీ నడిచే హ్యూమనాయిడ్‌లకు చాలా శక్తి అవసరం. వీటిని ఇంటర్నెట్‌తో అనుసంధానిస్తారు.

కొన్ని హ్యూమనాయిడ్‌లు..

చైనా కంపెనీ యూబీటెక్ వృద్ధుల సంరక్షణ, బోధన కోసం ప్రత్యేక హ్యూమనాయిడ్‌లను తయారు చేస్తోంది.

యూఎస్ టెక్నాలజీ సంస్థ ఎజిలిటీ రోబోటిక్స్ తయారు చేసిన 'డిజిట్'లు వస్తువులను తీసుకోవడం, ప్యాక్ చేయడం చేస్తున్నాయి.

స్టాన్‌ఫోర్డ్ వర్సిటీ రూపొందించిన 'ఓషన్ వన్'... సముద్రంలో ప్రమాదకర ప్రాంతాల్లో, భూగర్భంలో వెలికితీతలకు చక్కగా ఉపయోగపడుతోంది.



భారత హ్యూమనాయిడ్ 'స్కంద'

'అక్యూట్'తో భారత్ అరంగేట్రం!

హ్యూమనాయిడ్స్‌ను మనదేశమూ తయారు చేస్తోంది. తొలిసారిగా బిట్స్ పిలానీ 'అక్యూట్'అనే హ్యూమనాయిడ్ కి ప్రాణ ప్రతిష్ఠ చేసింది. ఇస్రో, డీఆర్‌డీఓ, రిలయన్స్ వంటివి ఈ రంగంలో విస్తృత ప్రయత్నాలు చేస్తున్నాయి. కృత్రిమ మేధ (ఏఐ), సెన్సార్ల వంటి స్మార్ట్ టెక్నాలజీలు ఈ హ్యూమనాయిడ్‌ల మెదడుకు మేత. ఈ మేతకు అవసరమైన కీలక ఎలక్ట్రానిక్ విడిభాగాల కోసం చైనా, యూఎస్, జర్మనీలపై ఆధారపడకుండా పూర్తి స్థాయిలో తయారీ చేపడితే అంతర్జాతీయంగా హ్యూమనాయిడ్ రోబోల రంగంలో భారత్ పోటీపడే అవకాశాలు ఉంటాయని మార్కెట్ వర్గాలు అంటున్నాయి.

వచ్చే ఐదేళ్లలో 50 వేలు...

ప్రపంచ హ్యూమనాయిడ్ రోబో మార్కెట్ 2024లో 3.28 బిలియన్ డాలర్లు. 2032 నాటికి ఇది 66 బిలియన్ డాలర్లకు చేరవచ్చని నివేదికలు చెబుతున్నాయి. భారత హ్యూమనాయిడ్ రోబోల మార్కెట్ విలువ రూ.1,275 కోట్లు. మొత్తం 8,000 రోబోలలో హ్యూమనాయిడ్‌లు 10 శాతం వరకు ఉంటాయి. ఏటా 25 శాతం రోబోలు తోడవుతున్నాయి. 2030 నాటికి భారత్ 50,000 హ్యూమనాయిడ్‌లను ఉపయోగించే అవకాశం ఉంది. మన హ్యూమనాయిడ్ రోబోల మార్కెట్ 2035 నాటికి రూ.12,750 కోట్లకు చేరొచ్చని అంచనా.


సాక్షి, స్పెషల్ డెస్క్

సవాళ్లు - పరిమితులు

హ్యూమనాయిడ్ రోబోల తయారీ, వినియోగం ఖరీదైన వ్యవహారం. చైనాకు చెందిన 'యూనిట్రీ జీ1'ధర రూ.13.6 లక్షలు. భారత రోబోలు.. ఆప్టిమస్ లేదా యూనిట్రీ జీ1 లాగా స్వేచ్ఛగా కదలలేవు, బ్యాటరీ ఎక్కువసేపు ఉండదు. రోబోలకు 5జీ వంటి వేగవంతమైన ఇంటర్నెట్ కావాలి. భారత్‌లో పూర్తి స్థాయిలో 5జీ విస్తృతం కాలేదు. అయితే మన 'యాడ్‌వర్బ్'భారీ ప్రణాళికలు, డీఆర్‌డీఓ రక్షణ పనులు.. భారత్ సైతం ఈ రంగంలో పోటీపడగలదని నిరూపిస్తున్నాయి. ఖర్చు వంటి సవాళ్లు ఉన్నప్పటికీ ఆశాజనకంగా ఉన్న మార్కెట్, ప్రభుత్వ మద్దతు ఉజ్వల భవిష్యత్తుపై ఆశలు కలిగిస్తున్నాయి.

శిల్పకళా వేదికలో జరిగిన టాలెంట్ గ్రాండ్ ఫినాలేలో మిస్ వరల్డ్ పోటీదారులు



మిస్ 'కళలు'.. అదుర్స్

శిల్పకళా వేదికలో మిస్ వరల్డ్ టాలెంట్ గ్రాండ్ ఫినాలే
మొదటి మూడు స్థానాల్లో ఇండోనేషియా, కామెరూన్, ఇటలీ

సాక్షి, హైదరాబాద్: మిస్ వరల్డ్ పోటీల్లో భాగంగా హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో గురువారం రాత్రి నిర్వహించిన 'టాలెంట్ గ్రాండ్ ఫినాలే విభిన్న కళలతో అలరించింది. 24 దేశాలకు చెందిన పోటీదారులు ఎంపికైన ఈ ఫినాలేలో మిస్ ఇండోనేషియా (పియానో) మొదటి స్థానంలో నిలవగా, మిస్ కామెరూన్ (సింగింగ్) రెండవ స్థానంలో, మిస్ ఇటలీ (బ్యాలే నృత్యం) మూడో స్థానంలో నిలిచారు. అద్భుతమైన పియానో సంగీతంతో మిస్ ఇండోనేషియా వేదికను సోల్‌ఫుల్ ఫీల్‌లో ముంచెత్తింది. శ్రావ్యమైన పాశ్చాత్య సంగీత వెల్లువతో 'గుడ్‌నెస్ ఆఫ్ గాడ్' పాట పాడి మిస్ కామెరూన్ ప్యానెలిస్టుల మనసు దోచుకుంది. మిస్ ఇటలీ ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక విశిష్టతను కలిగిన బ్యాలేను ప్రదర్శించింది. ఇండియన్ కంటెస్టెంట్ మిస్ ఇండియా నందిని గుప్తా చేసిన బాలీవుడ్ హిట్ సాంగ్ ఢోల్ బాజే సాంగ్ వేదికను దద్దరిల్లేలా చేసింది. భారతీయ సంస్కృతిని మిస్ వరల్డ్ వేదికపై ఘనంగా ప్రదర్శించడం సంతోషంగా ఉందని నందినీ గుప్తా తెలిపారు. చివరగా మొత్తం 24 మంది పోటీదారులు రాను బొంబాయికి రాను, అద్దాల మేడలున్నయే అంటూ తెలుగు పాటలకు స్టెప్పులేశారు. కాగా, అత్యవసర సమయాల్లో రోగులను కాపాడే సీపీఆర్ ఎలా చేయాలో వినూత్నంగా ప్రదర్శించి వేల్స్ కంటెస్టెంట్ తన వైద్య వృత్తి గొప్పదనాన్ని చాటారు.


మిస్ ఇండియా నందిని గుప్తా నృత్య ప్రదర్శన

సింగరేణి స్టాల్స్‌లో సుందరీమణులు

గురువారం సాయంత్రం శిల్పారామాన్ని సందర్శించిన అనంతరం మిస్‌వరల్డ్ పోటీదారులు పక్కనే ఉన్న ఇందిరా మహిళా శక్తి బజారును సందర్శించారు. ఈ సందర్భంగా సింగరేణి సేవా సమితి స్వయం ఉత్పత్తిదారుల వస్తు విక్రయశాలను కూడా వారు తిలకించారు. వివిధ ప్రాంతాల నుంచి సింగరేణి సేవా సమితిలో శిక్షణ పొందిన మహిళలు తయారుచేసిన బ్యాగులు, చేతి పర్సులు, మగ్గం వర్క్ చేసిన దుస్తులను పరిశీలించి, ఇవి చక్కగా ఉన్నాయంటూ ప్రశంసలు కురిపించారు.

పాకిస్తాన్‌తో యుద్ధం ఆగలేదు

- ఉగ్రవాదాన్ని పోషించినంతకాలం సాగుతుంది
- కరీంనగర్‌లో హిందూఏక్తా యాత్రలో కేంద్రమంత్రి బండి సంజయ్

సాక్షిప్రతినిధి,కరీంనగర్: పాకిస్తాన్‌తో భారత్ యుద్ధం ఆగలేదని, ఉగ్రవాదాన్ని పెంచి పోషించినంత కాలం సాగుతుందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. గురువారం హనుమాన్ జయంతి సందర్భంగా కరీంనగర్‌లో నిర్వహించిన హిందూ ఏక్తాయాత్ర ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ 15 ఏళ్ల కింద కరీంనగర్‌లో ఏక్తాయాత్ర ప్రారంభిస్తే తనను హిందూ పిచ్చోడని హేళన చేశారని చెప్పారు. పహల్గాం ఘటన తర్వాత హిందువుల్లో ఐక్యతగా ఉండాలనే ఆలోచన వచ్చిందన్నారు. యుద్ధంలో ఎన్ని మన రాఫెల్ విమానాలు ఎన్ని ధ్వంసమయ్యాయో లెక్క చెప్పాలని రాహుల్‌గాంధీ మాట్లాడటం సిగ్గుచేటు అన్నారు. ఆయనవి దేశద్రోహ వ్యాఖ్యలన్నారు. ట్రంప్‌కు భయపడి మోదీ యుద్ధం ఆపేసిండని రేవంత్‌రెడ్డి చెప్పడం సిగ్గుచేటన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్‌లు రోహింగ్యాలకు రేషన్, ఆధార్ కార్డులిచ్చింది నిజం కాదా అని ప్రశ్నించారు. రాష్ట్రంలోని విదేశీయుల్ని బయటకు పంపే దమ్ముందా ప్రశ్నించారు.


బండి సంజయ్‌పై పూలు చల్లుతున్న ఓ ముస్లిం

బీసీ గురుకుల బ్యాక్‌లాగ్ సీట్ల ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదల



సాక్షి, హైదరాబాద్: మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ పరిధిలోని పాఠశాలల్లో 6, 7, 8, 9 తరగతుల్లో బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీ కోసం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఫలితాలను సొసైటీ కార్యదర్శి బి.సైదులు గురువారం విడుదల చేశారు. విద్యార్థులు www.mjptbcwreis. telangana.gov.in లేదా https:// mjptbcadmissions.org వెబ్‌సైట్ల ద్వారా ఫలితాలు తెలుసుకోవచ్చని తెలిపారు. ప్రవేశ పరీక్షలో మెరిట్ ప్రకారం సీట్ల భర్తీ చేపడతామని పేర్కొన్నారు. బీసీ గురుకుల పాఠశాలల్లో 6, 7, 8, 9 తరగతులలో 6,832 బ్యాక్‌లాగ్ సీట్లు ఉండగా.. వీటికోసం 23,611 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఏప్రిల్ 20న అర్హత పరీక్ష నిర్వహించారు. ఈనెల 24న ప్రవేశాల కౌన్సెలింగ్ నిర్వహిస్తామని, సీట్లకు అర్హత సాధించిన విద్యార్థులు ధ్రువపత్రాలను సిద్ధం చేసుకోవాలని కార్యదర్శి బి.సైదులు సూచించారు.

30 మంది అడిషనల్ ఎస్పీలకు పోస్టింగ్‌లు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా 30 మంది అడిషనల్ ఎస్పీలకు పోస్టింగ్‌లు ఇస్తూ హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవిగుప్తా గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల పదోన్నతులు పొంది పోస్టింగ్‌ల కోసం ఎదురు చూస్తున్న వారికి పోస్టింగ్‌లు ఇవ్వడంతో పాటు.. సుదీర్ఘ కాలంగా ఒకేచోట పనిచేస్తున్న వారికి స్థానచలనం కలిగించారు. బదిలీ అయిన అధికారులకు ఉత్తర్వుల్లో సూచించిన విధంగా.. విధులు కేటాయించాలని డీజీపీని రవిగుప్తా తన ఉత్తర్వుల్లో ఆదేశించారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034.
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.



రిక్లైనర్ సోఫా సెట్ 3+2 (3 సీటర్ విత్ 2 రిక్లైనర్ + 2 సీటర్ విత్ 2 రిక్లైనర్ + కన్‌సోల్ టేబుల్)
MRP ₹3,76,499
Sale ₹69,999 PER DAY EMI ₹140
సఫారీ సోఫా సెట్ : 3+2+ దివాన్ (8 సీటర్)
MRP ₹62,999
Sale ₹19,999 PER DAY EMI ₹26
ప్రీమియం క్వాలిటీ క్వీన్ సైజ్ బెడ్
MRP ₹43,499
Sale ₹14,999
PER DAY EMI ₹18
ఉచితం
పిల్లో టాప్‌తో 10" స్ప్రింగ్ మ్యాట్రెస్ విలువ రూ. 15,000
మీ పాత మ్యాట్రెస్‌ను కొత్త మ్యాట్రెస్‌తో మార్చుకోండి
ఎక్స్ఛేంజ్ విలువ రూ. 20000 వరకు + 2 పిల్లోలు విలువ రూ. 999 వరకు + MRP పై 15% డిస్కౌంట్ పొందండి
సాలిడ్ ఉడెన్ డైనింగ్ టేబుల్ : 1 + 6
MRP ₹63,999 Sale ₹17,999 PER DAY EMI ₹32
ప్రీమియం క్వాలిటీ వార్డ్‌రోబ్
PER DAY EMI ₹12
2 డోర్ విత్ మిర్రర్ MRP ₹27,449 ₹ 8,999
3 డోర్ విత్ మిర్రర్ MRP ₹34,449 ₹ 12,999
4 డోర్ విత్ మిర్రర్ MRP ₹34,449 ₹ 16,999
సాలిడ్ ఉడెన్ డైనింగ్ టేబుల్ 6 సీటర్ (4 ఛెయిర్ + 1 బెంచ్)
MRP ₹55,000
₹ 22,222
3+1+1 : MRP Rs. 45,000/-, 5 Days Price : Rs. 18,999/-
3+1+1+ Diwan : MRP Rs. 65,000/-, 5 Days Price : Rs. 25,999/-
An ISO-9001:2015 Certified Company
BANTIA Furnitures
Affordable Lifestyles Since 1955
బాంటియా ఎస్టేట్, సిఖ్ రోడ్, సికింద్రాబాద్
ఏదైనా సోఫా కొనండి, సెంటర్ టేబుల్ ఉచితంగా పొందండి
ఏదైనా కాట్ కొనండి, మ్యాట్రెస్, బెడ్‌సైడ్ టేబుల్ ఉచితంగా పొందండి
79950 00930, 040-27841562 79933 33351
ఎ.ఎస్. రావ్ నగర్ ◆ అత్తాపూర్ ◆ బోడుప్పల్ ◆ దిల్‌సుఖ్‌నగర్ ◆ హైటెక్ సిటీ ◆ కర్మన్‌ఘాట్
కొంపల్లి ◆ కూకట్‌పల్లి ◆ నాగోల్ ◆ సికింద్రాబాద్ ◆ వరంగల్ ◆ విజయవాడ ◆ www.bantia.in





మార్కెటింగ్ శాఖ కార్యాలయంలో
తుమ్మల ఆకస్మిక తనిఖీ

ఆలస్యంగా వచ్చిన సిబ్బందిపై చర్యలకు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మార్కెటింగ్ శాఖ అధికారులకు ముచ్చెమటలు పోయించారు. గురువారం ఉదయం ఆయన బీఆర్‌కే భవన్‌లోని మార్కెటింగ్ శాఖ ప్రధాన కార్యాలయానికి చేరుకొని ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా, కార్యాలయానికి ఆలస్యంగా వచ్చిన అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆలస్యంగా వచ్చిన సిబ్బందికి వెంటనే మెమో జారీ చేసి సంజాయిషీ తీసుకోవాల్సిందిగా మార్కెటింగ్ డైరెక్టర్‌ను ఆదేశించారు. మొత్తం 53 మంది రెగ్యులర్ సిబ్బందిలో 16 మంది ఆలస్యంగా హాజరయ్యారని, 42 మంది ఔట్ సోర్సింగ్ సిబ్బందిలో ఐదుగురు ఆలస్యంగా వచ్చారని మార్కెటింగ్ డైరెక్టర్ తెలిపారు. ఆలస్యంగా వచ్చిన వారికి మెమోలు జారీ చేసి, సంజాయిషీ తీసుకోనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ, వ్యవసాయ, అనుబంధ రంగాలకు చెందిన కార్యాలయాల్లో ముఖ గుర్తింపుతో కూడిన బయోమెట్రిక్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఇకపై ఆలస్యంగా వచ్చిన అధికారులు, అందుబాటులో లేని అధికారులపై తగు చర్యలు తీసుకోవాలని డైరెక్టర్‌ను ఆదేశించారు. ప్రతిరోజూ సిబ్బంది హాజరు పట్టికను తన కార్యాలయానికి పంపాలని సూచించారు.

కవిత లేఖపై బదులివ్వాలి

బీఆర్ఎస్‌కు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ డిమాండ్



సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్‌లో ముసలం తారస్థాయికి చేరుకుందని, కల్వకుంట్ల కవిత రాసిన లేఖతో లుకలుకలు బయటపడ్డాయని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ధ్వజమెత్తారు. బీజేపీతో బీఆర్ఎస్ కలిసి పనిచేస్తుందని ఇప్పటివరకు తాము చెబుతున్న మాటలను కవిత సమర్థించారన్నారు. కవిత లేఖపై బీఆర్ఎస్ నాయకత్వం స్పందించి ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బీజేపీపై పల్లెత్తు మాట మాట్లాడకుండా కేసీఆర్ వ్యవహరించిన తీరును కవిత కడిగి పారేశారని, భవిష్యత్తులో బీఆర్ఎస్, బీజేపీ పొత్తు పెట్టుకోబోతున్నాయనే విషయాన్ని స్పష్టంచేశారన్నారు. కేసీఆర్ వైఖరిని ఆయన కూతురే తప్పు పడుతున్నారని, ఇక ప్రజలకు వాళ్లేమి సమాధానం చెబుతారని అన్నారు. తమ సీఎం రేవంత్ రెడ్డి మీద ఒంటి కాలిపై లేస్తున్న కేటీఆర్ ముందు తన చెల్లికి సమాధానం చెప్పాలన్నారు. కవితకు సమాధానం చెప్పకుండా ఇతర పార్టీలను విమర్శించే నైతిక హక్కు కేటీఆర్‌కు లేదని, అలిగిన హరీశ్‌రావు ఇంటికెళ్లి కేటీఆర్ బతిమాలుకున్నారని పేర్కొన్నారు.

కేటీఆర్ ఇష్టానుసారంగా మాట్లాడితే
ప్రజలే బుద్ధి చెబుతారు

ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్



సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఏకవచనంతో మాట్లాడితే గొప్పోడినవుతానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అనుకుంటున్నారని, ప్రజలు కర్రుకాల్చి వాతపెట్టినా బుద్ధి తెచ్చుకోకుండా నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నాడని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ ధ్వజమెత్తారు. గురువారం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎంను ఇష్టానుసారంగా మాట్లాడితే కేటీఆర్‌కు తెలంగాణ ప్రజలే బుద్ధి చెబుతారని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో కోట్లాది రూపాయల కమీషన్లను దండుకున్నారని, కల్వకుంట్ల కుటుంబం కమీషన్లతో కాళేశ్వరం కాస్తా కూలేశ్వరం అయిందని విమర్శించారు. కాళేశ్వరం కమిషన్ ఇచ్చిన నోటీసులతో కల్వకుంట్ల కుటుంబంలో ఆందోళన నెలకొందని అన్నారు. కేటీఆర్, హరీశ్‌రావు, కవిత, సంతోష్‌రావు తప్ప బీఆర్ఎస్‌లో ఎవరూ మాట్లాడటం లేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డిపైన తెలంగాణ ప్రజల్లో ఆదరణ, నమ్మకం పెరుగుతోందని చెప్పారు. పదేళ్లలో బీజేపీని విమర్శిస్తూ ఒక్కమాటైనా కేసీఆర్, కేటీఆర్ మాట్లాడారా అని ప్రశ్నించారు. అన్ని అంశాల్లో బీజేపీ ప్రభుత్వానికి కేసీఆర్ అండగా నిలిచారని, తెలంగాణ ప్రజలు కేటీఆర్, హరీశ్‌రావు లాంటి వారికి బుద్ధి చెబుతారని లక్ష్మణ్ అన్నారు.

కొత్త కోర్సులకే 'దోస్త్'



ఆప్షన్ల వేళ డిగ్రీలో చేరబోయే విద్యార్థుల హడావిడి

- ఇంజనీరింగ్ కీ విడుదల తర్వాత పెరిగిన వేడి
- సాంకేతిక నేపథ్యం గల డిగ్రీపై మక్కువ
- ఈ-కామర్స్, బీఎఫ్ఎస్ఐ కోర్సులపై ఆరా
- బీబీఏ, బీసీఏ కోర్సులకు పెరుగుతున్న డిమాండ్

సాక్షి, హైదరాబాద్: డిగ్రీలో ఏ కోర్సులో చేరితే బెటర్ అంటూ విద్యార్థులు ఆరా తీస్తున్నారు. ఇటీవల దోస్త్ నోటిఫికేషన్ విడుదల కాగా, ఈ నెల 10వ తేదీ నుంచి విద్యార్థులు ఆప్షన్లు ఇవ్వాల్సి ఉంది. ఈ ప్రక్రియ ఈ నెల 22 వరకూ కొనసాగుతుంది. ఇంజనీరింగ్ ఉమ్మడి ప్రవేశ పరీక్ష ప్రాథమిక కీ కూడా విడుదలైంది. దీని ఆధారంగా ఎన్ని మార్కులు వస్తాయనే అంచనాకు విద్యార్థులు వచ్చారు. ఈ కారణంగా దోస్త్‌కు ముందుగా దరఖాస్తు చేసేందుకు వారు ఆసక్తి చూపుతున్నారు. ఈసారి డిగ్రీలో అనేక కొత్త కోర్సులు ఉంటాయని, సిలబస్‌లోనూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ చాప్టర్లు తీసుకొస్తుండటంతో కొన్ని రకాల డిగ్రీ కోర్సుల్లో ఈసారి డిమాండ్ ఉండొచ్చని అంచనా వేస్తున్నారు.

ఇంజనీరింగ్ కన్నా మెరుగైనవి

- ఇంజనీరింగ్ కన్నా మెరుగైన కోర్సులు డిగ్రీ స్థాయిలో కూడా ఉన్నాయి. అయితే, ఇవి ఎక్కువగా హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోనే ఉన్నాయి. తక్షణ ఉపాధి లభిస్తుందని, సాఫ్ట్‌వేర్ వైపు కూడా వెళ్లేందుకు మార్గం సుగమం అవుతుందని కొన్ని కోర్సుల గురించి విద్యార్థులు ఎక్కువగా వాకబు చేస్తున్నారు.
- బీకాంలో గతంలో సంప్రదాయ సబ్జెక్టులు ఉండేవి. ఇప్పుడు కొత్తగా బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్ అండ్ ఇన్సూరెన్స్ (బీఎఫ్ఎస్ఐ), ఈ-కామర్స్ ఆపరేషన్స్, రిటైల్ ఆపరేషన్స్ వంటి కోర్సులు వచ్చాయి. కరోనా తర్వాత ఈ-కామర్స్ పెరిగింది. ఆడిటింగ్ వ్యవస్థలోనూ డిజిటలైజేషన్‌కే ప్రాధాన్యం ఇస్తున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని ఈ-కామర్స్, కంప్యూటర్ అనుసంధానిత కోర్సులను ఎంచుకునేందుకు విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు.
- బీఎస్సీలో మేథ్స్, బీజెడ్సీ వంటి కోర్సులే ప్రాధాన్యం సంతరించుకున్న పరిస్థితి మారిపోయింది. కానీ ఇప్పుడు బీఎస్సీలో టూరిజం అండ్ హాస్పిటాలిటీ ఆపరేషన్స్, డిజిటల్ ఇండస్ట్రీయల్ ఆపరేషన్స్, బీఎస్సీ మేథ్స్ డేటాసైన్స్, బీఎస్సీ ఆనర్స్ వంటి కోర్సులు అందుబాటులోకి వచ్చాయి. దీంతోపాటు బీఎస్సీలోనూ ఏదైనా ఒక ఇతర సబ్జెక్టు చేసుకునే వీలుంది.

దీన్ని దృష్టిలో ఉంచుకుని బీఎస్సీ మేథ్స్ విద్యార్థులు డేటాసైన్స్ వైపు ఆసక్తి చూపుతున్నారు.

ఆప్షన్‌లో మా కాలేజీకి ప్రాధాన్యం ఇవ్వండి అంటూ..

గత ఏడాది దోస్త్ ఐదు దశలు నిర్వహించినా, ప్రైవేట్ కాలేజీల్లో 38 శాతమే సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయి. దీనిని దృష్టిలో ఉంచుకొని విద్యార్థులను ఆకర్షించేందుకు ప్రైవేట్ కాలేజీలు ప్రయత్నిస్తున్నాయి. ప్రతీ విద్యార్థికి ఫోన్లు చేసి, ఏజెంట్ల ద్వారా కలుసుకొని దోస్త్ ఆప్షన్లలో తమ కాలేజీకే ప్రాధాన్యం ఇవ్వాలని కోరుతున్నారు. కొన్ని కాలేజీలు ప్రత్యేక రాయితీలు కూడా ఇస్తామంటున్నాయి. తొలిదశలో చేరిన వారికి రవాణా సౌకర్యం కల్పిస్తామని, బహుమతులు ఇస్తామని చెబుతున్నాయి. గ్రామీణ కాలేజీలు ఊరికో ఏజెంట్‌ను పెట్టుకొని మరీ విద్యార్థులను ఆకర్షిస్తున్నాయి. మీ-సేవ కేంద్రాలను కొన్ని కాలేజీలు మచ్చిక చేసుకుంటున్నాయి. కేంద్రాలకు వచ్చే వారిని తమ కాలేజీల వైపు మళ్లించాలని నజరానాలు ఇస్తున్నాయి.

గత ఏడాది దోస్త్ ద్వారా భర్తీ అయిన సీట్లు ఇలా

యాజమాన్యం	కాలేజీలు	సీట్లు	భర్తీ	శాతం
ప్రభుత్వ	160	80,337	55,361	61.96
ప్రైవేట్	816	3,44,793	1,32,388	38.39
రెసిడెన్షియల్	79	23,573	8,693	36.87

ఆయా కోర్సుల వారీగా ప్రవేశాలు ఇలా...

కోర్సు	ప్రవేశాలు
బీకాం	77,469
బీఎస్సీ లైఫ్‌సైన్స్	36,733
బీఎస్సీ ఫిజికల్ సైన్స్	32,181
బీఏ	28,362
బీబీఏ	15,835
బీసీఏ	5,170
బీబీఎం	100
బీఎస్‌డబ్ల్యూ	25
బ్యాచ్‌లర్ ఆఫ్ ఒకేషనల్	11
డిప్లొమా	556



రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను వైభవంగా నిర్వహించాలి

- ప్రతిశాఖ నుంచి ఒక నోడల్ అధికారిని నియమించండి
- ఉన్నతాధికారులతో సమీక్షలో సీఎస్ ఆదేశాలు

సాక్షి, హైదరాబాద్: జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని వైభవంగా నిర్వహించాలని ఉన్నతాధికారులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఆదేశించారు. వేడుకల ఏర్పాట్లపై గురువారం సచివాలయంలో సీఎస్ ఉన్నతాధికారులతో సమావేశమై సమీక్షించారు. ఆవిర్భావ దినోత్సవ వేడుకలను సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో ఘనంగా నిర్వహించనున్నట్లు సీఎస్ తెలిపారు. ఈ సందర్భంగా పరేడ్ గ్రౌండ్ వద్ద చేపట్టాల్సిన ఏర్పాట్లపై అధికారులకు సీఎస్ దిశానిర్దేశం చేశారు. ఈ వేడుకల ఏర్పాట్లపై ప్రతి శాఖ నుంచి ఒక నోడల్ అధికారిని నియమించి సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రముఖులు ప్రయాణించే మార్గాలలో అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని, పరేడ్ గ్రౌండ్స్‌కు వచ్చే వాహనాలకు అసౌకర్యం కలగకుండా పార్కింగ్ ఏర్పాట్లు చేసి ట్రాఫిక్ రూట్ మ్యాప్‌ను సిద్ధం చేయాలని పోలీసు శాఖను ఆదేశించారు. వర్షాలను దృష్టిలో పెట్టుకొని వాటర్ ప్రూఫ్ షామియానాలు, బారికేడ్లు ఏర్పాటు చేయాలని ఆర్అండ్‌బీ శాఖను ఆదేశించారు. సభా ప్రాంగణం, పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనుల నిర్వహణతోపాటు తాగునీటి సౌకర్యాలు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. పండుగ వాతావరణాన్ని తలపించేలా కళాకారులతో ప్రదర్శనలు ఏర్పాటు చేయాలని సాంస్కృతిక శాఖను ఆదేశించారు. నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని దీంతో పాటు జనరేటర్ బ్యాకప్ సైతం ఏర్పాటు చేయాలని విద్యుత్ శాఖకు సూచించారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను విస్తృతంగా ప్రచారం చేసేందుకు లైవ్ టెలికాస్ట్ ఏర్పాట్లు చేయాలని సమాచార శాఖ కమిషనర్‌ను ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలన్నారు. సమీక్షలో డీజీపీ జితేందర్, రోడ్లు, భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవి గుప్తా, రెవెన్యూ శాఖ ముఖ్యకార్యదర్శి నవీన్ మిట్టల్, జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్, సమాచార పౌర సంబంధాల కమిషనర్ హరీశ్, జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, ఇతర పోలీసు ఉన్నతాధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



'బొచ్చె' నిండింది

వలలో 36 కేజీల భారీ బొచ్చె చేప

ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు జలాశయంలో గురువారం వలకు పెద్ద చేప చిక్కింది. జోగుళాంబ గద్వాల జిల్లా ధరూర్ మండలం ఉప్పేరు గ్రామానికి చెందిన మత్స్యకారుడు బాబు.. జూరాల బ్యాక్‌వాటర్‌లో చేపల వేటకు వెళ్లాడు. బాబు వలకు 36 కేజీల పెద్ద బొచ్చె చేప చిక్కింది. ఇటీవల కాలంలో ఇంత పెద్ద చేప దొరకడం ఇదే మొదటిసారని తోటి జాలర్లు తెలిపారు.

– ధరూర్ (జోగుళాంబ గద్వాల జిల్లా)

మంత్రి సీతక్కకు ఎన్‌పీఆర్‌డీ సన్మానం

దివ్యాంగుల వివాహ కానుక నిబంధనల సడలింపుపై హర్షం



సాక్షి, హైదరాబాద్: దివ్యాంగుల వివాహ కానుక పథకం నిబంధనలు సడలించి.. దివ్యాంగులందరికీ లబ్ధి చేకూర్చేలా నిర్ణయం తీసుకోవడంపై వికలాంగుల హక్కుల జాతీయ వేదిక(ఎన్‌పీఆర్‌డీ) హర్షం వ్యక్తం చేసింది. ఇందులో భాగంగా గురువారం సచివాలయంలో రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్కను ఎన్‌పీఆర్‌డీ ప్రతినిధి బృందం సన్మానించింది. పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యను పరిష్కరించినందుకు మంత్రికి కృతజ్ఞతలు తెలిపింది. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. దివ్యాంగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఆర్టీసీ బస్సుల్లో దివ్యాంగులకు ఉచిత ప్రయాణం అంశాన్ని ప్రభుత్వ పరిశీలనలో ఉందన్నారు. అర్హుల జాబితాలో దివ్యాంగులుంటే, వారి పేరు మీద ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు నిబంధనలు రూపొందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు దైనంపల్లి మల్లికార్జున్, దివ్యాంగుల హక్కుల కార్యకర్త రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

అణగారిన వర్గాల ఆత్మగౌరవ
దీపిక భాగ్యరెడ్డి వర్మ

ఎమ్మెల్సీ కవిత



సాక్షి, హైదరాబాద్: దేశం గర్వించదగిన సంఘ సంస్కర్త భాగ్యరెడ్డి వర్మ అని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. భాగ్యరెడ్డి వర్మ జయంతి సందర్భంగా నివాళి అర్పిస్తూ, కవిత గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. 'తెలంగాణ వైతాళికుడు, అణగారిన వర్గాల ఆత్మ గౌరవ దీపిక. అంబేడ్కర్ కన్నా ముందే పీడిత ప్రజల కోసం గళమెత్తిన సామాజిక ఉద్యమకారుడు. వందేండ్ల క్రితమే దళిత బిడ్డలకోసం హైదరాబాద్‌లో 26 పాఠశాలలు నడిపిన అక్షర సూర్యుడు. ప్లేగు మహమ్మారి కబళించిన సందర్భంలో హైదరాబాద్ నగరంలో గొప్ప సేవలు అందించిన ఆదర్శ సంఘ సేవకుడు. బాల్య వివాహాలు, జోగిని ఇతర సాంఘిక దురాచారాల మీద పోరాడిన పాత్రికేయుడు. మరుగునపడిన ఆ మహనీయుడిని స్వరాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఘనంగా స్మరించుకుంది. భాగ్యరెడ్డి వర్మ జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహించడమే కాకుండా ఆయన చరిత్రను పాఠ్యాంశంగా చేర్చింది. భాగ్యరెడ్డి వర్మ చూపిన బాటలో నడుస్తూ గురుకుల విద్యా విప్లవంతో.. బడుగు, బలహీనవర్గాల బిడ్డల బతుకుల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం వెలుగులు నింపింది' అని కవిత నివాళి అర్పించారు.

నోటిఫికేషన్లు ఇవ్వండి

సాక్షి, హైదరాబాద్: నోటి దూల కాదు.. నిరుద్యోగులకు నోటిఫికేషన్లు ఇవ్వాలని బీఆర్ఎస్ నేత తుంగ బాలు డిమాండ్ చేశారు. అందాల పోటీలు నిర్వహించడం మాని, అన్నదాతల ఆత్మహత్యల నివారణ చర్యలు కావాలని గురువారం ఒక ప్రకటనలో హితవు పలికారు. అడ్డమైన భాషతో, నాలుకకే అసహ్యం వేసే బూతులతో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతున్నారని విమర్శించారు. రేవంత్‌రెడ్డి తిట్ల దండకం చదువుతున్న ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య భవిష్యత్తు ఎన్నికల్లో ఫెయిల్ అవ్వక తప్పదని హెచ్చరించారు.





గురువారం హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో జరిగిన మిస్ వరల్డ్ టాలెంట్ గ్రాండ్ ఫినాలేలో అందాల భామల సందడి. నృత్యంలో అలరించిన మిస్ ఇండియా నందినీ గుప్తా



గురువారం హైదరాబాద్‌లోని శిల్పారామం పక్కనే ఉన్న ఇందిరా మహిళాశక్తి బజారును మిస్ వరల్డ్ పోటీదారులు సందర్శించారు. ఈ సందర్భంగా సింగరేణి సేవా స్టాళ్లను పరిశీలించి అక్కడి సిబ్బందితో ఫొటోలు దిగారు

క్లుప్తంగా...

బాధ్యతలు చేపట్టిన ఆగ్రోస్ చైర్మన్



మంగళగిరి: రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఆగ్రోస్)చైర్మన్‌గా మాలేపాటి సుబ్బానాయుడు గురువారం గుంటూరు జిల్లా వడ్డేశ్వరంలోని రాష్ట్ర కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు మద్దతు ధర కల్పించడమే లక్ష్యంగా పని చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహిళా సహకార ఆర్థిక సంస్థ చైర్‌పర్సన్ బాధ్యతల స్వీకారం



నెహ్రూనగర్ (గుంటూరు ఈస్ట్): రాష్ట్ర మహిళ సహకార ఆర్థిక సంస్థ చైర్‌పర్సన్‌గా పీతల సుజాత గుంటూరులోని సంస్థ కార్యాలయంలో గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిస్సహాయస్థితిలో ఉన్న మహిళలకు ఆదరణ కల్పించడంతో పాటు వారిని వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దడానికి కార్యక్రమాలను చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో సహకార సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఎం. వేణుగోపాల్‌రెడ్డి, సంస్థ ఈడీ పద్మజ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ ఆడిట్ పేరాలపై చర్యలు అవశ్యం

పీఏసీ చైర్మన్ రామాంజనేయులు

సాక్షి, అమరావతి: వివిధ ప్రభుత్వ శాఖల్లోని పెండింగ్ ఆడిట్ పేరాలపై సకాలంలో చర్యలు తీసుకుని పరిష్కరించాలని పీఏసీ కమిటీ చైర్మన్ పి.రామాంజనేయులు అధికారులను ఆదేశించారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో పెండింగ్ ఆడిట్ పేరాలు, పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సిఫార్సులపై తీసుకున్న చర్యలపై గురువారం అసెంబ్లీ కమిటీ హాల్లో ఆయన సమీక్షా సమావేశం జరిపారు. తాము ఇచ్చిన సిఫారసులపై ఆయా శాఖలు తీసుకున్న యాక్షన్ టేకెన్ రిపోర్టులను ఈ సందర్భంగా కమిటీ సమీక్షించింది. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు. ఆడిట్ నివేదికలో పేర్కొన్న అభ్యంతరంపై సంబంధిత శాఖ లేదా అధికారులు ఇంకా స్పందించని లేదా తగిన చర్య తీసుకోని స్థితిని 'పెండింగ్ ఆడిట్ పేరా'గా పరిగణిస్తారు.

వ్యవసాయంలో 15% వృద్ధి రేటు ఎలా సాధ్యం?

ప్రభుత్వానికి ఏపీ రైతు సంఘం ప్రశ్న

సాక్షి, అమరావతి: వ్యవసాయ రంగంలో 2025–26 ఆర్థిక సంవత్సరంలో 15% అభివృద్ధి లక్ష్యంగా పెట్టుకున్నట్లు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం గురువారం ఓ ప్రకటనలో పేర్కొంది. ప్రభుత్వం వ్యవసాయ రంగానికి చేయూత ఇవ్వకుండా 15% వృద్ధిరేటు ఎలా సాధిస్తుందని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య, కార్యదర్శి కె.ప్రభాకరరెడ్డి ప్రశ్నించారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో అతివృష్టి, అనావృష్టితో 150 మండలాల్లో పంటలు దెబ్బతిని రైతులు నష్టపోయారన్నారు. రాయలసీమ జిల్లాల్లో పంటలు దెబ్బతిన్న ఏ ఒక్క రైతుకూ ప్రభుత్వం సాయం అందించలేదన్నారు. ప్రకృతి వైపరీత్యాల్లో రైతులకు ఎంతో కొంత ఊరటనిచ్చే పంటల బీమా విధానాన్ని పూర్తిగా మార్చివేయడంతో బీమా పరిహారమూ రైతులకు దక్కలేదన్నారు. నకిలీ, కల్తీ విత్తనాలు, ఎరువుల ధరల సమస్యలను, ప్రకృతి వైపరీత్యాల నుంచి పంటలను కాపాడే అంశాలపై ప్రభుత్వం శ్రద్ధ పెట్టాలని విజ్ఞప్తి చేశారు. రైతులందరికీ ఉచిత పంటల బీమా అమలు చేయాలని డిమాండ్ చేశారు.

సూపర్-6 అమలు కోసం జూన్ 2న ధర్నా

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

సాక్షి, అమరావతి: గత ఎన్నికల సందర్భంగా చంద్రబాబు ఇచ్చిన సూపర్-6 హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ జూన్ 2న రాష్ట్ర వ్యాప్తంగా మండల కార్యాలయాల వద్ద సీపీఐ ఆధ్వర్యంలో ధర్నాలు చేయనున్నట్టు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ తెలిపారు. విజయవాడలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ తదితరులతో కలిసి ఆయన ధర్నా గోడపత్రికను గురువారం ఆవిష్కరించారు. చత్తీస్‌గఢ్‌లో జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌పై న్యాయ విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఎన్‌కౌంటర్ హేయం: సీపీఎం

చత్తీస్‌గఢ్‌లో మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావుతో సహా 27 మందిని ఎన్‌కౌంటర్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్టు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. చర్చలకు తాము సిద్ధమేనని మావోయిస్టులు పదేపదే చేసిన విజ్ఞప్తులను కేంద్రం, చత్తీస్‌గఢ్ ప్రభుత్వాలు పెడచెవిన పెట్టి అమానవీయంగా మావోయిస్టులను తుడిచిపెట్టే విధానాన్ని అనుసరించాయని మండిపడ్డారు.



బైక్‌పై టార్పాలిన్ పట్ట తీసుకెళ్తూ..



ఉప్పు రాశిని సిద్ధం చేస్తూ..

కష్టాలవణం

వాతావరణంలో మార్పులతో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు ప్రకాశం జిల్లా ఉప్పు రైతులను ఇబ్బందులపాలు చేశాయి. కొత్తపట్నం సమీపంలో.. కయ్యల్లో ఉప్పు వర్షానికి కరిగిపోకుండా రాశులు పోసి జాగ్రత్త చేసుకునే క్రమంలో రైతులు హైరానాపడ్డారు. – సాక్షి, ఒంగోలు



వర్షం నీరు నిలవకుండా ఉప్పు రాశి చుట్టూ గాడి తీస్తున్న రైతు



కయ్యల్లో నుంచి ఉప్పు తెచ్చి రాశిగా పోస్తున్న కూలీలు



వర్షానికి ఉప్పు తడవకుండా టార్పాలిన్ పట్ట కప్పుతున్న కూలీలు

బెల్లం రైతుకు బేడీలు





బెల్లం తయారీలో రైతులు

కూటమి ప్రభుత్వం ఉమ్మడి చిత్తూరు జిల్లాలో బెల్లం సాగు చేసే రైతుకు బేడీలు వేస్తోంది. సాక్షాత్తు సీఎం ఇలాకాలో బెల్లం సాగు చేసే రైతులు జైలు ఊచలు లెక్కపెడుతున్నారు. వారు దొంగతనం, హత్యలు చేయలేదు. కానీ అలాంటి వారికి వేసే శిక్షలు ఆరుగాలం శ్రమించే అన్నదాతకు పడేలా చేస్తుండడం విస్మయానికి గురిచేస్తోంది. బెల్లం సాగు చేసే రైతులు బెల్లం అమ్మడం నేరమా? బెల్లం తీసుకొని పోయినవారు సారా కాస్తారా.. కాఫీ చేసుకుంటారా రైతుకు ఎలా తెలుస్తుంది? కానీ సారా కాసే వాళ్లను వదిలేసి.. బెల్లం సాగు చేసే రైతులను జైలుపాలు చేస్తుండడంపై అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు.

- నల్లబెల్లం పేరిట అన్నదాతల అరెస్టులు
- సారా తయారీకి బెల్లం విక్రయిస్తున్నారని సంకెళ్లు
- అక్రమంగా రైతుల అరెస్టులు.. నోటీసులు
- అన్నదాతలకు 'కూటమి సర్కారు' ఝలక్
- ట్రేడర్లకే విక్రయించాలంటున్న ఎక్సైజ్ పోలీసులు

'ఈ చిత్రంలో భార్య, బిడ్డలతో తన చెరకు తోట, ట్రాక్టర్‌తో కలిసి ఉన్న రైతు పేరు పెరుమాల్. గతేడాది ఆయుధపూజ నేపథ్యంలో చెరకు పంట ఓ మోస్తరుగా వస్తుండడంతో ఇలా ఫొటో తీసుకున్నాడు. కానీ ఇప్పుడు పెరుమాల్ చిత్తూరు జిల్లా జైలులో ఊచలు లెక్కిస్తున్నాడు.. కారణం.. పెరుమాల్ రైతు కావడం, తన వద్ద నల్ల బెల్లం కొన్న వ్యక్తులు సారా తయారు చేశారంట.'



కుటుంబ సభ్యులతో చెరకు పంట వద్ద రైతు పెరుమాళ్

చిత్తూరు అర్బన్ : ఉమ్మడి చిత్తూరుజిల్లాలో రైతులు పండించే ప్రధాన పంటల్లో చెరకు ఒకటి. ఇక్కడి నల్లరేగడి భూముల కారణంగా చాలా వరకు బెల్లం నలుపు రంగులో తయారవుతుంది. కొన్ని రకాల రసాయనాలు, ప్రాసెసింగ్ చేస్తే బెల్లం రంగు మారుతుంది. కానీ గిట్టుబాటు ధర దక్కదు. దీంతో చాలా మంది నల్లబెల్లాన్ని తయారు చేసి మండీలు, అవసరం ఉన్న వాళ్లకు, ట్రేడర్లకు అమ్ముతున్నారు. ఇదే ఇప్పుడు రైతుల పాలిట శాపంగా మారింది. నల్లబెల్లం తయారీ, విక్రయాలపై కూటమి ప్రభుత్వం ఆంక్షలు విధించింది. ఆంక్షలు అతిక్రమిస్తున్న అన్నదాతలను నిర్దాక్షిణ్యంగా అరెస్టు చేసి జైలుకు పంపుతోంది. ప్రభుత్వ చర్యలపై రైతులు, రైతు సంఘం నేతలు మండిపడుతున్నారు.

నవోదయంలో చీకట్లు

నాటుసారా తయారీ, విక్రయాలను అరికట్టడానికి కూటమి ప్రభుత్వం నవోదయం 2.0ను తీసుకొచ్చింది. సుదీర్ఘకాలంగా సారా తయారు చేస్తున్న కుటుంబాలను ఆ ఊబి నుంచి బయటపడేసి, వాళ్ల జీవన ప్రమాణాలు మార్చడానికి రుణాలు, ఇతర ప్రత్యామ్నాయ పనులను కల్పించాల్సిన ప్రభుత్వం రైతులపై పడింది. నాటు సారా తయారీకి నల్ల బెల్లం తప్పనిసరిగా వాడతారని, నల్లబెల్లం తయారు చేస్తున్న రైతులపై నిఘా ఉంచాలని, ఎవరెవరికి నల్లబెల్లం విక్రయిస్తున్నారు..? కొనుక్కునే వ్యక్తి ఆధార్ తీసుకున్నారా..? కిలో ఎంతకు అమ్ముతున్నారు..? అయిదు కిలోలకు పైబడి ఎవరికి అమ్ముతున్నారు..? అని వివరాల సేకరిస్తున్నారు. వాస్తవానికి బెల్లం తయారు చేసిన రైతులు దాన్ని మార్కెట్‌కు తరలించాలంటే తన రవాణాకు కిలోకు రూ.3, మార్కెట్‌లో కమిషన్ రూ.3 అదనపు సుంకంగా చెల్లించాలి. తీరా బెల్లాన్ని విక్రయించిన తరువాత తన పెట్టుబడి దక్కని పరిస్థితి. దీంతో కొందరు రైతులు బెల్లాన్ని మార్క్‌ఫెడ్‌లో విక్రయించడంతో పాటు గ్రామాల్లో అమ్ముతుంటారు. రైతుల నుంచి బెల్లాన్ని కొన్నవాళ్లు దాన్ని ఫ్యాక్టరీలకు వాడతారో.. పశువులకు దాణాగా ఉపయోగిస్తారో అన్నదాతలకు తెలియదు. కానీ ఎవరైనా సారా తయారు చేస్తూ పట్టుబడితే, నిందితులు చెప్పిన మాటలను పరిగణలోకి తీసుకుని బెల్లం విక్రయించారనే నెపంతో రైతులను అరెస్టు చేయడం అన్నదాతలను ఆందోళనకు గురిచేస్తోంది.

గిట్టుబాటు ధర ఎక్కడ ?

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో దాదాపు 5 వేల హెక్టార్లలో చెరకు పంట సాగువుతోంది. ఇందులో చిత్తూరు నియోజకవర్గంలోని గుడిపాల, రూరల్, నగరి, నింద్ర, విజయపురం, గంగాధర నెల్లూరు, కార్వేటినగరం, పెనుమూరు, పుంగనూరు, పులిచెర్ల, ఎస్.పురం, వెదురుకుప్పం మండలాల్లో చెరకు పంట ఎక్కువగా పండిస్తున్నారు. వీటిల్లో 4500 హెక్టార్లలో పండే పంటను ఫ్యాక్టరీలకు విక్రయిస్తుండగా మిగిలిన 500 హెక్టార్ల నుంచి బెల్లం తయారీ చేస్తున్నారు. ఒక హెక్టారుకు 70 టన్నుల వరకు బెల్లం తయారు చేస్తున్నారు. ఇందులో దాదాపు 5 వేల టన్నుల వరకు నల్లబెల్లం ఉత్పత్తి అవుతోంది. కిలో నల్లబెల్లాన్ని మార్కెట్‌లో ట్రేడర్లకు విక్రయిస్తే రూ.24–27 మధ్య ధర వస్తుంది. ఇందులోనే రవాణా చార్జీలు, దళారుల కమీషన్లు పోనూ చేతికి రూ.15 దక్కడం గగనంగా మారుతోంది. గత ప్రభుత్వ హయాంలో నల్ల బెల్లానికి గిట్టుబాటు ధర కల్పించిన వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం.. మార్క్‌ఫెడ్ ద్వారా బెల్లాన్ని కొనుగోలు చేయిస్తూ రైతులను ఆదుకుంది. కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంలో ఘోరంగా విఫలమైంది.



చెరకు పాలు మరిగిస్తున్న రైతు

ప్రభుత్వానికి దమ్ముంటే పంటను కొనుగోలు చేయాలి



వైఎస్.జగన్ సీఎంగా ఉన్నప్పుడు మార్క్‌ఫెడ్ ద్వారా నల్లబెల్లాన్ని కొనుగోలు చేసి రైతులకు అండగా నిలిచాం. సారాను నివారించడానికి పీడీ యాక్టులు పెట్టాం. కానీ టీడీపీ అధికారంలోకి వస్తేనే బెల్లం రైతులపై పడుతారు. గతంలోనూ అంతే, ఇప్పుడూ అదే కొనసాగుతోంది. మా నియోజకవర్గంలో ఎక్కువ మంది రైతులను అరెస్టు చేశారు. చంద్రబాబు అధికారంలోకి వస్తేనే జిల్లాలో బెల్లం రైతులకు ఇబ్బందులు తప్పవు. ఈ ప్రభుత్వానికి దమ్ముంటే నల్లబెల్లానికి గిట్టుబాటు ధర కల్పించి, పంటను కొనుగోలు చేయాలి. – ఎంసీ.విజయానందరెడ్డి, వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త

సారాకు బెల్లం విక్రయిస్తే అరెస్టు తప్పదు



సారా తయారీకి నల్ల బెల్లాన్ని విక్రయిస్తే చట్టపరంగా ముందుకు వెళతాం. సారా తయారీ వాళ్లకు బెల్లం అమ్మారని తెలిసాకే అరెస్టు చేశాం. నవోదయంలో భాగంగా నాటు సారా తయారీ అరికట్టడానికి ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా సదస్సులు నిర్వహించి, బెల్లం వ్యాపారులు, రైతులకు అవగాహన కల్పించాం. ఫ్యాక్టరీలు, పశువుల కోసం నల్లబెల్లం అమ్మితే పర్లేదు. సారా కోసం అమ్మితే మాత్రం అరెస్టు తప్పదు. – శ్రీనివాస్, ఎక్సైజ్ సూపరింటెండెంట్, చిత్తూరు

అరెస్టులపై ఉద్యమిస్తాం



ఎక్కడైనా సారా తయారు చేసే వాళ్లను అరెస్టు చేస్తారు. కానీ ఇక్కడ బెల్లం తయారు చేసే రైతులను అరెస్టు చేస్తున్నారు. ఇదెక్కడి న్యాయం.? నాటుసారా పేరిట రైతులను అరెస్టు చేసి జైలుకు తరలిస్తున్నారు. పొలాన్ని నమ్ముకున్న కుటుంబం రోడ్డున పడుతోంది. ఇది ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు. ప్రభుత్వం ఇలాంటి చర్యలు ఆపకపోతే ఉద్యమం తప్పదు. – నాగరాజన్, సీపీఐ, చిత్తూరు జిల్లా కార్యదర్శి

మార్కెట్‌కు మన్యం పైనాపిల్



- ఏజెన్సీలో ఆరంభమైన పైనాపిల్ సీజన్
- ఏటా 25 వేల మెట్రిక్ టన్నుల దిగుబడి
- ఒక్కోపైనాపిల్ ధర సరాసరి రూ.15, పట్టణాల్లో రూ.30కి విక్రయం



కుమ్మరిగండిలో విక్రయానికి సిద్ధంగా ఉంచిన పైనాపిల్

సీతంపేట: గిరిజన రైతులకు ఆదాయాన్ని తెచ్చిపెట్టే పైనాపిల్ సీజన్ ఆరంభమైంది. ఈ నెల నుంచి ఆగస్టు వరకు సీజన్ కొనసాగుతుంది. పార్వతీపురం మన్యంలో సుమారు 10వేల హెక్టార్లలో పంట విస్తరించి ఉంది. దాదాపు 25వేల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని గిరిజనుల అంచనా. ప్రస్తుతం ఒక్కోపండు రూ.15 ధర పలుకుతోంది. మరికొద్ది రోజుల్లో వారపు సంతలకు పంట ఉత్పత్తులు తరలిస్తామని రైతులు చెబుతున్నారు. గతేడాది సీజన్ ఆరంభంలో రూ.20 ధర పలికినా.. సీజన్ ముగిసే నాటికి రూ.5కు పడిపోయింది. దీంతో గిరిజనులు నష్టపోయారు. అప్పట్లో ఐటీడీఏ చొరవతో గిరిజనుల వద్ద నుంచి రూ.12 నుంచి రూ.15 వరకు కొనుగోలు చేసి బయట మార్కెట్లో విక్రయించారు. ఈ ఏడాది సీజన్ ఆరంభంలో రూ.15కు విక్రయిస్తున్నామని, సీజన్ ఆఖరుకు ఎంత ధర పడిపోతుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

కొండపోడు వ్యవసాయంలో సాగు...

సీతంపేట ఏజెన్సీలో కొండపోడు వ్యవసాయంలో భాగంగా అంతర పంటగా పైనాపిల్‌ను సాగు చేస్తున్నారు. ఈ ఏడాది సింహాచలం రకం ఎక్కువగా సాగు చేశారు. కేరళ రాష్ట్రానికి చెందిన క్యూ రకం కూడా కొన్నిచోట్ల సాగులో ఉంది. కుమ్మరిగండి, సారంగి, కుశిమి, ముత్యాలు, శంభాం, అక్కన్నగూడ, రాజన్నగూడ, జోగ్గైనాయుడుగూడ, కోడిశ, తొత్తడి, రామానగరం, అంటికొండ, పొల్ల, దోను బాయి, మానాపురం, తదితర గిరిజన గ్రామాల్లో ఇప్పుడు విస్తారంగా పైనాపిల్ పంట పండుతోంది. పంట సాగుకు తక్కువ పెట్టుబడి కావడంతో అధికమంది రైతులు ఆసక్తి చూపుతున్నారు.

వ్యాపారుల మన్యంబాట..

ఏజెన్సీలో పండే పైనాపిల్ రుచి, నాణ్యతలో మేటి. మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంటుంది. దీంతో ఒడిశాతోపాటు శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, రాజమండ్రి తదితర ప్రాంతాలకు చెందిన వ్యాపారులు ఇక్కడకు వచ్చి పంటను కొనుగోలుచేస్తారు. కొందరు వ్యాపారులైతే ముందుగానే రైతులతో ఒప్పందాలు కుదుర్చుకుంటారు. ఒక్కో పండుపై కనీసం రూ.10 నుంచి రూ.15 వరకు లాభాలు వస్తాయన్నది వ్యాపారుల మాట. కొన్ని సందర్భాల్లో ఒక్కోపైనాపిల్ పండును రూ.30 వరకు పట్టణాల్లో విక్రయిస్తారు.


గిరిజన సంతలు ఇలా..

పైనాపిల్ వ్యాపారం సంతల్లో కూడా జోరుగా సాగుతుంది. సీతంపేటలో సోమవారం, మర్రిపాడులో బుధవారం, దోనుబాయిలో గురువారం, పొల్ల, కుశిమిలలో శనివారం వారపు సంతలు జరుగుతా యి. ఇక్కడకు వ్యాపారులు వచ్చి పంటను కొనుగో లు చేస్తారు. కొన్ని సార్లు వ్యాపారులు సిండికేట్‌గా మారి నాణ్యతను బూచిగా చూపి పంటను చౌకగా దోచుకుంటారన్నది గిరిజన రైతుల ఆరోపణ.

గత ప్రభుత్వ చర్యలతో గిట్టుబాటు ధర

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇక్కడ పండిన పైనాపిల్ పంటను శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, కాకినాడ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, ఎన్టీఆర్ గుంటూరు, పల్నాడు తదితర జిల్లాల్లో 41 రైతు బజార్లకు తరలించేది. రైతు సంఘాల గ్రూపుల ద్వారా విక్రయించేందుకు చర్యలు తీసుకునేది. దళారీ వ్యవస్థ ఉండేది కాదు. పంట సీజన్ ముగిసేవరకు గ్రేడ్‌ను బట్టి ఒక్కో పండు రూ.15కు ఎఫ్‌పీవోలు కొనుగోలు చేసేవారు. దీంతో రైతులకు మంచి ఆదాయం వచ్చేది. ప్రస్తుతం అలాంటి చర్యలేవీ కనిపించడం లేదని, కూటమి ప్రభుత్వం రైతులను పట్టించుకోవడంలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టులకు అనుమతులు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టులను నెలకొల్పడానికి అనుమతినిస్తూ ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ గురువారం ఉత్తర్వులిచ్చారు. ప్రాజెక్టుల కేటాయింపు ఇలా..

- ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం తోటపల్లి గ్రామంలో రోజుకి 20 టన్నుల ఉత్పత్తి సామర్థ్యం గల కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటు కోసం మెస్సర్స్ నితిన్ సాయి కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (హైదరాబాద్) చేసిన అభ్యర్థనకు ఆమోదం.
- మెస్సర్స్ ఎకోరెన్ ఎనర్జీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ నుంచి 260 మెగావాట్ల విండ్ సోలార్ హైబ్రిడ్ విద్యుత్ సామర్థ్యాన్ని మెస్సర్స్ ఆంప్లస్ ఎనర్జీ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన రెండు గ్రూప్ ఆఫ్ కంపెనీలకు బదిలీ చేయడానికి అనుమతి లభించింది. దీంతో వైఎస్సార్ వైఎస్సార్ జిల్లాలోని గంగదేవిపల్లి, నల్లబల్లెలో ఆంప్లస్ ఎవరెస్ట్ సోలార్ ప్రైవేట్ లిమిటెడ్, ఆంప్లస్ ఐఐఎఫ్‌ఏ సోలార్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలు ప్రాజెక్టులు స్థాపించుకునేందుకు అనుమతి ఇచ్చారు.
- 300.30 మెగావాట్ల విండ్ పవర్ ప్రాజెక్టును, మెస్సర్స్ ఎకోరెన్ ఎనర్జీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ నుంచి మెస్సర్స్ దేశ్‌రాజ్ సోలార్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్‌కు బదిలీ చేసేందుకు ఆమోదం తెలిపారు. అనంతపురం జిల్లాలోని కంబదూర్, సెట్టూరు మండలాల్లోని రాళ్ల అనంతపురం, కురుబరహళ్లి, శ్రీ సత్యసాయి జిల్లాలోని కనగానపల్లి మండలంలో ఈ ప్రాజెక్టును నెలకొల్పనున్నారు.
- అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లోని వివిధ ప్రదేశాల్లో 2 వేల మెగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్టును ఏర్పాటు చేసేందుకు మెస్సర్స్ బొండాడ ఇంజినీరింగ్ లిమిటెడ్‌కు అనుమతినిచ్చారు.



శ్రీవారి దర్శనానికి 15 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూలైన్ ఏటీజీహెచ్ వద్దకు చేరుకుంది. బుధవారం అర్ధరాత్రి వరకు 80,964 మంది స్వామివారిని దర్శించుకోగా 32,125 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.24 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతుండగా, టికెట్లు లేని భక్తులకు 15 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.


మద్దిలో విశేష పూజలు



జంగారెడ్డిగూడెం: హనుమద్ జయంతిని పురస్కరించుకుని ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మండలం గుర్వాయిగూడెం మద్ది క్షేత్రంలో గురువారం ఆంజనేయస్వామికి విశేష పూజలు నిర్వహించారు. స్వామివారికి లక్ష తమలపాకులతో ప్రత్యేక పూజ జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు.

వైభవంగా హనుమాన్ శోభాయాత్ర

చీరాల అర్బన్: హనుమజ్జయంతి సందర్భంగా గురువారం సాయంత్రం చీరాలలో హనుమాన్ భక్తబృందం ఆధ్వర్యంలో హనుమాన్ శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. దేవాలయంలో ప్రత్యేక పూజల అనంతరం బోసనగర్‌లోని వీరాంజనేయ స్వామి దేవస్థానం నుంచి పట్టణంలోని హనుమాన్ నామస్మరణలతో శోభాయాత్ర ముంతావారి సెంటర్, దర్బార్ రోడ్డు మీదగా గడియార స్తంభం వరకు సాగింది.



తనయుడి కోసం...

చిరంజీవి హీరోగా నటించిన తాజా చిత్రం 'విశ్వంభర'. 'బింబిసార' ఫేమ్ వశిష్ఠ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో త్రిషా కృష్ణన్, ఆషికా రంగనాథ్ హీరోయిన్లుగా నటించారు. 'శుభలేఖ' సుధాకర్, కునాల్ కపూర్, ఇషా చావ్లా, రమ్య పసుపులేటి, రావు రమేశ్, రాజీవ్ కనకాల ప్రధాన పాత్రలు పోషించారు. విక్రమ్ రెడ్డి సమర్పణలో యూవీ క్రియేషన్స్‌పై వంశీకృష్ణా రెడ్డి, ప్రమోద్ ఉప్పలపాటి నిర్మించారు. ఈ సినిమాని సంక్రాంతి కానుకగా 2025 జనవరి 10న రిలీజ్ చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించిన సంగతి తెలిసిందే. అందుకు తగ్గట్టే షూటింగ్‌ని కూడా శరవేగంగా జరిపారు. చిరంజీవి ఎలాగైనా సంక్రాంతి బరిలో దిగుతారని అటు మెగా ఫ్యాన్స్, ఇటు సినిమా అభిమానులు అనుకున్నారు. కట్ చేస్తే... తనయుడు రామ్‌చరణ్ నటించిన 'గేమ్ చేంజర్' సినిమా కోసం తన 'విశ్వంభర' విడుదలని వాయిదా వేసుకున్నారు చిరంజీవి. రామ్‌చరణ్ హీరోగా శంకర్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'గేమ్ చేంజర్'. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్‌పై 'దిల్' రాజు, శిరీష్ నిర్మించిన ఈ మూవీని తెలుగు, తమిళ, హిందీ భాషల్లో జనవరి 10న రిలీజ్ చేశారు. 'గేమ్ చేంజర్' సినిమా కోసం 'దిల్' రాజుగారు అడగడంతో 'విశ్వంభర' సినిమా విడుదల వాయిదా వేశాం' అంటూ నిర్మాతల్లో ఒకరైన విక్రమ్ రెడ్డి గతంలో చెప్పిన సంగతి తెలిసిందే. జనవరి 10న రిలీజ్ వాయిదా పడిన 'విశ్వంభర' కొత్త విడుదల తేదీపై ఇప్పటి వరకూ చిత్రబృందం నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. అయితే మే 9న ఈ సినిమా విడుదలకానుందనే వార్తలు గతంలో వినిపించాయి. కానీ వీఎఫ్‌ఎక్స్ పనులు జరుగుతుండటంతో ఆ తేదీకి రిలీజ్ కాలేదు. కాగా జూలై 24న 'విశ్వంభర' థియేటర్లలోకి రానున్నట్లు సమాచారం. చిరంజీవి నటించిన 'ఇంద్ర' చిత్రం 2002 జూలై 24న రిలీజై బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ఈ నేపథ్యంలో సెంటిమెంట్ పరంగానూ ఆ డేట్ కలిసొచ్చే అవకాశం ఉండటంతో చిత్రయూనిట్ జూలై 24న విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారని ఫిల్మ్‌నగర్ టాక్. ఏది ఏమైనా కొత్త విడుదల తేదీపై చిత్రయూనిట్ అధికారిక ప్రకటన చేసే వరకు వేచి ఉండక తప్పదు.

లేట్‌గా వచ్చినా లేటెస్ట్‌గా...

హీరోకి గాయం... షూటింగ్‌కి బ్రేక్
ఆర్టిస్ట్ డేట్స్ సర్దుబాటు కాలేదు... షూటింగ్ లేట్
సినిమాకి అనుకున్న థియేటర్లు అమరలేదు... రిలీజ్ పోస్ట్‌పోన్
ఒక సినిమా మేలు కోరి ఇంకో సినిమా వెనక్కి తగ్గితే... విడుదల వాయిదా...
కారణం ఏదైనా కొన్ని సినిమాలు అనుకున్న సమయానికి థియేటర్లకు రావు.
వాయిదా పడుతుంటాయి. ఇలాంటప్పుడే లేట్‌గా వచ్చినా లేటెస్ట్‌గా వస్తా
అని రజనీకాంత్ 'బాషా'లో చెప్పిన డైలాగ్ గుర్తొస్తుంటుంది.
అలా లేట్ అయిన సినిమాలన్నీ లేటెస్ట్‌గా వస్తాయని ఊహించవచ్చు.
ఇక... విడుదల వాయిదా పడిన చిత్రాల గురించి తెలుసుకుందాం.



రాజా సాబ్ రాక కోసం అటు ప్రభాస్ అభిమానులు ఇటు సగటు సినిమా ప్రేమికులు వేచి చూస్తున్నారు. 'కల్కి 2898 ఏడీ' వంటి బ్లాక్‌బస్టర్ మూవీ తర్వాత ప్రభాస్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'రాజా సాబ్'. మారుతి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో నిధీ అగర్వాల్, మాళవికా మోహనన్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. పీరియాడికల్ హారర్

రాజా సాబ్ వచ్చేదెప్పుడు?

కామెడీ నేపథ్యంలో రూపొందుతోన్న ఈ చిత్రంలో ప్రభాస్ సరికొత్త లుక్‌లో కనిపించనున్నారు. అది కూడా ఆయన ద్విపాత్రాభినయం చేస్తున్నారని సమాచారం. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో ఈ ఏడాది ఏప్రిల్ 10న విడుదల చేయనున్నట్లు యూనిట్ పేర్కొంది. అయితే ఆ తేదీకి రిలీజ్ వాయిదా పడినప్పటికీ కొత్త విడుదల ఎప్పుడు? అన్నది మాత్రం చిత్రబృందం ఇప్పటివరకూ ప్రకటించ లేదు. ఈ సినిమా చిత్రీకరణ తుదిదశకు చేరుకుందని టాక్.



పవన్ కల్యాణ్ హీరోగా నటించిన తాజా చిత్రం 'హరి హర వీరమల్లు: పార్ట్-1 స్వార్డ్ వర్సెస్ స్పిరిట్'. జ్యోతికృష్ణ, క్రిష్ జాగర్లమూడి దర్శకత్వం వహించారు. నిధీ అగర్వాల్ హీరోయిన్‌గా నటించిన ఈ సినిమాలో బాబీ డియోల్, నాజర్, సునీల్, రఘుబాబు, సుబ్బరాజు వంటి వారు ఇతర ముఖ్య పాత్రలు పోషించారు. చారిత్రక యోధుడు వీరమల్లు పాత్రలో పవన్ కల్యాణ్ నటించారు. నిర్మాత ఏఎం రత్నం సమర్పణలో మెగా సూర్య ప్రొడక్షన్స్‌పై

చారిత్రక యోధుడు వీరమల్లు

ఎ.దయాకర్ రావు నిర్మించిన ఈ సినిమా పలుమార్లు వాయిదా పడగా, 2025లోనూ రెండు స్లారు రిలీజ్ వాయిదా పడింది. ఈ ఏడాది మార్చి 28న 'హరిహర వీరమల్లు'ని విడుదల చేయనున్నట్లు ప్రకటించిన యూనిట్.. ఆ తేదీకి వాయిదా వేసి, మే 9న రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించారు. అయితే ఆ తేదీకి కూడా విడుదల కాలేదు. నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నందున మే 9 నుంచి జూన్ 12కి విడుదలను వాయిదా వేసినట్లు చిత్రయూనిట్ ప్రకటించింది. ఈసారి ఎలాగైనా ఈ తేదీకే రిలీజ్ చేసేందుకు ప్రమోషన్స్‌ని కూడా భారీ స్థాయిలో చేస్తున్నారు. ఈ చిత్రం తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల కానుంది.

వెండితెరపై తనదైన శైలిలో మాస్ జాతరని ప్రేక్షకులకు చూపించనున్నారు రవితేజ. అయితే ఆ సమయం ఎప్పుడు? అనే విషయంపై స్పష్టత రావాల్సి ఉంది. రవితేజ నటిస్తున్న 75వ చిత్రం 'మాస్ జాతర'. (మనదే ఇదంతా అనేది ట్యాగ్‌లైన్). భాను భోగవరపు దర్శకత్వం వహిస్తున్నారు. 'ధమాకా' వంటి బ్లాక్ బస్టర్ మూవీ తర్వాత రవితేజ-శ్రీలీల 'మాస్ జాతర'లో రెండోసారి జోడీగా నటిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. గత ఏడాది దీపావళి సందర్భంగా 'మాస్ జాతర' అనే టైటిల్‌ను ఖరారు చేయడంతో పాటు 2025 మే 9న ఈ సినిమాని విడుదల చేయనున్నట్లు ప్రకటించారు నిర్మాతలు. అయితే ఈ నెల 9న విడుదల కాలేదు. రిలీజ్‌ని వాయిదా వేసిన చిత్రబృందం కొత్త విడుదల తేదీని మాత్రం ప్రకటించ లేదు.



మాస్ ఎంటర్‌టైనర్

దీంతో రవితేజ అభిమానులు నిరుత్సాహంగా ఉన్నారు. మాస్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ చిత్రంలో రవితేజ పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా కనిపించనున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమా చిత్రీకరణ సమయంలో రవితేజ భుజానికి గాయం కావడంతో షూటింగ్‌కి బ్రేక్ పడింది. ఈ కారణంగా చిత్రీకరణ ఆలస్యం అయింది. అయితే మేజర్ టాకీ పార్ట్ పూర్తయిందని, కేవలం పాటల చిత్రీకరణ బ్యాలెన్స్ ఉన్నట్లు సమాచారం. హీరోయిన్ శ్రీలీల కూడా ఇతర చిత్రాలతో బిజీగా ఉండటంతో డేట్స్ కుదరక పాటల చిత్రీకరణ బ్యాలెన్స్ ఉన్నట్లు టాక్. అయితే జూలైలో 'మాస్ జాతర'ని రిలీజ్ చేయనున్నట్లు ఇటీవల జరిగిన ఓ ప్రెస్‌మీట్‌లో నిర్మాత సూర్యదేవర నాగవంశీ చెప్పారు. ఆయన విడుదల తేదీ ప్రకటించనప్పటికీ జూలై 18న రిలీజ్ కానుందనే టాక్ వినిపిస్తోంది.



విష్ణు మంచు హీరోగా నటించిన పాన్ ఇండియన్ చిత్రం 'కన్నప్ప'. ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో ప్రీతీ ముకుందన్ హీరోయిన్‌గా నటించారు. మంచు మోహన్‌బాబు, బ్రహ్మానందం, ప్రభాస్, అక్షయ్ కుమార్, మోహన్ లాల్, శరత్‌కుమార్, కాజల్ అగర్వాల్ తదితరులు ఇతర కీలక పాత్రలు పోషించారు.

భక్తి పరవశం

అవా ఎంటర్‌టైన్మెంట్స్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ బ్యానర్లపై మంచు మోహన్‌బాబు నిర్మించిన ఈ చిత్రాన్ని తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ఏప్రిల్ 25న విడుదల చేయనున్నట్లు తొలుత ప్రకటించారు మేకర్స్. అయితే వీఎఫ్‌ఎక్స్ పనుల ఆలస్యం వల్ల రిలీజ్‌ని జూన్ 27కి వాయిదా వేసినట్లు చిత్రయూనిట్ ప్రకటించిన సంగతి తెలిసిందే. కొత్త రిలీజ్ డేట్‌కి సంబంధించిన పోస్టర్‌ని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ చేతుల మీదుగా విడుదల చేయించింది యూనిట్. మహాశివుడికి వీర భక్తుడైన కన్నప్ప కథ నేపథ్యంలో ఈ చిత్రం రూపొందింది. ఈ సినిమా ద్వారా మంచు విష్ణు కుమార్తెలు అరియానా, వివియానా, తనయుడు అవ్రామ్ భక్త వెండితెరపై ఎంట్రీ ఇస్తుండటం విశేషం. ఈ చిత్రం కోసం దేశవ్యాప్తంగానే కాదు.. అమెరికాలోనూ విస్తృతంగా ప్రమోషన్స్ నిర్వహిస్తున్నారు మంచు విష్ణు అండ్ టీమ్.

విజయ్ దేవరకొండ హీరోగా రూపొందుతోన్న పీరియాడికల్ చిత్రం 'కింగ్‌డమ్'. 'జెర్సీ' మూవీ ఫేమ్ గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్‌పై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. పీరియాడికల్ నేపథ్యంలో రూపొందుతోన్న ఈ చిత్రంలో ఇప్పటివరకూ కనిపించని వైవిధ్యమైన పాత్రలో విజయ్ దేవరకొండ కనిపించనున్నారు. ఇప్పటికే విడుదల చేసిన లుక్స్, గ్లింప్స్ చూస్తే ఈ విషయం స్పష్టమవుతోంది. ఈ సినిమాను తొలుత ఈ ఏడాది మార్చి 28న రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించారు మేకర్స్. అయితే ఆ తేదీకి

పీరియాడికల్ నేపథ్యంలో...

విడుదల కాలేదు. ఆ తర్వాత మే 30న రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించినప్పటికీ ఆ డేట్ కూడా జూలై 4కి వాయిదా పడింది. ''కింగ్‌డమ్'ని ముందుగా అనుకున్నట్టు మే 30న రిలీజ్ చేయాలని ఎంతగానో ప్రయత్నించాం. కానీ, మన దేశంలో ఇటీవల ఊహించని సంఘటనలు (ఆపరేషన్ సిందూర్) జరిగాయి. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రమోషన్స్, వేడుకలు నిర్వహించడం కష్టతరమని భావించి, వాయిదా నిర్ణయం తీసుకున్నాం. సినిమా కాస్త ఆలస్యంగా వచ్చినా అభిమానులు, ప్రేక్షకుల అంచనాలకు ఏమాత్రం తగ్గకుండా ఉంటుంది'' అని చిత్రబృందం పేర్కొన్న సంగతి తెలిసిందే. ఇదిలా ఉంటే.. ఈ చిత్రం రెండు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు నిర్మాత నాగవంశీ ప్రకటించారు. రెండో భాగానికి 'కింగ్‌డమ్ స్క్వేర్' లేదా 'కింగ్‌డమ్ 2' ఏ టైటిల్ పెట్టాలి? అన్నది తొలి భాగం ఫలితం తర్వాత నిర్ణయిస్తాం'' అని ఆయన తెలిపారు.



నితిన్ హీరోగా రూపొందిన తాజా చిత్రం 'తమ్ముడు'. శ్రీరామ్ వేణు దర్శకత్వం వహించిన ఈ సినిమాలో వర్ష బొల్లమ్మ, సప్తమి గౌడ కథానాయికలుగా నటించారు. నటి లయ కీలక పాత్ర చేశారు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్‌పై 'దిల్' రాజు, శిరీష్ నిర్మించిన ఈ చిత్రాన్ని మహా శివరాత్రి సందర్భంగా ఈ ఏడాది ఫిబ్రవరి 28న రిలీజ్ చేయనున్నట్లు మేకర్స్ తొలుత ప్రకటించారు. అయితే ఆ తేదీకి వాయిదా పడిన ఈ సినిమాని జూలై 4న రిలీజ్ చేయనున్నట్లు ఇటీవల ప్రకటించింది చిత్రయూనిట్. అక్క- తమ్ముడు అనుబంధాలతో అల్లుకున్న కథతో రూపొందిన ఈ చిత్రంలో

అక్కా తమ్ముడి అనుబంధం

నితిన్ అక్క పాత్రలో లయ కనిపించనున్నారు. ఇందులో క్రీడా నేపథ్య అంశాలు కూడా ఉంటాయని, ఆర్చరీ ఆటగాడిగా నితిన్ సందడి చేయనున్నట్లు తెలుస్తోంది. నితిన్, 'దిల్' రాజు, శిరీష్ కాంబినేషన్‌లో 'దిల్, శ్రీనివాస కళ్యాణం' సినిమాలొచ్చాయి. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్‌లో శ్రీరామ్ వేణు 'ఎంసీఏ, వకీల్ సాబ్' వంటి చిత్రాలు తీశారు. ఈ ముగ్గురి కాంబినేషన్‌లో వస్తున్న 'తమ్ముడు' సినీ ప్రియుల దృష్టిని ఆకర్షిస్తోంది. ఇక ఇదిలా ఉంటే.. విజయ్ దేవరకొండ 'కింగ్‌డమ్' వాయిదా పడి, చివరికి జూలై 4కి రాబోతోంది. అదే తేదీకి విడుదలకు సిద్ధమైన నితిన్ 'తమ్ముడు' మరోసారి వాయిదా పడుతుందా? లేక విడుదలవుతుందా? అనేది వేచి చూడాల్సిందే.



పై సినిమాలే కాదు.. మరికొన్ని చిత్రాల విడుదల తేదీల్లో మార్పులు జరిగాయి.. మరికొన్ని జరుగుతున్నాయి.

– దేరంగుల జగన్ మోహన్

విశ్వంభర బుక్‌లో ఏముంది?

– కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో విశ్వంభర బుక్ లాంచ్

'విశ్వంభర' బుక్‌లో ఏముంది? అంటే ప్రస్తుతానికి సస్పెన్స్ అంటున్నారు నిర్మాత విక్రమ్ రెడ్డి. చిరంజీవి హీరోగా నటిస్తున్న సోషియో ఫ్యాంటసీ అడ్వెంచరస్ యాక్షన్ మూవీ 'విశ్వంభర'. ఈ చిత్రంలో త్రిషా కృష్ణన్ హీరోయిన్‌గా నటిస్తుండగా, ఆషికా రంగనాథ్, బాలీవుడ్ నటుడు కునాల్ కపూర్ ఇతర లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు. మల్లిడి వశిష్ఠ దర్శకత్వంలో వంశీకృష్ణా రెడ్డి, ప్రమోద్, విక్రమ్ రెడ్డి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి. టాప్ హాలీవుడ్ వీఎఫ్‌ఎక్స్ స్టూడియోల భాగస్వామ్యంతో రూపొందుతున్న ఈ చిత్రానికి సంబంధించి పోస్ట్ ప్రొడక్షన్, వీఎఫ్‌ఎక్స్ పనులు ఇప్పటికే 90 శాతం పూర్తయ్యాయి. మిగతా పనులు వేగంగా సాగుతున్నాయి. కాగా ప్రస్తుతం ఫ్రాన్స్‌లో జరుగుతున్న 78వ కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో 'విశ్వంభర' సినిమాకు చెందిన బుక్‌ను రిలీజ్ చేశారు ఈ చిత్రనిర్మాత విక్రమ్ రెడ్డి. అలాగే కాన్స్‌లోని భారత పెవిలియన్‌లో 'విశ్వంభర' సినిమా కథ, భారతీయ పురాణాల ప్రాధాన్యత, బుక్ విశేషాలు, వీఎఫ్‌ఎక్స్ స్టూడియోల సహకారం గురించిన పలు విశేషాలను ఆయన తెలిపారు. కీరవాణిగారు అద్భుతమైన మ్యూజిక్, ఆర్‌ఆర్ అందించారని, ఛోటా కె. నాయుడు విజువల్స్ అద్భుతంగా ఉంటాయని ఆయన చెప్పుకొచ్చారు.


● విక్రమ్ రెడ్డి

అంతర్జాతీయ స్థాయిలో..

భారతదేశ మాజీ రాష్ట్రపతి, ప్రముఖ శాస్త్రవేత్త ఏపీజే అబ్దుల్ కలాం బయోపిక్ 'కలాం: ది మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా'ను కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో అనౌన్స్ చేసిన సంగతి తెలిసిందే. ధనుష్ టైటిల్ రోల్‌లో నటించనున్న ఈ బయోపిక్‌కు ఓం రౌత్ దర్శకత్వం వహించనున్నారు. గుల్షన్ కుమార్, తేజ్ నారాయణ్ అగర్వాల్, టీ- సిరీస్ ఫిల్మ్స్ సమర్పణలో అభిషేక్ అగర్వాల్, అనిల్ సుంకర, భూషణ్ కుమార్, క్రిషన్ కుమార్ ఈ సినిమాను నిర్మించనున్నారు. 'కలాం: ది మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా' సినిమాను ప్రకటించిన తర్వాత, ఈ సినిమాను గురించి కాన్స్‌లోని భారత్ పెవిలియన్‌లో ఈ చిత్ర దర్శకుడు ఓం రౌత్, నిర్మాత అభిషేక్ అగర్వాల్ మాట్లాడారు. ''ఏపీజే అబ్దుల్ కలాంగారి జీవితం ప్రపంచవ్యాప్త యువతకు స్ఫూర్తిదాయకం. ఆయన బయోపిక్‌ను తెరకెక్కడం బాధ్యతతో కూడిన సవాల్‌లాంటింది'' అని పేర్కొన్నారు ఓం రౌత్. ''ఈ సినిమా నిర్మాణంలో భాగస్వామిగా ఉన్నందుకు గౌరవంగా ఉంది. అంతర్జాతీయ స్థాయిలో ఈ సినిమాను రిలీజ్ చేస్తాం'' అని తెలిపారు అభిషేక్ అగర్వాల్.



● ఓం రౌత్, అభిషేక్ అగర్వాల్

సోనమ్.. ఓ హాట్ టాపిక్

భారత ప్రధానమంత్రి నరేంద్ర మోది బొమ్మ ఉన్న నెక్లెస్‌ను ధరించి, కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌కు హాజరై చర్చనీయాంశమయ్యారు రాజస్థాన్ నటి-మోడల్ రుచి గుజ్జర్. ఈ విషయాన్ని మరవక ముందే ఇండియన్ ఇన్‌ఫ్లుయెన్సర్ సోనమ్ చబ్రా ధరించిన కాస్ట్యూమ్ కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో చర్చనీయాంశమైంది. సోనమ్ చబ్రా డ్రెస్‌పై భారతదేశంపై జరిగిన ఉగ్రదాడుల (ఇటీవల జరిగిన పహల్గాం, గతంలో జరిగిన ఉరి, పుల్వామా..') పేర్లు ఉన్నాయి. అలాగే ఐశ్వర్యా రాయ్ 22వ సారి కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌కు హాజరైన సంగతి తెలిసిందే. అయితే ఐశ్వర్యా రాయ్ నుదుట సిందూర్ హైలైట్ అయ్యేలా ఉంది. 'ఆపరేషన్ సిందూర్'ను పరోక్షంగా ప్రస్తావిస్తూ, ఇలా ఐశ్వర్యా రాయ్ సిందూరం ధరించారనే టాక్ సోషల్ మీడియాలో ప్రచారంలోకి వచ్చింది. ఇంకా భారతీయ నటి అదితీరావ్ హైదరీ కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ రెడ్ కార్పెట్‌పై నడిచారు.


● అదితీ రావ్ హైదరీ


● సోనమ్ చబ్రా

గ్లిజరిన్ లేకుండా సహజంగా నటించాం

– ఆకాంక్షా సింగ్



''తల్లిదండ్రుల గురించి గొప్పగా చెప్పే చిత్రం 'షష్టిపూర్తి'. ఈ సినిమా చేస్తున్న సమయంలో మా నాన్న గుర్తొచ్చారు. ఆయన్ని నేను చాలా మిస్ అయ్యాను. కుటుంబ సమేతంగా అందరూ కలిసి చూడాల్సిన చిత్రమిది. తల్లిదండ్రులను ప్రేమించండి... వారితో ఎక్కువ సమయాన్ని గడపండి'' అని హీరోయిన్ ఆకాంక్షా సింగ్ తెలిపారు. రాజేంద్రప్రసాద్, అర్చన ప్రధాన పాత్రల్లో, రూపేష్, ఆకాంక్షా సింగ్ జంటగా నటించిన చిత్రం 'షష్టిపూర్తి'. పవన్ ప్రభ దర్శకత్వంలో హీరో రూపేష్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 30న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఆకాంక్షా సింగ్ విలేకరులతో మాట్లాడుతూ–''షష్టిపూర్తి'లో జానకి అనే గ్రామీణ అమ్మాయి పాత్ర చేశాను. అచ్చమైన తెలుగమ్మాయిలా లంగా ఓణిలో స్క్రీన్‌పై కనిపించడం నాకిదే తొలిసారి. ఇక 'బెంచ్ లైఫ్' చిత్రంలో రాజేంద్రప్రసాద్‌గారితో నటించాను. ఇప్పుడు 'షష్టిపూర్తి'లో చేశాను. మేమిద్దరం ఎప్పుడు కలిసి నటించినా భావోద్వేగ సన్నివేశాల కోసం గ్లిజరిన్ వాడలేదు. సహజంగానే నటించేస్తాం. కథ, పాత్ర నచ్చితే వెబ్ సిరీస్‌లో అయినా నటిస్తాను. యాక్షన్ చిత్రాలంటే ఎక్కువగా ఇష్టం. ప్రస్తుతం తెలుగులో ఓ యాక్షన్ మూవీ చేస్తున్నాను. తమిళంలో ఒక సినిమా ఒప్పుకున్నాను'' అని తెలిపారు.

సరికొత్తగా టాటా ఆల్ట్రోజ్



ప్రారంభ ధర రూ.6.89 లక్షలు

ముంబై: ప్రముఖ ఆటోమొబైల్ కంపెనీ టాటా మోటార్స్ తన ప్రీమియం హ్యాచ్‌బ్యాక్ ఆల్ట్రోజ్ కారుకు కొత్త అప్‌డేట్‌లు ఇచ్చి, ఆల్ట్రోజ్ ఫేస్‌లిఫ్ట్ పేరుతో మార్కెట్‌లోకి తీసుకొచ్చింది. ప్రారంభం మోడల్ ఎక్స్ షోరూమ్ ధర రూ. 6.89 లక్షలు, టాప్-ఎండ్ వేరియంట్ ధర రూ.11.29 లక్షలుగా ఉంది. ప్రిస్టైన్ వైట్, ప్యూర్ గ్రే, రాయల్ బ్లూ, ఎంబర్ గ్లో, డ్యూన్ గ్లో రంగుల్లో లభిస్తుంది. ఆరు ఎయిర్‌బ్యాగులు, హిల్ హోల్డ్ అసిస్టెంట్, ఫాగ్ ల్యాంప్స్, 360 డిగ్రీల కెమెరా, ఎస్‌ఓఎస్ కాల్ ఫంక్షన్ వంటి సేఫ్టీ ఫీచర్లున్నాయి. జూన్ 2 నుంచి బుకింగ్‌లు ప్రారంభం కానున్నాయి. ''సరికొత్త ఆల్ట్రోజ్‌తో ప్రీమియం హ్యాచ్‌బ్యాక్ విభాగంలో కొత్త అధ్యయనాన్ని ప్రారంభిస్తున్నాము. ఈ విభాగంలో 25% మార్కెట్ వాటా తిరిగి దక్కించుకుంటాము'' అని టాటా ప్యాసింజర్ ఎలక్ట్రిక్ మొబిలిటీ ఎండీ శైలేష్ చంద్ర తెలిపారు.

ఇండస్‌ఇండ్ బ్యాంక్‌లో ఉల్లంఘనలపై దృష్టి

సెబీ చైర్మన్ తుహిన్ కాంత పాండే



న్యూఢిల్లీ: ఇండస్ ఇండ్ బ్యాంక్‌లో సీనియర్ యాజమాన్యం వైపు నుంచి ఏవైనా తీవ్రమైన ఉల్లంఘనలు చోటుచేసుకుంటే వాటిపై తప్పక దృష్టి సారిస్తామని సెబీ చైర్మన్ తుహిన్‌కాంత పాండే ప్రకటించారు. రూ.3,400 కోట్ల మేర ఖాతాల్లో మోసాలపై ఆరోపణలు రావడం తెలిసిందే. ఇండస్‌ఇండ్ బ్యాంక్‌లో సమస్యలను ఆర్‌బీఐ చూసుకుంటుందని.. సెక్యూరిటీస్ మార్కెట్ నిబంధనల ఉల్లంఘనలను సెబీ పరిశీలిస్తుందని పాండే స్పష్టం చేశారు. అసోచామ్ కార్యక్రమానికి హాజరైన సందర్భంగా మీడియా ప్రతినిధుల ప్రశ్నలకు పాండే పై విధంగా బదులిచ్చారు. మోసంలో కొందరు ఉద్యోగుల పాత్ర ఉందన్న అనుమానాన్ని ఇండస్‌ఇండ్ బ్యాంక్ బోర్డు వ్యక్తం చేస్తూ.. దీనిపై దర్యాప్తు సంస్థలు, నియంత్రణ సంస్థలకు నివేదించాలని యాజమాన్యాన్ని కోరడం గమనార్హం. డెరివేటివ్‌లు, సూక్ష్మ రుణాల పోర్ట్‌ఫోలియోలో మోసాలు వెలుగు చూడడం తెలిసిందే. సీనియర్ ఉద్యోగుల పాత్ర ఉందంటూ అంతర్గత ఆడిట్ తేల్చడంతో ప్రస్తుతం ఫోరెన్సిక్ దర్యాప్తు కొనసాగుతోంది. ఖాతాల మోసాల్లో సీనియర్ యాజమాన్యం పాత్ర ఉండొచ్చంటూ బ్యాంక్ ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి సమాచారం ఇచ్చింది. ఇప్పటి వరకు ఆడిటింగ్, దర్యాప్తులో గుర్తించిన లోపాలను మార్చి త్రైమాసికం ఫలితాల్లో పేర్కొన్నట్టు ఇండస్‌ఇండ్ బ్యాంక్ తెలిపింది. డెరివేటివ్‌లో అక్రమాలకు సంబంధించి రూ.1,960 కోట్లను గుర్తించడంతోపాటు, తప్పుడు లెక్కలకు సంబంధించి రూ.674 కోట్లను రివర్స్ చేయడం గమనార్హం. మార్చి త్రైమాసికానికి బ్యాంక్ రూ.2,329 కోట్ల నష్టాన్ని ప్రకటించింది.

ఎన్‌ఎస్‌ఈ ఐపీవో సవాళ్లకు చెక్

స్టాక్ ఎక్స్ఛేంజీ దిగ్గజం ఎన్‌ఎస్‌ఈ పబ్లిక్ ఇష్యూకి అడ్డుగా నిలుస్తున్న సమస్యలు త్వరలో పరిష్కారంకాగలవని క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ చైర్మన్ తుహిన్ కాంత పాండే తాజాగా పేర్కొన్నారు. కొన్ని అంశాల కారణంగా నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ(ఎన్‌ఎస్‌ఈ) ఐపీవో ప్రతిపాదన సెబీ వద్ద పెండింగ్‌లో ఉన్న సంగతి తెలిసిందే. కీలక యాజమాన్య



వ్యక్తులకు చెల్లించిన పరిహారం, టెక్నాలజీ, క్లియరింగ్ కార్పొరేషన్‌లో మెజారిటీ ఓనర్‌షిప్ తదితరాలకు పరిష్కారం లభించగలదన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న అన్ని సమస్యలనూ తొలగించేందుకు ఎన్‌ఎస్‌ఈ, సెబీ చర్చలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. అసోచామ్ ఏర్పాటు చేసిన ఒక సదస్సులో పాండే ఈ విషయాలు వెల్లడించారు. ఇందుకు గడువును ప్రకటించనప్పటికీ సమస్యలను పరిష్కరించనున్నట్లు తెలియజేశారు. ఎన్‌వోసీ కోసం సెబీకి ఎన్‌ఎస్‌ఈ తిరిగి దరఖాస్తు చేసిన నేపథ్యంలో పాండే వివరణకు ప్రాధాన్యత ఏర్పడింది.

మార్చి త్రైమాసిక ఫలితాలు

దీపక్ ఫెర్టిలైజర్స్ లాభం రూ.278 కోట్లు

ఆదాయంలోనూ మెరుగైన వృద్ధి



న్యూఢిల్లీ: దీపక్ ఫెర్టిలైజర్స్ అండ్ పెట్రోకెమికల్స్ గత ఆర్థిక సంవత్సరం (2024-25) మార్చితో ముగిసిన త్రైమాసికంలో బలమైన పనితీరు నమోదు చేసింది. కన్సాలిడేటెడ్ లాభం క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూస్తే 21 శాతం పెరిగి రూ.278 కోట్లుగా నమోదైంది. అంతక్రితం ఆర్థిక సంవత్సరం ఇదే క్వార్టర్లో లాభం రూ.230 కోట్లుగా ఉండడం గమనార్హం. ఆదాయం సైతం ఇదే కాలంలో 26 శాతం వృద్ధితో రూ.2,717 కోట్లకు చేరింది. వ్యయాలు సైతం రూ.1,862 కోట్ల నుంచి రూ.2,397 కోట్లకు ఎగిశాయి. ఇక 2024-25 పూర్తి ఆర్థిక సంవత్సరానికి కంపెనీ లాభం రూ.945 కోట్లకు పుంజుకుంది. అంతక్రితం ఆర్థిక సంవత్సరంలో లాభం రూ.467 కోట్లతో పోల్చితే రెట్టింపైంది. గోపాల్‌పూర్‌లో తలపెట్టిన ట్యాన్ ప్రాజెక్ట్ 75 శాతం.. దహేజ్‌లో చేపట్టిన నైట్రిక్ యాసిడ్ ప్రాజెక్ట్ పనులు 48 శాతం పూర్తయినట్టు కంపెనీ వెల్లడించింది. గత ఆర్థిక సంవత్సరంలో రూ.655 కోట్ల మూలధన వ్యయాలు చేసినప్పటికీ.. నికర రుణ భారం రూ.3,426 కోట్ల నుంచి రూ.3,305 కోట్లకు తగ్గింది. సాధారణం కంటే అధిక వర్షాల అంచనాలతో ఖరీఫ్ సీజన్‌లో సాగు సంబంధిత పరిష్కారాలకు బలమైన డిమాండ్‌ను అంచనా వేస్తున్నట్టు కంపెనీ చైర్మన్, ఎండీ మెహతా తెలిపారు.

బీఎస్‌ఈలో కంపెనీ షేరు ధర ఒక శాతం నష్టంతో 1,359 వద్ద ముగిసింది.

ఎమ్‌క్యూర్ లాభం హైజంప్

క్యూ4లో రూ. 197 కోట్లు



ముంబై: ఔషధ రంగ సంస్థ ఎమ్‌క్యూర్ ఫార్మాస్యూటికల్స్ గతేడాది(2024-25) చివరి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. జనవరి-మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 63 శాతం జంప్‌చేసి రూ. 197 కోట్లకు చేరింది. ఆదాయం పుంజుకోవడం ఇందుకు ప్రధానంగా సహకరించింది. అంతక్రితం ఏడాది(2023-24) ఇదే కాలంలో కేవలం రూ. 121 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 1,771 కోట్ల నుంచి రూ. 2,116 కోట్లకు ఎగసింది. ఇది 20 శాతం వృద్ధికాగా.. దేశీ బిజినెస్ 25 శాతం పురోగమించినట్లు కంపెనీ వెల్లడించింది. ఇందుకు మహిళల ఆరోగ్య పరిరక్షణ, కార్డియో ఫ్రాంచైజీలు దోహదపడినట్లు పేర్కొంది.

ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు బీఎస్‌ఈలో 9 శాతం దూసుకెళ్లి రూ. 1,172 వద్ద ముగిసింది.

స్ట్రైడ్స్ ఫార్మా లాభం దూకుడు

- క్యూ4లో రూ. 86 కోట్లు
- షేరుకి రూ. 4 డివిడెండ్



ముంబై: ఔషధ రంగ సంస్థ స్ట్రైడ్స్ ఫార్మా సైన్స్ గతేడాది(2024-25) చివరి త్రైమాసికంలో పటిష్ఠ ఫలితాలు సాధించింది. జనవరి-మార్చి(క్యూ4)లో నికర లాభం భారీగా ఎగసి రూ. 86 కోట్లకు చేరింది. ఆదాయం పుంజుకోవడం ఇందుకు ప్రధానంగా సహకరించింది. అంతక్రితం ఏడాది(2023-24) ఇదే కాలంలో కేవలం రూ. 10.5 కోట్లు ఆర్జించింది. వాటాదారులకు కంపెనీ బోర్డు షేరుకి రూ. 4 చొప్పున డివిడెండ్ ప్రకటించింది. కాగా.. క్యూ4లో మొత్తం ఆదాయం రూ. 1,030 కోట్ల నుంచి రూ. 1,202 కోట్లకు జంప్ చేసింది. అయితే మొత్తం వ్యయాలు సైతం రూ. 958 కోట్ల నుంచి రూ. 1,072 కోట్లకు పెరిగాయి. గతేడాది అమ్మకాల్లో 12-15 శాతం వృద్ధిని అంచనా వేసినప్పటికీ 17 శాతంపైగా పురోగతి సాధించినట్లు కంపెనీ వ్యవస్థాపకుడు, నాన్‌ఎగ్జిక్యూటివ్ చైన్‌పర్సన్ అరుణ్ కుమార్ పేర్కొన్నారు.

ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు బీఎస్‌ఈలో 5 శాతం జంప్‌చేసి రూ. 730 వద్ద ముగిసింది.

ఆయిల్ ఇండియా పనితీరు బలహీనం

- లాభం, ఆదాయంలో క్షీణత
- షేరుకు రూ.1.50 డివిడెండ్



న్యూఢిల్లీ: ప్రభుత్వరంగ ఆయిల్ ఇండియా మార్చి త్రైమాసికంలో బలహీన పనితీరు నమోదు చేసింది. లాభం, ఆదాయాలు క్షీణించాయి. నికర లాభం రూ.1,592 కోట్లుగా నమోదైంది. క్రితం ఏడాది ఇదే కాలంలో లాభం రూ.2,028 కోట్లుగా ఉంది. ఆదాయం సైతం ఇదే కాలంలో రూ.6,590 కోట్ల నుంచి రూ.6,183 కోట్లకు తగ్గింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి కంపెనీ చరిత్రలోనే గరిష్ఠ స్థాయిలో 6.71 మిలియన్ టన్నుల గ్యాస్, ఆయిల్ ఉత్పత్తిని సాధించినట్టు ఆయిల్ ఇండియా ప్రకటించింది. పూర్తి ఆర్థిక సంవత్సరానికి కంపెనీ లాభం అంతక్రితం ఆర్థిక సంవత్సరంతో పోల్చితే 10 శాతం పెరిగి రూ.6,114 కోట్లకు చేరింది. ఒక్కో షేరుకు రూ.1.50 తుది డివిడెండ్‌ను కంపెనీ బోర్డు ప్రకటించింది.

బీఎస్‌ఈలో ఆయిల్ ఇండియా షేరు ధర ఒక శాతం లాభంతో రూ.427 వద్ద ముగిసింది.

ఫోర్టిస్ హెల్త్‌కేర్ లాభం రూ.188 కోట్లు



న్యూఢిల్లీ: ఫోర్టిస్ హెల్త్‌కేర్ మార్చి త్రైమాసికానికి రూ.188 కోట్ల కన్సాలిడేటెడ్ లాభాన్ని ప్రకటించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో లాభం రూ.203 కోట్లతో పోల్చి చూస్తే 7 శాతం తగ్గింది. ఆదాయం ఇదే కాలంలో రూ.1,786 కోట్ల నుంచి రూ.2,007 కోట్లకు వృద్ధి చెందింది. మొత్తం వ్యయాలు రూ.1,532 కోట్ల నుంచి రూ.1,741 కోట్లకు ఎగిశాయి. అసోసియేట్ సంస్థకు సంబంధించి పెట్టుబడుల విలువ క్షీణత రూపంలో రూ.53.57 కోట్ల నష్టం ఎదుర్కోవడం లాభం తగ్గడానికి కారణంగా కంపెనీ తెలిపింది. ప్రతీ షేరుకు రూపాయి చొప్పున తుది డివిడెండ్‌ను కంపెనీ బోర్డు ప్రకటించింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో కంపెనీ లాభం రూ.809 కోట్లకు దూసుకుపోయింది. అంతక్రితం ఆర్థిక సంవత్సరంలో ఇది రూ.645 కోట్లుగా ఉంది. ఆదాయం రూ.6,893 కోట్ల నుంచి రూ.7,783 కోట్లకు వృద్ధి చెందింది.

బీఎస్‌ఈలో ఫోర్టిస్ హెల్త్‌కేర్ స్టాక్ ధర ఒక శాతం నష్టపోయి రూ.680 వద్ద ముగిసింది.

అక్మే సోలార్ లాభం డౌన్

క్యూ4లో రూ. 122 కోట్లు



న్యూఢిల్లీ: రెనెవబుల్ ఎనర్జీ కంపెనీ అక్మే సోలార్ హోల్డింగ్స్ గతేడాది(2024-25) చివరి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. జనవరి-మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 77 శాతంపైగా క్షీణించి రూ. 122 కోట్లకు పరిమితమైంది. అంతక్రితం ఏడాది(2023-24) ఇదే కాలంలో రూ. 532 కోట్లు ఆర్జించింది. ఈ కాలంలో పంజాబ్, ఉత్తరాఖండ్, కర్ణాటకలలో 369 మెగావాట్ల విక్రయం ద్వారా రూ. 696 కోట్ల అనూహ్య ఆర్జన సాధించడం ఇందుకు సహకరించిన సంగతి తెలిసిందే. కాగా.. మొత్తం ఆదాయం మాత్రం రూ. 318 కోట్ల నుంచి రూ. 539 కోట్లకు జంప్‌చేసింది. అయితే ఫైనాన్స్ వ్యయాలు రూ. 177 కోట్ల నుంచి రూ. 206 కోట్లకు పెరిగాయి. తరుగుదల, అమార్టైజేషన్ పద్దు సైతం రూ. 61 కోట్ల నుంచి రూ. 102 కోట్లకు పెరిగింది. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి నికర లాభం రూ. 698 కోట్ల నుంచి రూ. 251 కోట్లకు వెనకడుగు వేసింది. నికర రుణ భారం రూ. 7,507 కోట్లుగా నమోదైంది. సొంత అనుబంధ సంస్థ అక్మే సికార్ సోలార్ బికనీర్.. రాజస్తాన్‌లో 112.5 మెగావాట్ల రెండో దశ సోలార్ ప్రాజెక్టును ప్రారంభించినట్లు కంపెనీ పేర్కొంది. దీంతో మొత్తం సామర్థ్యం 165 మెగావాట్లకు చేరగా.. మరో 300 మెగావాట్లు ప్రారంభంకానున్నట్లు తెలియజేసింది.

ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు బీఎస్‌ఈలో 3.5 శాతం క్షీణించి రూ. 238 వద్ద ముగిసింది.

ఎయిర్‌టెల్ యూజర్లకు గూగుల్ వన్ క్లౌడ్ స్టోరేజీ



న్యూఢిల్లీ: కస్టమర్లకు క్లౌడ్ స్టోరేజీ ప్రయోజనాలను అందించే దిశగా టెక్ దిగ్గజం గూగుల్‌తో టెలికం సంస్థ భారతి ఎయిర్‌టెల్ ఒప్పందం కుదుర్చుకుంది. దీని ప్రకారం ఎయిర్‌టెల్ పోస్ట్‌పెయిడ్, వైఫై యూజర్లందరికీ ఆరు నెలల పాటు 100 జీబీ మేర గూగుల్ వన్ క్లౌడ్ స్టోరేజ్ సబ్‌స్క్రిప్షన్ సర్వీసు ఉచితంగా లభిస్తుంది. దీన్ని మరో అయిదుగురితో షేర్ చేసుకోవచ్చు. 6 నెలల ఉచిత వ్యవధి పూర్తయిన తర్వాత నుంచి నెలకు రూ. 125 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. డివైజ్‌లలో డేటా స్టోరేజ్ పరిమితుల వల్ల మాటిమాటికీ ఫోటోలు, వీడియోలు, డాక్యుమెంట్లను డిలీట్ చేయాల్సిన పరిస్థితి ఉంటున్న నేపథ్యంలో క్లౌడ్ స్టోరేజీ ఉపయోగకరంగా ఉంటుందని ఎయిర్‌టెల్ తెలిపింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

23-5-2025

విశాఖ	545-00
చిత్తూరు	613-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	517-00
విజయవాడ	530-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	500-00
వరంగల్	502-00
రిటైల్ ధర	5.60

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
INDUSINDBK	783.5	1.76
JSWSTEEL	1,008.00	0.71
BAJAJ-AUTO	8,744.00	0.65
BHARTIARTL	1,831.00	0.47
HEROMOTOCO	4,272.10	0.19

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
ONGC	242.1	-2.65
M&M	3,016.00	-2.42
HINDALCO	649.55	-2.03
WIPRO	246.05	-1.94
TRENT	5,346.00	-1.79

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్‌ఈ	7,206
ఎన్‌ఎస్‌ఈ	1,06,355
ఎన్‌ఎస్‌ఈ(డెరివేటివ్స్)	2,12,754
ఎఫ్ఐఐ	- 5,045
డీఐఐ	+ 3,715

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	61.08	$ 61.57
బ్రెంట్	64.35	$ 64.97


బెంగళూరులో శాప్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్



అర్లాండో: జర్మన్ ఐటీ దిగ్గజం శాప్ కొత్తగా బెంగళూరులో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ని(సీవోఈ) ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించింది. ఈ ఏడాది జూలై-ఆగస్టులో సుమారు 15,000 సీటింగ్ సామర్థ్యంతో దీన్ని ప్రారంభించనున్నట్లు తెలిపింది. బెంగళూరులోని దేవనహళ్ళిలో 41 ఎకరాల విస్తీర్ణంలో ఇది ఏర్పాటు కానుంది. 1998 నుంచి భారత్‌లో కార్యకలాపాలు సాగిస్తున్న శాప్ ల్యాబ్స్ ఇండియాలో ప్రస్తుతం హైదరాబాద్ సహా అయిదు నగరాల్లో 14,000 మంది సిబ్బంది ఉన్నారు. జర్మనీ వెలుపల కంపెనీకి అతి పెద్ద పరిశోధన, అభివృద్ధి (ఆర్అండ్‌డీ) కేంద్రం ఉన్నది భారత్‌లోనే. తమకు అతి పెద్ద డెవలప్‌మెంట్ సెంటర్స్‌లో భారత్ కూడా ఒకటని శాప్ ఎగ్జిక్యూటివ్ బోర్డు సభ్యుడు ముహమ్మద్ ఆలం తెలిపారు. ఆటోమొబైల్, హెల్త్‌కేర్, రిటైల్ సహా వివిధ వ్యాపార విభాగాలు గణనీయంగా వృద్ధి చెందుతున్నట్లు వివరించారు. భారతీయ కంపెనీలు వేగవంతంగా కృత్రిమ మేధని (ఏఐ) అందిపుచ్చుకుంటున్నట్లు చెప్పారు.

జూన్ నుంచి సెన్సెక్స్‌లోకి ట్రెంట్, బీఈఎల్

నెస్లే ఇండియా, ఇండస్‌ఇండ్ బ్యాంక్ ఔట్



న్యూఢిల్లీ: బీఎస్‌ఈ సెన్సెక్స్‌లో జూన్ నుంచి టాటా గ్రూప్ సంస్థ ట్రెంట్, ప్రభుత్వ రంగ భారత్ ఎలక్ట్రానిక్స్ (బీఈఎల్) ఎంట్రీ ఇవ్వనున్నాయి. ఎఫ్ఎంసీజీ దిగ్గజం నెస్లే ఇండియా, ఇండస్‌ఇండ్ బ్యాంక్ స్థానంలో వీటిని చేర్చనున్నట్లు బీఎస్‌ఈ మార్కెట్ ఇంటెలిజెన్స్ విభాగం ఏషియా ఇండెక్స్ ఈ విషయం తెలిపింది. జూన్ 23 నుంచి ఈ మార్పులు అమల్లోకి వస్తాయి. సెన్సెక్స్‌లో 30 షేర్లు ఉంటాయి. మరోవైపు బీఎస్‌ఈ 100 ఇండెక్స్‌లో డిక్సన్ టెక్నాలజీస్ (ఇండియా), కోఫోర్జ్, ఇండస్ టవర్స్ చేరనుండగా, భారత్ ఫోర్జ్, డాబర్ ఇండియా, సీమెన్స్ నిష్క్రమించనున్నాయి. బీఎస్‌ఈ సెన్సెక్స్ 50 ఇండెక్స్‌లో బ్రిటానియా ఇండస్ట్రీస్, హీరో మోటోకార్ప్‌ల స్థానంలో ఇండిగో, శ్రీరామ్ ఫైనాన్స్ చేరనున్నాయి.

శ్రీరామ్ లైఫ్ పటిష్ట పనితీరు

2024-25 ప్రీమియంలో 20 % వృద్ధి

SHRIRAM Life Insurance
YOUR PARTNER FOR PROSPERITY

చెన్నై: శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ గత ఆర్థిక సంవత్సరంలో (2024-25) మంచి పనితీరు నమోదు చేసింది. ప్రీమియం ఆదాయం అంతక్రితం ఆర్థిక సంవత్సరంతో పోల్చి చూసినప్పుడు 20 శాతం పెరిగి రూ.4,216 కోట్లుగా నమోదైంది. 2023-24లో ప్రీమియం ఆదాయం రూ.3,508 కోట్లుగా ఉంది. కంపెనీ నిర్వహణలోని ఆస్తుల విలువ రూ.13,207 కోట్లకు వృద్ధి చెందింది. 2024 మార్చి నాటికి ఉన్న రూ.11,282 కోట్లతో పోల్చి చూస్తే 17 శాతం పెరిగింది. ఇండివిడ్యువల్ న్యూ బిజినెస్ ఏపీఈ 45 శాతం పెరిగి రూ.1,289 కోట్లుగా నమోదైంది. న్యూ బిజినెస్ ప్రీమియం గత ఆర్థిక సంవత్సరంలో 42 శాతం పెరిగి రూ.507 కోట్లకు చేరుకుంది. అధిక వృద్ధి దశలోకి శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ అడుగు పెట్టిందని, దీర్ఘకాలంలో బలమైన వృద్ధికి స్పష్టమైన అవకాశాలు కనిపిస్తున్నాయని సంస్థ ఎండీ, సీఈవో కాస్పరస్ జేహెచ్ క్రోమ్‌హట్ తెలిపారు.

సైబర్ మోసాల కట్టడికి 'ఫ్రాడ్ రిస్క్ ఇండికేటర్'

రిస్కుల ప్రాతిపదికన మొబైల్ నంబర్ల వర్గీకరణ



న్యూఢిల్లీ: సైబర్ మోసాలను అరికట్టేందుకు టెలికం శాఖ (డాట్) తాజాగా 'ఫైనాన్షియల్ ఫ్రాడ్ రిస్క్ ఇండికేటర్' (ఎఫ్ఆర్ఐ) పేరిట వినూత్న సాధనాన్ని ప్రవేశపెట్టింది. మోసాలతో ముడిపడి ఉన్న మొబైల్ నంబర్లను రిస్కు స్థాయిని బట్టి ఇది వర్గీకరిస్తుంది. ఆ వివరాలను బ్యాంకులు, ఆర్థిక సంస్థలు, యూపీఐ సరీ్వస్ ప్రొవైడర్లకు డిజిటల్ ఇంటెలిజెన్స్ ప్లాట్‌ఫాం ద్వారా టెలికం శాఖ షేర్ చేస్తుంది. తద్వారా రిస్కీ మొబైల్ నంబర్లతో ఆర్థిక లావాదేవీలను సత్వరం నిలిపివేసేందుకు ఇది ఉపయోగపడుతుందని డాట్ ఒక ప్రకటనలో తెలిపింది. సాధారణమైనవిగా కనిపించినా వాస్తవానికి సైబర్ ఫ్రాడ్ కేసులతో ముడిపడి ఉన్న మొబైల్ నంబర్లను గుర్తించేందుకు దీనితో అత్యధికంగా అవకాశాలు ఉంటున్నట్లు ఫోన్‌పే గణాంకాల్లో వెల్లడైందని డాట్ పేర్కొంది. సైబర్‌క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్, నేషనల్ సైబర్‌క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్, చక్షు ప్లాట్‌ఫాం, బ్యాంకులు, ఆర్థిక సంస్థల నుంచి లభించే వివరాల ప్రాతిపదికన మొబైల్ నంబర్లను 'మధ్య స్థాయి', 'అధిక', 'అత్యధిక' రిస్కుల కింద ఎఫ్ఆర్ఐ వర్గీకరిస్తుంది.

తెలంగాణలో ర్యాపిడో విస్తరణ



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: రైడ్ సర్వీసుల సంస్థ ర్యాపిడో తెలంగాణలో తమ కార్యకలాపాలను మరింతగా విస్తరించింది. కొత్తగా 11 నగరాల్లో బైక్ ట్యాక్సీ, ఆటో సర్వీసులను ప్రారంభించింది. సిద్ధిపేట్, మహబూబ్‌నగర్, నిజామాబాద్, రామగుండం, భువనగిరి మొదలైనవి వీటిలో ఉన్నాయి. దేశవ్యాప్తంగా 500 నగరాలకు కార్యకలాపాలను విస్తరించే లక్ష్యానికి ఇది దోహదపడనుందని కంపెనీ సహవ్యవస్థాపకుడు పవన్ గుంటుపల్లి తెలిపారు. ఇప్పటికే 90లక్షల పైచిలుకు ఉద్యోగావకాశాలు కల్పించామని, విస్తరణతో మరో లక్ష ఉపాధి అవకాశాలు లభించగలవని పేర్కొన్నారు.

భారత్‌పై బ్రూక్‌ఫీల్డ్ భారీ అంచనాలు

- ఐదేళ్లలో రూ.8.5 లక్షల కోట్ల ఏయూఎం
- మూడు రెట్లు పెంచుకోవాలన్న లక్ష్యం



ముంబై: న్యూయార్క్ కేంద్రంగా పనిచేసే బ్రూక్‌ఫీల్డ్ అసెట్ మేనేజ్‌మెంట్ భారత మార్కెట్లో తన స్థానాన్ని మరింత బలోపేతం చేసుకోవాలనుకుంటోంది. తన నిర్వహణలోని ఆస్తులను (ఏయూఎం) వచ్చే మూడేళ్లలో మూడు రెట్లు పెంచుకుని 100 బిలియన్ డాలర్లకు (రూ.8.5 లక్షల కోట్లు సుమారు) చేర్చే లక్ష్యంతో ఉన్నట్టు ప్రకటించింది. అంతర్జాతీయంగా తమ ఏయూఎం వచ్చే ఐదేళ్లలో ట్రిలియన్ డాలర్లకు చేరుకుంటుందని సంస్థ ప్రెసిడెంట్ కానర్ టెస్కే తెలిపారు. ఇదే సమయంలో భారత్ తదితర వర్ధమాన మార్కెట్లలో వృద్ధి మరింత అధికంగా ఉంటుందని అంచనా వేస్తున్నట్టు చెప్పారు. భారత్‌లో ఇన్‌ఫ్రా, రియల్ ఎస్టేట్, పునరుత్పాదక ఇంధన రంగాల్లో బ్రూక్‌ఫీల్డ్ ప్రస్తుతం 30 బిలియన్ డాలర్ల ఆస్తులను నిర్వహిస్తుండడం గమనార్హం. వచ్చే ఐదేళ్లలో నిర్వహణ ఆస్తులను మూడు లేదా నాలుగింతలు చేసుకోగలమన్న అంచనాతో ఉన్నట్టు టెస్కే చెప్పారు. భారత జీడీపీ వృద్ధి 5.5 శాతానికి పడిపోయినా తమ ఆస్తులపై ఎలాంటి ప్రభావం ఉండబోదన్నారు. భారత్ మాదిరి ఆర్థిక వ్యవస్థకు అది మెరుగైన రేటే అవుతున్నారు.

విలీనాలు.. కొనుగోళ్లు..

ప్రధానంగా విలీనాలు, కొనుగోళ్ల రూపంలో భారత్‌లోని తమ నిర్వహణ ఆస్తులు పెంచుకోనున్నట్టు కానర్ టెస్కే తెలిపారు. అదే సమయంలో ప్రస్తుత వ్యాపార వృద్ధిపైనా దృష్టి సారిస్తామని చెప్పారు. భారత్ వేగంగా మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించిందని చెబుతూ.. స్థిరమైన సరఫరా వ్యవస్థల కోసం చూసే కంపెనీలకు గమ్యస్థానం అవుతుందన్నారు. మౌలిక సదుపాయాలపై అధిక వ్యయాలు చేస్తుండడంతో ఈ రంగంలో తమ కార్యకలాపాలను మరింత బలోపేతం చేసుకోగలమని ఆశాభావం వ్యక్తం చేశారు. భారత్‌లో పెట్టుబడులపై రాబడులు తమ అంచనాలకు అనుగుణంగా లేదా అంతకుమించే ఉన్నట్టు టెస్కే తెలిపారు. బ్రూక్‌ఫీల్డ్ నిర్వహణ ఆస్తుల్లో 12 బిలియన్ డాలర్లు ఇన్‌ఫ్రాలో, మరో 12 బిలియన్ డాలర్లు రియల్ ఎస్టేట్‌లో ఉండగా.. పునరుత్పాదక ఇంధన రంగంలో 3 బిలియన్ డాలర్లు, ప్రైవేటు ఈక్విటీలో 3.6 బిలియన్ డాలర్ల మేర నిర్వహిస్తోంది. యూఎస్ అనుసరిస్తున్న టారిఫ్‌ల విధానంతో భారత్‌కు ఎక్కువ ప్రయోజనకరమని టెస్కే అభిప్రాయపడ్డారు.

భారత క్రికెట్‌లో 'సుదర్శన' మంత్రం

- ఐపీఎల్‌లో సత్తా చాటిన తమిళనాడు బ్యాటర్
- మూడు ఫార్మాట్‌లలో నిలకడైన రికార్డు
- ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్‌కు టీమిండియాలో అవకాశం!

దాదాపు రెండున్నరేళ్ల క్రితం ఉప్పల్ స్టేడియం వేదికగా హైదరాబాద్, తమిళనాడు మధ్య రంజీ ట్రోఫీ మ్యాచ్... తొలి ఇన్నింగ్స్‌లో హైదరాబాద్ తరఫున రెండు, తమిళనాడు తరఫున మూడు సెంచరీలు నమోదయ్యాయి. మ్యాచ్ సాధారణ 'డ్రా' దిశగా సాగుతున్నట్లు అనిపించింది. అయితే రెండో ఇన్నింగ్స్‌లో హైదరాబాద్ కుప్పకూలింది. దాంతో చివరి రోజు తమిళనాడు విజయలక్ష్యం 11 ఓవర్లలో 144... సాధారణంగా ఇలాంటి స్థితిలో బ్యాటర్లు మైదానంలోకి దిగి లాంఛనంగా కొన్ని బంతులు ఆడి 'షేక్ హ్యాండ్'కు సిద్ధమవుతారు. కానీ తమిళనాడు టి20 శైలిలో గెలుపుపై గురి పెట్టింది. ఒకవైపు సీనియర్ జగదీశన్ చెలరేగుతుండగా మరో ఓపెనర్ తన విధ్వంసకర బ్యాటింగ్‌తో 20 బంతుల్లోనే 5 సిక్సర్లతో 42 పరుగులు బాదాడు. 7 ఓవర్లలో స్కోరు 108/1. అనూహ్యంగా వెలుతురులేమితో మ్యాచ్‌ను అంపైర్లు నిలిపివేయడంతో హైదరాబాద్ బతికిపోయింది. అయితే 21 ఏళ్ల ఆ ఓపెనర్ ఆటపై అన్ని వైపుల నుంచి అసాధారణ ప్రశంసలు వెల్లువెత్తాయి. తొలి ఇన్నింగ్స్‌లోనూ సెంచరీ బాది 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచిన ఆ కుర్రాడే సాయి సుదర్శన్. అతనికిదే తొలి ఫస్ట్ క్లాస్ మ్యాచ్ కావడం విశేషం. నాలుగు సీజన్ల పాటు దేశవాళీ క్రికెట్‌లో నిలకడైన ఆటతో 'ఆల్ ఫార్మాట్' ప్లేయర్‌గా గుర్తింపు తెచ్చుకున్న సుదర్శన్ ఇప్పుడు ఇంగ్లండ్‌తో సిరీస్‌కు ఎంపిక చేయనున్న ఆటగాళ్లలో ముందు వరుసలో ఉన్నాడు.

–సాక్షి క్రీడా విభాగం



రంజీ ట్రోఫీలో అరంగేట్రం చేయడానికి ముందే సాయి సుదర్శన్ ఐపీఎల్‌లో ఒక సీజన్ ఆడాడు. 2022లో ఐదు మ్యాచ్‌లలో కలిపి 114 బంతులు ఎదుర్కొని ఒక హాఫ్ సెంచరీ సహా 145 పరుగులు చేసి ఫర్వాలేదనిపించాడు. అయితే ఐపీఎల్‌లో ఒక ఏడాది బాగా ఆడి ఆ తర్వాత ఎంతో మంది కనుమరుగైన ఉదంతాలు ఉన్నాయి కాబట్టి అతని ప్రదర్శనను ఎవరూ అంత సీరియస్‌గా చూడలేదు. కానీ రంజీ ట్రోఫీ తొలి మ్యాచ్‌లోనే అతని ఆటను చూశాక భవిష్యత్తులో చాలా తొందరగా భారత్‌కు ఆడగల సత్తా ఉన్న ప్లేయర్‌గా సుదర్శన్‌కు గుర్తింపు లభించింది. రంజీ ఆరంభానికి చాలా ముందే 'ఈ అబ్బాయిలో ఎంతో ప్రత్యేకత ఉంది. సాధ్యమైనంత తొందరగా ఇతడిని తమిళనాడు జట్టులోకి తీసుకోండి' అంటూ స్పిన్ దిగ్గజం రవిచంద్రన్ అశ్విన్ చేసిన సూచనను సెలక్టర్లు పరిగణనలోకి తీసుకుంటూ 'ఫాస్ట్ ట్రాక్'తో ముందు టి20ల్లోకి, ఆ తర్వాత వన్డేల్లోకి, ఆపై రంజీ టీమ్‌లోకి ఎంపిక చేశారు. తనపై ఉంచిన ఆ నమ్మకాన్ని అతను నిలబెట్టుకున్నాడు. ఒక్కసారి తమిళనాడు జట్టులోకి వచ్చాక తనకు లభించిన ప్రతీ అవకాశాన్ని సుదర్శన్ సమర్థంగా ఉపయోగించుకున్నాడు.

చూడచక్కటి ఆటతో...

సుదర్శన్ బ్యాటింగ్ గురించి ఒక్క మాటలో చెప్పాలంటే 'క్లాస్' తరహా శైలి అతనిది. చక్కటి డ్రైవ్‌లతో అలవోకగా ఫోర్లు రాబట్టడం అతనికి బాగా తెలిసిన విద్య. అవసరమైన సమయంలో గేర్లు మార్చి సిక్స్‌లు కొట్టినా అందులోనూ ఒక కళ ఉంటుంది. అప్పుడప్పుడు పుల్, హుక్ షాట్‌లతో పాటు స్లాగ్ స్వీప్‌లు, స్కూప్ షాట్‌లను కూడా ఐపీఎల్‌లో సుదర్శన్ చూపించాడు. టి20లు అయినా సరే లెక్క లేనితనంతో గుడ్డిగా బ్యాట్ ఊపే తత్వం కాదు. తనకు ఏం కావాలనే దానిపై అతనికి మంచి అవగాహన ఉంది. ఐపీఎల్‌లో నాలుగు సీజన్ల కెరీర్ చూస్తే అతని బ్యాటింగ్‌లో ఎక్కడా తడబాటు కనిపించకపోవడమే కాదు... అనవసరపు చెత్త షాట్లతో అవుటైన సందర్భాలు చాలా అరుదు. ఇదే అతడిని ఇతర దేశవాళీ బ్యాటర్లతో పోలిస్తే భిన్నంగా నిలబెట్టింది. అందుకే ఐపీఎల్‌లో చెలరేగుతున్న సమయంలో అతడిని టెస్టు జట్టులోకి తీసుకోవాలనే డిమాండ్ అన్ని వైపుల నుంచి వినిపించడం సుదర్శన్ బ్యాటింగ్‌పై నమ్మకాన్ని చూపిస్తోంది. సరిగ్గా చెప్పాలంటే టి20 ఫార్మాట్‌లో ఇప్పుడు అందరినీ ఆకట్టుకున్నా... సుదర్శన్ వన్డేలూ బాగా ఆడగలడు కాబట్టే ముందుగా అదే ఫార్మాట్‌లో తొలి అవకాశం దక్కింది. ఇక టెస్టు క్రికెట్‌కు సరిపోగల బ్యాటింగ్ నైపుణ్యం, పట్టుదల, టెక్నిక్ అతనిలో పుష్కలంగా ఉన్నాయి.

అమ్మా నాన్న అండతో...

సాయి సుదర్శన్ ఇప్పటికే భారత సీనియర్ జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. 3 వన్డేలు ఆడితే వరుసగా 55 నాటౌట్, 62, 10 పరుగులు సాధించాడు. బరిలోకి దిగిన ఏకైక టి20లో బ్యాటింగ్ అవకాశం రాలేదు. వేర్వేరు కారణాలతో ఆ తర్వాత అతనికి అవకాశాలు లభించలేదు. సుదర్శన్ టి20 సామర్థ్యమేమిటో ఐపీఎల్ చూపించింది. నిజానికి ఈ ఫార్మాట్‌లో తమిళనాడు ప్రీమియర్ లీగ్‌లో అదరగొట్టడంతోనే అతను ముందుగా వెలుగులోకి వచ్చాడు. అయితే అనూహ్యంగా మెరిసి ఆపై మళ్లీ కనబడకుండా పోయే ఆటగాళ్ల జాబితాలో అతను చేరరాదని సుదర్శన్ తల్లిదండ్రులు భావించారు. అందుకే పక్కా ప్రణాళికతో, సరైన కోచింగ్‌తో అతడికి వారు మార్గనిర్దేశనం చేశారు. క్రీడాకారుల కుటుంబం నుంచి రావడం కూడా అతనికి ఎంతో మేలు చేసింది. అథ్లెట్ అయిన తండ్రి భరద్వాజ్ 'శాఫ్' క్రీడల్లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించగా...తల్లి ఉష తమిళనాడు రాష్ట్ర జట్టు తరఫున వాలీబాల్ ఆడింది. పదేళ్ల వయసులో క్రికెట్ మొదలు పెట్టిన సుదర్శన్ ఆ తర్వాత మెల్లగా ఒక్కో మెట్టే ఎక్కుతూ వివిధ వయో విభాగాల్లో రాణిస్తూ ముందంజ వేశాడు. అండర్–19 చాలెంజర్ ట్రోఫీ తర్వాత భారత్ 'ఎ'కు ఆడిన తర్వాత రెగ్యులర్‌గా మారాడు. వరుసగా రెండు ఐపీఎల్‌లలో 500కు పైగా పరుగులు సాధించి తన విలువేమిటో అతను చూపించాడు.





2018 ఇంగ్లండ్ పర్యటనలో చెన్నై సూపర్ కింగ్స్ జూనియర్ జట్టు సభ్యుడిగా సాయి సుదర్శన్ (వృత్తంలో)

టెస్టులకు చేరువలో...

దేశవాళీలో నిలకడైన ప్రదర్శన, ప్రస్తుత ఫామ్, రోహిత్, కోహ్లిల రిటైర్మెంట్‌తో ఖాళీలు... ఇప్పుడు అన్నీ సరిగ్గా సరిపోయే సందర్భం 24 ఏళ్ల సుదర్శన్ కోసం వచ్చింది. దాదాపు 40 పరుగుల ఫస్ట్ క్లాస్ సగటు అసాధారణం కాకపోయినా... 29 మ్యాచ్‌లలో 1957 పరుగుల అనుభవం టెస్టు టీమ్‌లో అవకాశం కల్పించడానికి సరిపోతుంది. ప్రస్తుత టీమ్‌లో రాహుల్ ఓపెనింగ్ స్థానానికి మారితే మిడిలార్డర్ సుదర్శన్‌కు సరైన స్థానం కాగలదు. పైగా రెండు సీజన్ల పాటు ఇంగ్లండ్ కౌంటీ క్రికెట్‌లో 'సర్రే' టీమ్‌కు ప్రాతినిధ్యం వహించడం కూడా అతనికి మరో అదనపు అర్హతగా మారనుంది. భారత్ తరఫున టెస్టు ఆడే అవకాశం కోసం ఎదురు చూస్తున్నట్లు ఇటీవల వెల్లడించిన సుదర్శన్ కోరిక త్వరలోనే తీరవచ్చు. ఇదే జోరును అతను కొనసాగిస్తే స్థానం సుస్థిరం కూడా కావచ్చు.

అండర్‌-19 సారథిగా ఆయుశ్

- వైభవ్ సూర్యవంశీకి చోటు
- ఇంగ్లండ్ పర్యటనకు జట్టు ప్రకటన



న్యూఢిల్లీ: ఐపీఎల్‌లో అదరగొడుతున్న చెన్నై సూపర్ కింగ్స్ ఓపెనర్ ఆయుశ్ మాత్రే భారత అండర్–19 జట్టు కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. రాజస్తాన్ రాయల్స్ తరఫున ఈ సీజన్ ఐపీఎల్‌లో అరంగేట్రం చేసి... 35 బంతుల్లోనే సెంచరీతో సంచలనం రేకెత్తించిన 14 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ కూడా జట్టులో చోటు దక్కించుకున్నాడు. వచ్చే నెలలో భారత అండర్–19 జట్టు ఇంగ్లండ్‌లో పర్యటించనుంది. ఇందులో భాగంగా... 5 యూత్ వన్డేల సిరీస్‌తో పాటు 2 నాలుగు రోజుల మ్యాచ్‌లు ఆడనుంది. అంతకుముందు జూన్ 24న ఇంగ్లండ్ అండర్–19 జట్టుతో 50 ఓవర్ల వార్మప్ మ్యాచ్ కూడా ఆడనుంది. ఇప్పటికే యువ భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించిన ఆయుశ్, వైభవ్‌పై ఐపీఎల్‌తో మరిన్ని అంచనాలు పెరిగాయి. గతేడాది ఆస్ట్రేలియా అండర్–19 జట్టుపై వైభవ్ సెంచరీతో ఆకట్టుకోగా... 17 ఏళ్ల ఆయుశ్ 9 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లు, 7 లిస్ట్ 'ఎ' మ్యాచ్‌లాడి 962 పరుగులు చేశాడు. ముంబై వికెట్ కీపర్ బ్యాటర్ అభిజ్ఞాన్ కుందు ఈ జట్టుకు వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. గతేడాది ఆస్ట్రేలియా అండర్–19 జట్టుతో రెండు మ్యాచ్‌ల యూత్ టెస్టు సిరీస్ 16 వికెట్లతో అదరగొట్టిన కేరళ లెగ్‌స్పిన్నర్ మొహమ్మద్ ఇనాన్‌తో పాటు పంజాబ్ ఆఫ్‌స్పిన్నర్ అన్‌మోల్‌జీత్ సింగ్ కూడా జట్టులో చోటు దక్కించుకున్నారు. స్టాండ్‌బై ఆటగాళ్ల జాబితాలో హైదరాబాద్ వికెట్‌కీపర్ రాపోలు అలంకృత్‌కు స్థానం లభించింది.

భారత అండర్–19 జట్టు: ఆయుశ్ మాత్రే (కెప్టెన్), వైభవ్ సూర్యవంశీ, విహాన్ మల్హోత్రా, మౌల్యారాజ్‌సింగ్, రాహుల్ కుమార్, అభిజ్ఞాన్ కుందు, హర్‌వంశ్ సింగ్, అంబరీశ్, కనిష్క్ చౌహాన్, ఖిలాన్ పటేల్, హెనిల్ పటేల్, యుధజిత్ గుహ, ప్రణవ్ రాఘవేంద్ర, మొహమ్మద్ ఇనాన్, ఆదిత్య రాణా, అన్‌మోల్‌జీత్ సింగ్.

స్టాండ్‌బై ప్లేయర్లు: నమన్ పుష్పక్, దీపేశ్, వేదాంత్ త్రివేది, వికల్ప్ తివారీ, రాపోలు అలంకృత్.

యూఏఈ సంచలనం



- బంగ్లాదేశ్‌పై టి20 సిరీస్ కైవసం
- మూడో మ్యాచ్‌లో 7 వికెట్లతో గెలుపు

షార్జా: ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) జట్టు చారిత్రక సిరీస్ విజయాన్ని అందుకుంది. బుధవారం జరిగిన చివరి టి20లో యూఏఈ జట్టు 7 వికెట్ల తేడాతో బంగ్లాదేశ్‌ను చిత్తు చేసింది. తద్వారా మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 2–1తో కైవసం చేసుకుంది. బంగ్లాపై యూఏఈకి ఇదే తొలి సిరీస్ విజయం కాగా... ఓవరాల్‌గా ఐసీసీ రెగ్యులర్ మెంబర్ జట్టుపై యూఏఈకిది రెండో టి20 సిరీస్. 2021లో ఐర్లాండ్‌పై తొలి సారి యూఏఈ సిరీస్ గెలిచింది. మొదట బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 162 పరుగులు చేసింది. తన్జీద్ హసన్ (18 బంతుల్లో 40; 4 ఫోర్లు, 4 సిక్స్‌లు) శుభారంభం అందించగా, వికెట్ కీపర్ జాకీర్ అలీ (41; 1 ఫోర్, 3 సిక్స్‌లు) రాణించాడు. కెప్టెన్ లిటన్ దాస్ (14), పర్వేజ్ (0), తౌహీద్ హృదయ్ (0), మెహెదీ హసన్ (2), షమీమ్ హుసేన్ (9), రిషాద్ హుసేన్ (0) విఫలమయ్యారు. ఆఖర్లో హసన్ మహమూద్ (15 బంతుల్లో 26 నాటౌట్; 3 సిక్స్‌లు) ధాటిగా ఆడటంతో బంగ్లాదేశ్ ఆ మాత్రం స్కోరు చేయగలిగింది. యూఏఈ బౌలర్లలో హైదర్ అలీ 3 వికెట్లు పడగొట్టాడు. అనంతరం లక్ష్య ఛేదనలో యూఏఈ జట్టు 19.1 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 166 పరుగులు చేసింది. అలీషాన్ (47 బంతుల్లో 68 నాటౌట్; 5 ఫోర్లు, 3 సిక్స్‌లు) అజేయ అర్ధ శతకంతో ఆకట్టుకోగా... మొహమ్మద్ జోహైబ్ (29; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించాడు. ఒత్తిడి పెరిగిపోతున్న దశలో ఆసిఫ్ ఖాన్ (26 బంతుల్లో 41 నాటౌట్; 5 సిక్స్‌లు) అదరగొట్టాడు. బంగ్లా బౌలర్లను ఆటాడుకుంటూ సిక్స్‌లతో రెచ్చిపోవడంతో మరో ఐదు బంతులు మిగిలుండగానే యూఏఈ విజయం సాధించింది. అంతకుముందు తొలి టి20లో బంగ్లాదేశ్ 27 పరుగుల తేడాతో గెలుపొందగా... రెండో టి20లో యూఏఈ జట్టు 2 వికెట్ల తేడాతో నెగ్గింది. అలీషాన్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్', యూఏఈ కెప్టెన్ మొహమ్మద్ వసీమ్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' అవార్డులు దక్కాయి.

రైజా ఢిల్లాన్‌కు రజత పతకం


న్యూఢిల్లీ: జూనియర్ ప్రపంచకప్ షూటింగ్ టోర్నీలో భారత యువ షూటర్ రైజా ఢిల్లాన్ రజత పతకంతో మెరిసింది. జర్మనీ వేదికగా జరుగుతున్న ఈ టోర్నీ మహిళల స్కీట్ ఈవెంట్‌లో ఢిల్లాన్ రెండో స్థానంలో నిలిచింది. 60 షాట్ల ఫైనల్లో రైజా 51 షాట్లను లక్ష్యంపైకి గురిపెట్టింది. బ్రిటన్‌కు చెందిన బాడ్లీ స్కాట్ 53 షాట్లతో పసిడి పతకం గెలుచుకుంది. జర్మనీకి చెందిన అనాబెల్లా హెట్‌మెర్‌కు కాంస్యం దక్కింది. రైజాకు ఇదే తొలి ఐఎస్‌ఎస్‌ఎఫ్ వరల్డ్‌కప్ పతకం కాగా... ఓవరాల్‌గా ఈ టోర్నీలో భారత్‌కు ఇది మూడో పతకం. అంతకుముందు క్వాలిఫయింగ్ రౌండ్‌లో నాలుగో స్థానంలో నిలవడం ద్వారా రైజా ఫైనల్‌కు అర్హత సాధించింది. ఇప్పటికే ఒలింపిక్స్‌లో దేశానికి ప్రాతినిధ్యం వహించిన రైజా మాట్లాడుతూ... 'కెరీర్‌లో ఇదే తొలి వరల్డ్‌కప్ పతకం. చాలా ఆనందంగా ఉంది. ఒలింపిక్స్‌కు ముందు నా టెక్నిక్‌లో మార్పులు చేసుకోవడం బాగా తోడ్పడింది. ఇదే నిలకడ కొనసాగించేందుకు ప్రయత్నిస్తా' అని వెల్లడించింది.

ఇంగ్లండ్ 498/3

- క్రాలీ, డకెట్, పోప్ సెంచరీలు
- జింబాబ్వేతో ఏకైక టెస్టు



డకెట్



క్రాలీ

నాటింగ్‌హామ్: సొంత గడ్డపై టీమిండియాతో టెస్టు సిరీస్‌కు ముందు ఇంగ్లండ్ క్రికెట్ జట్టుకు అదిరిపోయే ప్రాక్టీస్ లభించింది. జింబాబ్వేతో ఏకైక టెస్టులో ఇంగ్లండ్ తొలి రోజే కొండంత స్కోరు సాధించింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ గురువారం తొలి రోజు ఆట ముగిసే సమయానికి రికార్డు స్థాయిలో 88 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 498 పరుగులు చేసింది. ఓపెనర్లు జాక్ క్రాలీ (171 బంతుల్లో 124; 14 ఫోర్లు), బెన్ డకెట్ (134 బంతుల్లో 140; 20 ఫోర్లు, 2 సిక్స్‌లు) భారీ శతకాలతో కదం తొక్కగా... ఒలీ పోప్ (163 బంతుల్లో 169 బ్యాటింగ్; 24 ఫోర్లు, 2 సిక్స్‌లు) డబుల్ సెంచరీ దిశగా సాగుతున్నాడు. జింబాబ్వే బౌలింగ్‌ను ఓ ఆటాడుకున్న ఇంగ్లండ్ బ్యాటర్లు తొలి రోజే భారీ స్కోరు చేశారు. గురువారం బ్యాటింగ్ చేసిన వారిలో మాజీ కెప్టెన్ జో రూట్ (34) ఒక్కడే తక్కువ స్కోరుకు వెనుదిరిగినా... ఈ క్రమంలో అతడు టెస్టుల్లో 13,000 పరుగులు పూర్తి చేసుకున్నాడు. జింబాబ్వే బౌలర్లలో ముజరబాని, సికందర్ రజా, వెస్లీ తలా ఒక వికెట్ పడగొట్టారు. నాలుగు రోజుల ఈ టెస్టు మ్యాచ్‌లో ఇప్పటికే విజయానికి అవసరమైనన్ని పరుగులు చేసిన ఇంగ్లండ్ జట్టు... రెండో రోజు మరెన్ని పరుగులు చేసి డిక్లేర్ చేస్తుందో చూడాలి.

498/3 టెస్టు క్రికెట్‌లో తొలి రోజు నమోదైన రెండో అత్యధిక స్కోరు ఇది. 2022లో పాకిస్తాన్‌పై ఇంగ్లండ్ తొలి రోజు 506/4 పరుగులు చేసింది.

జనవరి 5 నుంచి హాకీ ఇండియా లీగ్

నోయిడా: హాకీ ఇండియా లీగ్ (హెచ్ఐఎల్) 2026 సీజన్ వచ్చే ఏడాది జనవరి 5న ప్రారంభం కానుంది. ఈ మేరకు హాకీ ఇండియా (హెచ్ఐ) కార్యదర్శి భోళానాథ్ సింగ్ వివరాలు వెల్లడించారు. ఏడేళ్ల విరామం తర్వాత గతేడాది తిరిగి నిర్వహించిన హెచ్ఐఎల్‌కు మంచి ఆదరణ లభించగా ఈసారి మహిళల లీగ్‌లో మరో రెండు జట్లను పెంచనున్నట్లు భోళానాథ్ తెలిపారు. 'హెచ్ఐఎల్ వచ్చే సీజన్ తేదీలు ఖరారయ్యాయి. పురుషుల విభాగంలో 8 ఫ్రాంచైజీలు యథావిధిగా పాల్గొంటుండగా... మహిళల విభాగంలో గత సీజన్‌లో పాల్గొన్న నాలుగు జట్లతో పాటు మరో రెండు జట్లు అదనంగా చేరనున్నాయి. వేదిక ఇంకా ఖరారు కాలేదు. విదేశీ ఆటగాళ్ల వెసులుబాటుకు తగ్గట్లే షెడ్యూల్‌ను జనవరి 5 నుంచి ప్రారంభిస్తున్నాం' అని భోళానాథ్ వెల్లడించారు.



ఇక గత సీజన్‌కు సంబంధించి కొంత మంది ప్లేయర్లకు డబ్బులు చెల్లించలేదనే వార్తల్లో వాస్తవం లేదని కొట్టిపారేశారు. ఫ్రాంచైజీలన్నీ హెచ్ఐఎల్ నియమావళిని పాటిస్తున్నాయని తెలిపారు. హాకీ ప్లేయర్లు చదువు కొనసాగించేందుకు వీలుగా అమిటీ యూనివర్సిటీతో హాకీ ఇండియా ఎంఓయూ కుదుర్చుకుంది. దీని ద్వారా ప్లేయర్లు ఎక్కడి నుంచి అయినా ఆన్‌లైన్ ద్వారా తమ చదువు కొనసాగించే అవకాశం దక్కింది.

కేంద్ర ప్రభుత్వానిదే తుది నిర్ణయం

మరోవైపు భారత్ వేదికగా ఈ ఏడాది చివర్లో జరగనున్న ఆసియా కప్ హాకీ టోర్నమెంట్‌లో పాకిస్తాన్ పాల్గొనే అంశంలో తుది నిర్ణయం కేంద్ర ప్రభుత్వానిదే అని హాకీ ఇండియా వెల్లడించింది. ప్రభుత్వం సూచనల మేరకే నడుచుకుంటామని వెల్లడించింది.



ప్రో హాకీ లీగ్‌కు భారత జట్టు ప్రకటన

జూన్ 7 నుంచి యూరప్ అంచె పోటీలు

న్యూఢిల్లీ: వచ్చే నెలలో జరగనున్న ఎఫ్ఐహెచ్ హాకీ ప్రో లీగ్ యూరప్ అంచె పోటీల కోసం హాకీ ఇండియా (హెచ్ఐ) జట్టును ప్రకటించింది. జూన్ 7 నుంచి యూరప్‌లోని అమ్‌స్టెల్‌వీన్, నెదర్లాండ్స్, అంట్వెర్ప్, బెల్జియంలో భారత పురుషుల హాకీ జట్టు మ్యాచ్‌లు ఆడనుంది. దీని కోసం గురువారం 24 మందితో కూడిన జట్టును ప్రకటించింది. జూన్ 7, 9న నెదర్లాండ్స్‌తో, 11, 12న అర్జెంటీనాతో టీమిండియా తలపడుతుంది. ఆ తర్వాత 14, 15న ఆస్ట్రేలియాతో, 21, 22న బెల్జియంతో మ్యాచ్‌లు ఆడుతుంది. ఈ ఏడాది ఆరంభంలో భువనేశ్వర్ వేదికగా జరిగిన హాకీ ప్రో లీగ్ అంచె పోటీల్లో 8 మ్యాచ్‌లాడిన భారత్ 5 విజయాలతో 15 పాయింట్లు ఖాతాలో వేసుకుంది. 'అనుభవజ్ఞులు, యువ ఆటగాళ్లతో జట్టు సమతూకంగా ఉంది. ప్లేయర్లంతా బాగా సాధన చేశారు. హాకీ ప్రపంచకప్‌నకు అర్హత సాధించే నేపథ్యంలో... ప్రతి పాయింట్ కీలకం కావడంతో అన్నీ మ్యాచ్‌ల్లో విజయాలు సాధించేందుకు ప్రయత్నిస్తాం. పెనాల్టీ కార్నర్‌లను సద్వినియోగం చేసుకునే అంశంలో మరింత దృష్టిపెట్టాం'అని భారత హెడ్ కోచ్ క్రెయిగ్ ఫాల్టన్ అన్నాడు. పరాజయాలను 'డ్రా'లుగా... 'డ్రా'లను విజయాలుగా మలచడమే లక్ష్యంగా ఉన్నామన్నాడు.

భారత పురుషుల హాకీ జట్టు

గోల్‌కీపర్స్: కృషన్ బహదూర్ పాఠక్, సూరజ్,
డిఫెండర్స్: సుమిత్, అమిత్ రోహిదాస్, జుగ్‌రాజ్ సింగ్, నీలమ్ సంజీప్, హర్మన్‌ప్రీత్ సింగ్, జర్మన్‌ప్రీత్ సింగ్, సంజయ్, యశ్‌దీప్ సివాచ్,
మిడ్‌ఫీల్డర్స్: రాజ్ కుమార్ పాల్, నీలకంఠ శర్మ, హార్దిక్ సింగ్, రాజిందర్ సింగ్, మన్‌ప్రీత్ సింగ్, వివేక్ సాగర్ ప్రసాద్, శంషేర్ సింగ్,
ఫార్వర్డ్స్: గుర్జాంత్ సింగ్, అభిషేక్, శైలానంద్ లక్రా, మన్‌దీప్ సింగ్, లలిత్ కుమార్ ఉపాధ్యాయ్, దిల్‌ప్రీత్ సింగ్, సుఖ్‌జీత్ సింగ్.



రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము గురువారం రాష్ట్రపతి భవన్‌లో రక్షణ దళాల సిబ్బందికి శౌర్య పతకాలను అందించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, ప్రధాని మోదీ, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ఆర్మీ అధికారులతోపాటు పతక గ్రహీతలు

అది బ్లడీ కారిడార్

యూనస్‌కు ఆర్మీ జనరల్ వార్నింగ్


దెబ్బకు తాత్కాలిక సారథి యూ-టర్న్

బంగ్లాదేశ్‌లో బయటపడుతున్న లుకలుకలు

ఢాకా: బంగ్లాదేశ్‌లో మహ్మద్ యూనస్ సారథ్యంలోని తాత్కాలిక ప్రభుత్వానికి గట్టి షాక్ తగిలింది. ఇప్పటికే యూనస్ తీరుపై అసంతృప్తితో ఉన్న సైన్యం మయన్మార్ సరిహద్దుల్లో మానవతా కారిడార్ ఏర్పాటు ప్రతిపాదనకు ఆమోదం తెలపడం మండిపడింది. అది 'బ్లడీ కారిడార్'అంటూ ఆర్మీ చీఫ్ జనరల్ వకారుజ్జమాన్ వ్యతిరేకత వ్యక్తం చేయడంతో యూనస్ సర్కారు వెనక్కి తగ్గింది. అలాంటిదేమీ లేదని ప్రకటిస్తూ ఆర్మీతో కాళ్ల బేరానికి వచ్చింది. కారిడార్ వ్యవహారంపై బంగ్లాదేశ్‌లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఇది దేశ సార్వభౌమత్వానికి భంగకరంగా మారడంతోపాటు అమెరికా భౌగోళిక రాజకీయాలకు అనుకూలంగా మారనుందని ఆందోళన వ్యక్తమవుతోంది. అంతేకాదు, యూనస్, ఆయన అనుచరగణం దేశంలో ఎన్నికలు నిర్వహించకుండానే మరింత కాలం అధికారంలో కొనసాగేందుకు అమెరికాకు వత్తాసు పలుకుతున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. 'బంగ్లాదేశ్‌లో మిగిలి ఉన్న ఏకైక విశ్వసనీయ, లౌకిక వ్యవస్థ సైన్యం. దేశ నిష్పాక్షిక సంరక్షకత్వ బాధ్యతల్లో ఆర్మీ ఉంది. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై ఇటీవలి కాలంలో అసహనంతో ఉంది. విషయం తెల్సుకున్న యూనస్ ప్రభుత్వం సైన్యంతో ఘర్షణ వాతావరణం తలెత్తకుండా జాగ్రత్తగా పావులు కదుపుతోంది'అని పరిశీలకులు అంటున్నారు.

వకారుజ్జమాన్ ఏమన్నారు?

రఖైన్ కారిడార్‌ను బ్లడీ కారిడార్ అంటూ ఆర్మీ చీఫ్ జనరల్ వకారుజ్జమాన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారని ఢాకా ట్రిబ్యూన్ పేర్కొంది. 'దేశ సార్వభౌమత్వానికి భంగం కలిగించే ఎటువంటి చర్యలోనూ బంగ్లాదేశ్ ఆర్మీ పాలుపంచుకోదు. ఎవరినీ అలా చేయనివ్వదు'అని ఆర్మీ చీఫ్ బుధవారం యూనస్ సారథ్యంలోని తాత్కాలిక ప్రభుత్వానికి గట్టి వార్నింగిచ్చారు. 'దేశ ప్రయోజనాలకే మా అత్యధిక ప్రాధాన్యం. ఆ తర్వాతే ఏ విషయమైనా. ఎలాంటి నిర్ణయం తీసుకున్నా రాజకీయ ఏకాభిప్రాయం తప్పనిసరి'అంటూ ఆయన కుండబద్దలు కొట్టారు. అంతేకాదు, 'సాధ్యమైనంత త్వరగా దేశంలో ఎన్నికల జరపాలి. మిలటరీ అంశాల్లో జోక్యం మానాలి. రఖైన్ కారిడార్ ప్రాజెక్టు వంటి కీలకమైన అంశాలపై ఆర్మీని పరిగణనలోకి తీసుకోవాలి'అని ఆయన యూనస్‌ను కోరారని ఢాకా ట్రిబ్యూన్ తెలిపింది.



యూనస్



వకారుజ్జమాన్

ఏమిటీ కారిడార్..?

బంగ్లాదేశ్ తూర్పు సరిహద్దుల్లోని చట్టోగ్రామ్ ప్రాంతం నుంచి మయన్మార్‌లో అంతర్యుద్ధం, భూకంపం కారణంగా తీవ్రంగా నలిగిపోతున్న రఖైన్ ప్రాంతంలోని 20 లక్షల మంది పౌరులకు మానవీయ సాయం అందించేందుకు ఉద్దేశించిన మార్గమే రఖైన్ కారిడార్. ఈ నడవా ఏర్పాటు చేయాలంటూ ఐక్యరాజ్యసమితి నుంచి అందిన వినతిపై యూనస్ ప్రభుత్వం అంగీకరించిందంటూ విదేశీ వ్యవహారాల సలహాదారు తౌహిద్ హొస్సైన్ ఇటీవల చేసిన ప్రకటనే ఈ అసంతృప్తి జ్వాలకు ఆజ్యం పోసింది. యూనస్ ప్రభుత్వ నిర్ణయాన్ని ఖలేదా జియా సారథ్యంలోని బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ(బీఎన్‌పీ), కొన్ని వామపక్షాలు సైతం తీవ్రంగా వ్యతిరేకించాయి. ఈ నిర్ణయం ఏకపక్షం, చట్టవ్యతిరేకమంటూ మండిపడ్డాయి. ప్రజల ప్రయోజనాలకు గాలికొదిలేసి విదేశీ ప్రయోజనాల కోసమే ఈ నిర్ణయం తీసుకుందని ఆరోపించాయి. ఎలాంటి నిర్ణయమైనా ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన ప్రభుత్వం, పార్లమెంట్‌లో చర్చించి తీసుకోవాలని పేర్కొంది. ఏదేమైనా, తాత్కాలిక ప్రభుత్వం కారిడార్ ఏర్పాటుపై ముందుకే వెళ్లాలని నిర్ణయించింది. చైనాకు చెక్ పెట్టే ఎత్తుగడతోనే అమెరికా ప్రభుత్వం చేసిన ఒత్తిడులకు యూనస్ లొంగిపోయారని పరిశీలకులు అంటున్నారు. మానవీయ సాయం పేరుతో బంగ్లాదేశ్‌లో విదేశీ జోక్యం పెరిగిపోతుందని, సైనిక, నిఘా పరమైన అవసరాలకు దీనిని వాడుకునే అవకాశముందని ఢాకా ట్రిబ్యూన్ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ కారిడార్ ఏర్పాటైతే బంగ్లాదేశ్‌తోపాటు మయన్మార్ సార్వభౌమత్వమూ ప్రమాదంలో పడుతుందని తన కథనంలో పేర్కొంది.

తాజా నిర్ణయమేమంటే..

ఆర్మీ చీఫ్ హెచ్చరికలు, ప్రజల నుంచి వెల్లువెత్తుతున్న వ్యతిరేకతల నేపథ్యంలో యూనస్ సన్నిహితుడు, జాతీయ భద్రతా సలహాదారుగా వ్యవహరించే ఖలీలుర్ రహ్మాన్ ఇటీవల ఓ ప్రకటన చేశారు. రఖైన్ కారిడార్ గురించి తమ ప్రభుత్వం ఏ రాజకీయ పార్టీతోనూ చర్చించలేదని, ఇకముందు కూడా చర్చించదని స్పష్టం చేశారు. 'దేశ సరిహద్దులకు సమీపంలోని రఖైన్ ప్రాంత వాసులకు మానవతా సాయం అందించే విషయంలో వీలుంటే సాయం చేయాలని మాత్రమే ఐక్యరాజ్యసమితి కోరింది. ఈ వినతిని పరిగణనలోకి తీసుకుంటామని మాత్రం చెప్పాం'అంటూ మాటమార్చారు. అంతకుముందు, ఏప్రిల్‌లో ఆయన..'రఖైన్ కారిడార్ ఏర్పాటుపై ఐరాస ప్రతిపాదనకు ప్రభుత్వం షరతులతో సూత్రప్రాయంగా ఆమోదం తెలిపిందని ప్రకటించారు. ఆ షరతులేమిటో ఆయన వివరించలేదు.

తాము శక్తికి ప్రతిరూపమని నిరూపించుకున్నారు

ఆపరేషన్ సిందూర్‌లో మహిళా సైనికుల పాత్రపై బీఎస్‌ఎఫ్ డీఐజీ ప్రశంసలు

అఖ్నూర్ (జమ్మూ కశ్మీర్): ఆపరేషన్ సిందూర్‌లో మహిళా దళాల పాత్రను బీఎస్‌ఎఫ్ డీఐజీ వరీందర్ దత్తా కొనియాడారు. మహిళలు తాము శక్తికి ప్రతిరూపమని నిరూపించుకున్నారని ఆయన ప్రశంసించారు. పాక్‌లో ఉగ్రవాద స్థావరాలపై దాడుల సందర్భంగా అఖ్నూర్‌లోని సరిహద్దు భద్రతా దళం (బీఎస్‌ఎఫ్)లోని మహిళా సైనికులు పురుష సైనికులతో భుజం భుజం కలిపి నిలిచారన్నారు. ''మేం అన్నింటికీ సిద్ధంగా ఉన్నాం. శత్రువు మా పోస్టులపై దాడి చేయడం ప్రారంభించిన వెంటనే, మేం కాల్పులు జరిపాం. వారి ఎనిమిది ఫార్వర్డ్ పోస్టులను ధ్వంసం చేశాం. ఒక లాంచింగ్ ప్యాడ్‌తో పాటు వారి వైమానిక నిఘా వ్యవస్థను కూడా ధ్వంసం చేశాం. మా మహిళా కంపెనీ కమాండర్ ఒక శత్రు పోస్టును పూర్తిగా ధ్వంసం చేశారు'అని వరీందర్ దత్తా చెప్పారు. మహిళా సైనికులు అనే పదాన్ని తొలగించాల్సిన అవసరం ఉందని సాంబాలో ఓ బీఎస్‌ఎఫ్ అధికారి అన్నారు. యూనిఫాంలో ఉన్న పురుషుల కంటే మహిళలు తక్కువ కాదని నిరూపించారన్నారు. సరిహద్దు కాల్పులు పెరిగినప్పుడు, మహిళా అధికారులను బెటాలియన్ ప్రధాన కార్యాలయానికి వెళ్లాలనుకుంటే వెళ్లొచ్చని అవకాశం ఇచ్చినా.. వారు సరిహద్దుల్లోనే విధులు కొనసాగించారని వెల్లడించారు. అంతేకాదు.. పాకిస్తాన్ కాల్పుల విరమణ ముసుగులో అంతర్జాతీయ సరిహద్దు వెంబడి.. మే 8న జమ్మూ కశ్మీర్‌లోని సాంబా జిల్లాలో 45-50 మంది ఉగ్రవాదులు చొరబాటుకు దోహదపడేందుకు ప్రయత్నించిందని, బీఎస్‌ఎఫ్ భారీ మోర్టార్ కాల్పులను ఉపయోగించి శత్రు పోస్టులను ధ్వంసం చేసి, చొరబాటు ప్రయత్నాన్ని భగ్నం చేసిందని బీఎస్‌ఎఫ్ అధికారులు తెలిపారు. షెల్లింగ్‌ను సైతం బీఎస్‌ఎఫ్ సమర్థవంతంగా ఎదుర్కొందని డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఎస్ఎస్ మాండ్ తెలిపారు.

ఆస్ట్రేలియాలో ఆకస్మిక వరదలు

ముగ్గురు మృతి, 50 వేల మంది తరలింపు

సిడ్నీ: ఆస్ట్రేలియాలో ఆకస్మిక వరదలతో ముగ్గురు మృతి చెందారు. 50వేల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. మరో 50,000 మంది ప్రజలు తరలింపుకు సిద్ధంగా ఉండాలని అధికారులు కోరారు. రాబోయే 24 గంటల్లో మరిన్ని వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు. శుక్రవారం నాటికి 200 మి.మీ వరకు వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని, వరద ముప్పు మరింత తీవ్రమవుతుందని తెలిపారు. ఆస్ట్రేలియాలో అత్యధిక జనాభా కలిగిన రాష్ట్రమైన న్యూ సౌత్ వేల్స్‌లోని హంటర్, మిడ్ నార్త్ కోస్ట్ ప్రాంతాలలోని అనేక గ్రామీణ పట్టణాలను భారీ వరదలు ముంచెత్తాయి. భారీ వర్షంతో మిడ్ నార్త్ కోస్ట్ ప్రాంతం వరద నీటిలో మునిగిపోయింది.

వృద్ధుడి పిత్తాశయంలో 8 వేల రాళ్లు

న్యూఢిల్లీ: ఓ వృద్ధుడి పిత్తాశయంలో ఒకటీ రెండూ కాదు ఏకంగా 8,125 రాళ్లు బయట పడిన అరుదైన ఘటన దేశ రాజధాని ఢిల్లీలో వెలుగు చూసింది. 70 ఏళ్ల వృద్ధుడొకరు కొన్నేళ్లుగా తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతున్నారు. ఆకలి మందగించడం, తరచూ జ్వరం బారినపడటం, ఛాతీ, వెన్నెముక భాగంలో బరువుగా ఉండటం వంటి సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. పరిస్థితి తీవ్ర రూపం దాల్చింది. దీంతో, ఈ నెల 12వ తేదీన గురుగ్రామ్‌లోని ఫోర్టిస్ మెమోరియల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌కు తీసుకువచ్చారు. అల్ట్రా సౌండ్ పరీక్ష చేయగా పిత్తాశయ భాగమంతా రాళ్లతో నిండిపోయి కనిపించింది. దీంతో, వెంటనే లాపరోస్కోపిక్ సర్జరీ చేయాలని నిర్ణయించారు. గంటసేపట్లో శస్త్ర చికిత్స పూర్తయింది. అందులో వచ్చిన 8,125 రాళ్లను లెక్కించేందుకు వైద్య సిబ్బందికి ఏకంగా ఆరు గంటలు పట్టిందని ఆస్పత్రి గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. సాధారణంగా కొలెస్ట్రాల్ అసమతౌల్యం కారణంగా గాల్‌స్టోన్స్ ఏర్పడుతుంటాయి. వీటిని వెంటనే తొలగించాల్సి ఉంటుంది. లేకుంటే ఇవి పెరిగిపోయే ప్రమాదముంది. ఈ కేసులో రోగి శస్త్రచికిత్సకు నిరాకరిస్తూ చాలాకాలంపాటు తాత్సారం చేశారని ఆస్పత్రి తెలిపింది. పరిస్థితి మరీ విషమించాకే తప్పనిసరి పరిస్థితుల్లో ఆయన ఆపరేషన్‌కు అంగీకరించారని పేర్కొంది. ఆపరేషన్ తర్వాత రెండు రోజుల్లో ఆయన్ను డిశ్చార్జి చేశామని వెల్లడించింది. ఇప్పటికీ సర్జరీ చేయకుంటే అక్కడ చీము పేరుకుపోయి గట్టిపడి, పిత్తాశయం గోడలు మందంగా తయారవుతాయని, ఆ భాగంలో క్యాన్సర్‌కు దారి తీసే ప్రమాదం సైతం ఉంటుందని గ్యాస్ట్రో ఇంటెస్టయినల్ ఆంకాలజీ వైద్యుడు అమిత్ జావెద్ చెప్పారు. దేశ రాజధాని ప్రాంతంలో ఇంత పెద్ద సంఖ్యలో పిత్తాశయంలో రాళ్లు బయటపడటం ఇదే మొదటిసారి కావచ్చని ఫోర్టిస్ ఆస్పత్రి తెలిపింది. అసాధారణమైంది కానప్పటికీ ఇది అరుదైన కేసని పేర్కొంది.

పట్టుబడ్డ హైటెక్ కాపీయింగ్

పరీక్ష అరుణాచల్ ప్రదేశ్‌లో.. సమాధానాలు హరియాణా నుంచి

సిమ్లా: మోసగాళ్ల అతి తెలివితేటలు మామూలుగా లేవు. హిమాచల్ ప్రదేశ్‌లో జరిగే ఉద్యోగ ఎంపిక పరీక్షలకు 2,600 కిలోమీటర్ల దూరంలోని హరియాణా నుంచి సమాధానాలందించే ముఠా గుట్టు రట్టయింది. పరీక్ష రాసే అభ్యర్థులు గుట్టుచప్పుడు కాకుండా అమర్చుకున్న ఎల్రక్టానిక్ పరికరాలతో హరియాణాలోని జింద్‌లోని ముఠా జవాబులు అందించినట్లు పోలీసులు గుర్తించారు. ఈ రాకెట్‌ను ఛేదించేందుకు ముమ్మరంగా దర్యాప్తు సాగిస్తున్నారు. ఏం జరిగిందంటే.. అరుణాచల్‌లోని నవోదయ విద్యాలయ సమితిలోని బోధనేతర పోస్టుల భర్తీకి సీబీఎస్ఈ ఈ నెల 18న ఎంపిక పరీక్ష నిర్వహించింది. ఈ పరీక్షకు ఇటానగర్‌లోని వీకేవీ చింపు, కింగ్‌కప్ పబ్లిక్ స్కూల్ కేంద్రాల్లో ఆ రోజు సాయంత్రం ల్యాబ్ అటెండెంట్ పరీక్ష జరిగింది. కింగ్‌కప్ పబ్లిక్ స్కూల్‌లో పరీక్ష రాసే ఓ అభ్యర్థి తీరు అనుమానాస్పదంగా కనిపించడంతో అధికారులు, పోలీసులు సోదాలు చేపట్టారు. తనిఖీల్లో ఆ విద్యార్థి వద్ద ఓ చిన్న ఎల్రక్టానిక్ పరికరం, అతి చిన్న మైక్రోఫోన్ దొరికాయి. ఈ పరీక్ష కేంద్రంలో సరిగ్గా ఇలాంటి ఉపకరణాలనే ధరించిన మొత్తం 23 మంది విద్యార్థులను పట్టుకున్నారు. వివేకానంద కేంద్ర విద్యాలయంలో మరో విద్యార్థి పట్టుబడ్డాడు. ఇలాంటి సోదాల్లో మిగతా వాళ్లు బయటపడ్డారని అధికారులు తెలిపారు. ఆరా తీయగా ఉదయం పరీక్ష రాసిన వారివద్ద కూడా ఇలాంటి ఉపకరణాలున్నట్లు తేలింది. దీంతో, వారిని కూడా పట్టుకున్నామని ఎస్పీ రోహిత్ రాజ్‌బీర్ సింగ్ తెలిపారు. వీరందరినీ సమీప హోటళ్లు, ఇళ్లలోనే అరెస్ట్ చేశామన్నారు. 'ఎల్రక్టానిక్ డివైజెస్‌తో మోసపూరితంగా పరీక్ష రాస్తున్న మొత్తం 53 మందిని అదుపులోకి తీసుకుని, 29 డివైజెస్‌ను స్వాధీనం చేసుకున్నాం వీరిలో చాలా మంది నేరాన్ని అంగీకరించారు'అని ఎస్పీ వివరించారు. 'పరీక్ష రాసేందుకు సాయం చేస్తామంటూ ఓ ముఠా తమను నమ్మించిందని వీరు చెప్పారు. నిఘా నుంచి తప్పించుకునేందుకు ఎగ్జామ్ హాల్స్‌లో మారుమూల ప్రాంతాల్లో కూర్చోవాలని సూచనలు ఇచ్చారు. ఈ మేరకు ఎల్రక్టానిక్ పరికరాలను ఉపయోగించే తీరుపై వీరందరికీ ముఠా శిక్షణ ఇచ్చింది' అని ఎస్పీ తెలిపారు. దీని ప్రకారం అభ్యర్థులు ఎల్రక్టానిక్ డివైజ్‌ను అండర్ వేర్‌లో దాచుకున్నారు. అతిచిన్న ఇయర్ ఫోన్‌ను బయటకు కనిపించని రీతిలో చెవి లోపల అమర్చారు. ముందుగా వీరు తమకందించిన క్వశ్చన్ పేపర్ సెట్ పేరు ఏ, బీ, సీ, డీల్లో ఏదో అవతలి వారికి చెప్పాలి. అడిగిన ప్రశ్నకు సమాధానం ఇచ్చే వరకు ఎదురు చూడాలి. దగ్గితే సమాధానం అడిగినట్లు అర్థం. అప్పుడు అవతలి వ్యక్తి సమాధానం చెప్తాడు'అని ఎస్పీ రాకెట్ వివరాలను వెల్లడించారు. మొత్తమ్మీద పరీక్ష పత్రం కూడా లీకై ఉంటుందని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. డెహ్రాడూన్, సిక్కిం, దిమాపూర్‌ల్లోని పరీక్ష కేంద్రాల్లోనూ ఇలాంటి మతలబే జరిగినట్లు గుర్తించామన్నారు. ముమ్మరంగా దర్యాప్తు జరుగుతోందని వివరించారు. పట్టుబడిన 53 మందిపై భారతీయ న్యాయ సంహిత(బీఎన్ఎస్), ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టం కింద కేసులు నమోదు చేశారు. వీరికి సాయం అందించిన వారిని, ముఠా సూత్రధారిని కనుక్కునేందుకు హరియాణా పోలీసుల సాయం కోరామని వివరించారు.

53 మంది అభ్యర్థుల అరెస్ట్..



విమాన శకలాలు, ఇంధనం పడి మంటల్లో కాలిన కార్లు

జనావాసంలో కూలిన చిన్న విమానం

మంటల్లో 15 ఇళ్లు, డజనుకు పైగా కార్లు • పలువురు మృతి చెందినట్లు అనుమానం

శాన్ డియాగో: అమెరికాలోని శాన్ డియాగో శివారులోని జనావాసాల మధ్య గురువారం తెల్లవారుజామున చిన్న విమానం ఒకటి కూలింది. ఈ ఘటనలో పలువురు మృత్యువాతపడినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. విమాన శకలాలతోపాటు ఇంధనం పారబోసినట్లు పడి మండటంతో 15 ఇళ్లలో మంటలు చెలరేగాయి. మరో డజను వరకు కార్లు కాలిపోయాయని అధికారులు తెలిపారు. జనావాసాలున్న చోట విమాన ప్రమాదం చోటుచేసుకుందన్నారు. తీవ్రంగా గాయపడిన ఒకరిని ఆస్పత్రిలో చేర్చామని, మరో ఇద్దరికి స్వల్పంగానే గాయాలయ్యాయన్నారు. కూలిన ప్రైవేట్ సెస్నా రకం విమానంలో 10 మంది వరకు ప్రయాణించే వీలుందని, ఘటన సమయంలో అందులో ఎందరున్నారనే విషయం తెలియాల్సి ఉందని చెప్పారు. బుధవారం రాత్రి న్యూయార్క్ నగరంలోని టెటెర్‌బొరో ఎయిర్‌పోర్టు నుంచి టేకాఫ్ తీసుకునన ఈ విమానం కన్సాస్ రాష్ట్రం విచిటాలోని కల్నల్ జేమ్స్ జబరా ఎయిర్‌పోర్టులో కాసేపు ఆగింది. అనంతరం టేకాఫ్ తీసుకున్న ఈ విమానం శాన్ డియాగోలోని మాంట్‌గోమెరీ-గిబ్స్ ఎగ్జిక్యూటివ్ ఎయిర్‌పోర్టులో ల్యాండవ్వాల్సి ఉందని సమాచారం. మరో మూడు మైళ్ల ప్రయాణం ఉందనగా ప్రమాదంలో చిక్కుకుందన్నారు. విమానం పైలట్ నుంచి ఎటువంటి ప్రమాద సంకేతాలు రాలేదని తెలిపారు. అక్కడికి సమీపంలోనే ప్రపంచంలోనే అతిపెద్ద సైనికుల నివాస ప్రాంతముందని చెప్పారు. కాగా, అలాస్కాలోని ఓ కంపెనీకి చెందిన ఈ విమానం 1985లో తయారైంది. సుమారు 4 గంటల సమయంలో దట్టంగా మంచుకురుస్తుండగా విమానం కరెంటు తీగలను తాకడం వల్ల ప్రమాదానికి గురైందా అనే కోణంలో దర్యాప్తు జరుగుతోందని అధికారులు వివరించారు.

ఆరుగురికి కీర్తి చక్ర, 33 మందికి శౌర్య చక్ర

ప్రదానం చేసిన రాష్ట్రపతి ముర్ము

న్యూఢిల్లీ: రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము గురువారం ఆర్మీ, జమ్మూకశ్మీర్ పోలీసు విభాగాలకు చెందిన ఆరుగురికి కీర్తి చక్ర ప్రదానం చేశారు. వీరిలో నలుగురికి మరణానంతరం ప్రకటించారు. విధి నిర్వహణలో వీరు అసమాన ధైర్య సాహసాలు ప్రదర్శించారని రాష్ట్రపతి భవన్ ఒక ప్రకటనలో తెలిపింది. దేశంలోని రెండో అత్యున్నత శౌర్య పురస్కారం కీర్తి చక్ర. మరణానంతరం ఈ గౌరవం అందుకున్న వారిలో ఆర్మీలోని సిఖ్ లైట్ రెజిమెంట్‌కు చెందిన కల్నల్ మన్‌ప్రీత్ సింగ్, రాష్ట్రీయ రైఫిల్స్‌కు చెందిన ఇద్దరు, జమ్మూకశ్మీర్ పోలీసు అధికారి ఒకరు ఉన్నారు. సాయుధ బలగాల సుప్రీం కమాండర్ కూడా అయిన రాష్ట్రపతి ముర్ము మరో 33 మందికి శౌర్య చక్ర ప్రదానం చేశారు. వీరిలో ఏడుగురికి మరణానంతరం అందజేశారు. 56 రాష్ట్రీయ రైఫిల్స్‌లోని మరాఠా లైట్ ఇన్‌ఫాంట్రీకి చెందిన మేజర్ మళ్ల రామ గోపాల్ నాయుడు, 22 రాష్ట్రీయ రైఫిల్స్‌లోని పంజాబ్ రెజిమెంట్‌కు చెందిన మేజర్ మంజిత్ రాష్ట్రపతి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో కీర్తి చక్ర స్వీకరించారు. విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన రైఫిల్ మ్యాన్ రవి కుమార్, కల్నల్ మన్‌ప్రీత్ సింగ్, నాయక్ దిలావర్ ఖాన్, హుమాయున్ ముజమ్మిల్ భట్‌ల తరఫున కుటుంబసభ్యులకు ఈ అవార్డులను రాష్ట్రపతి ప్రదానం చేశారు.

బెయిల్ పిటిషన్ 27సార్లు వాయిదానా?

అలహాబాద్ హైకోర్టుపై సుప్రీం అసహనం

న్యూఢిల్లీ: సీబీఐ నమోదు చేసిన చీటింగ్ కేసులో నిందితుడు పెట్టుకున్న బెయిల్ పిటిషన్‌పై విచారణను 27సార్లు వాయిదా వేసిన అలహాబాద్ హైకోర్టుపై సుప్రీంకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. 'వ్యక్తిగత స్వేచ్ఛకు సంబంధించిన అంశంపై విచారణను 27 సార్లు వాయిదా ఎలా వేస్తారు?'అంటూ ప్రశ్నించింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ అగస్టీన్ మసీహ్‌ల ధర్మాసనం లక్ష్య తవార్ అనే వ్యక్తి వేసిన పిటిషన్‌పై గురువారం విచారణ సందర్భంగా వ్యాఖ్యలు చేసింది. తవార్‌కు బెయిల్ మంజూరు చేసిన ధర్మాసనం, సీబీఐకి నోటీసు జారీ చేసింది. 'సాధారణంగా కేసు వాయిదాలకు సంబంధించిన వ్యవహారాల్లో జోక్యం చేసుకోం. వ్యక్తిగత స్వేచ్ఛకు సంబంధించిన అంశంపై 27 పర్యాయాలు వాయిదా వేసి, పెండింగ్‌లో ఉంచడం అసాధారణమైన విషయం. ఈ వ్యవహారాన్ని పరిశీలించాల్సి ఉంది'అని సీజేఐ పేర్కొన్నారు. కాగా, తవార్‌పై వివిధ నేరారోపణలకు సంబంధించిన 33 కేసులున్నందున, మరింత ఆలస్యం కాకుండా విచారణను వేగవంతం చేయాలంటూ మార్చి 20న తవార్ బెయిల్ పిటిషన్ విచారణను వాయిదా సందర్భంగా అలహాబాద్ హైకోర్టు దిగువ న్యాయస్థానానికి ఉత్తర్వులు జారీ చేసింది.

శిక్ష తప్పదని ఉగ్రవాదులను హెచ్చరించాం

ఆపరేషన్ సిందూర్‌పై ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్

పణజి: పాకిస్తాన్‌తోపాటు పీవోకేలోని ఉగ్ర స్థావరాలు, మౌలిక వసతుల ధ్వంసమే లక్ష్యంగా కేంద్రం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌పై ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ ప్రశంసలు కురిపించారు. ఈ ఆపరేషన్ ద్వారా ఏమూలన దాగున్నా ఉగ్రవాదులను వెంటాడి వేటాడుతామనే సందేశాన్ని ప్రధాని మోదీ పంపించారన్నారు. 'ఇప్పుడున్నది మునుపటి భారత్ కాదు. చాలా భిన్నమైన, ఆత్మవిశ్వాసం, ధైర్యం కలిగిన భారత్. ప్రధాని మోదీ మన పొరుగు దేశాలకు మాత్రమే కాదు, యావత్ ప్రపంచ సమాజానికి సందేశం పంపారు. ఉగ్రవాదాన్ని సహించబోం, అతిక్రమిస్తే ఉగ్రవాదులను శిక్షిస్తాం..అదే ఈ సందేశం'అని ఉపరాష్ట్రపతి పేర్కొన్నారు. 'గ్రవాదులు ఎక్కడున్నా వేటాడి హతమారుస్తాం. ఆపరేషన్ సిందూర్ ఇకపైనా కొనసాగాల్సిన అవసరం ఉంది. మన ప్రధాని ముందుకు చూపునకు మన సెల్యూట్ చేయాలి'అని ఆయన తెలిపారు. ఈ ఆపరేషన్ సాధించిన ఫలితాలను అందరం ఒప్పుకుంటున్నామన్నారు. గురువారం గోవా రాజ్‌భవన్ ప్రాంగణంలో ఆయన భారతీయ వైద్యానికి ఆద్యులైన చరక, సుశ్రుత విగ్రహాలను ఆవిష్కరించారు.

ఎదురుకాల్పుల్లో జవాను వీరమరణం

కిష్త్వార్(జేకే): జమ్మూకశ్మీర్‌లోని కిష్త్వార్ జిల్లాలోని సింగ్‌పోరా ప్రాంతంలో గురువారం ఉదయం జరిగిన ఎదురుకాల్పుల్లో ఒక జవాను అమరుడయ్యాడు. ఆపరేషన్ ఇంకా కొనసాగుతోంది. సింగ్‌పోరాలో ఉగ్రవాదులున్నారన్న సమాచారంతో గురువారం తెల్లవారుజామునుంచే రెండు పారా ఎస్ఎఫ్ దళాలు, ఆర్మీకి చెందిన 11రాష్ట్రీయ్ రైఫిల్స్, 7వ అస్సాం రైఫిల్స్, కిష్త్వార్ ఎస్ఓజీ దళాలు సెర్చ్ ఆపరేషన్ ప్రారంభించాయి. ఉదయం ఏడుగంటల ప్రాంతంలో ఎన్‌కౌంటర్ ప్రారంభమైంది. ఈ ఎదురు కాల్పుల్లో తీవ్రంగా గాయపడ్డ జవాను.. చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచాడు. సైఫుల్లాతో సహా ముగ్గురు నుంచి నలుగురు ఉగ్రవాదుల బృందం చుట్టూ అడవుల్లో భద్రతా దళాలకు చిక్కినట్లు సమాచారం. ముందుజాగ్రత్త చర్యగా అదనపు దళాలను మోహరించారు. ఎన్‌కౌంటర్ సైట్‌కు వెళ్లే అన్ని మార్గాలను మూసివేశారు. జమ్మూ కశ్మీర్‌లోని పుల్వామా జిల్లాలోని త్రాల్ ప్రాంతంలోని నాదిర్ గ్రామంలో వారం రోజుల క్రితం వేర్వేరు ఉగ్రవాద వ్యతిరేక చర్యలలో ముగ్గురు జైషే మహమ్మద్ ఉగ్రవాదులను హతమయ్యారు. ఈ ఎన్‌కౌంటర్‌లో మరణించిన ముగ్గురు ఉగ్రవాదులను ఆసిఫ్ అహ్మద్ షేక్, అమీర్ నజీర్ వాని మరియు యావర్ అహ్మద్ భట్‌గా గుర్తించారు, వీరంతా జమ్మూ కాశ్మీర్‌లోని పుల్వామా జిల్లా నివాసితులు. అంతకుముందు మే 13న షోపియాన్‌లోని జిన్‌పథర్ కెల్లర్ ప్రాంతంలో ముగ్గురు లష్కరే తోయిబా ఉగ్రవాదులు కూడా హతమయ్యారు. వీరిలో ఇద్దరిని షోపియాన్ నివాసులైన షాహిద్ కుట్టాయ్, అద్నాన్ షఫీగా గుర్తించారు.

మావోయిస్టులతో కేంద్రం చర్చలు జరపాలి

సీపీఎం పొలిట్‌బ్యూరో డిమాండ్

న్యూఢిల్లీ: చత్తీస్‌గఢ్‌లో బుధవారం జరిగిన ఎన్‌కౌంటర్‌ను సీపీఎం పొలిట్‌బ్యూరో తీవ్రంగా ఖండించింది. చర్చలకు సిద్ధంగా ఉన్నామని మావోయిస్టులు పదేపదే చెబుతున్నప్పటికీ మరోవైపు ఎన్‌కౌంటర్లు చేయడం దారుణమని కేంద్ర ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తంచేసింది. మావోయిస్టులతో కేంద్రం చర్చలు జరపాలని పేర్కొంది. ఈ మేరకు సీపీఎం పొలిట్‌బ్యూరో గురువారం ఒ ప్రకటన విడుదల చేసింది. చర్చల ద్వారా సమస్యకు పరిష్కార మార్గం కనిపెట్టే అవకాశం ఉన్నప్పటికీ కేంద్రంతోపాటు చత్తీస్‌గఢ్‌లోని బీజేపీ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా పెడచెవిన పెడుతున్నాయని విమర్శించింది. మావోయిస్టులను పూర్తిగా అంతం చేయడమే కేంద్రం లక్ష్యంగా పెట్టుకుందని, ప్రజాస్వామ్య విరుద్ధంగా వ్యవహరి స్తోందని ఆగ్రహం వ్యక్తంచేసింది. ప్రభుత్వం ఇప్పటికైనా మావోయిస్టులతో చర్చలకు ముందుకు రావాలని, ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని కోరింది. మరోవైపు చత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్‌ను సీపీఐ, సీపీఐ(ఎంఎల్) ఖండించాయి. ఈ ఘటనపై న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశాయి. మావోయిస్టు అగ్రనేత నంబాల కేశవరావును అరెస్టు చేసే అవకాశం ఉన్నప్పటికీ ఎన్‌కౌంటర్‌లో హత్య చేయడం పట్ల సీపీఐ అనుమానాలు వ్యక్తంచేసింది.

అవామీ లీగ్‌పై నిషేధం ఏకపక్షం

యూనస్ ప్రభుత్వంపై హెచ్‌ఆర్‌డబ్ల్యూ ఆగ్రహం

న్యూయార్క్: బంగ్లాదేశ్ పదవీచ్యుత ప్రధానమంత్రి షేక్ హసీనా సారథ్యంలోని అవామీ లీగ్‌పై తాత్కాలిక ప్రభుత్వం నిషేధం విధించడాన్ని న్యూయార్క్ కేంద్రంగా పనిచేసే హ్యూమన్ రైట్స్ వాచ్(హెచ్‌ఆర్‌డబ్ల్యూ) తీవ్రంగా తప్పుబట్టింది. బాధ్యతారాహిత్యంతో ఉద్దేశ పూర్వకంగా తీసుకున్న ఏకపక్ష నిర్ణయమని స్పష్టం చేసింది. హసీనా మద్దతుదారులతోపాటు, అవామీ లీగ్‌పై పార్టీ కార్యకర్తల హక్కులను కాలరాయడమేనని తూర్పారబట్టింది. ఈ మేరకు బుధవారం తన వెబ్ సైట్‌లో ఒక ప్రకటన వెలువరించింది. అవామీ లీగ్ పార్టీ ఉగ్రవాద వ్యతిరేక చర్య లకు పాల్పడుతోందంటూ సంబంధిత చట్టాన్ని హడావుడిగా మార్చిన యూనస్ ప్రభుత్వం మే 12వ తేదీన ఆ పార్టీని నిషేధిస్తున్నట్లు ప్రకటించడం తెల్సిందే. ఈ మేరకు అవామీ లీగ్ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయడంతోపాటు, ఎన్నికల్లో పోటీ చేయకుండా ఆ పార్టీపై అనర్హత వేటు వేస్తూ ఎన్నికల కమిషన్ ప్రకటన వెలువరించింది. నేర న్యాయ విధానాన్ని సంస్కరించి, తీవ్రమైన నేరాలకు పాల్పడిన వారిని బాధ్యులుగా చేస్తామని చెప్పిన యూనస్ ప్రభుత్వం హసీనాతోపాటు అవామీ లీగ్ మద్దతుదారుల హక్కులను అణచివేసేందుకు ప్రయత్నాలు చేస్తోందని హెచ్‌ఆర్‌డబ్ల్యూ విమర్శించింది. యూనస్ ప్రభుత్వం ఇటీవల చేపట్టిన చర్యలు ప్రాథమిక హక్కులకు భంగకరంగా మారాయని పేర్కొంది.

ప్రాథమిక హక్కుల పరిరక్షణ కర్త సుప్రీంకోర్టు

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
పాలిటీ

వ్యక్తిగత స్వేచ్ఛలు, హక్కులు

ప్రకరణ-28

విద్యాలయాల్లో మత బోధన నిషేధం

ప్రకరణ 28(1): ప్రభుత్వ ఆర్థిక సహాయంతో నడిచే ప్రైవేట్ విద్యాసంస్థల్లో ప్రత్యేక మత బోధన నిషేధం.

ప్రకరణ 28(2): పై నిబంధనకు కొన్ని మిన హాయింపులిచ్చారు. ప్రభుత్వం నిర్వహించే దేవాదాయ, ధర్మాదాయ సంస్థల్లో ప్రత్యేక మత బోధన చేయవచ్చు.

ప్రకరణ 28(3): ప్రభుత్వ గుర్తింపు ఉన్న, ప్రభుత్వ ఆర్థిక సహాయం పొందే విద్యాసంస్థల్లో ఒక వ్యక్తి ఐచ్ఛికంగా మత ప్రార్థనలు/బోధనల్లో పాల్గొనవచ్చు. అయితే పాల్గొనమని ఒత్తిడి చేయరాదు. ఆ వ్యక్తి మైనర్ అయితే తల్లిదండ్రులు లేదా సంరక్షకుడి అనుమతి తీసుకోవాలి.

ప్రకరణలు-29, 30

విద్యా, సాంస్కృతిక పరమైన హక్కులు

ప్రకరణ 29(1): భారతదేశంలో నివసిస్తున్న ప్రజలకు ప్రత్యేక భాష, లిపి, సంస్కృతి ఉంటే.. వాటిని పరిరక్షించుకుని, పెంపొందించుకునే స్వేచ్ఛ వారికి ఉంటుంది.

ప్రకరణ 29(2): ప్రభుత్వం నిర్వహిస్తోన్న లేదా ప్రభుత్వ ఆర్థిక సహాయం పొందుతున్న సంస్థల్లో ప్రవేశానికి మతం, జాతి, కులం, భాషా ప్రాతిపదికన వివక్ష చూపరాదు.

ప్రకరణ 30(1): మైనారిటీ వర్గాలవారు, ప్రత్యేక విద్యాసంస్థలను ఏర్పాటు చేసుకొని, నిర్వహించుకోవచ్చు.

ప్రకరణ 30(1)(ఎ): మైనారిటీలు నిర్వహిస్తున్న విద్యాసంస్థలు, వాటి ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటే, వారికి ప్రత్యేక నష్టపరిహారం చెల్లించాలి. 1978లో 44వ రాజ్యాంగ సవరణ ద్వారా ఈ క్లాజును చేర్చారు.

ప్రకరణ 30(2): ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించే సమయంలో విద్యాసంస్థల పట్ల వివక్ష చూపరాదు. అల్ప సంఖ్యాక వర్గాల వారు నడిపే సంస్థలు, అధిక సంఖ్యాక వర్గాల వారు నడిపే సంస్థలను సమ దృష్టితో చూడాలి.

వివరణ:

- ఆర్టికల్ 29, 30లలో 'మైనారిటీ' పదాన్ని ప్రస్తావించారు. కానీ ఈ పదాన్ని రాజ్యాంగంలో ఎక్కడా నిర్వచించలేదు.
- మైనారిటీల వర్గీకరణకు రాష్ట్రాన్ని ప్రాతిపదికగా తీసుకోవాలని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. దేశంలో రెండు రకాల మైనారిటీ వర్గాలున్నాయి. అవి మతపరమైన, భాషాపరమైన మైనారిటీ వర్గాలు.
- హిందువులు మినహా మిగతా వారంతా మతపరమైన మైనారిటీలే. భాషాపరమైన మైనారిటీలు రాష్ట్రాల వారీగా మారుతుంటారు. ఉదాహరణకు.. తెలంగాణలో కన్నడిగులు, గుజరాతీలు, మరాఠీలు భాషాపరంగా మైనారిటీలు.

సుప్రీంకోర్టు తీర్పులు

కేరళ విద్య పాఠ్యాంశాల సవరణ బిల్లు (1958) కేసు: కేరళ ప్రభుత్వ పాఠశాలల్లో విప్లవ, కమ్యూనిస్టు భావాలున్న పాఠ్యాంశాలను చేర్చారు. దీంతో ఈ బిల్లును సుప్రీంకోర్టు సలహా పరిధికి నివేదించారు. పాఠ్యాంశాల్లో తీవ్రవాద భావజాలాన్ని చేర్చడం చెల్లదని సుప్రీంకోర్టు తెలిపింది.

డి.ఎ.వి. కాలేజ్ v/s స్టేట్ ఆఫ్ పంజాబ్ (1971) కేసు: విశ్వవిద్యాలయాలు, వాటి అనుబంధ కళాశాలల్లో పంజాబీ మాత్రమే బోధన భాషగా ఉండాలని నిర్ణయించారు. అయితే ఇది చెల్లుబాటు కాదని సుప్రీంకోర్టు తీర్పుచెప్పింది.

అల్‌సెయింట్స్ v/s గవర్నమెంట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (1980) కేసు: మైనారిటీ విద్యాసంస్థల నిర్వహణలో ప్రభుత్వం జోక్యం చేసుకోరాదని ఈ కేసులో సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది.

టి.ఎం.ఎ.పాయ్ v/s స్టేట్ ఆఫ్ కర్ణాటక (2003) కేసు: మైనారిటీ విద్యా సంస్థల విషయంలో ప్రభుత్వం ఏ సందర్భంలో జోక్యం చేసుకోవచ్చో, జోక్యం చేసుకోరాదో వివరణ ఇస్తూ కొన్ని మార్గదర్శకాలు జారీ చేసింది. అవి..

- మైనారిటీ స్థాయిని నిర్ణయించడానికి రాష్ట్రాన్ని మాత్రమే యూనిట్‌గా తీసుకోవాలి.
- మైనారిటీ అనే పదంలో భాషాపరమైన, మతపరమైన మైనారిటీలు ఉండవచ్చు.
- బోధన, బోధనేతర సిబ్బంది నియామకాలు, వారిపై పాలనా నియంత్రణ సంబంధిత హక్కులు మేనేజ్‌మెంట్‌కే ఉంటాయి. ప్రభుత్వ ధనసహాయం పొందని మైనారిటీ విద్యాసంస్థల ఫీజులను నియంత్రించే అధికారం ప్రభుత్వానికి లేదు. అయితే క్యాపిటేషన్ ఫీజులను ప్రభుత్వం నియంత్రించవచ్చు.

మత స్వేచ్ఛ - సుప్రీంకోర్టు తీర్పులు

బిజో ఇమాన్యువల్ v/s స్టేట్ ఆఫ్ కేరళ (1986) కేసు:
జాతీయ గీతాన్ని ఆలపించడం తమ మత విశ్వాసాలకు విరుద్ధమని నిరూపించగలిగితే.. జాతీయ గీతం పాడాలని ఏ వ్యక్తిని ఒత్తిడి చేయరాదని సుప్రీంకోర్టు పేర్కొంది. కేరళ పాఠశాలల్లో జాతీయ గీతం ఆలపించడం తప్పనిసరి చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. దీన్ని ప్రశ్నిస్తూ సుప్రీంకోర్టులో ఈ కేసు దాఖలైంది.

సెయింట్ జేవియర్స్ కాలేజీ v/s స్టేట్ ఆఫ్ గుజరాత్ (1974) కేసు:
'లౌకికతత్వం' పదానికి ఈ కేసులో సుప్రీంకోర్టు వివరణ ఇచ్చింది. మతానికి, దేవుడికి అతీతంగా వ్యవహరించడమే లౌకికతత్వం. దేవుడి పట్ల ప్రత్యేక ద్వేషం,వ్యతిరేకత చూపకూడదు. దేవుణ్ని నమ్మేవారిని, నమ్మని వారిని ప్రభుత్వం ఒకే విధంగా చూడాలి.

ప్రకరణ - 31

ఆస్తిహక్కు

పార్లమెంటు ఆస్తి హక్కుకు సంబంధించి అనేక సవరణలు, చట్టాలు చేసింది. 1951లో మొదటి రాజ్యాంగ సవరణ, 1964లో 17వ రాజ్యాంగ సవరణ, 1971లో 24వ రాజ్యాంగ సవరణ చేశారు. 1978లో 44వ రాజ్యాంగ సవరణ ద్వారా ఆస్తి హక్కును ప్రాథమిక హక్కుల జాబితా నుంచి తొలగించారు. దాన్ని 12వ భాగంలో ప్రకరణ 300-ఎలో రాజ్యాంగ పరమైన హక్కుగా (Constitutional Rights) చేర్చారు. 1979 జూన్ 20 నుంచి ఇది అమల్లోకి వచ్చింది. అలాగే ఆస్తి హక్కుకు సంబంధించి నూతన నిబంధనలను కూడా చేర్చారు.

ప్రకరణ 31(ఎ): ప్రభుత్వం ఆస్తిని స్వాధీనం చేసుకున్నప్పుడు వర్తించే కొన్ని మినహాయింపులను ఈ ప్రకరణలో పేర్కొన్నారు. భూ సంస్కరణల అమలు కోసం చట్టాలు చేసినప్పుడు.. అవి 14, 19 ప్రకరణలకు వ్యతిరేకమనే కారణంతో న్యాయస్థానాల్లో ప్రశ్నించరాదు.

ప్రకరణ 31(బి): కొన్ని చట్టాల వర్తింపునకు మినహాయింపులు. వీటిని 9వ షెడ్యూల్‌లో ప్రస్తావించారు. ప్రాథమిక హక్కులకు వ్యతిరేకంగా ఉన్నాయన్న కారణంతో ఇలాంటి చట్టాలను న్యాయస్థానాల్లో ప్రశ్నించరాదు.9వ షెడ్యూల్‌లో పేర్కొన్న అంశాలు సాధారణంగా న్యాయ సమీక్షకు గురి కావు. కానీ'రాజ్యాంగ మౌలిక నిర్మాణంలో న్యాయ సమీక్ష అంతర్భాగం. దాన్ని పరిమితం చేసే అధికారం పార్లమెంటుకు లేదు' అని కేశవానంద భారతి కేసు(1973)లో సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది.

2007లో ఐ.ఆర్. కొహెల్లో v/s తమిళనాడు కేసులో 'న్యాయ సమీక్ష రాజ్యాంగ మౌలిక నిర్మాణంలోకి వస్తుంది. కాబట్టి 1973 తర్వాత 9వ షెడ్యూల్‌లో చేర్చిన అంశాలు న్యాయ సమీక్షకు గురవుతాయి' అని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది.

ప్రకరణ 31(సి): ఆదేశిక సూత్రాల అమలు కోసం ప్రాథమిక హక్కులపై, ముఖ్యంగా ఆస్తి హక్కుపై కొన్ని పరిమితులు విధించవచ్చు. ఈ పరిమితులు రాజ్యాంగ విరుద్ధమంటూ న్యాయస్థానాల్లో ప్రశ్నించడానికి వీల్లేదు.

ఆదేశిక సూత్రాల్లోని ప్రకరణ 39లో ఉన్న క్లాజు బి, సిలో సామ్యవాద తరహా సమాజ స్థాపన గురించి పేర్కొన్నారు. ఈ విషయమై రాజ్యాంగ సవరణ ద్వారా పార్లమెంటు కొన్ని పరిమితులు విధిస్తే, అవి ప్రాథమిక హక్కులకు వ్యతిరేకమని న్యాయస్థానంలో ప్రశ్నించలేం.



వివరణ:

ప్రకరణ 31(ఎ), 31(బి), 31(సి)లు ఆస్తి హక్కుపై పరిమితికి సంబంధించినవి. ఇవి ఎలాంటి ప్రాథమిక హక్కులను ప్రసాదించవు. 44వ రాజ్యాంగ సవరణ ద్వారా ఆస్తి హక్కు ప్రకరణ 31ను తొలగించారు. కానీ వీటిని మాత్రం కొనసాగించారు.

ప్రకరణ - 32

రాజ్యాంగ పరిహార హక్కు (Right to Constitutional Remedies)

ప్రాథమిక హక్కుల్లో ఇది అత్యంత ముఖ్యమైంది. మూడో భాగంలో పొందుపరచిన ప్రాథమిక హక్కులకు భంగం కలిగినా/ఆ హక్కులను పరిమితం చేసినా/అమలు చేయకపోయినా, బాధితులు నేరుగా సుప్రీంకోర్టును ఆశ్రయించి తగిన రాజ్యాంగ పరిహారాలను పొందవచ్చు. మొదటి ఆరు ప్రాథమిక హక్కుల అమలు ఈ నిబంధన పైనే ఆధారపడి ఉంటుంది. హక్కులను గుర్తించడంతోపాటు, వాటి అమలుకు హామీ ఉన్నప్పుడే వాటికి విలువ ఉంటుంది. అమలు కాని హక్కులు వ్యర్థం.

ప్రాథమిక హక్కుల పరిరక్షణకు నిబంధన 32(4) హామీ ఇస్తోంది. అందుకే అంబేద్కర్ రాజ్యాంగ పరిహార హక్కును రాజ్యాంగ ఆత్మగా, హృదయంగా వర్ణించారు.

ప్రకరణ 32(1): ఒక వ్యక్తి ప్రాథమిక హక్కులకు భంగం కలిగినప్పుడు లేదా అవి అమలు కానప్పుడు ఆ వ్యక్తి నేరుగా సుప్రీంకోర్టును ఆశ్రయించి తగిన పరిహారం పొందవచ్చు.

ప్రకరణ 32(2): హక్కులను కాపాడటానికి ప్రత్యేక ఆదేశాలైన హెబియస్ కార్పస్, మాండమస్, ప్రొహిబిషన్, కో-వారెంటో, సెర్షియరీ లాంటి రిట్లను సుప్రీంకోర్టు జారీ చేసేందుకు ఈ భాగం వీలు కల్పిస్తుంది.

ప్రకరణ 32(3): సుప్రీంకోర్టు అధికారాలకు విఘాతం కలగకుండా, ఇతర న్యాయస్థానాల(స్థానిక కోర్టులు, జిల్లా కోర్టులు)కు కూడా రిట్లు జారీచేసే అధికారాన్ని పార్లమెంటు చట్టం ద్వారా కల్పించవచ్చు.

ప్రకరణ 32(4): రాజ్యాంగంలో ఇతరత్రా అనుమతించిన విధంగా తప్ప ఈ ప్రకరణ ద్వారా గుర్తించిన హక్కులు రద్దు కావు.

వివరణ:

రాజ్యాంగ మౌలిక నిర్మాణంలో రాజ్యాంగ పరిహార హక్కు అంతర్భాగమని 1981లో ఫర్టిలైజర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కేసులో సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది.

రిట్లు-పరిధి-పరిమితులు

ప్రాథమిక హక్కుల పరిరక్షణకు జారీచేసే ప్రత్యేక ఆదేశాలను న్యాయశాస్త్ర పరిభాషలో రిట్లు (Writs) అంటారు. రిట్లు జారీ చేసే పద్ధతిని బ్రిటన్ రాజ్యాంగం నుంచి గ్రహించారు. నిబంధన 32 ప్రకారం సుప్రీంకోర్టుకు, నిబంధన 226 ప్రకారం రాష్ట్ర హైకోర్టులకు రిట్లు జారీ చేసే అధికారాన్ని కల్పించారు. పార్లమెంటు ప్రత్యేక చట్టం ద్వారా ఈ అధికారాన్ని జిల్లా న్యాయస్థానాలకు కల్పించవచ్చు. ఇప్పటి దాకా పార్లమెంటు అలాంటి చట్టాలను రూపొందించలేదు. కాబట్టి సుప్రీంకోర్టు, హైకోర్టులకు మాత్రమే రిట్లు జారీ చేసే అధికారం ఉంది. రిట్ల జారీ విషయంలో సుప్రీంకోర్టు, హైకోర్టు మధ్య వ్యత్యాసాలు ఉన్నాయి.

హైకోర్టులు జారీ చేసే రిట్ అత్యవసర పరిస్థితుల్లో రద్దవుతుంది. ప్రకరణ 226 విషయ పరిధి తక్కువ. కానీ సుప్రీంకోర్టు జారీ చేసే రిట్ అత్యవసర పరిస్థితుల్లో రద్దు కాదు. ప్రకరణ 32 విషయ పరిధి విస్తృతమైంది.

ప్రాథమిక హక్కుల పరిరక్షణలో సుప్రీం కోర్టుకు ప్రత్యేకమైన, ప్రాథమిక విచారణ పరిధి ఉంటుంది (Primary and Original). అందుకే సుప్రీంకోర్టును **ప్రాథమిక హక్కుల పరిరక్షణ కర్త** అంటారు.

ప్రాథమిక హక్కుల పరిరక్షణలో సుప్రీంకోర్టు, హైకోర్టులకు ఉమ్మడి పరిధి ఉంటుంది. అంటే పౌరులు ప్రాథమిక హక్కుల పరిరక్షణకు ప్రకరణ 32 ప్రకారం నేరుగా సుప్రీంకోర్టును లేదా ప్రకరణ 226 ప్రకారం హైకోర్టును ఆశ్రయించవచ్చు.

సాధారణంగా హైకోర్టు ద్వారా తగిన రక్షణ, ఉపశమనం లభిస్తుందని పౌరులు భావిస్తే, మొదట హైకోర్టును ఆశ్రయించాలని కనుభాయ్ బ్రహ్మభట్ v/s గుజరాత్ (1972) కేసులో సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది.

వివిధ రిట్లు-అర్థం-పరిధి-ప్రాముఖ్యత

హెబియస్ కార్పస్ (Hebeas Corpus)

ఈ పదం లాటిన్ భాష నుంచి వచ్చింది. హెబియస్ అంటే 'Have', కార్పస్ అంటే 'Body' అని అర్థం. ఒక వ్యక్తిని భౌతికంగా కోర్టు ముందు హాజరుపర్చడమని దీనికి అర్థం.ఇది పురాతన రిట్. నిబంధన 19-22 వరకు పొందుపరచిన వ్యక్తిగత స్వేచ్ఛలకు భంగం కలిగినప్పుడు ఈ రిట్ జారీ చేస్తారు. అరెస్టయిన వ్యక్తిని 24 గంటల్లోగా సమీప న్యాయస్థానంలో హాజరుపరచాలి. లేని పక్షంలో ఈ రిట్ దాఖలు చేస్తే వెంటనే ఆ వ్యక్తిని న్యాయస్థానం ముందు హాజరుపరచాలని కోర్టు ఆదేశిస్తుంది.

వ్యక్తిగత స్వేచ్ఛల పరిరక్షణతోపాటు చట్టబద్ధత లేకుండా ఏ వ్యక్తిని నిర్బంధించకుండా, శిక్షించకుండా కాపాడటం ఈ రిట్ ప్రధాన ఉద్దేశం. ఈ రిట్‌ను ప్రభుత్వ సంస్థలకు, ప్రైవేట్ వ్యక్తులకు కూడా జారీ చేయవచ్చు.

మూడో వ్యక్తికి కూడా ఇందులో జోక్యం చేసుకునే హక్కు (లోకస్ స్టాండై) ఉంటుంది. బాధితుల తరఫున సామాజిక స్పృహ ఉన్న సంస్థ/వ్యక్తి ఈ రిట్ దాఖలు చేయవచ్చు. అందుకే దీన్ని ఉదారమైన రిట్ అని, వ్యక్తిగత స్వేచ్ఛల పరిరక్షణ సాధనమని అంటారు.

మినహాయింపులు:

పార్లమెంటు స్వాధికారాలకు భంగం కలిగించిన కారణంతో వ్యక్తిని నిర్బంధించినప్పుడు, కోర్టు ద్వారా నేరారోపణ నిరూపితమై జైలు శిక్ష అనుభవిస్తున్నప్పుడు ఇది వర్తించదు.

మాండమస్ (Mandamus)

భాషాపరంగా మాండమస్ అంటే ఆదేశం అని అర్థం. సుప్రీం కోర్టు లేదా హైకోర్టు జారీచేసే అత్యున్నత ఆదేశంగా దీన్ని చెప్పవచ్చు. ప్రభుత్వాధికారి/సంస్థ తమ చట్టబద్ధమైన విధులను నిర్వర్తించనప్పుడు వాటిని నిర్వర్తించమని న్యాయస్థానం ఇచ్చే ఆదేశం.

ప్రభుత్వాధికారులు, సంస్థలు తమ విధులను చట్టబద్ధంగా నిర్వర్తించనప్పుడు ప్రజల హక్కులకు భంగం వాటిల్లుతుంది. అలాంటి సందర్భాల్లో వారు సక్రమంగా విధులు నిర్వర్తించడానికి ఈ రిట్ జారీ చేస్తారు. పబ్లిక్ సంస్థలు, క్వాజి పబ్లిక్ (Quasi-Public), జ్యుడీషియల్ సంస్థలు, క్వాజి జ్యుడీషియల్ సంస్థలకు వ్యతిరేకంగా ఈ రిట్ జారీ చేయవచ్చు.

మినహాయింపులు:


రాష్ట్రపతి, గవర్నర్లకు ఈ రిట్ వర్తించదు. వీరు తమ అధికారాలు, విధులను నిర్వర్తించనప్పుడు వాటిని నిర్వర్తించమని ఏ కోర్టు ఆదేశించలేదు.

ప్రైవేట్ వ్యక్తులు, ప్రైవేటు సంస్థలకు వ్యతిరేకంగా ఈ రిట్ జారీచేయడానికి వీల్లేదు.

మాండమస్ రిట్‌ను అంతిమ ప్రత్యామ్నాయంగా మాత్రమే జారీచేస్తారు. అంటే పరిపాలనాపరమైన ప్రత్యామ్నాయాల ద్వారా పౌరులు న్యాయాన్ని పొందలేనప్పుడు ఈ రిట్ ద్వారా ఉపశమనం పొందవచ్చు. ఈ రిట్ జారీ అనేది కోర్టు విచక్షణపై ఆధారపడి ఉంటుంది.

అధికారులు తప్పనిసరిగా నిర్వర్తించాల్సిన విధులకే ఇది వర్తిస్తుంది. విచక్షణా (Discretion) పూర్వకమైన విధులకు వర్తించదు.

సిద్ధాంత శిరోమణి గ్రంథాన్ని రాసింది?



1. సైన్స్ ఏ భాషా పదం?
   ఎ) ఇంగ్లిష్ బి) లాటిన్
   సి) ఫ్రెంచ్ డి) గ్రీకు
2. పాదరసం ద్రవ రూపంలో ఉన్న లోహం. ఇది ఒక..?
   ఎ) భావన బి) సాధారణీకరణం
   సి) యదార్థం డి) ప్రాకల్పన
3. పరమాణువులు సంయోగం చెంది అణువులు ఏర్పడతాయి. ఇది ఒక..?
   ఎ) యదార్థం బి) భావన
   సి) పరికల్పన డి) సత్యం
4. పరస్పర సంబంధం కలిగి.. సత్యాల సంబంధాన్ని నియమబద్ధం చేసేది..?
   ఎ) యదార్థం బి) భావన
   సి) పరికల్పన డి) సాధారణీకరణం
5. ఎత్తైన పర్వతాలపై నీరు తక్కువ ఉష్ణోగ్రత వద్ద మరగవచ్చు. ఇది ఒక..?
   ఎ) నల్ ప్రాకల్పన బి) ప్రశ్నా ప్రాకల్పన
   సి) ప్రాసక్తి ప్రాకల్పన
   డి) ప్రకటనాత్మక ప్రాకల్పన
6. ఆమోదించిన సిద్ధాంతం ఒక..?
   ఎ) నియమం బి) సూత్రం
   సి) యదార్థం డి) పరికల్పన
7. కింది వాటిలో విజ్ఞాన శాస్త్రంలో ద్రవ్యాత్మక నిర్మాణం కానిది?
   ఎ) యదార్థం బి) భావన
   సి) శాస్త్రజ్ఞులు పరిస్థితులను వివరించడం
   డి) సిద్ధాంతం
8. విజ్ఞాన శాస్త్రాన్ని ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ ఎలా నిర్వచించింది?
   ఎ) భౌతిక ప్రపంచాన్ని, ప్రకృతి నియమాలను పరిశీలించడం
   బి) అనుభవాత్మక పరిశీలనలు - అన్వేషణ
   సి) విజ్ఞానశాస్త్రం అంటే మాపకం
   డి) వ్యవస్థీకృతమైన సాధారణ జ్ఞానం
9. విజ్ఞానశాస్త్రం అంటే ఒక మాపకం.. అని చెప్పింది?
   ఎ) కార్ల్ పియర్‌సన్ బి) అర్హీనియస్
   సి) జేమ్స్ బికోనెంట్ డి) ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ
10. విషయాత్మక విశ్వంలో సామ్యం ఉందని విజ్ఞాన శాస్త్రం భావించడం ఒక..?
    ఎ) యదార్థం బి) భావన
    సి) పరికల్పన డి) మూల భావన
11. ఒక విద్యార్థి నాలుగు ఆమ్లాలను రుచి చూసిన అనంతరం.. అవి పుల్లగా ఉంటాయని చెప్పాడు. ఇది ఒక..?
    ఎ) యదార్థం బి) సాధారణీకరణం
    సి) భావన డి) పరికల్పన
12. శాస్త్రీయ ఫలితాలను సమర్థవంతంగా వివరించేవి..?
    ఎ) యదార్థం బి) భావనలు
    సి) ప్రాగుక్తీకరణలు డి) సిద్ధాంతాలు
13. శాస్త్రజ్ఞులకి ఉండే ప్రత్యేక లక్షణాలను ఎలా పిలుస్తారు?
    ఎ) శాస్త్రీయ పద్ధతి బి) శాస్త్రీయ వైఖరి
    సి) పై రెండూ డి) ఏదీకాదు
14. ఒక విద్యార్థి ఏ నిర్ణయాన్ని అంత్య నిర్ణయంగా అంగీకరించకపోవడం.. ఒక ?
    ఎ) శాస్త్రీయ పద్ధతి బి) శాస్త్రీయ వైఖరి
    సి) శాస్త్ర లక్షణం డి) పైవన్నీ
15. కాంతి ఏడు రంగుల మిశ్రమం. ఇది ఏ రకమైన ప్రాకల్పన?
    ఎ) శూన్య ప్రాకల్పన బి) ప్రశ్నా ప్రాకల్పన
    సి) ప్రాగుక్త ప్రాకల్పన
    డి) ప్రకటనాత్మక ప్రాకల్పన
16. విజ్ఞానశాస్త్ర అభ్యాసకుడు సత్యశీలుడు.. ఎందుకంటే శాస్త్ర స్వభావం ఒక?
    ఎ) క్రమశిక్షణ బి) సౌందర్యాన్వేషణ
    సి) ధనార్జన డి) సత్యాన్వేషణ
17. సార్వత్రికంగా రుజువు చేసే ప్రవచనం.. ఒక?
    ఎ) ప్రాకల్పన బి) నియమం
    సి) ప్రయోగం డి) సాధారణీకరణం
18. జ్ఞాన సముపార్జనకు దోహదం చేసేది?
    ఎ) తర్కం బి) స్పందన
    సి) కంఠస్థం డి) అధికారత్వం
19. సాధారణీకరించిన ఊహ లేదా ఆలోచనే ఒక..?
    ఎ) యదార్థం బి) సిద్ధాంతం
    సి) సూత్రం డి) భావన
20. శాస్త్ర ప్రక్రియ నిర్మాణంలో ఇమడని కృత్యం?
    ఎ) ప్రశ్నించడం బి) పరిశీలించడం
    సి) నమ్మడం డి) ఊహించడం
21. జ్యోతిష్య శాస్త్రాన్ని అభివృద్ధి చేసింది?
    ఎ) ఈజిప్షియన్లు బి) బాబిలోనియన్లు
    సి) మెసపటోనియన్లు డి) పైవేవీ కాదు
22. 365 రోజుల క్యాలెండర్‌ను తయారు చేసింది?
    ఎ) ఈజిప్షియన్లు బి) బాబిలోనియన్లు
    సి) హోమోసేపియన్లు డి) ఇండియన్స్
23. నవీన విజ్ఞాన శాస్త్ర పితామహుడు?
    ఎ) గెలీలియో బి) న్యూటన్
    సి) నీల్స్ బోర్ డి) ఐన్‌స్టీన్
24. విశ్లేషణాత్మక త్రాసును అభివృద్ధి చేసింది?
    ఎ) అరిస్టాటిల్ బి) గెలీలియో
    సి) లెవోయిజర్ డి) న్యూటన్
25. 'ప్రిన్సిపియా ఆఫ్ మేథమెటికా' పుస్తకాన్ని రాసింది?
    ఎ) ఐన్‌స్టీన్ బి) గెలీలియో
    సి) న్యూటన్ డి) ఫారడే
26. ఖగోళ శాస్త్రానికి పునాది వేసిన గ్రంథం?
    ఎ) గణితం బి) విజ్ఞానశాస్త్రం
    సి) ఆర్యభట్టీయం డి) లీలావతి గణితం
27. రెటీనా, హెర్నియా, సిజేరియన్‌ల గురించి తెలిపే గ్రంథం?
    ఎ) చరక సంహిత బి) రుగ్వేదం
    సి) సుశ్రుత సంహిత డి) అన్నీ
28. రసరత్నాకర గ్రంథాన్ని రాసింది?
    ఎ) ఐన్‌స్టీన్ బి) నాగార్జునుడు
    సి) న్యూటన్ డి) నీల్స్ బోర్
29. భారతదేశంలో నూతన విద్యా విధాన పితామహుడు?
    ఎ) ఛార్లెస్ గ్రాంట్ బి) గెలీలియో
    సి) కొఠారి డి) న్యూటన్
30. సెకండరీ విద్యా కమిషన్ అధ్యక్షుడు?
    ఎ) సర్వేపల్లి రాధాకృష్ణన్ బి) మొదలియార్
    సి) కొఠారి డి) ఛార్లెస్ గ్రాంట్
31. ఎన్‌సీఈఆర్‌టీని ప్రారంభించిన సంవత్సరం?
    ఎ) 1961 బి) 1962
    సి) 1963 డి) 1964
32. జీవశాస్త్ర పితామహుడు?
    ఎ) న్యూటన్ బి) డార్విన్
    సి) అరిస్టాటిల్ డి) గెలీలియో
33. కణాల బ్రేనియన్ చలనం గురించి తెలిపింది?
    ఎ) చార్లెస్ హెచ్‌టిన్స్ బి) ఐన్‌స్టీన్
    సి) న్యూటన్ డి) గెలీలియో
34. 'π' విలువను కనుగొన్న శాస్త్రవేత్త?
    ఎ) ఐన్‌స్టీన్ బి) గెలీలియో
    సి) ఆర్యభట్ట డి) న్యూటన్
35. సిద్ధాంత శిరోమణి గ్రంథాన్ని రాసింది?
    ఎ) ఆర్యభట్ట బి) భాస్కరాచార్యుడు
    సి) లీలావతి డి) మహావీర
36. 1954లో భారతరత్న బిరుదు పొందిన శాస్త్రవేత్త?
    ఎ) న్యూటన్
    బి) సుబ్రహ్మణ్యం చంద్రశేఖర్
    సి) సి.వి.రామన్ డి) ఐన్‌స్టీన్
37. నాడీ గమనాన్ని తెలిపే పరికరం?
    ఎ) ఆడో మీటర్ బి) స్ఫిగ్నో మీటర్
    సి) పల్స్ మీటర్ డి) పైవేవీ కావు
38. 'ఆన్ ది నేచర్ ఆఫ్ కామెంట్స్' పుస్తక రచయిత?
    ఎ) న్యూటన్ బి) గెలీలియో
    సి) ఫారడే డి) హైగెన్స్
39. 'అనాటమీ అండ్ ఫిజియాలజీ' అనే గ్రంథాన్ని రాసింది?
    ఎ) గెలీలియో బి) న్యూటన్
    సి) లెవోయిజర్ డి) హైగెన్స్
40. 'ఆటమ్స్ ఫర్ పీస్' అవార్డ్ పొందిన శాస్త్రవేత్త?
    ఎ) నీల్స్ బోర్ బి) హైగెన్స్
    సి) న్యూటన్ డి) రూథర్ ఫర్డ్
41. విద్యుత్ ప్రవాహం వల్ల జరిగే రసాయనిక మార్పులను అధ్యయనం చేసేది?
    ఎ) ఎలక్ట్రాలసిస్ బి) హైడ్రాలసిస్
    సి) ఎలక్ట్రో కెమిస్ట్రీ డి) పైవన్నీ
42. అన్‌సర్టెనిటీ ప్రిన్సిపల్‌ను తెలియజేసింది?
    ఎ) హైసెన్ బర్గ్ బి) హైగెన్స్
    సి) న్యూటన్ డి) ఫారడే
43. ప్రయోగాత్మక విజ్ఞాన శాస్త్రానికి ఆద్యుడు?
    ఎ) గెలీలియో బి) విలియం హార్వే
    సి) న్యూటన్ డి) రోజర్ బేకన్
44. జ్ఞానం మరింత జ్ఞాన సముపార్జన కోసం.. అనే భావాన్ని అభివృద్ధి పర్చిన విలువ ఏది?
    ఎ) ఉపయోగిత విలువ
    బి) వృత్తి విలువ సి) బౌద్ధిక విలువ
    డి) క్రమశిక్షణ విలువ
45. విజ్ఞానశాస్త్రం విద్యార్థుల్లో అవగాహన, బుద్ధి వికాసం, బుద్ధి కుశలత, సత్యాన్వేషణ కలిగిస్తే.. అది ఏ విలువ?
    ఎ) బౌద్ధిక విలువ బి) వృత్తి విలువ
    సి) నైతిక విలువ డి) క్రమశిక్షణ విలువ
46. విజ్ఞాన శాస్త్రాన్ని అధ్యయనం చేస్తే.. విద్యార్థి శాస్త్ర స్వభావాన్ని కలిగి ఉండటం ఒక?
    ఎ) నైతిక విలువ బి) వృత్తి విలువ
    సి) శాస్త్రీయ వైఖరి- అభివృద్ధి విలువ
    డి) సాంస్కృతిక విలువ
47. సత్యాన్వేషణలో శాస్త్రీయ పద్ధతిని ఉపయోగించడం వల్ల విద్యార్థిలో పెంపొందే విలువ?
    ఎ) బౌద్ధిక విలువ బి) నైతిక విలువ
    సి) క్రమశిక్షణ విలువ
    డి) సౌందర్యాత్మక విలువ
48. భావనలు సత్యం లేదా అసత్యం అని నిరూపించలేని పక్షంలో అవి ఎలా మిగిలిపోతాయి?
    ఎ) నియమాలుగా బి) సూత్రాలుగా
    సి) సాధారణీకరణాలుగా
    డి) సిద్ధాంతాలుగా
49. సాంస్కృతిక వారసత్వాన్ని నూతన తరాలకు అందించటం, సాంస్కృతిక అభివృద్ధికి విజ్ఞాన శాస్త్రం సహాయం చేయటం ఒక..?
    ఎ) నైతిక విలువ
    బి) సౌందర్యాత్మక విలువ
    సి) సాంస్కృతిక విలువ
    డి) క్రమశిక్షణ విలువ
50. ప్రస్తుతం మనం ఉపయోగిస్తున్న సెల్‌ఫోన్.. విజ్ఞానశాస్త్రం ఏ విలువ అవుతుంది?
    ఎ) వృత్తి విలువ
    బి) సాంస్కృతిక విలువ
    సి)ఉపయోగిత విలువ
    డి) క్రమశిక్షణ విలువ
51. ఒక ఉపాధ్యాయుడు ప్రతిరోజు ఒక విద్యార్థికి బొమ్మలు గీయమని చెబుతున్నాడు. దీని ద్వారా నెరవేరే ఉద్దేశం?
    ఎ) జ్ఞాన సముపార్జన
    బి) నైపుణ్య, సామర్థ్యాల అభివృద్ధి
    సి) శాస్త్రీయ పద్ధతిలో శిక్షణ
    డి) శాస్త్రీయ వైఖరుల అభివృద్ధి
52. ఒక ఉపాధ్యాయుడు విద్యార్థుల్లో అనుకూలమైన అలవాట్లు పెంపొందించడంలో నెరవేరే సామర్థ్యం?
    ఎ) స్వీయ నిశ్చయం చేయగలగడం
    బి) నైపుణ్యాల అభివృద్ధి
    సి) శాస్త్రీయ వైఖరుల అభివృద్ధి
    డి) భావి జీవితానికి భూమిక
53. విద్యుదయస్కాంత సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన శాస్త్రవేత్త?
    ఎ) న్యూటన్ బి) మాక్స్‌వెల్
    సి) మాక్స్ ప్లాంక్ డి) హైగెన్స్
54. సౌర గడియారాన్ని తొలుత తయారు చేసినవారు?
    ఎ) మెసపటోనియన్లు
    బి) బాబిలోనియన్లు
    సి) ఈజిప్షియన్లు డి) గ్రీకులు
55. అణుశాస్త్ర పితామహుడు?
    ఎ) డాల్టన్ బి) న్యూటన్
    సి) నీల్స్ బోర్ డి) హైగెన్స్
56. జాన్ డాల్టన్ రాసిన పుస్తకాలు..?
    ఎ) న్యూ సిస్టమ్ ఆఫ్ కెమికల్ ఫిలాసఫీ
    బి) కలర్ బ్లైండ్‌నెస్
    సి) పరమాణు సిద్ధాంతం డి) పైవన్నీ
57. ఫారడే సిద్ధాంతాన్ని గణిత రూపంలో మార్చిన శాస్త్రవేత్త?
    ఎ) మాక్స్‌వెల్ బి) మాక్స్ ప్లాంక్
    సి) ఫ్లెమింగ్ డి) ఐన్‌స్టీన్
58. 'ది లాస్ ఆఫ్ మోషన్' గ్రంథ రచయిత?
    ఎ) న్యూటన్ బి) గెలీలియో
    సి) ఫారడే డి) కోపర్నికస్

సమాధానాలు

1) ఎ	2) సి	3) బి	4) డి	5) సి
6) ఎ	7) సి	8) సి	9) డి	10) డి
11) బి	12) డి	13) బి	14) బి	15) డి
16) డి	17) బి	18) సి	19) డి	20) సి
21) బి	22) ఎ	23) ఎ	24) సి	25) సి
26) సి	27) సి	28) బి	29) ఎ	30) బి
31) ఎ	32) సి	33) సి	34) బి	35) బి
36) సి	37) సి	38) బి	39) సి	40) ఎ
41) సి	42) ఎ	43) డి	44) సి	45) ఎ
46) సి	47) సి	48) డి	49) సి	50) సి
51) బి	52) ఎ	53) బి	54) సి	55) ఎ
56) డి	57) ఎ	58) బి		

దక్షిణ భారతదేశంలో అతిపెద్ద నది ఏది?

భారతదేశ ప్రధాన నదీ వ్యవస్థ

భారతదేశంలో నదీ వ్యవస్థను ప్రధానంగా రెండు రకాలుగా విభజించవచ్చు. అవి:

1) జీవ నదీ వ్యవస్థ
2) వర్షాధార నదీ వ్యవస్థ

ఈ రెండు నదీ వ్యవస్థల వల్ల భారతదేశానికి వ్యవసాయపరంగా, పారిశ్రామికంగా, రవాణా పరంగా చాలా ప్రయోజనాలున్నాయి.

జీవ నదీ వ్యవస్థ

వీటినే హిమాలయన్ నదులు అని కూడా అంటారు. సంవత్సరం పొడవునా నీటి ప్రవాహం ఉన్న నదులను 'జీవనదులు' అంటారు. వర్షాకాలంలోని వర్షపు నీరు, ఇతర కాలాల్లో పర్వత శిఖరాల్లోని మంచు కరగడం వల్ల ఈ నదులు ఎల్లప్పుడూ ప్రవహిస్తూ ఉంటాయి. హిమాలయ నదులైన గంగా, సింధూ, బ్రహ్మపుత్ర, వీటి ఉపనదులు జీవ నదులుగా ఉన్నాయి.

- **సింధూనది:** ఇది 'టిబెట్' హిమాలయాల్లోని 'మానస సరోవరం' పశ్చిమ వైపున 5180 మీ. ఎత్తయిన కైలాస శిఖరాల్లో జన్మిస్తోంది. టిబెట్, భారత్, పాకిస్థాన్‌లో ప్రవహిస్తోంది. దీని మొత్తం పొడవు 2880 కి.మీ. భారతదేశంలో 709 కి.మీ. దూరం ప్రయాణిస్తుంది. ఈ నది భారతదేశంలో జమ్మూ-కాశ్మీర్ రాష్ట్రంలో ప్రవేశిస్తుంది. ఈ రాష్ట్రం నుంచి పాకిస్థాన్‌లోకి ప్రవేశించి, ఆ దేశంలో ఉత్తర, దక్షిణాలుగా ప్రవహిస్తోంది. చివరకు పాకిస్థాన్‌లోని 'కరాచి' వద్ద అరేబియా సముద్రంలో కలుస్తోంది. జమ్మూ-కాశ్మీర్‌లో ప్రధానంగా లడక్, బలిస్థాన్ ప్రాంతాల ద్వారా ప్రవహిస్తోంది. దీని ఉపనదులు సట్లెజ్, జీలం, చినాబ్, బియాస్, రావి. వీటిలో అతి పెద్ద ఉపనది సట్లెజ్.
- **గంగా:** ఇది భారతదేశంలో ప్రవహిస్తున్న నదుల్లో అత్యంత పొడవైంది. ఉత్తరాఖండ్ హిమాలయాల్లో గంగోత్రి హిమానీనదం వద్ద జన్మిస్తున్న అలకనంద, భగీరథ అనే రెండు పాయలు కొంత దూరం ప్రవహించి 'దేవ ప్రయాగ' వద్ద కలిసి 'గంగానది' ఏర్పడుతోంది. దీని మొత్తం పొడవు 2525 కి.మీ. దీని పరీవాహక ప్రాంతం సుమారు 8,61,404 చ.కి.మీ. విస్తరించి ఉంది.

ఈ నది భారతదేశంలో ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్, బీహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల ద్వారా ప్రవహిస్తూ బంగ్లాదేశ్‌లోకి ప్రవేశించి బంగాళాఖాతంలో కలుస్తోంది. దీన్ని బంగ్లాదేశ్‌లో 'పద్మా నది' అని, బ్రహ్మపుత్రా నదితో కలిసిన తర్వాత 'మేఘన' అని పిలుస్తున్నారు. పశ్చిమ బెంగాల్‌లో నిర్మించిన ఫరక్కా బ్యారేజీ ద్వారా దీని నీటిని హుగ్లీనదికి మళ్లిస్తున్నారు. దీని ప్రధాన ఉప నదులు- యమున, కోసీ, రామ్‌గంగా, గోమతి, బాగ్రా, గండక్, మహానందా, సోన్. దక్షిణ దిశ నుంచి వచ్చి గంగానదిలో కలిసే ఏకైక ఉపనది సోన్. మిగితావన్నీ హిమాలయాల నుంచి వచ్చి గంగానదిలో కలుస్తున్నాయి.

- **యమునా:** ఇది గంగానది ఉపనదులన్నింటిలో పెద్దది. ఇది 'యమునోత్రి' హిమానీనదం వద్ద పుట్టి 'అలహాబాద్' దగ్గర గంగానదితో కలుస్తుంది. చంబల్, బెట్వా, కెన్ దీని ఉపనదులు.
- **బ్రహ్మపుత్ర:** ఇది టిబెట్ హిమాలయాల్లోని 'మానస సరోవరం' తూర్పు వైపున జన్మిస్తోంది. టిబెట్, భారత్, బంగ్లాదేశ్ ద్వారా 2900 కి.మీ. దూరం ప్రయాణించి బంగాళాఖాతంలో కలుస్తోంది.

ఈ నది భారత్‌లో అరుణాచల్ ప్రదేశ్‌లో ప్రవేశించిన వెంటనే 'షియాంగ్' అనే నదితో కలిసి కొంత దూరం ప్రయాణించి 'దిహాంగ్' అనే ప్రదేశం వద్ద దిహాంగ్, లోహిత నదులతో కలుస్తోంది. అసోంలో 'తీస్టా' ఉపనదిని కలుపుకొని బంగ్లాదేశ్‌లో ప్రవేశిస్తోంది. చివరగా గంగానదితో కలిసి బంగాళాఖాతంలో కలుస్తోంది. ఈ నదిని వివిధ ప్రాంతాల్లో వివిధ పేర్లతో పిలుస్తున్నారు. టిబెట్‌లో – సాంగ్‌పో లేదా త్సాంగ్‌పో అని పిలుస్తున్నారు. 'స్వచ్ఛమైన' అని దీని అర్థం. అరుణాచల్ ప్రదేశ్‌లో 'దిహాంగ్' అని, బంగ్లాదేశ్‌లో 'జమునా' అని పిలుస్తున్నారు.

మగవారి పేరుతో పిలుస్తున్న భారతదేశ ఏకైక నది బ్రహ్మపుత్ర. దీని ఉపనదులు తీస్టా, షియాంగ్, దిహాంగ్, లోహిత. గంగా, బ్రహ్మపుత్ర నదులు సముద్రంలో కలిసేచోట ప్రపంచంలో కెల్లా అతి పెద్దదైన 'సుందర్‌బన్ డెల్టా'ను ఏర్పరుస్తున్నాయి.



వర్షాధార నదీ వ్యవస్థ

వర్షాకాలం మాత్రమే నీటి ప్రవాహం కలిగి ఉండటం వల్ల వీటిని 'వర్షాధారిత నదులు' అంటారు. వీటినే 'ద్వీపకల్ప నదులు' అని కూడా అంటారు. వీటిని రెండు రకాలుగా విభజించవచ్చు.

- **పశ్చిమం వైపునకు ప్రవహిస్తున్న నదులు:** సబర్మతి, నర్మదా, తపతి, మహి మొదలైనవి.
- **నర్మదానది:** ఇది పశ్చిమం దిశగా ప్రవహిస్తున్న నదుల్లో అతి పొడవైంది. ఇది మధ్యప్రదేశ్‌లోని 'అమర్‌కంటక్' ప్రాంతంలో పుట్టి వింధ్య, సాత్పుర పర్వత శ్రేణుల మధ్య 1312 కి.మీ. ప్రవహించి అరేబియా సముద్రంలో కలుస్తోంది. భారతదేశంలో 'పగులు లోయ'లో ప్రవహిస్తున్న అతి పొడవైన నది నర్మద.దీని ప్రధాన ఉపనదులు షార్, బర్హానర్, బంజర్, షక్కర్, కోలర్, బుర్నా, హీరాన్. ఈ నది ప్రవాహ మార్గంలో రెండు ప్రధాన జలపాతాలున్నాయి. అవి: కపిల ధారా, ధూన్‌ధర్. దీని పరీవాహ ప్రాంతం అత్యధికంగా మధ్యప్రదేశ్‌లో (87 శాతం), మిగిలింది మహారాష్ట్ర, గుజరాత్‌లో ఉంది.
- **తపతి:** ఇది పశ్చిమం దిశగా ప్రవహిస్తున్న వాటిలో రెండో అతిపెద్ద నది. ఇది మధ్యప్రదేశ్‌లోని 'బిటువల్' జిల్లాలోని 'ముల్టాయి' వద్ద పుట్టి 724 కి.మీ. పొడవున సాత్పురా – అజంతా పర్వత శ్రేణుల మధ్య ప్రవహించి అరేబియా సముద్రంలో కలుస్తోంది. పూర్ణానది, గిర్నా, బొరి, కీప్ర, సిప్రా, సుకీ, అమరావతి దీని ఉపనదులు.

తూర్పు వైపునకు ప్రవహిస్తున్న నదులు: వీటిలో ముఖ్యమైనవి గోదావరి, కృష్ణా, మహానది, కావేరి, పెన్నా. ద్వీపకల్ప పీఠభూమి తూర్పు వైపునకు వాలి ఉండటంతో దీనిలోని నదులు అధికభాగం తూర్పుదిశగా ప్రవహించి బంగాళాఖాతంలో కలుస్తున్నాయి.

- **గోదావరి:** భారతదేశంలో గంగానది తర్వాత రెండో అతిపెద్ద నది గోదావరి. ఇది దక్షిణ భారతదేశంలో అతిపెద్ద నది. దీన్ని 'దక్షిణ గంగా', 'దక్షిణ గంగోత్రి', 'వృద్ధ గంగా' అని కూడా అంటారు. ఈ నది మహారాష్ట్రలోని పశ్చిమ కనుమల్లో 'నాసిక్ త్రయంబకం' వద్ద జన్మిస్తోంది. మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ద్వారా సుమారు 1465 కి.మీ. ప్రవహించి బంగాళాఖాతంలో కలుస్తోంది. మంజీరా, మానేరు, ప్రాణహిత, ఇంద్రావతి, శబరి, సీలేరు, వార్ధా మొదలైనవి దీని ఉపనదులు. ఇది నిర్మల్ జిల్లాలోని 'బాసర' వద్ద తెలంగాణ రాష్ట్రంలో ప్రవేశిస్తుంది.
- **కృష్ణానది:** ఇది మహారాష్ట్రలో పశ్చిమ కనుమల్లోని 'మహాబలేశ్వరం' వద్ద పుట్టి మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ప్రవహిస్తోంది. 1440 కి.మీ. ప్రవహించి బంగాళాఖాతంలో కలుస్తోంది. ఇది దక్షిణ భారతదేశంలో రెండో అతిపెద్దనది. ఈ నది నారాయణపేట జిల్లాలోని మక్తల్ మండలం 'తంగడి' వద్ద తెలంగాణ రాష్ట్రంలో ప్రవేశించి ఆంధ్రప్రదేశ్‌లోని హంసలదీవి వద్ద బంగాళాఖాతంలో కలుస్తోంది. తుంగభద్ర, కోయన, పాలేరు, దిండి, మూసీ, భీమా, మున్నేరు, ఘటప్రభ మొదలైనవి దీని ఉపనదులు.
- **కావేరి:** ఇది కర్ణాటకలోని 'కూర్గ్' జిల్లాలో 'బ్రహ్మగిరి' కొండల్లో జన్మించి కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల ద్వారా సుమారు 805 కి.మీ. పొడవున ప్రవహిస్తోంది. తమిళనాడులోని కావేరి పట్టణం ప్రాంతంలో బంగాళాఖాతంలో కలుస్తోంది. హేమావతి, లోకపావని, షింషా, ఆర్కావతి, లక్ష్మణ తీర్థ, భవాని మొదలైనవి దీని ఉపనదులు. ఇది తమిళనాడులో అతి ప్రధానమైన నది.
- **పెన్నా:** ఇది కర్ణాటకలోని మైసూరు వద్ద 'నంది దుర్గ' కొండల్లో పుట్టి అనంతపురం జిల్లా హిందూపురం వద్ద ఆంధ్రప్రదేశ్‌లో ప్రవేశిస్తోంది. నెల్లూరు జిల్లాలోని 'ఊటుకూరు' వద్ద బంగాళాఖాతంలో కలుస్తోంది. జయమంగళి, చిత్రావతి, కుందేరు, పాపాఘ్ని, చెయ్యేరు, సగిలేరు దీని ఉపనదులు.
- **మహానది:** ఇది మధ్యప్రదేశ్‌లో పుట్టి ఒడిశా ద్వారా ప్రవహించి బంగాళాఖాతంలో కలుస్తోంది. దీని పొడవు 857 కి.మీ. దీని ఉపనదులు- మండ్, షియోనాథ్, లేప్, ఇబ్, హస్‌డియో.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. కిందివాటిలో అత్యంత పొడవైన నది ఏది?
   1) గంగా 2) నర్మదా
   3) కృష్ణా 4) గోదావరి
2. భారతదేశంలోకి బ్రహ్మపుత్ర నది మొదట ఎక్కడ ప్రవేశిస్తుంది?
   1) అరుణాచల్ ప్రదేశ్ 2) త్రిపుర
   3) అస్సాం 4) మేఘాలయ
3. దక్షిణ గంగా అని ఏ నదికి పేరు?
   1) కృష్ణా 2) గోదావరి
   3) తుంగభద్ర 4) పెన్నా
4. ఏ నదీ సమూహం టిబెట్‌లో ప్రారంభ మూలాన్ని కలిగి ఉంది?
   1) బ్రహ్మపుత్ర, గంగా, సట్లెజ్
   2) గంగా, సట్లెజ్, యమున
   3) చినాబ్, రావి, సట్లెజ్
   4) బ్రహ్మపుత్ర, ఇండస్, సట్లెజ్
5. సాత్పురా, వింధ్య శ్రేణుల మధ్య ప్రవహించే నది ఏది?
   1) నర్మద 2) గండక్
   3) తపతి 4) గోదావరి
6. బంగ్లాదేశ్‌లో గంగానదిని ఏమని పిలుస్తారు?
   1) సుభ్ర 2) భగీరథి
   3) రూప్ నారాయణ్ 4) పద్మ

సమాధానాలు

1) 1; 2) 1; 3) 2; 4) 4;
5) 1; 6) 4.

మాదిరి ప్రశ్నలు

1. కొంకణ్ తీరం ఏ రాష్ట్రంలో విస్తరించి ఉంది?
   1) కర్ణాటక 2) తమిళనాడు
   3) కేరళ 4) మహారాష్ట్ర
2. అత్యధిక సంఖ్యలో సరస్సులు, లాగూన్‌లను కలిగి ఉన్న తీర ప్రాంతం ఏది?
   1) కేరళ తీరం 2) తమిళనాడు తీరం
   3) ఒడిశా తీరం 4) గుజరాత్ తీరం
3. అష్టముడి సరస్సు ఏ రాష్ట్రంలో ఉంది?
   1) తమిళనాడు 2) కేరళ
   3) పశ్చిమ బెంగాల్ 4) మణిపూర్
4. శ్రీహరికోటలోని 'సతీష్‌ధావన్' రాకెట్ ప్రయోగ కేంద్రం ఏ సరస్సులో విస్తరించి ఉంది?
   1) చిలుకా సరస్సు 2) కొల్లేరు సరస్సు
   3) పులికాట్ సరస్సు
   4) వెంబనాడ్ సరస్సు
5. పగులులోయ ద్వారా ప్రవహిస్తున్న నది?
   1) గంగా 2) నర్మదా
   3) బ్రహ్మపుత్ర 4) గోదావరి
6. టిబెట్‌లో 'త్సాంగ్‌పో' అని ఏ నదిని పిలుస్తారు?
   1) సింధూ 2) బ్రహ్మపుత్ర
   3) గంగా 4) గండక్
7. గంగానది ఉపనదుల్లో ఉత్తరానికి ప్రవహించేది?
   1) కోసి 2) ఘాగ్ర
   3) సోన్ 4) గండక్
8. కిందివాటిలో పశ్చిమానికి ప్రవహించే నది?
   1) గోదావరి 2) చంబల్
   3) మహానది 4) నర్మదా
9. ఒడిశా రాష్ట్రంలో డెల్టాను ఏర్పరిచే నది?
   1) సువర్ణరేఖ 2) మహానది
   3) కావేరి 4) నర్మదా
10. బెంగాల్ దుఃఖదాయని అని ఏ నదిని పిలుస్తారు?
    1) కోసి 2) హుబ్లీ
    3) దామోదర్ నది 4) గంగానది
11. బీహార్ దుఃఖదాయని అని ఏ నదిని పిలుస్తారు?
    1) దామోదర్ 2) కోసి
    3) బ్రహ్మపుత్ర 4) వైతరణి
12. కృష్ణా – గోదావరి నదుల మధ్య విస్తరించిన సరస్సు ఏది?
    1) పులికాట్ 2) కొల్లేరు
    3) చిలుకా 4) అష్టముడి
13. గంగానది ఉపనదుల్లో కెల్లా అతిపెద్దది?
    1) చంబల్ 2) ఘాగ్ర
    3) కోసి 4) యమునా
14. కపిలధార జలపాతం ఏ నదిపై ఉంది?
    1) యమునా 2) నర్మదా
    3) గోదావరి 4) కావేరి
15. అలకనంద, భాగీరథిలు ఎక్కడ కలుస్తాయి?
    1) రుద్ర ప్రయాగ్ 2) దేవ ప్రయాగ్
    3) రిషికేష్ 4) ప్రయాగ్
16. నర్మదా నది ఎక్కువ భాగం ఏ రాష్ట్రం ద్వారా ప్రవహిస్తుంది?
    1) రాజస్థాన్ 2) గుజరాత్
    3) మధ్యప్రదేశ్ 4) మహారాష్ట్ర

సమాధానాలు

1) 4; 2) 1; 3) 2; 4) 3;
5) 2; 6) 2; 7) 3; 8) 4;
9) 2; 10) 3; 11) 2; 12) 2;
13) 4; 14) 2; 15) 2; 16) 3.

The scheme has fallen out due to..



Directions (Q. 1-10): *In the following passage there are blanks, each of which has been numbered. These numbers are printed below the passage and against each, five words/ phrases are suggested, one of which fits the blank appropriately. Find out the appropriate word/ phrase in each case and mark your answer.*

Though most of us know him _____ (1) for his inventions, Thomas Alva Edison was first and _____ (2) a telegraph operator. Born humbly in Ohio, U.S.in 1847, he was the seventh _____ (3) last child of Samuel Ogden Edison. At the _____ (4) age of nineteen he moved to Kentucky, where he worked in night shifts. He was _____ (5) with a lead-acid battery when he spilled Sulfuric acid onto the floor it ran between the floorboards and onto his boss's desk below. The next morning Edison was ____ (6). He was ___ (7) about reading and experimenting. One of his mentors during those early years was a fellow telegrapher and inventor named Franklin Leonard Pope, who allowed the ____(8) youth to live and work in the basement of his home. The invention that first gained him notice was the phonograph in 1877. This ___ (9) was so unexpected by the public at large as to appear almost ___ (10).

1. (1) except (2) best (3) hardly (4) greatly (5) sometimes
2. (1) previous (2) only (3) foremost (4) above (5) lastly
3. (1) between (2) before (3) with (4) and (5) of
4. (1) elder (2) early (3) delicate (4) old (5) tough
5. (1) set (2) establish (3) working (4) shared (5) purchase
6. (1) fired (2) send (3) showed (4) followed (5) take
7. (1) fame (2) character (3) passionate (4) defeat (5) poor
8. (1) poverty (2) worry (3) problem (4) conflict (5) impoverished
9. (1) accomplishment (2) well (3) fine (4) leading (5) excellent
10. (1) partly (2) wisely (3) rarely (4) magical (5) almost

Directions (Q. 11-20): *Read the following passage carefully and answer the questions given below it. Certain words have been printed in bold to help you locate them while answering some of the questions.*

The joy of discovery is a very real **incentive** to research, despite the rareness of its realization. It is on error to suppose that the scientist is unemotional, or could succeed if he were. The error has arisen through a misconception. The absolute necessity that a scientist's findings shall not be changed from **objective** truth in response to emotional urges of any kind does not result in his becoming a particularly unemotional person: whether a discoverer or anyone else is pleased with a discovery has no effect on its validity. 'I have been working like a madman at Drosera' wrote Darwin to Sir J.D. Hooker in reference to his study of insectivorous plants and a few days later, to the geologist, Lyell 'at the present moment I care more about Drosera that the origin of all the species in the world---- I am **frightened** and **astounded** at my results'. Kropotkin once wrote, 'There are not many joys in human life equal to the **joy** of the sudden birth of a generalization ---He who has once in this life experienced this joy of scientific creation will never forget it.'

11. The author of the passage counters the misconception that a scientist is unemotional by pointing out that
    1) the objectivity of a scientist cannot make emotional compromises
    2) even such a great scientist as Darwin cared so much for Drosera
    3) he has capacity to react to emotional appeals made by others
    4) he considers scientific discovery equal to the joy of creation
    5) he has no capacity to react to emotional appeals made by others
12. In this passage the author tells us that scientific research leads one to
    1) rare discoveries
    2) success, sometimes
    3) sure success
    4) finding the objective truth
    5) funding rarity
13. Darwin's letter to Lyell reveals to us that he
    1) attached greater importance to his discovery of insectivorous pants than to his discovery of the origin of the species
    2) used to get deeply involved in whatever research, big or small, he had on hand at a given point of time
    3) was rather uncertain about his success in his research on insectivorous plants
    4) was worried that insectivorous plants would destroy all species of insects
    5) was sure of success
14. The findings of scientific researchers
    1) are universally welcome
    2) result in robbing the researcher of all emotions
    3) are objective in nature
    4) have universal validity
    5) no relation to present
15. Kropotkin says about the unforgettable experience
    1) joy of scientific creation
    2) remember the experience
    3) sorrows of human life
    4) generalized observations
    5) astounding facts

Directions (Q. 16-18): *Choose the word which is MOST SIMILAR in meaning to the word printed in **bold** as used in the passage.*

16. **ASTOUNDED**
    1) amazed 2) scared
    3) rescued 4) worked
    5) furnished
17. **JOY**
    1) ecstasy 2) wander
    3) murmur 4) jump 5) leap
18. **INCENTIVE**
    1) enticement 2) enjoyment
    3) overwhelm 4) spurious
    5) engulf

Directions (Q. 19-20): *Choose the word which is MOST OPPOSITE in meaning to the word printed in **bold** as used in the passage.*

19. **OBJECTIVE**
    1) purpose 2) subjective
    3) change 4) bonus
    5) increment
20. **FRIGHTENED**
    1) ghastly 2) beastly
    3) horrified 4) courageous
    5) happy

Directions (Q. 21-25): *Each question below has two blanks, each blank indicating that something has been omitted. Choose the set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.*

21. Scientists fear that many birds -----heading towards a unisex existence that would ----- to extinction.
    1) is… make 2) are.. making
    3) is… moving 4) are…lead
    5) were…leading
22. Using ------ from government survey, he found ------ support for his line of reasoning.
    1) data… strong 2) date…much
    3) doubt…many
    4) dates…very 5) date…meek
23. Science consists of ------, Art consists of ------.
    1) naming…pleading
    2) knowing…doing
    3) doing… pleasing
    4) creation…erosion
    5) evolution…inspection
24. Technology is important but what is of great ---------- is the capturing of tacit knowledge.
    1) important 2) import
    3) improvement 4) importance
    5) importantly
25. The ------ of the hour is to evolve measures to tackle the issue.
    1) time 2) moment 3) need
    4) pride 5) speed

Directions (Q. 26-30): *Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence. Mark the number of that part with error as your answer. If there is 'No error', mark (5) as your answer.*

26. There is a misconception (1)/that freedom means(2)/to be doing (3)/your own thing.(4)/No error (5)
27. Shakespeare was (1)/ better than any poet(2)/ of his days (3)/ according to critics. (4)/ No error (5)
28. I ordered for a cup of tea (1)/ but the bearer (2)/brought it only (3)/ at the end of the tea-session. (4)/ No error (5)
29. Lack of honesty(1)/ is sometimes labeled as(2)/tact public relations (3)/or politics. (4)/ No error (5)
30. in the aftermath of the September 11th (1)/ the American president's speech was (2)/ broadcasted and televised (3)/ all over the world. (4)/ No error (5)

Directions (Q. 31-35): *Which of the phrases (1), (2), (3) and (4) given below each sentence should replace the phrase printed in bold in the sentence to make it grammatically correct? If the sentence is correct as it is given and no correction is required, mark (5) as the answer.*

31. The minister **hit out** at his critics and categorically denied his involvement in the scam.
    1) hit up 2) hit back
    3) hit upon 4) hit around
    5) no correction
32. He can **strike out** a friendship even with complete strangers.
    1) strike up 2) strike at
    3) strike on 4) strike back
    5) no correction
33. I prefer listening to soft music to help me **wind over** after a stressful day.
    1) wind up 2) wind down
    3) wind off 4) wind of
    5) no correction
34. The scheme has **fallen out** due to paucity of funds.
    1) fallen through 2) fallen over
    3) fallen apart 4) fallen back
    5) no correction
35. Over the years several extremists **laid up** their arms and joined the mainstream.
    1) laid out 2) laid upon
    3) laid by 4) laid down
    5) no correction

KEY

1) 2; 2) 3; 3) 4; 4) 3; 5) 3;
6) 1; 7) 3; 8) 5; 9) 1; 10) 4;
11) 1; 12) 4; 13) 1; 14) 3; 15) 1;
16) 1; 17) 1; 18) 1; 19) 2; 20) 4;
21) 4; 22) 1; 23) 2; 24) 4; 25) 3;
26) 3; 27) 2; 28) 1; 29) 2; 30) 3;
31) 2; 32) 1; 33) 2; 34) 1; 35) 4.